భారతి

సాహిత్య మాసపత్రిక

జూన్ 1980

ఈ జీవిత దర్పణంలో

మాదిరాజు రంగారావు

గిడుగు రామమూర్తి పంతులుగారు

కీ. శే. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

ఆకాశంలో చుక్కలు

చల్లా రాధాకృష్ణశర్మ

నిగమశర్మ అక్క

పర్దేశాయి తిరుమలరావు

నాకూ...నీకూ...మధ్య

భాగవతుల గాయత్రి

కవిత్వము – ధార

యు. ఎ. నరసింహమూర్తి

ఇంకా కాళిదాసు, రమేష్‌బాబు, తిరువగరి, భానుమూర్తి, కాళిదాస్, అంజయ్య, నాగేశ్వరరావు, రమణ, సుబ్బలక్ష్మి, రాధాకృష్ణ, దిలావర్, తంగిరాల, లక్ష్మీనారాయణాచార్యులు ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

జూన్ 1980

సంపుటము : 57 సంచిక : 6

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

జూన్ 1980

వెన్నెల తోట

శ్రీ వఝ్ఝల కాళిదాసు

విరియఁబూచిన యట్టి విరజాజి కొమ్మలు
తారల తోడ బంతాల నాడ
పసుపు నిగ్గులదేరు బంతిపువ్వుల సౌరు
చంద్రునితో నెకసక్కెమాడ
చిరునవ్వులొలికించు చిరుమల్లె పువ్వులు
పాల బాటలతోడ మేలమాడ
బంగారు జలతారు రంగు సంపెంగలు
వెన్నెల వెలుగుల వెక్కిరింప

తెరలు తెరలుగ తావులు తరలివచ్చి
కమ్మ గాడ్పుతో పరియాచకమ్ము సేయ
కాంచుచున్న కొలఁది యజ్ఞాత సీమ
లందు విహరించుచున్న యట్లౌనుగాదె!

అనుభవైక వేద్యమె సుమీ ఆ యపూర్వ
చంద్రికా సాగర తరంగ సంఘ డోలి
కా సమాలోల విశ్వంభరా సవిత్రి
అంకసీమ ప్రకృతి బాల ఆడులీల!

సింగారముల నీను చిన్నారి జాబిల్లి
సిగ బంతి పూవయి సొగసులీన
చక్కదనాలొల్కు చుక్కల గుంపులు
ముత్యాల సరిగలై మురువునింప
తావుల వెదజల్లు పూవుల తీవలు
మువ్వల కమరులై నివ్వటిల్ల
మిల మిలల్ తొణికించు మిణుగురు బుర్వులు
జలతారు తొడవులై తళుకుఁజిలుక

చలవ మడత వన్నెల నెలవెలుగు జిలుగు
వలిపముల మేలి ముసుగయి పరిఢవిల్ల
ప్రకృతి అపురూపమైన లావణ్య సుంద
రాంగియైన పెండిలికూతురనగ దోచె!

ప్రకృతి జవరాలు నిజమనోరథము దీర్ప
వచ్చియున్న వసంతుని పజ్జజేరు
తరి విడిన యామె నిడుద పెన్నెరులనుండి
జారి పడిన పూలన దోచె తారకాళి

వసుమతీదేవి పూర్ణిమా పర్వవేళ
స్నిగ్ధమతి శాంతి సౌభాగ్య సిద్ధికోరి
పూజలొనరించి యిడిన నీరాజనముగ
వెన్నెలల గ్రుమ్మరించు రేవెలుగు దోచె!

చతురాననుని సృష్టిచాకచక్యంబు
మయశిల్ప రచనా సమాశోపలబ్ధి
చిత్రకారుని వర్ణ శృంగారదీప్తి
ఉన్మిషితమ్మ్మలీ యుద్యానవీధి!

పట్టు తివాసీలు పరచిన గడ్డి
పచ్చందనమ్ము లాహ్వాన పత్రికల
విశ్రాంతి వీధుల విహరింప పిలుపు
లందించుచున్నవి అతి నమ్ర గతుల
పావురముల గుబాళింపుల ప్రాకృతమ్ము
శారికామృదు స్వరముల సంస్కృతమ్ము
చిలుక పలుకులలో అచ్చతెలుగు మాట
పికపిక స్వర గీతుల వేద ఘోష
వినబడుచునున్న ఈ తోట, వేడుకలకు
దాన కంబగు – కాదు – విజ్ఞానదాయి
యైన గురుకుల మార్గ విద్యాలయమ్ము!

ఆ వెన్నెల తళుకులలో
అవని సొగసు హిమవాలు కాన్తతనూ శో
భా విభాజిత సుందర
యౌవనివలె దోచె పరిమళావాప్తంబై!

సదా సర్వదా...

నిత్యం చూస్తున్న ఆ కళ్లలో
నాకేమీ కనిపించలేదు
కనురెప్పల కదలికలు తప్ప
కంటిపాపల తిరుగుళ్లు తప్ప.
కాని ...
ఏనాడైతే నా
గుండెలోతుల్లో
ప్రేమపురుడు పోసుకొందో
అనురాగాల బారసాల చేసుకొందో
ఆనాటినుంచీ ...
నాకా రెప్పల కదలికల్లో
మాణిక్యవీణా సరిగమలు వినిపిస్తున్నాయి !
నాకా తిరుగుళ్ల మెరుపులలో
అరవిందాతిశయ మధురిమలు కనిపిస్తున్నాయి !
ప్రతి సరిగమా ...
ఓ కార్తీక చంద్రంలా విరబూస్తూ.
ప్రతి మధురిమా ...
ఓ శరత్కాల వసుధలా వికసిస్తూ.
అందుకే ...
నా చూపులు తొంగిచూస్తున్నాయి
ఎప్పుడూ చూస్తూనే ఉంటాయి
కేవలం ఆ కళ్లలోకి కాదు —
ఆ కళ్లు దాచిన నీలి మమతల లోగిళ్లలోకి ...
ఆ లోగిళ్ల నిలిచిన నా ఆత్మ ప్రతిబింబాల్లోకి ...
అవ్యక్తీభూత భావపరధుల్లోకి ...
ప్రణయారాధ్య గీతా అవధుల్లోకి ...
నిండు ప్రేమను కాంక్షిస్తూ ...
ఆ మధులాలిమను వాంఛిస్తూ ...
సదా
సర్వదా !

ఆ ముగ్గురూ...

సంధ్యకై
తూరుపునుండి పరుగులు తీసి
అపరాహ్ణుడై
ఆవేదనతో
పడమట మునిగిపోతాడు సూర్యుడు.
విసిగి వేసారి
విరక్తితో తల్లడిల్లి
తూరుపు సంధ్య సోలిపోగా
ఉదయించే ఆ దినకరుడు !
కొండంత ఆశతో
కోటి సెలయేళ్ల ఎద సవ్వడితో
పడమటి సంధ్య ఎదురు రాకమునుపే
అస్తమించే ఆ ప్రభాకరుడు !
ఏమిటీ వైచిత్ర్యం ?
ఎంతకూ అంతుపట్టని అదృశ్యచిత్రం ?
అయినా సడలని ఆ మనోధైర్యం
ఏనాటికీ మొక్కవోని ఆ స్థైర్యం
భళా ! అభినందించి ఆశించదగ్గది
హలా ! అనుసరించి ఆచరించదగ్గది

శ్రీ గుమ్మనూరి రమేష్‌బాబు

శ్రీ పి. సుందరరామశాస్త్రి

విష్ణుకుండినులు వంశ, కాలానుక్రమణికలు★

ప్రాచీనాంధ్రదేశ చరిత్రలో శాతవాహన — చాళుక్య యుగాల నడిమి కాలంలో వర్ధిల్లిన రాజవంశాలలో విష్ణుకుండినులు సుప్రసిద్ధులు. వీరి వంశ, కాలానుక్రమణికల నిర్మాణానికి మాధవవర్మ మహారాజుచే నీయబడిన పొలమూరు శాసనం కీలకమైందిగా పూర్వ చరిత్రకారులు భావించారు. కాని, ఆ శాసనం సమకూర్చే సాక్ష్యాధారాలు సంశయాత్మకంగా, పలువిధాలైన వంశ, కాలానుక్రమణికల నూహించే అవకాశం కల్పించినందున, నేటికి అవి అపరిష్కృత సమస్యలుగానే నిల్చియున్నాయి.

ఇటీవలి కాలంలో వెలుగులోనికి వచ్చిన మఱికొన్ని విష్ణుకుండిన శాసనాలు వారి చరిత్రనుగూర్చి లోగడ లభ్యమైన శాసనాలకన్నా మఱింత స్పష్టమైన, వినూత్నమైన సాక్ష్యాధారాలను సమకూర్చుతున్నాయి. అవి, రెండవ విక్రమేంద్రవర్మచే నీయబడిన తుండి తామ్ర శాసనము, రెండు తుమ్మలగూడెం శాసనాలు. ఈ శాసనాల నుండి లభ్యమయే సాక్ష్యాధారాలు విష్ణుకుండిన చరిత్రను మఱింత సమగ్రమైన, ఖచ్చితమైన రీతిలో నిర్మించే ఆశను కల్పిస్తున్నాయి. కాని, ఈనూతన సాక్ష్యాధారాలను పొలమూరు శాసనం వలన లభించే చారిత్రకాంశాలతో జోడించే ప్రయత్నంలో ఈ వంశ చరిత్ర మఱింత క్లిష్టమైంది. మఱికొందఱు చరిత్రకారులు ఈ శాసనాల వలన అనేక సంశయాలు తలెత్తుతున్నాయని భావించినారు.[1] అట్టి వాదాలలో ప్రధానమైన వాటిని సమీక్షించి, అంగీకార యోగ్యమైన విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికలను సూచించడమే ఈ వ్యాస రచనలోని ప్రధానోద్దేశం.

విష్ణుకుండిన శాసనాలు : సమీక్ష

విష్ణుకుండిన రాజుల వంశ, కాలానుక్రమణికల నిర్మాణానికి తత్సంబంధమైన వాద ప్రతివాదాల పరామర్శకు, మొదట వారి శాసనాల నుండి అందుకవసరమైన సాక్ష్యాలను సేకరించాలి. అందుకై వారి శాసనాల స్థూల పరిచయం అవసరం. కాలానుగుణంగా నేటివరకు లభ్యమైన విష్ణుకుండిన శాసనాలివి : 1) చిక్కుళ్ళ తామ్ర శాసనము, 2) రామతీర్థం తామ్రశాసనము, 3) రెండు ఈపూరు తామ్ర శాసనాలు, 4) పొలమూరు తామ్ర శాసనము, 5) ఖానాపూరు తామ్ర శాసనము, 6) వేల్పూరు శిలా శాసనము, 7) తుండి తామ్ర శాసనము, 8) రెండు తుమ్మలగూడెం తామ్ర శాసనాలు. వీటిలో 5వసంఖ్యగల ఖానాపూర్ తామ్ర శాసనము మొదటి రేకు, శాసనాను బంధితమైన రాజముద్రిక నష్టమై, లభ్యమైన రేకులలో మొదటిది చాల శిథిలమై ఉంది. అందుచే తత్ప్రదాతయైన మాధవవర్మ వంశ గోత్రాది వివరాలు తెలియవు. ఆ రాజును గుర్తించడం వివాదాస్పదం.[2] అలాగే, వేల్పూరు శిలా శాసన ముఖం చాలవరకు భగ్నమై అసంపూర్ణమైన శాసన పాఠాన్నిస్తుంది [3] అందుచేత ఈ రెండు శాసనాలు విస్తృతంగా చరిత్రకారుల పరిగణనలోనికి రాలేదు.

చిక్కుళ్ళ శాసనం[4] రెండవ విక్రమేంద్రవర్మచే నతని దశమ రాజ్య సంవత్సరంలో నీయబడింది.[5] అందు ఈ క్రింది విధంగా మహారాజ పరంపర పేర్కొనబడింది.[6]

మాధవవర్మ
|
విక్రమేంద్రవర్మ
|
ఇంద్రభట్టారకవర్మ
|
విక్రమేంద్ర భట్టారక వర్మ

వీరిలో మాధవవర్మ ఏకాదశాశ్వమేధ క్రతు సహస్ర పురస్సరంగా సర్వమేధ బహు సువర్ణ పౌండరీక పురుషమేధ వాజపేయ యూఢ్య షోడశి రాజసూయ ప్రాధిరాజ్య ప్రాజాపత్యాద్యనేక వివిధ పృథు గురువర శత సహస్రయాజీ;[7] క్రత్వనుష్ఠాన మహిమచేత పరమేష్ఠిత్వాన్నధిష్ఠించినవాడు[8] నని వర్ణించబడినాడు. ఆయన

★ నన్నీ వ్యాస రచనకు ప్రోత్సహించి, మార్గదర్శకులైన డా. బి ఆర్. సుబ్రహ్మణ్యం, ఎమ్. ఏ., పిహెచ్. డి., రీడరు, ప్రాచీన భారతదేశ చరిత్ర, పురావస్తు శాస్త్ర విభాగము, నాగార్జున విశ్వవిద్యాలయము, గుంటూరు, గార్కి నా కృతజ్ఞతలు.

కుమారుడైన విక్రమేంద్రవర్మ విష్ణుకుండి—వాకాటక వంశద్వయాలంకృత జన్ముడు[9] తర్వాత ఇంద్రభట్టారకవర్మ స్ఫురన్నిశిత నిస్త్రింశ ప్రభావంచే నశేష జగన్మండలాధిపత్యం వహించినవాడు,[10] భ్రూభంగ మాత్రంచేత సమగ్రదాయాద వినిర్ధూతం చేసినవాడు, అనేక చాతుర్దంత సమర విజయి[11] అని చెప్పబడినాడు శాసన ప్రదాత అయిన రెండవ విక్రమేంద్ర భట్టారకవర్మ శైశవమునందే సకల నృపగుణాలంకారములు కల్గి, సమ్యగధ్యారోహిత రాజ్యభారం **వహించినవాడు.**[12]

రామతీర్థం శాసనము[13] ఇంద్రవర్మచే నతని ఇరువది యేడవ రాజ్య సంవత్సరంలో నీయబడింది.[14] అందు క్రింది విధంగా వంశ క్రమం పేర్కొనబడింది.

మాధవవర్మ
|
విక్రమేంద్రవర్మ
|
ఇంద్రవర్మ

మాధవవర్మ మహారాజు శాసనంలో[15] సకల మహీమండలావనత సామంత మకుట మణి కిరణావలీఢ చరణయుగుడని, విష్ణుకుండి పార్థివోదితాన్వయ తిలక సముద్భూతుడు, ఏకాదశాశ్వమేధావభృథావ ధౌత జగత్కల్మషుడు, క్రతుసహస్రయాజియని పేర్కొనబడినాడు. విక్రమేంద్రవర్మ మాతా పితృ పాదానుధ్యాతుడు, ఉభయ వంశాత్మజాలంకార భూతుడని[16] చెప్పబడినాడు. ఇంద్రవర్మ[17] అనేక చాతుర్దంత సంగ్రామ విజయుడని, చతురుదధి నృపతి మణి మయూఖ విచ్ఛురిత పాదాంబురుహుడని వర్ణించబడినాడు.

ఈపూరు శాసనాలలో మొదటిది[18] మహారాజు గోవిందవర్మ కుమారుడైన మహారాజు మాధవవర్మచే నతని ముప్పదియేడవ రాజ్య సంవత్సరంలో[19] నీయబడింది. అందు మహారాజు గోవిందవర్మ[20] అపరిమిత బలపరాక్రముడు, సకల సామంతుల ప్రణతులందినవాడు, అనేక గో హిరణ్య భూమి ప్రదాతయని వర్ణింపబడినాడు. శాసన ప్రదాతయైన మాధవవర్మ[21] స్మృతి, మతి బలసత్త్వ ధైర్య వీర్య వినయ సంపన్నుడు, సకల మహీమండల మనుజపతి ప్రతిపూజిత శాసనుడు, త్రివర నగర భవనగత యువతీ హృదయ నందనుడు, అగ్నిష్టోమ సహస్రాలను, ఏకాదశాశ్వమేధాలను చేసినవాడు, హిరణ్యగర్భ ప్రసూతుడునని వర్ణింపబడినాడు.

ఈపూరు రెండవ శాసనం[22] దేవవర్మకుమారుడైన మాధవవర్మచే నీయబడింది. ఇందు ముగ్గురు రాజులు పేర్కొనబడినారు. వారిలో మొదటివాడైన మాధవవర్మ[23] మాత్రమే మహారాజుగాను, ఏకాదశాశ్వమేధాగ్నిష్టోమ సహస్రయాజిగాను, అనేక సామంత మకుట కూట మణి ఖచిత చరణయుగళుడని చెప్పబడినాడు. అతని కుమారుడైన దేవవర్మ[24] క్షత్రియావస్కంద ప్రవర్తితా ప్రతిమ విఖ్యాత పరాక్రముడని పేర్కొనబడినాడు. శాసన ప్రదాత యగు మాధవవర్మ[25] త్రికూట మలయాధిపతి, నయవినయ సత్త్వసంపన్నుడని ప్రశంసింపబడినాడు.

ఈ శాసన ప్రదాతకు మహారాజ బిరుదం లేకపోవడాన, ఆజ్ఞప్తిని ప్రస్తావించేచోట ''విష్ణుకుండ్యధిరాజ''[26] ను పదం కన్పించడంచేత కొందఱు చరిత్రకారు లీతడు స్వతంత్రుడు కాడని భావిస్తారు.[27] ఈతడెవరో విష్ణుకుండ్యధిరాజుకు నాజ్ఞానువర్తియై యీ శాసనాన్నిచ్చినాడని వారి భావం[28] శాసనకాలం సైతము 47వ సంవత్సరంగాను,[29] 27వ సంవత్సరంగను,[30] 17వ సంవత్సరంగాను,[31] వివిధంగా చదువబడుతున్నది. ఈరాజు స్వతంత్రుడని భావిస్తే అతడే అధిరాజుకు సామంతుడో, ఆతనిరాజ్యకాలానికి చెందినవి భావించవలసి వస్తుంది.

పొలమూరు శాసనం[32] మహారాజు మాధవవర్మ తన 48వ రాజ్య సంవత్సరంలో[33] ఇచ్చినది. అది ఈ క్రింది విధంగా రాజ పరంపరను వివరిస్తుంది. వారిలో శాసన ప్రదాతకుకాక అన్యులెవరికి మహారాజ బిరుదం లేదు.

విక్రమహేంద్ర
|
గోవిందవర్మ
|
మాధవవర్మ

విక్రమహేంద్రుడు ద్రవతిహత శాసనుడు. స్వప్రతాపోపనత సామంత మనుజపతి మండలుడు, విరహిత రిపుషడ్వర్గుడు, విధివదుపచిత త్రివర్గుడు, విబుధపతి సాధ్య శరవీర విభవ బల పరాక్రము[34] డని వర్ణింపబడినాడు. అతని కుమారుడైన గోవిందవర్మ అనేక సమర సంఘట్ట విజయుడు, పరనరపతి మకుట మణి మయూఖావదాత చరణయుగళుడు, విక్రమాశ్రయుడునని[35] ప్రశంసించబడినాడు.

శాసన ప్రదాత అయిన మహారాజు మాధవవర్మ అతుల బల పరాక్రమ యశోదాన వినయ సంపన్నుడు, దశ శత సకల ధరణీతల నరపతి,[36] అవసిత వివిధ దివ్యుడు,[37] త్రివర నగర భవనగత పరమ యువతీజన విహరణరతి,[38] అనన్య నృపతి సాధారణ దాన మాన దయాధర్మ ధృతి మతి కాంతి శౌర్యౌదార్య గాంభీర్య ప్రభుత్వనేక గుణసంపజ్జనిత రయసముత్థిత భూమండల వ్యాపివిపులయశుడు,[39] క్రతు సహస్రయాజి, హిరణ్యగర్భ ప్రసూతుడు, ఏకాదశాశ్వమేధ యాజి విద్వద్ద్విజ గురు వృద్ధ తపస్వి జనాశ్రయుడు[40] నని వర్ణించబడినాడు. తర్వాత ఆ రాజును గూర్చి శ్లోక రూపంలో ఈ క్రింది విధమైన ప్రశంస కన్పిస్తుంది.[41]

నియమాగన సంసత్వం
కైశవం కాంతిమైందవీం
ఉద్వహన్నురు భాః భాతి
విక్రమాదాప్త భూరి భూః

ఈ శాసనం తూర్పు చాళుక్య రాజయిన మొదటి జయసింహుడు తన 5వ రాజ్య సంవత్సరంలో ఈయబడిన మఠౌక పొలమూరు శాసనం[42] తో కలసి లభ్యమైంది. ఈరెండు శాసనాలు

పొలమూరు గ్రామాన్నే, ఒకేగృహీత్రు వంశంలో దానం చేస్తున్నట్లు కన్పిస్తాయి.[43] తూర్పు చాళుక్యరాజు పరిపాలనా కాలాన్ననుసరించి, ఈ రెండు శాసనాల ప్రదాన కాలాల మధ్య వ్యత్యాసాన్ని నిర్ణయించి మాధవవర్మ పరిపాలనా కాలాన్ని, తద్ద్వారా విష్ణుకుండిన వంశ కాలానుక్రమణికలను నిర్ధారించవచ్చునని **పూర్వ** చరిత్రకారుల విశ్వాసము.

విష్ణుకుండిన వంశ చరిత్రను **గూర్చి** పరిశోధించిన చరిత్రకారులకు బహుకాలంగా తెలిసిన శాసనాలివి మాత్ర**మే**. ఇటీవల బయల్పడిన తుండి శాసనము[44] వంశానుక్రమణిక, రాజప్రశంసలను **పూర్తి**గా చిక్కుళ్ళ శాసనం వలెనే తెల్పుతున్నా, తత్ప్రదాతయైన రెండవ విక్రమేంద్రవర్మ పరిపాలన పదునాల్గు సంవత్సరాలు జరిగినట్లు,[45] ఇతఃపూర్వం చిక్కుళ్ళ శాసనం తెలిపినట్లు పది సంవత్సరాలు మాత్రమే కాదని, తెల్పుతుంది.

రెండు తుమ్మల**గూ**డెం శాసనాలు[46] విష్ణుకుండినవంశంలో నితఃపూర్వం తెలియని వంశక్రమ[47] కాల సూచికలను తెల్పు**తూ**, తీవ్ర సంచలనం కల్గిస్తున్నాయి. లిపి పరిణామశాస్త్రానుసారం **ఈ** రెండు శాసనాలు క్రీ. శ. 6వ శతాబ్ది ద్వితీయార్థానికి చెందినవి. అందుచేత తత్ప్రదాతలు సమకాలీనులని **భా**వించవలసినట్లు[48] కన్పిస్తుంది.

తుమ్మలగూడెం మొదటి శాసనం గోవిందవర్మచే నతని ముప్పది యేడవ రాజ్య సంవత్సరంలో[49] నీయబడింది. స్వస్తి వచనానంతరం బుద్ధభగవానుని స్తుతితో ప్రారంభమై విష్ణుకుండిన వంశ ప్రశస్తిని, ప్రదాత వరకుగల ''మహారాజు'' పరంపరను తెలియజేస్తుంది ఇందు పేర్కొనబడిన మహారాజులు ఇంద్రవర్మ, మాధవవర్మ, శాసన ప్రదాతయైన గోవిందవర్మ వీరిలో గోవిందవర్మ మాత్రమే విపులంగా ప్రశంసించబడగా, మిగిలిన ఇద్దరు మహారాజులు నామమాత్రంగానే ప్రస్తావించబడినారు.

గోవిందవర్మ స్వనయ భుజబలోత్సాహ ప్రభావానురాగాలచే స్వరాజ్యమును పొందినవాడు; శౌర్య ధైర్య ప్రతాపానుభావాలచే అన్యసామంత రాజ్యాల నాక్రమించినవాడు; దాన మానాది విధానాలచే వర్ణాశ్రమ స్వజన పరిజన పాలనయందనురక్తి చూపినవా**డు**; గ్రామ క్షేత్ర హిరణ్య ద్విరద తురగ గోబలీవర్ద శయనాసన యాన పాన **భో**జన భాజన భవన వసనాభరణ కన్యాదాసీ దాససహస్ర ప్రదాత; అనేక దేవాయతన విహారసభా ప్రపాత**టా**కోదపానారామ (నిర్మాణము, పూర్వకృతములైన వాటి) ప్రతి సంస్కారములను జరిపి, సకల దిగంతముల నలంకరించినవాడు; భిక్షుద్విజానాథయాచక వ్యాధిత దీన కృపణ జనోపభుజ్యమానమైన న్యాయాధిగత విభవ ధన సముదయ**ము** కలవాడు; సకృత్సర్వస్వత్యాగి, సకల శాస్త్రార్థశ్రవణ పరిజ్ఞానములచే నిహపరములను **గూర్చి** అసామాన్యదృష్టి కలవాడు; విద్వచ్ఛూర మహాకులీన జన సమాశ్రయుడు; సకల సత్వధాతూత్రాణాయోత్పాదిత మహాబోధిచిత్తుడు[50] నని ప్రశంసించబడినాడు. ఆ రాజు తన అగ్రమహిషియైన పరమ మహాదేవిచే నిర్మితమైన మహావిహారానికి ఎంబుదల, పెణ్కపఱ అను గ్రామద్వయాన్ని దానం చేస్తున్నట్లు[51] ఈ శాసనం తెలియజేస్తుంది.

తుమ్మల**గూ**డెం రెండవ శాసన**ము** రెండవ విక్రమేంద్రవర్మచే అతని పదునొకండవ రాజ్యసంవత్సరంలో[52] దానికి సరియైన శక గతాబ్ది 488 (క్రీ. శ. 566) లో నీయబడింది [52a] ఈ శాసనం **శ్లోకరూపంలో** సత్యాశ్రయుని సుతుడైన **ఉత్తమాశ్రయుడు తన** బాలార్క ప్రతిమాన తేజస్సుచే దిఙ్మండల వ్యాప్తమైన లోకాన్ని వెలిగిస్తున్నాడని ప్రశంసించబడింది.[53] ఆ పిమ్మట, స్వస్తివచనానంతరం వంశప్రశంస, శాసన ప్రదాత వరకు కల మహారాజ పరంపర పేర్కొనబడినాయి. ఈ శాసన మీ క్రిందివిధంగా విష్ణుకుండిన మహారాజులను పేర్కొంటున్నది.

గోవిందవర్మ
|
మాధవవర్మ
|
విక్రమేంద్రవర్మ
|
ఇంద్రభ**ట్టా**రకవర్మ
|
(రెండవ) విక్రమేంద్ర భట్టారకవర్మ

గోవిందవర్మ షడభిజ్ఞ, ప్రాతిహార్య దర్శనానుగ్రహ జనిత సుగత శాసనాభిప్రసాదమును పొందినవాడు, విబుధ భవన ప్రతిస్పర్థి శోభాయమానములైన అనేక మహావిహార ప్రతిష్ఠాపనచే ననంతమైన బ్రహ్మపుణ్య సంభార భార**ము** కలవాడు[54] నని ప్రశం**సించబడినాడు.**

మాధవవర్మ ఏకాదశాశ్వమేధ రాజసూయ పురుష మేధాది క్రతువులను శ్రుతివిహితాశేషంగా ననుష్ఠించినవాడు; ప్రాగ్దక్షిణాపరాం**భో**నిధి రేవాపరిత్సలిలవలయిత**మై**న భూమికి భర్తయైనవాడని[55] వర్ణింపబడినాడు ఆతని పుత్రుడైన విక్రమేంద్రవర్మ **మ**హారాజుగానూ, వాకాటక మహాదేవీ సుతుడు, మహాకవి, పరమ సౌగతుడైన వాడని[56] వివరింపబడినాడు. ఇంద్రభ**ట్టా**రకవర్మ అనేక చాతుర్దంత యుద్ధ విజయాలచే నశేష చక్రవర్తి క్షేత్రాన్ని పొందినవాడు, స్ఫురత్ఖడ్గ కిరణ సహస్రావళిచే ప్రకాశమానమైన స్వభుజ దినకర ప్రభావంచేత నశేష దాయాద మండల ఘనతిమిర పటలాన్ని ధ్వంసమొనర్చినవాడని[57] ప్రశంసించబడినాడు ఆతని పుత్రుడు, శాసన ప్రదాతయునైన విక్రమేంద్రవర్మ తండ్రి కనురూపమైన శౌర్యాతిశయమును, సమస్త రాజర్షి గుణసంపద్యోగ సామర్థ్యమును కలిగి, ప్రకృతి మండలిచేత శైశవమునందే రాజ్యభారము నారోపించబడినాడు, ప్రణతానేక **సా**మంత మణిమయూఖోద్భాసితవర చరణ యుగళుడని[58] కీర్తింపబడినాడు.

ఈ శాసన ప్రాధాన్యత పైన వివరింపబడిన మహారాజ పరంపర, ప్రశంసలందేకాక, ప్రధాన భాగమునందలి పరమభ**ట్టా**రికా

మహాదేవిని గూర్చి చేసిన ప్రశస్తియందు కూడ కలదు. రెండవ విక్రమేంద్రవర్మ తాను గ్రామదానం చేస్తున్న మహావిహారము పరమ భట్టారికా మహాదేవిచే నిర్మించబడిందని[59] తెలియజేస్తూ, ఆమె వ్యక్తిత్వ విశేషాలను వివరించాడు. అందాతడు గత కాలాన్ని స్ఫురణకు తెచ్చుకొంటూ, స్వపరవంశాలంకార భూతులైన సర్వరాజర్షులను తగురీతిలో గౌరవభావంతో యిలా అర్థంచేసికొంటున్నాడని[60] చెప్పబడింది.

—తన ప్రభావంచేత అన్యరాజవంశాలను సాత్మీభూతం చేసికొని, పృథివీపతి పదాన్నాహరించిన నిరతిశయ మహిమను వ్యక్తమొనర్చిన నయ పరాక్రమాదిగుణ సందోహానికి పుత్రనెపంతో[61] మాధవ రాజనే పేరున మనోహరాకారమునకు జన్మనిచ్చుట (అనగా, నయపరాక్రమాది గుణసందోహము, మనోహరాకారము కల మాధవ రాజునకు తల్లియగుట)చేత;[62]

—విష్ణుకుండి కులమును సమ్మానించు సంబంధంతో ప్రఖ్యాత మహిమను కల్గి, అశేష సామంత కులతిలకాయమానులైన వంశపూర్వులను కల్గి, నిశ్చలమైన సద్గుణమణి కాంతులచే విపుల దిగంతరాళము నాక్రమించిన శ్రీ పృథ్వీమూల రాజవంశమును (తన) జన్మచేత, లక్ష్మిసాగరమునువలె, నలంకరించినదియు,[63]

దక్షిణాపథమునందలి ప్రతిరాష్ట్రమును వివిధ, మనోహరమైన వనితనములచేత ననేక అద్భుత స్థాపవిహారములచే నలంకరించి, శ్రీ పర్వతమునకు[64] పూర్వాపరమునందున్న రాజపరంపరా హార మధ్యంలో కౌస్తుభరత్నంవలె ప్రకాశించిన జన్మకలవాడు, గుణ రూప సంపదలందు గోవిందు ననుగమించినవాడునైన గోవింద రాజు[65] నకు మూర్తీభవించిన శ్రీ రూపమైన పరమభట్టారికా మహాదేవి[66], ఇంద్రపురాన్నలంకరించే కోరికతో నచట మహావిహారం నిర్మించింది.[67]

విష్ణుకుండిన వంశవృక్షము

పైన వివరించిన శాసనాలలో మొదట లభించిన చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలోని రాజపరంపర ఒకటేనని, వారిపేర్లు, ప్రశంసలు సమానంగా ఉండడంచేత స్పష్టమవుతున్నది. విష్ణుకుండిన చరిత్రపై పరిశోధనలు జరిగిన ప్రారంభకాలంనుండి, ఈ విషయంలో ఎట్టి వివాదమూలేదు. అలాగే, తుండి గ్రామ శాసనంలోని మహారాజపరంపర, ప్రశస్తులు, పై శాసనాల సమాచారాలతో నేకీభవిస్తాయి.

విష్ణుకుండిన వంశకాలాను క్రమణికలకు లిపి పరిణామ శాస్త్రం (Palaeography) పరిశీలనమే ప్రధాన సాధనంగా భావింపబడిన కాలంలో, ఈపూరు రెండవ శాసనం అన్నిటికన్న ప్రాచీనమైనదిగా భావించబడింది. అనాటికింకా పొలమూరు శాసనం వెలువడలేదు. హూల్ష్ పండితుడు[68] చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలో ప్రశంసించబడిన మాధవవర్మ ఒకడేనని, ఆతడు మొదటి ఈపూరు శాసన ప్రదాత అయి ఉండవచ్చునని భావించారు. రెండవ ఈపూరు శాసనలిపి లక్షణాలనుబట్టి ఈ మూడు శాసనాలకంటెనది పూర్వమై, తత్ప్రదాత అయిన మాధవవర్మ మొదటి ఈపూరు శాసన ప్రదాతయొక్క పితామహుడు కావచ్చునని అభిప్రాయపడినాడు. సర్వసాధారణంగా, తాతలపేర్లు మనుమలకుంచడం సంప్రదాయసిద్ధం కనుక, ఈ విధమైన నిర్ణయం సవ్యంగానే కన్పించింది. రావు బహదూర్ కృష్ణశాస్త్రిగారు[69] కూడ అదేవిధంగా భావించారు. వారిరువురు ప్రతిపాదించిన విష్ణుకుండిన వంశవృక్ష స్వరూపం ఇది:

మొదటి మాధవవర్మ
(ఏకాదశాశ్వమేధి, క్రతుసహస్రయాజి)
|
దేవవర్మ
|
రెండవ మాధవవర్మ
(త్రికూట మలయాధిపతి,
ఈపూరు రెండవ శాసన ప్రదాత)
|
గోవిందవర్మ
|
మూడవ మాధవవర్మ
(మొదటి ఈపూరు శాసన ప్రదాత)
|
విక్రమేంద్రవర్మ
|
ఇంద్రవర్మ
|
రెండవ విక్రమేంద్రవర్మ
(చిక్కుళ్ళ శాసన ప్రదాత)

పొలమూరు శాసనం వెలువడిన తర్వాత కృష్ణశాస్త్రిగారు[70] ఆ శాసనమందలి విక్రమహేంద్రుని రెండవ విక్రమేంద్రవర్మగా భావించి[71] పై వంశవృక్షాన్నిక్రిందివిధంగా మరిరెండు తరాలు పొడిగించారు.

రెండవ విక్రమేంద్రవర్మ
|
రెండవ గోవిందవర్మ
|
నాలుగవ మాధవవర్మ
(పొలమూరు శాసన ప్రదాత)

తదుపరి శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు[72] ఈపూరు మొదటి శాసనంలోని రాజపరంపర పొలమూరు శాసనంలోని వంశక్రమ వివరంలో నిమిడిపోతుందని, ప్రత్యేకంగా చూపనవసరంలేదని, విష్ణుకుండిన వంశవృక్షాన్నిక్రిందివిధంగా సవరించారు.

మొదటి మాధవవర్మ
|
దేవవర్మ
|
రెండవ మాధవవర్మ
(ఈపూరు శాసన ప్రదాత)
|
మొదటి విక్రమేంద్రవర్మ
|
ఇంద్రవర్మ
|
రెండవ విక్రమేంద్రవర్మ
|
గోవిందవర్మ
|
మూడవ మాధవవర్మ
(మొదటి ఈపూరు, పొలమూరు శాసన ప్రదాత)
|
మంచన్న భట్టారకుడు
(మొదటి ఈపూరు శాసనాజ్ఞాపకుడు)

ఈవిధంగా నిర్మించబడిన విష్ణుకుండిన వంశవృక్షాలలోని మాధవవర్మ నామధేయులందఱు, ఒక్క రెండవ మాధవవర్మ కాక, ఏకాదశాశ్వమేధ క్రతుసహస్రయాజులే! అందుచే డా. డి. సి. సర్కారుగారు[73] వీటినిక్రిందివిధంగా విమర్శించి లోపాలనెత్తి చూపారు. 1) పొలమూరు శాసనం వెలువడడంతో మాధవవర్మ పితామహుడు మఱొక మాధవవర్మ కాక, విక్రమహేంద్రుడని స్పష్టమయింది[74] 2) రెండవ ఈపూరు శాసన ప్రదాతయైన మాధవవర్మ ఏకాదశాశ్వమేధి, క్రతుసహస్రయాజికాడు; చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలో ప్రశంసించబడిన మాధవవర్మ త్రికూట మలయాధిపతికాడు. అందుచే వారిరువుర నొకరుగా భావించ రాదు.[75] 3) విష్ణుకుండిన శాసనాలన్నిటిలో నేకాదశాశ్వమేధ, క్రతు సహస్రయాజిగా చెప్పకొన్న, లేదా చెప్పబడిన మాధవవర్మ నామధేయులందఱ నొక్కరుగ భావించడం యుక్తం ఒకేవంశంలో, ఒకే పేరు కలిగి, ఒకే సంఖ్యలో నగ్నిష్టోమాశ్వమేధాలను జరిపిన అనేక మహారాజులున్నా నడం సబబుకాదు.[76]

అందుచే ఈపూరు రెండవ శాసనం లిపి లక్షణాలనుబట్టి ప్రాచీనమైనదిగా కన్పించినా, తత్ప్రదాతయొక్క పితామహునిగా చెప్పబడిన మాధవవర్మ ఈపూరు (మొదటి), పొలమూరు శాసనాల

ప్రదాతతోను, చిక్కుళ్ళ రామతీర్థం శాసనాలలో ప్రశంసించబడిన సనామధేయునితోను ఏకీకరించి, డా. సర్కారుగారు ఈక్రింది విధంగా విష్ణుకుండిన వంశవృక్షాన్ని నిర్మించారు.

- విక్రమహేంద్ర (లేక మొదటి విక్రమేంద్రవర్మ ?)
  - గోవిందవర్మ
    - మాధవవర్మ (ఏకాదశాశ్వమేధ క్రతు సహస్రయాజి) (మొదటి ఈపూరు, పొలమూరు శాసన ప్రదాత)
      - దేవవర్మ
        - మాధవవర్మ (త్రికూట మలయాధిపతి)
      - మొదటి (రెండవ?) విక్రమేంద్రవర్మ
        - ఇంద్రవర్మ
          - రెండవ (మూడవ) విక్రమేంద్రవర్మ

డా. సర్కారుగారు సూచించిన సవరణలు సహేతుకంగా ఉన్నాయని ప్రత్యేకించి చెప్పనవసరంలేదు డా. కె. గోపాలాచారి,[77] డా. మారేమండ రామారావు[78] గార్లు సర్కారు గారేర్పరచిన విష్ణుకుండిన వంశవృక్షాన్నంగీకరించినారు. కాని, భావరాజు వెంకటకృష్ణారావుగారు,[79] ఆచార్య కె ఏ. నీలకంఠశాస్త్రి[80] గారలు సర్కారుగారి వాదాలను తిరస్కరించి, చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలో ప్రశంసించబడిన మాధవవర్మ, మొదటి ఈపూరు, పొలమూరు శాసనాల ప్రదాత కాజాలడని భావించారు. అందుకు ఆ యిద్దరిమధ్య బిరుద ప్రశంసలలో కొన్ని తేడాలను వారు గుర్తించారు. అవి : త్రివర నగర భవన గత యువతులతో గల సంబంధాలను సూచించేవి;[81] స్మృతి మతి బలసత్వ ధైర్యాది గుణసూచకాలు;[82] హిరణ్యగర్భ ప్రసూత, అవసిత వివిధ దివ్య, జనాశ్రయ బిరుదాలు [83] ఈ బిరుదాలు చిక్కుళ్ళ, రామతీర్థం శాసనాలలో ప్రశంసించబడిన మాధవవర్మకు లేవు. కొమర్రాజు లక్ష్మణరావుగారు సూచించినట్లుగా, పొలమూరు శాసన ప్రదాత అయిన మాధవవర్మ బాదామి చాళుక్య మహారాజు రెండవ పులకేశికి సమకాలికుడై, ఆతనిచే నోడింపబడి, రాజ్యభ్రష్టుడైనట్లు వారు భావించారు [84] తదనుగుణంగా వారు నిర్మించిన విష్ణుకుండిన వంశవృక్ష స్వరూపం ఇలా ఉంటుంది.

- మొదటి మాధవవర్మ (ఏకాదశాశ్వమేధ, క్రతుసహస్రయాజి)
  - దేవవర్మ
    - రెండవ మాధవవర్మ (రెండవ ఈపూరు శాసన ప్రదాత)
  - మొదటి విక్రమేంద్రవర్మ
    - ఇంద్రవర్మ
      - రెండవ విక్రమేంద్రవర్మ
        - గోవిందవర్మ
          - మూడవ మాధవవర్మ (ఏకాదశాశ్వమేధి, క్రతుసహస్రయాజి, హిరణ్యగర్భ ప్రసూతి, జనాశ్రయుడు, మొదటి ఈపూరు, పొలమూరు శాసన ప్రదాత)
            - మంచన్న భట్టారకుడు

పై విధంగా నిర్మించబడిన విష్ణుకుండిన వంశవృక్షంలో ఏకాదశాశ్వమేధ, క్రతు సహస్ర యాజులైన ఇద్దరు మాధవవర్మలు చోటు చేసుకొన్నారు. కొందరు చరిత్రకారులు మొదటి మాధవవర్మ మాత్రమే అట్టి క్రతువులు జరిపి యుండవచ్చునని, పొలమూరు శాసన ప్రదాత సంప్రదాయికంగా మాత్రమే అట్టి ఖ్యాతిని చెప్పుకొన్నాడని భావిస్తారు.[85] కొన్ని రాజవంశాలలో పూర్వులెవరో సల్పిన క్రతువులను పారంపర్యంగా చెప్పుకొనే పద్ధతి లేకపోలేదు.[86] కాని విష్ణుకుండిన శాసనాలలోని వాక్యాలు అలా కాక, వ్యక్తిపరమైన అర్థాన్నిస్తున్నాయి. విష్ణుకుండిన రాజులందరిలో అట్టి క్రతు నిర్వహణను మఱొక మాధవవర్మ నామధేయుడు మాత్రమే చెప్పుకొనడమూ, వారిరువురి నడుమగల రాజులెవ్వరు ఆ బిరుదాలపై ఆసక్తి చూపక, అతిశ్రద్ధతో కేవలం తమ వంశపూర్వుడైన మాధవవర్మకే కట్టబెట్టడంవలన, అది కేవలం సాంప్రదాయిక ప్రశస్తి కాదని స్పష్టమవుతుంది.[87] కనుక పొలమూరు శాసనం ఏకాదశాశ్వమేధి, క్రతుసహస్రయాజులైన మాధవవర్మలనిద్దరున్నట్లే సూచిస్తుంది.

విష్ణుకుండినులు : త్రికూటమలయశాఖ

విష్ణుకుండినుల వంశవృక్ష నిర్మాణంలో చరిత్రకారులలో నున్న మఱియొక వివాదం రెండవ ఈపూరు శాసన ప్రదాత అయిన మాధవవర్మకు కల స్థానం. కొందఱాతడు మూలవంశంలోనివాడుగా (అనగా విష్ణుకుండిన రాజులందఱు నొకే రాజపరంపరగాను, ఈతడందులోని వానిగాను), మొదటి మాధవవర్మ తర్వాత సింహాసనము నధిష్ఠించిన వానిగాను, భావిస్తారు.[88] తదనంతరం ఆతని ద్వైమాతుర పితృవ్యుడైన మొదటి విక్రమేంద్రవర్మ వార్ధక్యంలో సింహాసనము నధిష్ఠించినట్లు వారి అభిప్రాయం కాని, శ్రీ వి. యస్. రామచంద్రమూర్తిగారు[89] దేవవర్మ, ఆతని కుమారుడైన మాధవ

వర్మలు త్రికూట మలయశాఖీయులైన విష్ణుకుండినులని, మూల వంశంలోనివారు కారని సూచించారు. మూలవంశం మొదటి మాధవవర్మ తర్వాత అతని కుమారుడైన మొదటి విక్రమేంద్రవర్మ, తత్సంతతివారిచే కొనసాగించబడి యుంటుందని ఆయన నిర్ణయిం చారు. ఈ సూచన సరియైనదిగా కన్పిస్తుంది ఆ తర్వాత పలువురు చరిత్రకారులు తదనుగుణంగా విష్ణుకుండిన రాజపరంపరను సవ రించి నిర్ణయించారు.[90]

మొదటి విక్రమేంద్రవర్మ వాకాటక మహాదేవీ సుతుడని,[91] రాజు,[92] మహారాజు[93] బిరుదాలతోనూ ప్రశంసించబడినాడు. కనుక అతడు మొదటి మాధవవర్మ కుమారులలో పట్టమహిషి పుత్రుడై రాజ్యార్హత కలవాడని, తండ్రి అనంతరం సింహాసనము నధిష్ఠించి, పరిపాలించినవాడని స్పష్టమవుతున్నది. దేవవర్మకట్టి బిరుదాలు లేకపోవడం ఈ సందర్భంలో గమనించవలసిన విషయం. మహారాజ బిరుదం లేకపోవడాన రెండవ మాధవవర్మ సైతం స్వతంత్ర పరిపాలకుడని చెప్ప వీలులేదు. అతనికి కల ''త్రికూట మలయాధిపతి'' యనే బిరుదంవలన, అతడు త్రికూట ప్రాంతాన్ని పరిపాలించిన దాయాద విష్ణుకుండిన వంశీయుడని భావించవచ్చును. ఈ శాఖ నేర్పరచినవాడు మహారాజు మాధవవర్మయని తోస్తుంది.

గోవిందవర్మ, అతని కుమారుడైన మహారాజు మాధవవర్మ కృష్ణానదికి దక్షిణంగా కల ఆంధ్రదేశం (ఇకముందు దక్షిణాంధ్ర దేశమని వ్యవహరించబడుతుంది ఇది కృష్ణ, పెన్న నదులకు నడు మన కల దేశం. పెన్నకు దక్షిణాన పల్లవుల రాజ్యమైన తొండై మండలం ఉంది.) లోనికి రాజ్య విస్తరణలు జరిపారు.[94] ఆ సంద ర్భంగా వారు కృష్ణా పర్యంతమైన దక్షిణాంధ్ర దేశాన్నాక్రమించి యుండిన పల్లవులతో సుదీర్ఘ పోరాటాలు జరిపినట్లు, ఒకానొక సమయాన మాధవవర్మ మహారాజు స్వయంగా సేనా నాయకత్వం వహించి, పల్లవులతో పోరినట్లు వేల్పూరు శిలా శాసనం వలన తెలుస్తున్నది.[95] ఆ సందర్భంలో పల్లవులను దక్షిణాంధ్ర దేశం నుండి తరిమివేసి, ఆ ప్రాంతంపై తమ అధికారాన్ని నిరపాయం చేసుకొనేందుకు విష్ణుకుండినులు - అనగా మాధవవర్మ త్రికూట ప్రాంతాన్నొక సామంత రాజ్యంగా ఏర్పరచినాడని తోస్తుంది. పల్ల క్కడ రాజధానిగా పరిపాలించిన ఆంధ్ర పల్లవ శాఖకూడ నీవిధంగ ఏర్పడిందేనని భావించవచ్చును.[96]

విష్ణుకుండినుల త్రికూటరాజ్యం అమరపురం[97] నుండియో లేక కుడూరపురం నుండియో[98] పల్లవులతో పోరాటాలుసల్పుతూ వారి వ్యాప్తి నరికట్ట గల్గింది. కాని, తర్వాత దేవవర్మ కుమారు డైన మాధవవర్మ మూల వంశంతో విరోధించి, పోరాటాలు సల్పి నట్లు కన్పిస్తుంది. ఇంద్రవర్మ దాయాద వంశాలను నిర్మూలించి నాడన్న శాసన ప్రమాణాలు అతడు త్రికూట శాఖీయ విష్ణుకుండి నులతో పోరాటాలు జరిపినట్లు, ఆ పోరాటాలలో ఆ వంశాన్ని నిర్మూలించినట్లు సూచిస్తాయని, శ్రీరామచంద్రమూర్తిగారు సరిగా అభిప్రాయపడినారు.[99]

'త్రికూటమలయ' మని వ్యవహృతమైన దేశంలోని మలయ, నేటి తూర్పు గోదావరి, విశాఖపట్టణం జిల్లాలలోని అరణ్య ప్రాంత మని, ఇది తర్వాత కాలంలో 'మన్య' ప్రాంతంగా పిలువబడుతూ వచ్చిందని, చరిత్రకారుల అభిప్రాయం[100] అగునేని, రెండవ మాధవవర్మ తన ఈపూర (రెండు) శాసనకాలం నాటికి తీరాంధ్రా న్నంతటిని స్వాధీనపరుచుకొని, తద్వారా మూలవంశంపై తిరుగబడి, పోరాటాలు సాగించినాడని తోస్తుంది. మహారాజ బిరుదం అప్పటి కింకా ధరించకున్నా, ''త్రికూట మలయాధిపతి''నంటూ సగర్వంగా చాటుకొనడం అతని స్వతంత్ర ధోరణినే వ్యక్తం చేస్తున్నది. ఈపూరు శాసనాజ్ఞప్తిగా నొక ''విష్ణుకుండ్యధి రాజు''ను పేర్కొ న్నంత మాత్రాన తత్ప్రదాతయైన రెండవ మాధవవర్మ నస్వతం త్రునిగా భావించవీలులేదు. సామంతరాజుల శాసనాలకు ''అధిరాజు' లాజ్ఞప్తులుగా నుండటం అసంభవం.[101] అస్పష్టము, అసమగ్రమూ అయిన రెండవ ఈపూరు శాసన పాఠం ఈ సందర్భంలో గణనీయ మైన సాక్ష్యంగా భావించతగదు. తచ్ఛాసనకాలం నాటికి రెండవ మాధవవర్మ స్వతంత్రించినాడని, మూలవంశాన్ని జయించిన పిదప ''మహారాజు''గా ప్రకటించుకొని యుండేవాడని గ్రహించడంలో పొరబాటుండబోదు. కనుక, శాసనకాలంగా చెప్పబడిన రాజ్య సంవ త్సరాలతని పరిపాలనకే చెందుతవి. అయితే, మూల వంశంపై అతడు విజయుడు కాలేదు, అందుచే ''మహారాజు'' బిరుదంతో శాసనాల నీయలేకపోయాడు.

ఇంద్రవర్మ తన 27వ సంవత్సరంలో ఇచ్చిన రామతీర్థం శాసనంలో తన దాయాద విధ్వంసన ప్రస్తావించలేదు అతని కుమారుడైన రెండవ విక్రమేంద్రవర్మ తన తండ్రి ప్రస్తావన వచ్చినపుడెల్ల, ఆ యుద్ధాలను జ్ఞప్తి చేయకమానలేదు. దీనినిబట్టి ఇంద్రవర్మయొక్క 27వ రాజ్యసంవత్సరం తర్వాత ఈ పోరాటాలు జరిగినాయని[102] అవి విష్ణుకుండిన సామ్రాజ్య సుస్థిరతకు భంగం కల్గించగల తీవ్రస్థాయిలో ఈ పోరాటాలు జరిగి, ఇంద్రవర్మ సాధిం చిన ఘన విజయాలలో చెప్పదగిన వైనాయని తోస్తుంది. ఆ యుద్ధాలలోనే బహుశః, ఇంద్రవర్మ విజయుడైనా, అసువులువీడి యుండవచ్చును. అందుచేతనే రెండవ విక్రమేంద్రవర్మ శైశవం లోనే రాజ్యాభిషిక్తుడైనాడని నిర్ణయించవచ్చు.

ఇంద్రవర్మకు, రెండవ మాధవవర్మకు బహుశః, గృధ్ర హారంలోని కుడూరపురం వద్ద[103] పోరాటాలు జరిగియుండవచ్చు నని తోస్తుంది. ఈ పోరాటాలలో పాల్గొనడానికి, దక్షిణ దిశగా కదలివస్తూ ఇంద్రవర్మ పృకి రాష్ట్రంలో పెరువిండక గ్రామాన్ని దానమిచ్చినాడని, తత్సందర్భంగనే రామతీర్థం శాసనమిచ్చినాడని భావించవచ్చు.

విష్ణుకుండిన కాలానుక్రమణిక

విష్ణుకుండిన తూర్పు చాళుక్యరాజుల పొలమూరు శాసనాలు, అందలి దానగ్రహీతలను, వారి పూర్వులను వర్ణించిన తీరు, విశే షించి తూర్పు చాళుక్య శాసనమందలి గ్రహీత ''పూర్వాగ్రహారి కుడ''ని పేర్కొనబడడము చరిత్రకారులు ఆ శాసన గ్రహీతల వంశానుక్రమణికను నిర్ధారించడానికి పురికొల్పినాయి. తత్పులి

తంగా, విష్ణుకుండిన దానగ్రహీత కుమారుడే చాళుక్య దానగ్రహీత యని నిర్ధారణ చేయబడింది [104] ఈ రెండు శాసనాలలోని దాన గ్రహీతలు, వారి పూర్వులు వర్ణించబడిన తీరును ఈ క్రింది పట్టికలో పరిశీలించవచ్చు.

విష్ణుకుండిన శాసనము[105]

1. రుద్రశర్మ (వేద వేదాంగ విదుః)
|
2. దామశర్మ (స్వపితు రధిక గుణాధ్యాసిత తనుః)
|
3. శివశర్మ (తైత్తిరిక సబ్రహ్మచారి, వేద చతుష్టయ సమామ్నాతా వదాతా ననాయ, స్వకర్మానుష్ఠానపరాయ)

తూర్పు చాళుక్య శాసనము[106]

1. దామశర్మ (వేద వేదాంగ విదుః)
|
2. శివశర్మ (స్వపితు రధిక గుణాధ్యాసిత తనుః)
|
3. రుద్రశర్మ (వేద ద్వయాలంకృత శరీరాయ, స్వకర్మానుష్ఠాన పరాయ, పూర్వాగ్రహారిక.[107].)

"విష్ణుకుండిన శాసన ప్రదానానంతరం రెండవ పులకేశి తీరాంధ్రంపై దండెత్తి, వేంగిలో చాళుక్య రాజ్యం స్థాపించినాడని, కుబ్జ విష్ణువర్ధనుని అనంతరం పరిపాలించిన మొదటి జయ సింహుడు పొలమూరు గ్రామాన్ని పూర్వాగ్రహారిక వంశానికి పునర్దత్తం చేసినాడని, ఈ ఉభయ ప్రదానాలు సుమారొక తరం వ్యవధిలో జరిగినాయని వారు విశ్వసించారు. కొమర్రాజు లక్ష్మణ రావుగారు[108] రెండవ పులకేశి దండయాత్ర క్రీ. శ. 610 లో జరిగిందని, తత్సమీపకాలంలో విష్ణుకుండిన ప్రదాన కాలంగా చెప్పబడిన చంద్రగ్రహణం క్రీ. శ. 594, ఫిబ్రవరి 10న సంభవించిందని నిర్ణయించారు [109] తదనుగుణంగా ఆయన విష్ణుకుండిన కాలానుక్రమణిక నీ క్రింది విధంగా నిశ్చయించారు.

మొదటి మాధవవర్మ	క్రీ. శ. 357–382
దేవవర్మ	382–407
రెండవ మాధవవర్మ	407–444
మొదటి విక్రమేంద్రవర్మ	444–469
ఇంద్రవర్మ	469–496
రెండవ విక్రమేంద్రవర్మ	496–521
గోవిందవర్మ	521-546
మూడవ మాధవవర్మ	546 610
మంచన్న భట్టారకుడు	610

ఈ పట్టికలో మూడవ మాధవవర్మకాక, మిగిలిన రాజులందరికీ సగటున 25 సంవత్సరాలు పరిపాలనా కాలం కేటాయించబడింది. ఆ రాజు దానం చేసిన పొలమూరు శాసనం అతని 48 వ రాజ్య సంవత్సరం నాటిది కనుక, అతడొక అర్ధశతాబ్ది పరిపాలించినాడని భావించవచ్చు కాని, ఆతనికి 48వ రాజ్య సంవత్సరాన్ని క్రీ. శ. 594 గాను, ఆపైన క్రీ శ. 610లో పులకేశి దండయాత్రా సమయాన ఆంధ్రదేశాన్ని పరిపాలిస్తూండిన రాజతడేనని భావించి, 64 సంవత్సరాల పరిపాలనా కాలాన్ని అతనికి కేటాయించడం యుక్తంగా కన్పించదు. ఇంత సుదీర్ఘకాలం పరిపాలించిన మఱియొక రాజెవ్వడు ఉదాహరణ మాత్రంగానైనా కానరాడు [110] తక్కిన రాజులకు సగటు పరిపాలనా కాలం కేటాయించడం కూడ సరికాదు. ఇంద్రవర్మ 27 సంవత్సరాలు పరిపాలించినట్లు అతని రామతీర్థం శాసనం చెపుతున్నది. అతడు సుమారు 30 సంవత్సరాలు రాజ్యపాలన చేసినాడని చెప్పవచ్చు.

డా. డి. సి సర్కారుగారు పై సిద్ధాంతాన్ని ఖండించి, 5వ శతాబ్దికి పూర్వం వేంగిలో విష్ణుకుండినుల పరిపాలనకు అవకాశం లేదని, అది శాలంకాయనుల పరిపాలనా కాలమని వాదించారు. ఆచార్య హెచ్. సి. రావ్ చౌధురి[111] గారి అభిప్రాయాన్ననుసరించి మౌఖరీ వంశీయుడైన ఈశానవర్మచే నోడించబడిన ఆంధ్రాధిపతి విష్ణుకుండిన మాధవవర్మ అయి ఉండాలని, పొలమూరు శాసనమా రాజు పూర్వ దిగ్విగీషతో గోదావరి నతిక్రమించినట్లు చెప్పడం[112] ఈ సిద్ధాంతాన్ని బలపరుస్తుందని ఆయన భావించారు. ఆయన రెండు పొలమూరు శాసనాల కాలాంతరం సుమారొక అర్ధశతాబ్దిగా భావించి, విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికల నిర్మాణానికి దానినే ఆధారంగా గ్రహించారు. ఈ అంశాలాధారంగా ఆయన మాధవవర్మ పరిపాలనాకాలం క్రీ. శ. 535–585గా నిర్ణయించి, విష్ణుకుండిన కాలానుక్రమణిక నిలా రూపొందించారు.

విక్రమహేంద్ర (లేక మొదటి విక్రమేంద్రవర్మ ?)	క్రీ. శ. 500–520
గోవిందవర్మ	520–535
మాధవవర్మ	535–585
రెండవ మాధవవర్మ	585-615[113]
మొదటి విక్రమేంద్రవర్మ (II?)	615–625
ఇంద్రవర్మ	625–655
రెండవ విక్రమేంద్రవర్మ (III?)	655–670

పై పట్టికలో విష్ణుకుండినుల పరిపాలన క్రీ. శ. 670 వరకు, అనగా రెండవ పులకేశి దండయాత్ర, తూర్పు చాళుక్యరాజ్య స్థాపనల తర్వాత కూడ కొనసాగినట్లు చూపబడింది. డా.సర్కారుగారు తూర్పు చాళుక్యుల తొలి రాజధాని పిష్టపురంగాను, తర్వాత రాజమహేంద్రవరంగాను కన్పిస్తుందని, అందుచేత, రెండవ పులకేశిచే ఓడింపబడి, ప్రాభవంకోల్పోయినా, విష్ణుకుండినులు వేంగిలో క్రీ. శ. 670 వరకు పరిపాలించి యుండవచ్చునని ఆయన భావించారు. అయితే, కొప్పరం శాసనం[114] వెలువడడంతో క్రీ శ 631 నాటికే కర్మ రాష్ట్రంతోసహా తీరాంధ్రమంతా వేంగి చాళుక్యుల వశమైనట్లు స్పష్టమైంది. అందుచే, డా. సర్కారుగారు,[115] విష్ణుకుండిన కాలానుక్రమణికలో మొదటి మాధవవర్మ అనంతర కాల వివరాలు తగు విధం సవరించి, యిలా ప్రకటించారు.

(మొదటి) మాధవవర్మ	క్రీ. శ. 535–585
(మొదటి) విక్రమేంద్రవర్మ	585 590
ఇంద్ర (భట్టారక) వర్మ	590 620
రెండవ విక్రమేంద్రవర్మ	630-631

తుండి శాసనం ప్రకటించే సందర్భంలో తత్ప్రదాతయైన రెండవ విక్రమేంద్రవర్మ పదునాలుగుసంవత్సరాలు పరిపాలించినట్లు తెలియరావడాన సర్కారుగారు మరల నొక సవరణ జరిపి, విష్ణుకుండిన కాలానుక్రమణికను పునర్నిర్మించారు. మొదటి విక్రమేంద్రవర్మ పరిపాలనా కాలం మరింతగా తగ్గించి, ఆ వ్యత్యాసాన్ని రెండవ విక్రమేంద్రవర్మకు కేటాయించడం ద్వారా ఆయన మొదటి విక్రమేంద్ర వర్మ పరిపాలనా కాలం నుండి యీ పునర్నిర్మాణాన్ని సూచించారు.[116]

మొదటి విక్రమేంద్రవర్మ	క్రీ. శ 585–587
ఇంద్రవర్మ	587–616
రెండన విక్రమేంద్రవర్మ	616–631

డా. గోపాలాచారిగారు[117] మొదటి మాధవవర్మకు క్రీ. శ. 553 593 సంవత్సరాల నడుమ పరిపాలించినట్లు భావించి, రెండు పొలమూరు శాసనాల కాలంతర మొక తరమని, అభిప్రాయ పడినారు. డా సర్కారుగారి వలెనే గోపాలాచారిగారు విష్ణుకుండిన పరిపాలన క్రీ. శ. ఏడవ శతాబ్ద్యంలిమ పాదం వరకు కొనసాగి యుంటుందని భావించారు. తరువాత కాలంలో వెలువడిన సాక్ష్యాధారాల ననుసరించి సర్కారుగారు చేసిన సవరణలను గోపాలాచారి గారు చేయలేకపోయారు.

డా. సర్కారు, గోపాలాచారిగార్లు విష్ణుకుండిన పరిపాలనను ఏడవ శతాబ్ది తుది పాదం వరకు జరిగినదని వాదించడాన్ని ఆచార్య నీలకంఠశాస్త్రిగారు[118] తిరస్కరించి, క్రి. శ 616 లో రెండవ పులకేశి దండయాత్రతో విష్ణుకుండిన యుగం ముగుస్తుందని నిర్ణయించారు. మొదటి మాధవవర్మ వాకాటక దేవసేనుని పుత్రిక అయి ఉంటుందని, ఇంద్రవర్మచేసిన చతుర్దంతయుద్ధాలు తూర్పు గంగరాజైన మొదటి ఇంద్రవర్మ[119] తోనని, ఆయన విష్ణుకుండినులకు సమకాలీన రాజవంశాలతో సంబంధాన్ని సూచించారు. ఈ ఆధారాల ననుసరించి, ఆయన నిర్మించిన విష్ణుకుండిన కాలానుక్రమణిక స్వరూపం ఈ విధంగా ఉంటుంది :

మొదటి మాధవవర్మ	క్రీ. శ. 440-460
మొదటి విక్రమేంద్రవర్మ	460–480
ఇంద్రవర్మ	480 515
రెండవ విక్రమేంద్రవర్మ	515–535
గోవిందవర్మ	535–556
మూడవ మాధవవర్మ	556–616
మంచన్న భట్టారకుడు	616

ఈ పట్టిక ననుసరించి, నీలకంఠశాస్త్రిగారు కూడా పొలమూరు శాసన ప్రదాతకు 60 సంవత్సరాల పరిపాలనా కాలాన్ని కేటాయించి, చాళుక్య దండయాత్రి వరకు సుదీర్ఘమైన పరిపాలన నారాజు నెరపినాడని నిర్ణయించినట్లు స్పష్టమవుతున్నది. భావరాజు కృష్ణారావుగారు కూడ[120] ఇదే మాదిరి చారిత్రక సమకాలీనతలను, కొమర్రాజు లక్ష్మణరావుగారు పొలమూరు శాసనానికి నిర్ణయించిన కాల సూచికల ననుసరించి, విష్ణుకుండిన కాలానుక్రమణికలను నిర్మించారు. అంతేకాక ఆయన మొదటి విక్రమేంద్రవర్మ పరిపాలనానంతరం క్రీ. శ. 493 - 500 సంవత్సరాల నడిమి కాలంలో వాకాటక హరిషేణసాయంతో నెవడో దాయాదవంశీయుడు విష్ణుకుండిన సింహాసనము నాక్రమించి యుండవచ్చునని,[121] ఇంద్రభట్టారకుడాతని నోడించి విష్ణుకుండిన మూల వంశీయుల పాలనను పునరుద్ధరించి, దాయాద వినిర్ఘాతునిగా ఖ్యాతి నందినాడని భావించారు.[122] కాని, ఇంద్రభట్టారకుని దాయాద వినిర్ఘాత సంగ్రామాలాతని పరిపాలన ప్రారంభకాలాన జరిగినవి కావని నిశ్చయంగా చెప్పవచ్చును.[123] అంతేకాక, వాకాటకులసాయంతో నెవడూ విష్ణుకుండిన సింహాసనము నాక్రమించినట్లు విశ్వసనీయమైన సాక్ష్యాధారమేదీ లేదు.

శ్రీ భావరాజు కృష్ణారావుగారు నిర్మించిన విష్ణుకుండిన కాలానుక్రమణికా స్వరూప మీక్రింద చూపబడింది.[124]

మొదటి మాధవవర్మ	క్రీ. శ. 420–455
దేవవర్మ	455-458
రెండవ మాధవవర్మ	458–488
మొదటి విక్రమేంద్రవర్మ	488–493
ఇంద్రవర్మ	500–530
రెండవ విక్రమేంద్రవర్మ	530–540
గోవిందవర్మ	540–546
మూడవ మాధవవర్మ	546–611
మంచన్న భట్టారకుడు	611–

పైన పేర్కొన్న చరిత్రకారులలో డా. డి. సి. సర్కార్, గోపాలాచారిగార్లు కాక తక్కినవారు పొలమూరు శాసనానికి కొమర్రాజు లక్ష్మణరావుగారు నిర్ణయించిన తేదీ నంగీకరించినవారే. అలా కాక మౌలికంగా ఆ శాసన ప్రాధాన్యత నంగీకరించి, స్వతంత్రంగా ఆ శాసనానికి క్రీ. శ 621, ఫిబ్రవరి 21గా తేదీని నిర్ణయించి శ్రీ ఆర్. యస్ పంచముఖి[125] వేరొక విష్ణుకుండిన కాలానుక్రమణికను ప్రకటించారు. ఆయన ఆచార్య నీలకంఠశాస్త్రి, భావరాజు కృష్ణారావుగార్లు సూచించిన విష్ణుకుండిన వంశ వృక్షాన్ని చారిత్రక సమకాలీనతలను అనుసరించారు. మొదటి మాధవవర్మ క్రీ. శ. 500 ప్రాంతంలో వాకాటక హరిసేనుని సమకాలికుడని, ఇంద్రభట్టారకుడు క్రీ. శ 535 నాటికి త్రికళింగాధిపతి అయిన తూర్పుగంగ వంశీయుడైన ఇంద్రవర్మతో చతుర్దంత సంగ్రామాలు జరిపినాడని, మూడవ మాధవవర్మ రెండవ పులకేశి సమకాలికుడై, ఆతనిచే నోడింపబడి, పదవీచ్యుతుడైనాడని ఆయన అభిప్రాయ పడినాడు.

(ఇంకా వుంది)

కాలహేల

నిన్నటి సౌందర్యాలు ఇగిరిపోయిన
నిర్మానుష్యపు ఎడారిని నేడు నేను
నిన్నటి స్వప్న శారికలు ఎగిరిపోయిన
నిశ్శబ్ద పుటారామాన్ని నేడు నేను
నిన్నటి మధురోహ జ్యోత్స్నలు కరిగిపోయిన
నీలాకాశాన్ని నేడు నేను
నిన్నటి ప్రేయసి మాటల్లోని ప్రవరత్వాన్ని కోల్పోయిన
నిశ్చైతన్యపు మానవాకృతిని నేడు నేను

ఏవీ నిన్నటి జీవన వసంతాలు ?
ఎప్పుడో వెళ్ళిపోయాయి
ఇప్పుడు వస్తున్న ప్రకృతి వసంతాలు
గతాన్ని కసిగా కెలుకుతున్నాయి
ఈ బ్రతుకు రహదారిలో
ఇంకా సగం దూరమైనా చేరని నా కళ్ళముందు
ఇదేం లీల ?
కాబోలు
కాలహేల !

వాన వెలిసిన ఉదయం

వర్షంలో రాత్రంతా తడిసిన భూదేవి
అప్పుడే ప్రసవించిన బాలెంతలావుంది
ఒయ్యారంగా సాగిన సెలయేటి నురుగు
భూమిపై పడిన పసికందు నిద్రలోని నవ్వులా లీలగావుంది
చెట్లనుండి రాలుతున్న నీటిచుక్కలు
చెప్పరాని ఆనందంతో మురిసిపోతున్న ప్రకృతి హర్షా
శ్రువుల్లా వున్నాయి
తడిసి తడిసి వాన వెలిసిన తరువాత రెక్కలు దులుపు
కుంటున్న పక్షులు
పాపనాశంలో అభ్యంగన స్నానం చేసిన యాత్రికుల్లావున్నాయి
మబ్బుల చాటునుంచి సందుచేసుకొని కించిదరుణంగా
తొంగిచూచే ఉషోరేఖ
ప్రపంచానికి ఉజ్వల భవిష్య దభయమిస్తున్న కాంతి
పతాకలావుంది
అక్కడక్కడా నీటి గుంటల్లో ఈదుతూ వెళుతున్న బాతులు
ఆకాశ గంగాజలాల్లో అందంగా ఈదుతున్న దేవకన్యల్లా
వున్నాయి
వాన వెలిసిన ఉదయం కాళిదాసు కావ్యంలా
పరమ రమణీయంగా వుంది
ఉషోదయంలో తళుక్కున మెరసే ధాత్రి
సంతానాన్ని చల్లగా దీవిస్తున్న జనయిత్రిలావుంది
వాన వెలిసిన ఉదయం నాకు
శాపంతీరి అంగన నాశ్లేషించిన యక్షుని తన్మయత్వంలావుంది.

తిరునగరి



శ్రీ కొల్లూరు సూర్యనారాయణ

పండరంగుని కటకరాజవంశము

తెలుగుజాతి చరిత్రలో చాళుక్యాగమనాన్ని ఒక నవోజ్జ్వల యుగానికి నాందిగా పేర్కొనటం అసమంజసంకాదు. తెలుగుభాషా సంస్కృతుల పరిరక్షణకు కంకణం కట్టుకొని సుమారు ఐదువందల సంవత్సరములు రాజ్యం చేసిన వేంగీచాళుక్య రాజులా స్థితికి చేరటాన్కి ముఖ్యకారణం విధేయమైన వారి సామంతరాజ వంశాలే. వీటి అవిరళకృషి, నిరుపమ త్యాగాలే ఆ ప్రభువులకు జాతి చరిత్రలో ప్రముఖ స్థానాన్ని కూర్చిపెట్టాయి. అలాంటి దండనాయక, సామంతరాజ వంశాల్లో ముఖ్యంగా పేర్కొనవల్సినది కటకరాజ వంశము.

సామాన్య రాజోద్యోగులుగా జేరి విశ్వాసముతో సేవించి చక్రవర్తుల మన్ననలకుఁబాత్రులై వీరు సామ్రాజ్యములోని యత్యున్నత పదవుల నలంకరించి యోధులుగ, దండనాయకులుగా తమ స్వయం ప్రతిభా విశేషాలతో తమ ప్రభువుల కీర్తి ప్రతిష్టల్ని యినుమడింపజేశారు. జన్మతః బ్రాహ్మణులే అయిననూ వీరు వృత్తిగా ఆయుధ విద్యల్ని ఆశ్రయించటాన్కి కారణం ఆనాటి సామాజిక పరిస్థితులే కావచ్చు. సునిసిత మేధాశక్తి వీరిని రాజకీయాన్కి, పరిపాలనా వ్యవస్థకి మరింత సన్నిహితం గావించాయి క్లిష్టమైన పదవులు సమర్థవంతంగా నిర్వహించి వేంగీచాళుక్య ప్రభుత్వం సుస్థిరం కావటాన్కి రాష్ట్రకూటాది శత్రువులకు పాదాక్రాంతం కాకపోవటాన్కి కారణమయ్యారు ప్రప్రథమంగ వీరి ప్రస్తావన వేంగీ చాళుక్యుల్లో ప్రముఖుడైన సమస్త భువనాశ్రయ గుణగ విజయాదిత్యుని కాలంలో కన్పిస్తుంది.

త్రిభువనాంకుశుఁడు, బెజయుఁడు మున్నగు పేర్లతో పిలువబడే యీ గుణగ విజయాదిత్యుడు త్రికళింగములే కలిసి సమస్త దక్షిణాపథాన్ని నలభైనాలుగు సంవత్సరాలు ఏకచ్ఛత్రాధిపత్యంగా యేలినట్లు శాసనాల మూలంగా తెలుస్తోంది.[1] ఈతని రాచరికాన్కి ముందు వెనుకలలో మరెన్నడూ వేంగీ సామ్రాజ్యం యీ కాలంలో వున్నంత శక్తివంతంగాలేదు. అలాంటి సమర్థుడైన చక్రవర్తి నీడలో యీ కటక రాజులు తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు.

గుణగ విజయాదిత్యుని కాలమునాటి అద్దంకి, ధర్మవరము, సాతలూరు, ఊరుటూరు, మచిలీపట్టణము, చింబులూరు, పోణంగి మున్నగు ప్రదేశాల్లోని శాసనాలు, ప్రథమ చాళుక్యభీముని ధర్మవర, మోగశాసనాలు, రెండవ అమ్మరాజ విజయాదిత్యుని కాలమునాటి మలియపూండి, నాగియపూండి శాసనాలు వీరి వంశచరిత్ర తెల్సుకోవటాన్కి తగిన ఆధారాలందిస్తాయి.

ఈ వంశములో ప్రథమంగా ప్రస్తావింపబడినవాడు భట్టకాలుని మనుమడైన కడెయరాజ[2] ఈతని తండ్రి నామమేదో తెలియదు. మొక్కవోని భుజశక్తిలో చాల సంవత్సరము లీతడు ప్రభుసేవలో గడపెను ఈ 'కడెయ' శబ్దము 'కటక' శబ్దమునకు భ్రష్టరూపమనియు నందుచే యీ 'కడెయరాజ' లేక 'కటకరాజ' అనునవి వృత్తి లేక ఉద్యోగ నామమగుననియు, వ్యక్తినామము కాకపోవచ్చుననియు పండితుల యభిప్రాయము.[3] కాని వంశానుగతముగా యీ పదవి యీ కుటుంబీకులకే లభ్యమగుచుండుట గమనార్హము. గుణగ విజయాదిత్యుని సేవలో యీ కడెయరాజు తన జీవిత కాలమంతయు గడపి చివరకు ఒక యుద్ధమున ప్రభుపక్షమున పోరాడుచు రణరంగమునకు బలియైనట్లు పోణంగి శాసనమునందున్నది.[4]

"పరచక్రేణ యుద్ధ్వాజౌ దత్త ప్రాణస్య భూభృతే
మూనుః కడెయరాజస్య పాండరంగో గుణాధికః॥"

పై శ్లోకమే కొలది మార్పులతో చింబులూరు శాసనము నందును చెప్పబడినది. అయినచో గుణగ విజయాదిత్యుని యసంఖ్యాక విజయ యాత్రలలో దేనియందీతడు వీరస్వర్గమందెనో చెప్పుట కష్టము. శాసన పరిశోధక శాఖవారి యభిప్రాయమున యీ కడెయరాజు గుణగవిజయాదిత్యునకు రాష్ట్రకూట కృష్ణుడు, మంగి, సంకిలులకు జరిగిన యుద్ధమున నిహతుఁడై యుండును.[5] శ్రీ నేలటూరి వేంకటరమణయ్య, శ్రీ భావరాజు వేంకటకృష్ణారావు గార్ల వాదమున గుణగవిజయాదిత్యునకు బోయకొట్టములపై జరిగిన దాడిలో నీతని మరణము సంభవించి యుండును[6] కాని ఏ విషయమును నిర్ధారించుటకు అవకాశములులేవు. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారనినట్లు[7] బోయకొట్టములపై దాడికి కొద్దికాలము ముందుగనే యీ కడెయరాజు మరణించినట్లూహించుటకు హెచ్చు వీలున్నది.

ఈతని కుమారుడు గణుతికెక్కిన పండరంగుడు. పండరంగుడే గాక కడెయరాజునకు నయ్యపయ్యయను మరియొక పుత్రుడుఁడినట్లు గుణగవిజయాదిత్యుని కాలమునాటి ధర్మవర శిథిల శాసనమునుబట్టి తెలియుచున్నది.[8]

"విజయాదిత్య పాదప। ద్మభ్రమరాయమాణ శ్రీ మత్కడెయ రాజు గుణగణాభరణుణ్డు దన। కె. ని ఈశ్వరునకుం గార్తికేయుణ్డుం బోలె చౌషష్ఠి కలావిశారదుణ్డు । య్ను అయ్యపయ్యయు....."

కాని యతని యితర వివరములేవియు తెలియవు. కడెయరాజు మరణానంతరము గుణగవిజయాదిత్యుడు పండరంగునే తన సర్వసైన్యాధ్యక్షునిగా పట్టముగట్టి తత్ప్రథమ వత్సరముననే బోయ

కొట్టములపై వెడలనంపెను. చాళుక్యభీముని కాలమునాటి యొక శాసనమున బోయలొనరించిన తిరుగుబాటే యీ దండు వెడలుటకు కారణమని చెప్పబడినది. కాని పండరంగుడు తన అద్దంకి శిలాశాసనమున కేవలము బలగర్వ ప్రకటనకే యీ దాడియని స్పష్టపరచెను.

పండరంగుడు ప్రఖ్యాతిగన్న దండనాయకుడు. గుణగవిజయాదిత్యుడంతటి కీర్తి వహించుటకు, ఆ కాలంలో వేంగీ చాళుక్యుల య్యాక్రమణలో నంతటి భూభాగ ముండటానిక కారణాలుగా పండరంగుని భుజశక్తి, రణతంత్రములని చెప్పటంలో అతిశయోక్తి లేదు. గుణగ విజయాదిత్యుడు జయించినట్లు చెప్పబడుచున్న విజయములన్నింటికి వెనుక నున్నది పండరంగుని కృపాణహస్తమే. గుణగ విజయాదిత్యుని చింబులూరు శాసనం యీ దండనాథుని తన తేనితో గూడి తులాభారం తూగిన వానిగా వర్ణిస్తుంది.[9]

అద్దంకి, కందుకూరు శిలాశాసనములలో పండరంగుని ప్రథమ జైత్రయాత్ర వర్ణింపబడింది [10] అది పన్నెండుబోయకొట్టములపై చేసిన దండయాత్ర. ఈ బోయలు బాణ, ఆలూప, గాంగ, చోడ, వైదుంబులకు సామంతులుగా దక్షిణాంధ్ర ప్రాంతములు పాలించెడి నొక తెగ. బహుశః యీ దండయాత్ర వేంగీచాళుక్య పల్లవ కలహములలో నొక భాగము కావచ్చును. పండరంగుడు దుర్భేద్యములైన యీ పన్నెండు బోయకొట్టములను జయించి యీ ప్రాంతమును చాళుక్యుల యేలుబడికి తెచ్చెను. ఈ ముట్టడియందే కట్టెపు దుర్గమును బయల్పెసెను. (ఈ కట్టెపు దుర్గమునది తెనాలి తాలూకాలోని కాటెపరమని శాసన పరిశోధక శాఖవారు భావించిరి [11] శ్రీ భావరాజు వేంకట కృష్ణారావుగారీ యభిప్రాయమును ఖండించి తొండైమండలము, వైదుంబవాడి విషయమైన ప్రస్తుత కడప జిల్లాలో నిది యుండియుండుట కవకాశమున్నట్లు చెప్పిరి.[12] నల్లమలై కొండలలో నీ దుర్గముండవచ్చునని శ్రీ కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుగారి భావము [13] ఈ విషయమై యింకనూ పరిశీలన జరుగవలసియున్నది. నెల్లూరు పరిసరములలో కంటెపల్లి, కట్టువపల్లి, కాటెపల్లి—మున్నగు నామములతో గ్రామములు కలవు. ఆ గ్రామముల నన్నింటిని పరిశీలించిన గాని యీ విషయము నిర్ధారింప వీలుకాదు.)

ఈ సందర్భముననే పండరంగుడు కందుకూరునకు మరలి తన విజయయాత్రా సూచకముగా దానిని నాటి వేంగీ చాళుక్య రాజధానియైన బెజవాడ యన్పించునంతగా తీర్చిదిద్దెను. నెల్లూరు పురమును దహనముగావించి[14] భూభాగము లాక్రమించుకొనుచు దక్షిణమున పులికాట్ సరస్సువరకు చేరెను నెల్లూరు జిల్లా దక్షిణ ప్రాంతమున 'పంద్రంగ'మను గ్రామమును అందున్న పండరంగేశ్వరాలయమున బట్టి చూడగా ఆ పురమును, ఆలయమును బహుశః పండరంగుడే తన విజయయాత్రా సూచకముగా నిర్మించెనని యూహించుట కవకాశమున్నది.[15]

ఈ క్రమమున తన జీవితాంతము పండరంగుడెత్తిన కత్తి దించినట్లు లేదు. చక్రకూట దుర్గము సాధించుటయందును, రాష్ట్రకూటులతోడను తత్సంబంధీకులతోడను గుణగునకు సంభవించిన యసంఖ్యాక యుద్ధములలో పండరంగుని పాత్ర గణనీయమైనది. అచలపుర, కిరణపురములను దహన మొనరించుటలో, రాహణ, సంకిల, మంగి, డాహల, బద్దెగాది నృపతుల నుక్కడగించుటలో నీతని కీర్తి విస్తరించినది ఈ విజయయాత్రలన్నియు నీతని పరాక్రమమువలననే సమకూడినట్లు మలియంపూడి శాసనమున పేర్కొనబడింది.[16]

''కిరణపురమ ధాక్షీత్ కృష్ణరాజ స్థితం యః
త్రిపురమివ మహేశః పాణ్డరంగ ప్రతాపీ
తదిహముఖ సహస్రై రన్విత స్యాస్య శక్యం
గణనమమల కీర్తేతస్య సత్సాహసానం॥''

పై విజయములకు తోడుగా శత్రువులచే చీకాకు వడుచున్న చోళరాజును గైకొని కాచుటలో పండరంగ ప్రభుని ప్రజ్ఞయున్నట్లు గుణగ విజయాదిత్యుని మరణాంతర మిరువదేండ్ల లోపుగా వేయబడిన ప్రథమ చాళుక్య భీముని ధర్మవర శిలాశాసనం పేర్కొంటుంది.[17]

''లోహాసనం బెక్కి రాహను నోడిచిన వల్లభు కొల్వున నెల్లనెఱుంగ
కన్నరాభూపతి వెన్నాజిలోం జూపె సంకిలాణ్డను తేని బింకమ్ముడిపె
దణ్డపై వచ్చిన బెణ్డైన చోళునింజేకొని కాచె భూలోకంబెఱుంగ
కిరనపురము డహాల నిరుతంబు దలెనాండు నచలపురముసాచ్చెన
చలతుణ్డు
వల్లభుణ్డు గుణకెనల్లుణ్డు వన్చినం బణ్డరంగ చూరె పణ్డరంగు'

—ఇటువంటి యపజయ మెరుంగని జోదు కనుకనే గుణగ విజయాదిత్యుని మచిలీపట్టణ శాసనమున ''విక్రమక్రాంత శాత్రవః, ద్వితీయ ఇవ బీభత్సుః, ప్రతాపవ్యా'' అని వర్ణింపబడినాడు.[18] ఎన్ని సమరము లందెంతటి శత్రువీరులను కూల్చి ఖ్యాతిగొన్నను, ఎట్టి విజయములందినను యీ సచ్ఛీలుని యెదలో స్వార్థమంకురింప లేదు. రాజ్యకాంక్ష, స్వామిద్రోహము లీతనికి కలయందైనను దలపరానివి. సాధించిన విజయపరంపర లన్నింటిని తన ప్రభువున కంకితమిచ్చిన యీతని ప్రభుభక్తి సాటిలేనిది. కనుకనే ఊరటూరు, పోణంగి శాసనములందు ''విజయాదిత్య భూపాల పాదపద్మ శిలీముఖః'' అని తనను తానభినందించుకొనెను.[19]

పండరంగుని రాజధాని కందుకూరు ఈతని రాజ్యం బహుశః అద్దంకి ప్రాంతాలవరకు వ్యాపించి వుండవచ్చు స్వాధీన పరచుకొన్న ప్రాంతాల్లో తన యధికారాన్ని సుస్థిరంగా నెలకొల్పుటకై గుణగ విజయాదిత్యు డీతని నిట నిల్పియుండును.[20] ఏ సామంతుడు, దండనాథుడు వహించని బిరుదము లీతడు ధరించాడు. ఈతని విజయయాత్రలు ముఖ్యంగా కిరణపుర దహన మీతని తర్వాత నాలు వందలలేండ్లకు కీర్తింపబడటం దాని ప్రాముఖ్యతను చెబుతోంది.[21] పరమమాహేశ్వరుడనని చెప్పుకొన్నను ఆదిత్య భట్టా

రకునకు ధర్మవగమున య్యాలయం కట్టించుట మీతని సమదృష్టికి నిదర్శనం. గుణగ విజయాదిత్యుని చాల శాసనముల కాజ్ఞప్తి యీతఁడే. అద్దంకి శాసనమునకును పండరంగుడే యాజ్ఞప్తిగా నుండెననుట కవకాశమున్నదని పరిశీలకుల యభిప్రాయము.[22] బహుశః యిందాతని పరాక్రమమును, సమర్పించిన దానమును వర్ణిత ములగుటచే నాజ్ఞప్తి పేరు వేరుగా దెలుపబడియుండకపోవచ్చును. ఈ శాసన కావ్యకర్త కూడ పండరంగుడేయై యుండునని శ్రీ నిడద వోలు వేంకటరావుగా రూహించిరి.[23]

సాతలూరి శాసనమున కాజ్ఞప్తియైన యీతనికి విశేషణ ముగా "అసిధారా సముచ్ఛిన్న విద్వద్బృందోపవందితః" అని చెప్ప బడినది.[24] ఈ విశేషణము ప్రయోగించుటలో కొంతపొరపాటున్నట్లు తెలియుచున్నది. పై విశేషణమునకు "కత్తివాదరచే ఛేదింపబడిన విద్వాంసుల సమూహముచే వందితుఁడైనవాఁడ"ని చెప్పకొనవలసి వచ్చును. ఇది అనుచితము. దీనిని ప్రథమముగా గుర్తించినది శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు. ఆయన పై విశేషణమున పొర పాటున్నట్లు గుర్తించి "విద్వద్బృందోప వందితః" అనికాక "విద్విడ్బృందోపవందితః" అని యుండుట లెస్సయని సరిదిద్దిరి.[25]

పండరంగుని శాసనములు తెలుగు సాహిత్య చరిత్రలో నతి ముఖ్యమైనవి. తెలుగున వ్రాయబడిన పద్యశాసనములలో నీతని యద్దంకి శాసనము మొదటిది. ఇందు తరువోజ పద్యమున్నది. రెండవ పద్యమయ శాసనమైన యీతని కందుకూరు శిలాశాసన మున నొక సీసపద్యమున్నది. ఈతఁడాజ్ఞప్తిగానుండిన సాతలూరు శాసనమున నొక చంపక మాలావృత్తమున్నది. ఇది సంస్కృతము ననే రచింపబడినను సంస్కృత కవులు పాటింపని ప్రాసనియమ మిందు కన్పించుచున్నది. ఈ శాసన కావ్యకర్త కూడ పండరంగుడే యగునని శ్రీ నిడదవోలు వేంకటరావుగారి యూహ.[26] అదియే నిజమగుచో పండరంగుడు రణరంగమున కత్తినే గాక, సారస్వత రంగమున కలమును గూడ త్రిప్పెననియు, సంస్కృత వృత్తము లను దెలుగులోనికిఁదెచ్చుట కాతఁడే మార్గదర్శకుఁడనియుఁ దెల్ప వచ్చును తెలుగు భాషా చరిత్రలో తొలి "సాహితీ సమరాంగణ సార్వ భౌము" డీతడే యగునేమో!

తన పోటరితనమును, దండు నడుపు నేర్పును ప్రప్రథమమున బోయ దండయాత్రలో ప్రదర్శించి ప్రభువు మన్ననలకు పాత్రుడై నది మొదలు దాదాపు గుణగవిజయాదిత్యుని యుద్ధములన్నియు నీతని యాధిపత్యముక్రిందనే నడచినవి. సమకాలీన చరిత్రలో నీతని నెదురొడ్డి నిల్చిన దళవాయి లేడు.

వేంగీ చాళుక్య రాజ్యమున కీతని సేవలు మరువరానివి

ఈతని కుమారుడు నిరవద్యధవళుడు, తండ్రి యనంతర మీతడు తన తండ్రి పదవీ బాధ్యతలు నిర్వహించియుండును. కాని అతి స్వల్పకాలముననే మరణించెను. అంతట ప్రథమ చాళుక్య భీము డీతని కుమారుడైన కటక విజయాదిత్యుని వారి కులక్రమాగత మైన పదవులలో నియమించెను. ఈతడును తన బల శౌర్యములు చాళుక్య భీముని పరాక్రమమునకు తోడ్పడసేవించి మెప్పించెను. తన జీవితమును కూడ ప్రభుసేవయందే యర్పించినట్లు తోచుచున్నది. ఈతడాజ్ఞప్తిగా నుండిన చాళుక్య భీముని బెజవాడ తామ్ర శాస నమున నీతనికి పండరంగునితోగల సంబంధమును తెల్పుచున్నది.[27]

ఈతని భార్య అసమాన సౌందర్యరాశియైన శ్రీమహాదేవి. కటకరాజు విజయాదిత్యుడు మరణించునాటికీమె పూర్ణయౌవనవతి. ఆమె భర్త రాజవంశమునకు చేసినసేవలు దృష్టియందుంచుకొనియే నాతని స్మృతిగా చాళుక్య భీముడీమెకు 'మోగ' గ్రామమును సర్వా గ్రహారముగా చేసి యిచ్చెను. చాళుక్య భీముని కాలమునాటి మోగ దాన శాసన మీ విషయమును వివరించుచున్నది.[28]

పండ రంగుని మనుమనిగా నీ శ్రీమహాదేవి భర్తయైన విజయాదిత్యుడేగాక మరియొక కడెయరాజు (రెండవ కడెయరాజు) శాసనాల్లో చెప్పబడ్డాడు.[29] ఈ కడెయరాజు, విజయాదిత్యు లిరువు రును నొక్కరగుదురా, కారా యను విషయము విచారింపదగ్గది. కొందరు పరిశీలకుల యభిప్రాయమున[30] నీ విజయాదిత్య, రెండవ కడెయరాజ నామములొకే వ్యక్తికి చెందినట్టివి. ఒకటి వృత్తి నామము, మరియొకటి వ్యక్తినామము. ఆ దృష్టిలో పై నిరూపణ సాధింపబడుటలో నెట్టి లోపమునులేదు కాని మరియొక విధముగా కూడ యనుమానించుట కవకాశమున్నది. పైన చెప్పబడిన మోగ శాసనమున నీ విజయాదిత్యుని సేవలు స్మరించుకొనుచు నాతని స్మృతిగా నాతని భార్యకు దయచేసిన దానపట్టమున కాజ్ఞప్తి ఈ కటకరాజు. అందువలన స్పష్టముగా విజయాదిత్యుని మరణానంతము కటకరాజు సజీవుడైయున్నట్లు తెలియుచున్నది కావున ఆ యిరు వుర నొక్కరుగ చెప్పట కాస్కారములేదు. వంశానుగతముగా వచ్చిన పదవిని, రెండవ అమ్మరాజు కాలంలోని నాగియపూండి శాసనమున నీతడుగూడ పండ రంగుని వారసుడుగా చెప్పకోవటాన్నిబట్టి యీ రెండవ కటకరాజు కూడ వీరి వంశస్థుడే యని తెలుస్తోంది. ఎక్కడా ప్రస్తావించబడకపోయిననూ బహుశః యీ రెండవ కటక రాజు కూడ వీరి వంశస్థుడేయని తెలుస్తోంది. ఎక్కడా ప్రస్తావించ బడక పోయిననూ బహుశః యీరెండవ కటకరాజు విజయాదిత్యుని తోబుట్టువుగా నూహించటాన్కి అవకాశముంది.

కటక విజయాదిత్యుని సేవలకు ప్రత్యుప కృతిగా మోగ గ్రామాన్ని శ్రీ మహాదేవికి బహూకరించటంతో తమ బాధ్యత తీరి నట్లుగా చాళుక్య రాజులు భావించుకోలేదు. కటకరాజ వంశస్థుల యందు వారికిగల గౌరవాదరము లెనలేనివి. అందువలననే రెండవ అమ్మరాజు యీ విజయాదిత్యుని కుమారుడైన దుర్గరాజును వారి కనువంశికమైన కటకాధిపతి పదవియందు నియమించెను. పండ రంగుని తర్వాత నీ వంశస్థులలో మరియొక అంతటి సమర్థుడైన సేనానిగా, బలమైన సామంతునిగ గుర్తింపబడినది దుర్గరాజే.

ఈతడు కర్మరాష్ట్ర ప్రాంతములకు "రాజ విషయా ధ్యకు"నిగా నియమింపబడి గౌరవమందినట్లును,[31] సభలకు గోష్ఠు లకు పంచమహాశబ్దములతో నేతెంచు మహాసామంతుడనియు వర్ణింప బడినాడు.[2] త్యాగనిరతికి ధర్మపరిరక్షణకు నర్పితమైనవానిగా కీర్తినందినాడు. చాళుక్యుల వైభవ పరిరక్షణలో నీతని కరవాల


మెప్పుడును యప్రమత్తుడై మెలగెడిదట. ఈతని రాజధాని ఈతని ముత్తాతయైన పండ రంగుడు మెచ్చి బెజవాడను మఱపించురీతిలో రూపు తీర్చిన కందుకూరు. గుండ్లకమ్మ నుండి సువర్ణముఖివరకు సుమారులో ప్రస్తుత నెల్లూరు జిల్లానుండి ఒంగోలు వరకు నీతని యేలుబడిలో నుండి యుండవచ్చును.

ఈతడు తన పేరిట కటకాభరణ జినాలయమును జైన దేవాలయమును ధర్మవరము నందు నిర్మించినట్లును, దీనికి రెండవ అమ్మరాజు కర్మ రాష్ట్రమందలి మలియంపూడి గ్రామమును దేవ భోగముగా సమర్పించినట్లును తెలుస్తోంది.[33] సువర్ణముఖి దక్షిణ తీరమున కల దుర్గరాజ పట్నమను చిన్నరేవు పట్నమీతని నిర్మితమే యని భావింపబడుచున్నది.[34]

భారద్వాజ గోత్రజుడైన మూశియశర్మ యను బ్రాహ్మణుడీ దుర్గరాజు మంత్రి. తన సామంతుడైన దుర్గరాజు ప్రార్థనను సరించి అమ్మరాజ విజయాదిత్యుడీమూశియశర్మకు 'తుమియవేణి' గ్రామము సర్వాగ్రహారముగా ననుగ్రహించినట్లు చెప్పబడినది.[35]

అమ్మరాజ విజయాదిత్యుని యాశ్రయమున యీ దుర్గరాజే గాక కటకరాజ వంశజుడైన మరియొక పండ రంగుడు (రెండవ పండ రంగుడు) కూడనున్నట్లు శాసనములు పేర్కొనుచున్నవి. ఈతడు ప్రథమమున దళవాయిగాచేరి, యంతర్యుద్ధ సమయమున ననూహ్యమగు పరిస్థితులలో మిగిలిన దండనాధులతోపాటు అమ్మరాజున కెదురు తిరిగి, ఆతని దాయాదియైన బాదపుని పక్షము వహించినట్లు భావింపబడుచున్నది.[36] దీనికి ప్రత్యుప కృతిగా బాదపునిచే నెట్టి సన్మాన మందెనో తెలియుదు కాని బాదపుని 'ఇంతేరు' శాసనమున ''పణ్డరాగో యశోనిధిః సూనుః కటక రాజస్య, మూల వర్గైక నాయకః'' అనుటను బట్టి బాదపుని సర్వసైన్యాధ్యక్ష పదవికి నియుక్తుడై యుండును.[37]

దుర్గరాజ, రెండవ పండ రంగు లిరువురును సమకాలికులు. దుర్గరాజు విజయాదిత్యునకు, రెండవ పండరంగుడు రెండవ కటక రాజునకును పుత్రులు. అప్పుడు వీరివంశవృక్షమీ విధముగానుండును.



ఈ వంశీయులలో దుర్గరాజ, రెండవ పండ రంగులే చివరి వారిగా కన్పించుచున్నారు. కాని వీరితో వీరి వంశము నశించినట్లు తోపదు. క్రీ॥ శ॥ పన్నెండవ శతాబ్దిని వేంగీ రాజుల సామంతునిగా చెప్పుకొని ''కడెయరాజు'' ''కిరణపుర దహనకర'' బిరుదములు దాల్చిన ప్రభువొకడు అద్దంకి సీమను పాలించుటనుబట్టి వీరి వంశీయులా కాలమువరకును పాలన సేయుచున్నట్లు తెలియుచున్నది.

ఆధోజ్ఞాపికలు

1 ఇండియన్ ఏంటిక్వరీ, వాల్యూం. XX.

2 జర్నల్ ఆఫ్ ఆంధ్రా హిస్టారికల్ రీసెర్చి సొసైటీ, వాల్యూం. V, పే. 114.

3 ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి (నేలటూరి వేంకట రమణయ్యగారిది) పే. 131.

4 భారతి, సం. 5, పే. 616.

5 ఏన్యువల్ రిపోర్టు ఆఫ్ ఎపిగ్రఫీ, 1909, పే. 106.

6 పల్లవులు – చాళుక్యులు, పే. 317.

7 వేంగీ చాళుక్యులు, పే. 33.

8 పల్లవులు – చాళుక్యులు, పే. 345.

9 ఎపిగ్రఫియా ఆంధ్రికా, వాల్యూం III, నెం. 3.

10 ఎపిగ్రఫియా ఇండికా, వాల్యూం. XIX, పే. 271.

11 ఏ ఆర్. ఇ. 1923, పే. 27.

12 హిస్టరీ ఆఫ్ ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి. (భావరాజు వేంకట కృష్ణారావుగారిది), పే. 190.

13 ఎపిగ్రఫియా ఇండికా, వాల్యూం XIX, పే. 271.

14 ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, సం. 11, పే. 241.

15 ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి (నేలటూరి వేంకట రమణయ్య) పే. 99.

16 ఎపిగ్రఫియా ఇండికా, వాల్యూం IX, పే. 47.

17 భారతి, సం. 5, పే. 619.

18 ఎపిగ్రాఫియా ఇండికా, వాల్యూం. V, పే. 122.

19 ఎ. ఆర్. ఇ. నెం 3, ఆఫ్ 1912–13, పేరా. 64.

20 పల్లవులు – చాళుక్యులు, పే. 305.

21 యస్ ఐ. ఐ. వాల్యూం VI, నెం. 191.

22 ప్రాబ్జన్నయ యుగము, పే. 75.

23 తెలుగు కవుల చరిత్ర. పే. 25.
24 జర్నల్ ఆఫ్ ఆంధ్రా హిస్టారికల్ రీసెర్చి సొసైటీ. వాల్యూం. V పే. 101.
25 ప్రాబ్నన్నయ యుగము. పే. 74.
26 " " పే. 335.
27 ఎపిగ్రాఫియా ఇండికా. వాల్యూం. V, పే. 127.
28 ఎపిగ్రాఫియా ఆంధ్రికా, వాల్యూం III నెం. 5.
29 జర్నల్ ఆఫ్ ఆంధ్రా హిస్టారికల్ రీసెర్చి సొసైటీ వాల్యూం XX, p. 195.
30 ఎపిగ్రాఫియా ఇండికా. వాల్యూం IX పే 55.
31 ఎపిగ్రాఫియా ఇండికా. వాల్యూం. XVIII పే 226
32 " " వాల్యూం IX పే. 45.
33 " " వాల్యూం IX పే. 47.
34 హిస్టరీ ఆఫ్ ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి (భావరాజు వేంకట కృష్ణారావు) పే. 282.
35 ఎపిగ్రాఫియా ఇండికా. వాల్యూం. XVII పే. 274.
36 ది ఈస్టరన్ చాళుక్యాన్ ఆఫ్ వేంగి (నేలటూరి వేంకట రమణయ్య) పే. 186.
37 ఏ. ఆర్. ఇ నెం. 6 ఆఫ్ 1938–39.

మార్క్సిస్టు కన్ను

శ్రీ కె. అంజయ్య

పిల్ల కాలువల్ని తోడుచేసుకున్న
  నదులు
అమాయకపు ఆడదానిలా
సముద్రుడి కర్కోటకపు ఉప్పులో
కాలుజారి పడుతున్నాయి
రెక్కలూడిన పక్షుల్లా
గిలగిలా తన్నుకుంటున్నాయి.
దోపిడీ అరాచకానికి
కళ్ళు మూసిన అమాయకుల్లా
అస్థిత్వానికే ఎసరుపెట్టుకుంటున్నాయి.
బొక్కలూడ్చుకపోగా
తోలుతిత్తుల్లా పడున్న నదుల్ని,
రూపంకై సెర్చ్ చేసినా
దొరకని కాలువల్ని చూసి
వ్యగ్రుడై ఉగ్రుడై
విప్లవకారుడైనాడు సూర్యుడు.
విప్లవకారుని తీవ్రతకు జడిసి
నక్కలైట్లన్నాయి
తీవ్రవాదన్నాయి ప్రచార సాధనాలు.
బూర్జువా అల్లల్లాడితే
పెటీ బూర్జువా దగ్ధమైనాడు.
ఎంతటి అహింసా విప్లవమైనా
స్వాతంత్ర్య సమరంలో ఎందరో బలైనారు.
అయినా
తీవ్రవాది
దోచిందంత మళ్ళీ పంచుతాడని
అందరికీ తెలుసు
అందుకే సూర్యుడు వాళ్ళ దేవత
సారీ —
వాళ్ళ మార్గదర్శకుడు.

మధురానుభూతులు

శ్రీ పి. కాళిదాస్

నేటి నా కవితా తపస్సమీక్షలో
కురిసిన ఆశా పయోధరమ్మిది
ఎప్పుడో పొగడ పూవుల మత్తులో
జీవితాన్ని వెతుకుతున్న జ్ఞాపకాలివి

ఏనాడో పైరుగాలి గుసగుసలతో
అనుభూతుల చిక్కని గుచ్చుకున్న ముత్యాల సరాలివి.

సిరి సిరి మువ్వ సవ్వడి నా గుండె గుడిలో
పలికించిన శ్రీ శ్రీ ఒరవడి ఇది !

ఎప్పుడో కోనసీమ కొబ్బరి నీడలో
దోచుకొని దాచుకున్న జ్ఞాపకాలివి.

పెద్ద చెరువుగట్లపై వేదసారాన్ని
ప్రబోధిస్తున్నట్లు నిలిచిన రావిచెట్లు
వసంతాన్ని మనసునిండా అలంకరించుకొని
ఆశలను ముత్యాల పల్లకిలో
ఊరేగించిన మధురక్షణాలివి.

నా సాహితీ ప్రస్థానంలో కవితా హృదయం
పొంగించిన క్షీర సాగరం ఇది
నా నవ కలిత కల్హార కదంబంలో
మధుమాస లీలలు ఇవి ! ! !

ఆకాశంలో చుక్కలు

శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

చిదిమిన అన్నపు కరుళ్లవలె
చెదిరిన హారపు పూసలవలె
పగిలిన హృదయపు ముక్కలవలె
వేరుపడిన ఏకోదరులవలె
కనిపిస్తున్నవి ఆకాశంలో చుక్కలు
మూల మూలకు చెదరి.

కొడిగట్టిన దీపాలవలె
వాడిపోయిన మల్లెలవలె
దుమ్ము కొట్టుకున్న గాజు ముక్కలవలె
ఈర్ష్యతో ముడుచుకుపోయి

కాంతి తొరగిన నయనాలవలె
కనిపిస్తున్నవి ఆకాశంలో చుక్కలు
మినుకు మినుకుమంటూ.

విమానం ప్రమాదానికి గురి అయి
పుట్టకొకరుగా చెట్టుకొకరుగా
చెదరిపోయి, చెదరిపోయి
శూన్యపు చూపులు చూసే
నిరాశా జీవులవలె
కనిపిస్తున్నవి ఆకాశంలో చుక్కలు
బెదురు బెదురు చూపులతో.

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

నిగమశర్మ అక్క పరమపద సోపానము

కవి వ్యక్తిత్వము

కవికి రెండు వ్యక్తిత్వములుండును. ఒకటి—దైనందిన జీవితమునకు సంబంధించినది. రెండు—కావ్యజీవితమునకు సంబంధించినది. దైనందిన జీవితముచేత కావ్యము, కావ్యజీవితముచేత లోకము ప్రభావితమగును. తాను జీవితమునుండి నేర్చుకొనిన పాఠములను కవి పాఠకులకు చెప్పవచ్చును. తన ప్రత్యేకాభిరుచులను పరితల తలలపై రుద్దు తీరునని చెప్పలేము. తన ప్రత్యేకాభిరుచులను తన రచనలలో ప్రతిబింబింపజేసియే తీరుననియు జెప్పలేము. కవుల పోకడలు చిత్రముగా కూడ ఉండును. మేదకునిగ కనపడు కవి ప్రచండమైన రచన చేయును. సంప్రదాయస్థునివలె ఉండు రచయిత విప్లవాత్మక రచన చేయవచ్చును. నవ్వుచు, నవ్వించుచు ఆనందమును వెదజల్లుచుండు ఒక ఆధునిక కవి విషాద గీతికలు వ్రాసినాడు. విద్యార్థులను "మ్యాథ్సు" చెప్పి హడలుగొట్టు లెక్కల మాస్టరు బాలానందదాయక రచనలు చేయును. ప్రకృతిలో గతితర్కము (Dialectics of Nature) ఉన్నట్లు కవితలోను గతితర్కము (Dialectics of Poetry) ఉన్నదనిపించును. కవి ప్రకృతికిని, అతని కావ్య ప్రకృతికిని సమ, అనులోమ, విలోమ సంబంధముండును. కవి ఒక పద్యములో వేపుడు చేపకూర బాగుగ వర్ణించినాడు. అట్లని ఆ కవికి ఆ కూరయందు మయి తీరియుండునా? శ్రీనాథకవి వంటకములను చాల రసవంతముగ వర్ణించినాడు కాబట్టి ఇతడు భోజనప్రియుడని సిద్ధాంతము చేయవచ్చునా? తల, తోక, సంగతి, సందర్భములేని కొన్ని చాటువులను ఆధారముగా చేసికొని ఆ మహానుభావుని శ్రీనాథుని భండునిగ చిత్రింపవచ్చునా ?

తెనాలి రామకృష్ణుడు హాస్యకారుడా ?

అట్టి దురవస్థయే తెనాలి రామకృష్ణకవికి కలిగినది. జనశ్రుతిలోనున్న "తెనాలి రాముడు", "తెనాలి రామలింగడు" ఒక హాస్యకాడు. తెనాలి రాముడు, వీరబలుడు, నజీరుద్దీను, బెంజమిన్ ఫ్రాంక్లిన్‌వంటి వ్యక్తులను, వారుండిన సంఘ సామూహిక సమయస్ఫూర్తిని, హాస ప్రవృత్తిని, లోకజ్ఞానమును ప్రతిబింబించు దర్పణములుగను, ప్రతిధ్వనించు పలుకురాళ్లగను, ప్రతీకలుగనే పరిగణింపవలెను. వారి కంటగట్టబడిన మాటలన్నింటిని ఆడియుందురనియో, చేష్టలుచేసి యుందురనియో తు. చ. తప్పక నమ్మట బాల మనస్తత్వమే యగును. ఒకవిధముగ వీరు "మిషామేషములు" (Scapegoats) — బూతుపద్యములకు చౌడప్ప, లోకనీతికి వేమన, తిట్టుకవితకు భీమకవివలె. ప్రాచీన వర్గాలకు (Primitive tribes), totems ఉన్నట్లు వీరిని నాగరక సంఘాలలో ఎన్నవలెను ఇంకొక విధముగ వీరు "జీవద్విష్టి బొమ్మలు." వీరుండిననే మనకు భూతప్రేత పిశాచముల బెడద ఉండదు. జనశ్రుతిలోని తెనాలిరాము డెప్పటివాడో తెలియదు. నిజముగా ఉండెనో కూడ చెప్పలేము. ఒకవేళకు ఉన్నను వాడును "పాండురంగ మాహాత్మ్యము" వ్రాసినవాడును ఒకడేనాయని సందేహము. ఏదియేమైనను వాడే వీడైనాడు.

రామకృష్ణుని కవితా కళ

ఈ అభేదము పాండురంగమాహాత్మ్య కావ్యావగాహనకు అవిరోధముగ ఉన్నది. తత్కావ్య సాహిత్య విమర్శను కవి హృదయ విరోధ మార్గమును పట్టించునదిగ ఉన్నది. నిజమే. రామకృష్ణుడు బహు చమత్కారి. ప్రాత వస్తువుకు క్రొత్తపేరు పెట్టును. (కప్పకు "రాతికొడుకు" అని పేరు పెట్టినాడు). ప్రసిద్ధ పదము వాడవలసినచోట మారుమూల పదము వేయును (వేశ్యకు "రూపాజీవ") చిన్న మాటల ఎంపికలో పనితనము చూపించును (ఎలుకపిల్ల అను మాటకు "ఆఖు కన్యక"). క్రొత్త సమాసములు సృష్టించును. (బ్రహ్మ "తొలుకారుకలంక పులుగు మావురావుత్తు" అట). ఒక సామెత వేసినాడన అది జన వ్యవహారములో భాగము కావలసినదే. నేతిబీరకాయ, ఆకుమఱుంగు పిందె, తేనె పూసిన కత్తి, ఉవిదలతు బుద్ధి పెడతలనుండు వంటివి. ప్రకృతి వర్ణన, సమకాలీన ప్రజాజీవితము చిత్రించుటలో గట్టివాడు. నిర్వేద, చిఱ్ఱుంగవు, కొన్నినిసి, పోర్మహిషున్, ఎడ్మవంటి ప్రయోగములు నవ్వుకూడ తెప్పించును. రామకృష్ణుని సంబోధనలును "విట్టి"గా ఉండును. గంభీరముగ కూడ ఉండును. గుణభద్రాతుంగ భద్రా, అంశేందూద్వహదేవి (పార్వతి)! ఛత్రితశేష (విష్ణువు)! తెనాలి రామకృష్ణుడు హాసప్రియుడు కావచ్చు. హాస్యకారుడుకాదు. హాసప్రియుడు కావున నితని కవిత్వమున హాస్యముండి యుండుననియు, "పరిహాసము పవిత్ర వస్తువునుకూడ గమనింపదేమో" (శ్రీ రాళ్లపల్లివారు) అని

అనుకొనిన, రామకృష్ణ హృదయము చిక్కదేమో అని భయపడు టకు నిగమశర్మఅక్క వృత్తాంతము ఉదాహరణ ప్రాయము.

నిగమశర్మోపాఖ్యానము

చండాలమైన కళింగదేశమున (''కన్యాశుల్క'' నాటక రంగము కళింగదేశమే) సభాపతి యను బ్రాహ్మణుడు కలడు. అతని కొడుకు నిగమశర్మ. వీడు పోకిరి. వేదశాస్త్రములు చదివినను, ''నిగమశర్మ''అను పేరు వీనికి నేతిబీరకాయవంటిదాయెను. నిజము నకు నిగమశర్మ మూలనమూనాపాత్ర (**Archetypal Character**). భాగవతములో అజామీళుడు, శ్రీనాథుని గుణనిధి (వీడొక అనన్వర్థ నామధేయుడు) ఇట్టివి రామకృష్ణుని ప్రత్యేకత పాత్రసృష్టిలో లేదుకాని, కథాకథనములోను, శ్రీవైష్ణవతత్వ ప్రతిపాదనా చణత్వములోను ఉన్నది. నిగమశర్మ చేయని చెడ్డపనిలేదు. ఇల్లు గుల్ల చేయుచున్నాడు. తండ్రి, తల్లి, భార్య కుందుచున్నారు. వీనికి బుద్ధి చెప్పి, దారికి మళ్లింప తలచి ఇతని అక్క భర్తతోను, గంపెడు పిల్లలతోను పుట్టినింటికి వచ్చును. ''చుక్కతెగిన వడువున'' ఒక ప్పుడు ఇంటికి వచ్చిన తమ్ముని మచ్చిక చేసికొని వాని కన్ని గోములు చేసి హితబోధ చేయును. నిత్యనైమిత్తిక కర్మలాచరించుచు, గొప్ప సోమయాజియై తనకు, తన పుట్టినింటికి కీర్తి తెమ్మనును. సమ యానికి సరిగా సాపాటు లేనివాడు కావున అక్క చెప్పిన దానికెల్ల తలూచి, ఆకె చెప్పిన దాచరించువానివలె నటించుచు, కొలది దిన ములు మెక్కి ''తేనెపూసిన కత్తి'' వంటి ఆ నిగమశర్మ, ఒకరాత్రి, అందరును పరుండియుండగా, వారి విలువయిన సామానులు సంగ్ర హించుకొని పరారి యగును. ''చుక్కతెగిన వడువున'' వచ్చినవాడు ''వడువడుకకుఁ జెప్పక'' పారిపోయెను శిల్పములో అంగాంగ సంశ్లి ష్టత (**Symmetry**) అనిన నిది. ప్రొద్దున చూచికొని, ఒక్కొ క్కరు ఒక్కొక్క వస్తువు పోయినందుకు విచారింతురు. ఈ సన్ని వేశములో నిగమశర్మ అక్క ఎడల రామకృష్ణుడు ప్రత్యేకశ్రద్ధ చూపించును. తండ్రి ''శోకించె''ను. తల్లి ''వనట బొందె''ను. అల్లుడు ''వెతబొందె''ను. అక్కయో? ''క్రొత్తగాఁ జేయించు కొన్న ముక్కరకునై యడలు దుర్వారయై యాడుబిడ్డ'' అట! అసంబద్ధ నాటక కళ (**Drama of the Absurd**)కు దీనిని ప్రాచీ నోదాహరణముగ పేర్కొనవచ్చును.

నిగమశర్మ అక్క

అంతకుముందు చిత్రణమునకును, ఈ ముగింపునకును సంబంధమేలేదు. ఆ పతాకావస్థ ఏమి? ఈ **Anticlimax** ఏమి? కర్ణకుండలములు, కవచము దానమిచ్చివేసిన తర్వాత కర్ణుడు, అవి ఎందుకిచ్చివానురా యని వాపోయినట్లు వర్ణించినట్లున్నది. ఈ వర్ణ నము అన్యాయమనిపించును. ఇచట పాత్రభంగము సహింపరానిదిగ అనుపించుటలో ఆశ్చర్యములేదు. ఆధునిక విమర్శకుల ఆగ్రహమునకు రామకృష్ణుడు గురియైన దిచటనే. కవి, నిగమశర్మఅక్క పాత్రను ఎంతయో విశదముగను, జాగ్రత్తగను, సున్నితముగను చిత్రించెను. ఆ చిత్రమునకు నగిషీలు చెక్కెను. ఇచటి కావ్యశిల్పము హేమావతి దేవాలయ శిల్పమును బోలినది. ''అక్క'' ఎంతయో హుందాకల మధ్యమ తరగతి కుటుంబినిగ చూపించెను. అట్టి గాంభీర్యము, నయశాసనాధికారముగల ఇంకొక పాత్ర తిక్కన సుధేష్ణయే. ఈ రెండు పాత్రలు విఫలలు అనునది వేఱుమాట. రామకృష్ణుడు నిగమశర్మఅక్క పాత్రకు వాడని సొబగుమాటలేదు.

''చేటికానీత పీఠికాసీన యగుచు
పద్మకర్ణికఁ గొలువున్న పద్మవోలె''

లో నిగమశర్మఅక్కను లక్ష్మీదేవితోగూడ పోల్చును. ఇందులో నొక కిటుకున్నది. వివరణ తర్వాత.

నిగమశర్మ అక్క పాత్రోన్మీలనము వ్రాయుట నా ఉద్దేశము కాదు. ఆ పని శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగా రెప్పుడో అనితర సాధ్యముగ జేసిరి (చూడుడు: ''భారతి'' జనవరి, 1934). అస లుకు వారి వ్యాసవ్యాసంగమే నన్నీ పునస్సమీక్ష వ్రాయుటకు ప్రోత్స హించినది. ఇంత జాగ్రతగ, ఆప్యాయముగ, ఉదాత్తముగ, కళాన్విత ముగ నిర్మించిన పాత్రసౌధమును రామకృష్ణుడేల పడగొట్టెను? పాత్రను శిఖరముమీది కెక్కించి హఠాత్తుగ ఎందుకు కూల ద్రోసెను? బాలకుడొకడు తడి ఇసుకతో ఒక బొమ్మరిల్లుకట్టును. అది చూచుచున్నవారు వాని పనితనమునకు మురియుచుందురు. ఇది గమనించిన ఆ పిల్లవాడు వెంటనే ఆ ఇంటిని కాలితో చరచి, చెడిపి అందరివైపు చూచి కిలకిల నవ్వ మొదలిడును. రామకృష్ణుడు ఇట్టి దేదో చేసి మనలను చూచి తనకు తానే నవ్వుకొనుచున్నాడా? నిగమ శర్మ అక్క ఉదంతమున

- ★ పరిహాసము పవిత్ర వస్తువును కూడ గమనింపలేదా?
- ★ నిగమశర్మఅక్క పవిత్ర వస్తువా?
- ★ ఇందు పరిహాసమున్నదా ?
- ★ ఉండిన, ఎందుకున్నది?
- ★ ఇందు హాస్యము లేకపోఁ, గంభీర నిగూఢతత్వమేమైనా దాగి ఉన్నదా?

అను ప్రశ్న పరంపరను చర్చించెదను.

పాత్ర పరిశీలనావిధానములు

''మనిషి ద్వీపముకాదు'' అనినాడు జాన్‌డున్. కావ్యములోని పాత్రయు ద్వీపముకాదు తేనె తెట్టెలోని ఒక గూడు (**cell**)వంటిది. గూడుకు ఆఱు భుజములుండును. ఒక్కొక్క భుజము ఇంకొక్క గూడు యొక్క భుజముతో కలిసియుండును. ఒక్క గూడు చుట్టు ఆఱు గూళ్లుండును. ఆఱు గూళ్లచుట్టు ముప్పదియాఱు గూళ్లుండును. ఇట్లు చూచిన తేనెతెట్టె **grand pattern** కలదిగ

కన్పించును. గూడు షడ్భుజములు కలదిగ ఉండుటయు, భరతుడు చిత్రకళకు షడంగములు చెప్పియుండుటయు, గమనింపవలసిన coincidence. గూడు తనలో కొంత మధువు కలిగి ఉండి, ఇతర గూళ్లతో సంబంధము కలిగిఉండి తేనెతెట్టె మాధుర్యమునకు, నిర్మాణ పటిష్ఠతకు ఎట్లు తోడ్పడునో, పాత్రస్థానమును, కావ్యమున అట్టిదే. కావ్యములోని పాత్రస్థానమును ద్విపరముగ పరిశీలింపవలెను. 1. పాత్ర పరముగ 2. కావ్యపరముగ. ఒకరత్నము తనకు తానే ఒక విధమైన సౌందర్యము కల్గియుండును. ఒక పచ్చల పతకములో పొదుగబడిన అదేరత్నము వేఱేవిధమైన అందము కలిగియుండును. కావ్యపాత్ర దాని పరముగనే చూచిన ఒక రూపముతోను, సమగ్ర కావ్యపరముగను, కావ్యఫల ప్రాప్తి దృష్టితో చూచిన వేఱొక రూపముతోను దర్శనమీయవచ్చును. మిల్టను ''స్వర్గచ్యుతి'' **(Paradiselost)** లోని సైతాను **(Satan)** పాత్ర మొదటి దృష్టిలో గంభీరముగ, ఉదాత్తముగ చదువరుల సానుభూతి కాస్పదమగునదిగ కన్పించును. రెండవ దృష్టిలో పేలవము, నీచము, చదువరుల ఈసడింపునకు తగినదనిపించును. ఏలన, సైతాను దేవద్వేషి. మానవ పతన కారకుడు. షేక్సుపియరు ''లియరురాజు'' **(King Lear)**లోని ''ఫూలు'' పాత్ర మొదటి పద్ధతిలో కేవల విదూషకుడు. రెండవ పద్ధతిలో, లియరుకు ప్రత్యర్థ ప్రాయముగా లోకజ్ఞానమునను, విశ్వాస బుద్ధికిని, విచక్షణతను ఓజబంతిగ నాటకకర్త నిలబెట్టిన గొప్పపాత్ర అనిపించును. ''కన్యాశుల్క'' నాటకమందలి గిరీశం పాత్ర తీసికొందము. చాలమంది ఇతనిని హాస్యపాత్ర అనుకొందురు. కొందరు నాటక నాయకు డనుకొందురు. ఏదియుకాదు. గిరీశం ''విలన్'' ఈ పాత్ర పరిగణనా పద్ధతులను అస్తవ్యస్తముగ, అయోమయముగ అర్థము చేసకొనుటవలననే కైకేయి, మందర, శకుని, కర్ణ, శంబుక, వేన, హిరణ్యకశిపు, ధర్మరాజ, నాగమ్మ పాత్రలు అనేకుల రచనలలో, అనేక స్వరూప స్వభావములు కల్గి దర్శనమిచ్చును

నిగమశర్మఅక్క పాత్రను కావ్యప్రమేయమునుండి వేఱుచేసి పరిశీలించిన మార్దవ మానవీయత కలదిగ కన్పడుటలో ఆశ్చర్యము లేదు. ''పాండురంగ మాహాత్మ్యము'' లౌకిక విషయ కావ్యము కాదు.

క్షేత్రమాహాత్మ్య నిరూపక గ్రంధము. విష్ణుపారమ్య ప్రకటనార్థము రచితమైన పుణ్యగ్రంధము. మోక్షసాధనములలో ఈ కలి యుగమున ఉత్తమమార్గ సూచక గ్రంధము. ఇట్టి గ్రంధములో వచ్చు నిగమశర్మోపాఖ్యానములో నిగమశర్మఅక్క పాత్ర పరిణామము, స్థానము నిర్ణయించుట ముందు, ఆ పాత్ర రంగమునుండి నిష్క్రమించిన తర్వాతి సంఘటనలను పరిశీలింపవలెను.

శరణాగతి మార్గము

నిగమశర్మ తుది గడియలు వచ్చినపుడు నరసింహ క్షేత్రములో ఆక్రోశించి విష్ణుసాయుజ్యము చెందుట కావ్యపరమార్థము. ఈ ఫలప్రాప్తికి కావ్యమందలి ప్రతి విషయము దోహదము చేయవలెను. సహాయము చేయువారలు మంచివారనియు, నిరోధించువారు చెడ్డవారనియు సిద్ధాంతము ఈ ప్రాతిపదిక పైననే నా చర్చ సాగింతును.

విష్ణువును చేరుటకు తొమ్మిది (భక్తి) మార్గములు భాగవతమునను, పదునొకండు విధములు నారద భక్తిసూత్రమునను ఉన్నవి. ఆ మార్గములు, వాని ననుసరించిన భక్తులు ఇట్లుండును. శ్రవణము (పరీక్షిత్తు), కీర్తనము (శుకుడు), స్మరణము (ప్రహ్లాదుడు), పదసేవ (లక్ష్మి), అర్చనము (పృధువు), వందనము (అక్రూరుడు), దాస్యము (గరుడుడు), సఖ్యము (అర్జునుడు), ఆత్మనివేదనము(బలి). ఈ సాత్విక విధములేకాక తామస విధములు కూడ ఉన్నవి. కామమున గోపికలు, భయమున కంసుడు, వైరమున హిరణ్యకశిపుడు, మత్సరమున శిశుపాలుడు, హరిని బొందిరని భాగవతము చెప్పును. ఈ విధములను మించినది, అందరికిని అందుబాటులో నున్న సులభపద్ధతి ఉన్నది. అది భగవద్గీతలో ''సర్వధర్మాన్ పరిత్యాజ్యమామేకం శరణం వ్రజ'' అను శ్లోకమున చెప్పబడిన శరణాగతి. దీనికి ప్రపత్తి అను సాంకేతిక పదము శ్రీ వైష్ణవమున గలదు. గజేంద్రుడు, కాకాసురుడు, విభీషణుడు, ద్రౌపది శరణాగతిచే విష్ణుకృపకు పాత్రులయిరి. ఇస్లాము మతము శరణాగతి మతమే. శ్రీ రామానుజాచార్యులు ''శరణాగతి గద్య'' వ్రాసిరి. తరువాత శ్రీ నిగమాంత దేశికులు ''పరమపద సోపాన''మను గ్రంధ

మున శరణాగతి పద్ధతిని విశదీకరించిరి. ఈ పరమపద సోపాన ఖేల నమును ప్రదర్శించుటయే నిగమశర్మోపాఖ్యానమున రామకృష్ణుడు చేసినది.

సంకేత కావ్యము

నిగమశర్మోపాఖ్యానమును "మానవీయ ప్రాపదము" (Human Tragedy) గకాక, "దైవీ మోదాంతము" (Divine Comedy)గా పరిగణింపవలెను. ఇందు నిగమశర్మ, అతని అక్కగ అతని కాపురము, కాపుపడతి, చండాల స్త్రీ ప్రతీకలు (Symbols), పరిగణింపవలెనే కాని మనుష్యపాత్రలుగ కాదు. రామకృష్ణుడు హాస్య ప్రవృత్తికల వికటకవి అను భావన మఱచిపోవలయును. నిగమశర్మ అక్క వచ్చుట, నిగమశర్మ దొంగతనము, పరారి, కిరాతకులు వానిని కొట్టుట, జాతర, గుడిసె కాలిపోవుట, వాని ఆక్రోశము అనునవి సంకేతిత సన్నివేశములే కాని కథాకుతూహలమునకై సృష్టింపబడ లేదు. నిగమశర్మ శరణాగతి మార్గమున పరమపదమును గమ్యమునకు పోవు యాత్రికుడు. నిగమశర్మోపాఖ్యానము, ఇంగ్లీషు లోని "యాత్రిక పురోగతి" (Pilgrim's Progress) వంటి సంకేత కావ్యము (Allegory) పైని ఇంగ్లీషు గ్రంథములో ప్రతి సన్ని వేశము, ప్రతిపేరు సంకేతముగ నుండును. పరమపద ప్రాప్తికి సోపాన సిద్ధాంతమును ప్రతిపాదించిన శ్రీ వైష్ణవాచార్యుడును ఆ సోపానమును ఎక్కిపోయిన మన కావ్యనాయకుడును ఒకేపేరు (నిగమ) కలవారగుట యాదృచ్ఛికముకాదు. రామకృష్ణుడదే పనిగ కథానాయకునకా పేరు పెట్టెను. నిగమశర్మను రక్షించిన కాపు ఇతనిని "నిజదేశికోత్తము"నిగా భావించి కొలిచినట్లు రామకృష్ణుడు వర్ణించినాడు (తృతీయాశ్వాసము, పద్యము 58). ఇందును నిగ మాంతదేశికుల స్ఫురణ ఉన్నది. వేదాంత దేశికులు పరమపదమునకు నిర్మించిన సోపానము లివి: వివేకము, నిర్వేదము, విరక్తి, భీతి, ప్రసాదహేతువు, ఉత్క్రమణ, అర్చిరాది మార్గము పరమపదా రోహణము, పరత్వప్రాప్తి. నిగమశర్మ ఈ మెట్లన్నియు ఎక్కినాడు. అందుకే నిగమశర్మోపాఖ్యానము మనము గవ్వలతో, కాయలతో ఆడుకొను పరమపద సోపానపటము ఆట వంటిదని నా భావము. కొందఱు రాజులు చదరంగపుటాటను నిజమైన సైనికులు, ఏను గులు, రథములు, గుఱ్ఱములతో నాడుచుండినట్లు, లీలాప్రియుడైన విష్ణువు ఈ పరమపద సోపాన పట ఆటను, జీవులతో ఆడుకొని నట్లు మనము అనుకొనవలెను. ఎందుకీ ఆట?

విష్ణుకృప స్రోతస్విని

ఇతర మోక్షమార్గములకును శరణాగతి మార్గమునకును భేదమున్నది. శరణాగతి స్వయంపూర్ణము. సకలజీవులు దీని కధి కారులే. కాల, దేశ, వర్ణ, లింగ, జాతి నియమములు శరణాగతికి వర్తింపవు. ఇట్లనును భగవద్గీత:

మాంహిపార్థ! వ్యపాశ్రిత్య
యేఽపిస్యుః పాపయోనయః
స్త్రీయో వైశ్యాస్తథా శూద్రా
స్తేఽపి యాంతి పరాంగతిం.

(భగవద్గీత, అధ్య–9, శ్లో–32)

శరణాగతి సునాయాస సాధ్యము – ముఖ్యముగ ఆధ్యాత్మిక ముగ అట్టడుగున నున్నవారికి విష్ణుకృప ప్రవాహము వంటిదట జలపాతమనియు ననవచ్చును నీరు పల్లమెఱుగు విష్ణుకృపయు నిమ్నగము. ఎత్తు ఎంత పెద్దగ నుండిన జలపాతమంత జోరుగ పడునట్లు, శరణాగతుడు ఎంత క్రిందపడియుండిన అధోక్షజుని దయారసము అంత త్వరగా అతనిపై దానంతటదే ఒలుకును. ఈ అపడక్షిణ ఆధ్యాత్మిక సత్యమును (Esoteric spiritual tenet) వేదాంతదేశికులు 'పరమపద సోపాన''మందు ఇట్లు దృష్టాంతీక రించిరి:

"ఉన్నతస్థలే సోపరోధ మారోపణార్హేణ
నిమ్న విషయే స్వయంప్రవహణ శీలేన కృపాగుణేన
స్వతంత్రశేషీ స్వభాగబుద్ధ్యా, స్వప్రయోజన
బుద్ధ్యాచోపరితరాన్ సర్వాన్ హితాన్ సాధయేత్"

ఉన్నతస్థాయిలోనున్న వారిపై విష్ణుకృపసులభముగా ప్రస రింపదు. ఆయనకృప తగ్గుస్థాయికీ స్వయముగా ప్రవహించును. పల్లమెఱుగు నీటిని పైకి పంపుటకు "పంపు" కావలసినట్లు, పై అంతస్తుమీది వారిపై విష్ణుకృపాగుణము ప్రవహించుటకు యజ్ఞ, యాగ, జప, తప, యోగములవంటి సాధనములు కావలెను. అది కష్టసాధ్యము.

నిగమశర్మ తన అక్కమాట విని యజ్ఞయాగులు చేయుచున్నచో ఇహలోకమున "సోమయాజులు" అను బిరుదు, పరలోకమున స్వర్గము లభింపవచ్చును. కర్మము పరిపాకమొందు దాక జనన మరణ చక్రమున గిరగిర తిరుగుచు నుండవలసినదే కాని హరికిగల ఎనిమిది పార్శ్వచరులలో ఒక పదవి శాశ్వతముగ పట్టము కట్టుకొని ఉండు వాడా?

భగవద్గీత ఇట్లనును:

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా
యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే
తేపుణ్య మాసాద్య సురేంద్ర లోక
మశ్నంతి దివ్యాన్ దివిదేవ భోగాన్

తేతం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి
ఏవం త్రయీధర్మ మను ప్రపన్నా
గతాగతం కామకామా లభంతే

(భగవ, అధ్యా–9 శ్లో–20, 21)

కావున నిగమశర్మ పతితుడు కావలెను. అధఃపతితుడు కావలెను. శరణాగతి చొరవలెను. నిమ్న విషయమున స్వయం

ప్రవహణశీలమగు విష్ణుకృప అతనిపై ప్రసరింపవలెను. విష్ణువుకు ఎవ్వనిపై అవ్యాజ కృప కలుగునో వానిని కార్యముల పాల్జేసి అధః పతితులజేయును. బైబిలు పూర్వప్రకరణమున, జాబ్ వృత్తాంతము (**Book** of **Job**) లో ఇట్లనే జరిగినది. ఇచట అజామీళుడు, విప్రనారాయణుడు ఈ దివ్యప్రణాళిక (**Divine Scheme**) లో నిగమశర్మ చదువు నేతి బీరకాయ యగుట మొదటి పతనము. క్రిందికిపడినట్లెల్ల వస్తువు వేగము పుంజుకొనునట్లు, నిగమశర్మ పతనము ఉధృతము కాసాగును. తనవారి వస్తువులు దొంగిలించుకొని పోవుట ఇంకొక పతనము. తనను చావునుండి కాపాడిన కాపువాని పడతిని లేవదీసికొనిపోవుట మఱొక పతనము. తర్వాత చండాల స్త్రీని కూడి సంసారము చేయుట, వేటాడుట, మద్య మాంసములు మరగుట అనునవి అతని అధఃపతనమునకు పరాకాష్ఠ. ఇప్పుడితనిని ''అయిన పాపుడు'' అనవచ్చును. ఎందుకనగా ఇతనిని ఈ స్థితిలోనే రామకృష్ణుడు ''కాఁగల పుణ్యుడు'' (పాండు రం. ఆ3, ప98) అని వర్ణించును విష్ణుకృప ఈతనిపై పడినది. ''సరోరుహనేత్రు నపారకరుణ, నధమలోకంబు విడిచి యయ్యమర పథముజూచుటకు'' (పాండురం ఆ 3, ప 99) లేచినాడు విష్ణుతత్త్వము ఇతని నిలువెల్ల ఆవరించినది. నరసింహ క్షేత్రమున నిగమశర్మ చేష్టలు భగవంతుని దశావతారములతో రూపించినాడు రామకృష్ణుడు ఆ సీస పద్య మద్భుతము :

ఒక యింత తెప్పవేయక చూచు పెఱవారిఁ (మత్స్య అవతారము)
దరికొట్టుకొని దుఃఖ జలధి మునుఁగు (కూర్మ)
బిలము తెఱువు మంచు బృధివిలోఁ జొఱబాఱు (వరాహ)
సమధిక స్తంభోద్భవముగ మించు (నృసింహ)
దిరియు వాడును బోలెఁ దెసలకుఁ జెయి చాఁచుఁ (వామన)
దొరఁగు నస్రాంబుధి దొప్ప దోఁగు (పరశురామ)
హా! పోయితే యని యఱచు భార్య గుఱించి (రామ)
బహు విధైరాసక్తి భ్రాంతిఁ బొందుఁ (బలరామ)
జేరగారాని దర్శన స్థితి వహించు (బౌద్ధ)
బాడబస్ఫూర్తిలోఁ గొన్ని పగిది మండు (కల్కి)
దానవారాతి కాబూని తదవతార
దశకమును మున్నె తాల్చె నా ధరణిసురుడు
(పాండురం. ఆ 3, ప 102)

లౌకిక దృష్టిలో నిగమశర్మ పడిపోవుచున్నాడే కాని, పారమార్థిక దృష్టిలో ''పరమ ధాము''ని (ఇది రామకృష్ణుని సమాసమే) దగ్గరకు పరమ పదమున ఒక్కొక్క సోపానమునే ఎక్కిపోవుచున్నాడు. నిగమశర్మ పడుపాట్లను, అతడు తనవారి వస్తువులను ఎత్తుకొని పోయినప్పటి నుండి, విష్ణులోకము చేరువఱకు జరిగిన సంఘటనా పరంపర వేగమును, దానిని గమనించినట్లయిన, ఇతడు ఎవరిచేతనో తఱుమబడుచున్నాడా అనుసందేహము కలుగకమానదు. ఇంగ్లీషు భాషలో ఫ్రాన్సిస్ థాంప్సను ''వేలుపు జాగిలము'' (**The Hound of Heaven**) అను మార్మికార్థక కావ్యము వ్రాసినాడు. దయాసముద్రుడు అగు పరమాత్మ వేటకుక్కవలె మానవుని తఱిమి తఱిమి, పట్టుకొని తన అక్కున చేర్చుకొనినట్లు వర్ణించినాడు

మానవుడు అనుచున్నాడు :

''I fled Him, down the nights and down the days;
I fled Him, down the arches of the years
I fled Him, down the labyrinthine ways of my own mind;
... ...
... ...
From those strong Feet that followed, followed after'

ఇందు I అనగా మానవుడు. He అనగాపరమాత్మ. జీవాత్మను ఐక్యము చేసికొను పరమాత్మ చరమ వాక్యము లివి. ఇవి భగవద్గీత చరమ శ్లోకార్థమును ఇచ్చుచుండుట చూడదగును.

All which I took from thee I did but take
Not for thy harms
But just thou might'st seek it in My arms
All which thy child's mistake
Fancies as lost, I have stored for thee at home
Rise, clasp My hand and come
... ...
... ...
Ah, fondest, blindest, weakest
I am He whom thou seekest
(The Hound of Heaven)

పరమాత్ముని, కుక్కతో పోల్చుట ఋగ్వేదమున నున్నది. ఋగ్వేదమందు సరమ అను కుక్క గోవుల మందను మళ్లించుకొని పోయి, ఒక గుహలోనికి తీసికొనిపోయి, అచటి చీకటులను తఱిమి వేసి, భద్రముగ నుంచినట్లు కలదు. గోవులు భద్రముగ నుంచిన వెలుగు గుహను ''సదనం ఋతస్య''అనును. అరవిందుల వ్యాఖ్యానమనుసరించి ఋతమనిన Righteousness. మానవాత్మను ధార్మికత్వమునకు మళ్లించును సరమరూప పరమాత్మ. థాంప్సను రచనలోను **Hound of Heaven** అనిన కుక్క రూపముతోనున్న పరమాత్మయే. ''జోనాథన్ లివింగ్స్టన్ సీగల్'' అను మార్మిక రచనలో, చిన్న చిన్న సముద్ర పక్షులకు ఎగురుట నేర్పు పెద్ద సముద్ర పక్షి (The Great Gull) పరమాత్మయే.

వైకుంఠపాళి ఆట

నిగమశర్మోపాఖ్యానమును వైకుంఠపాళిఆట అనుకొందము. ఇందు, దొంగతనము, కాపుపడతి చండాలస్త్రీ, వేట, మద్యమాంస సేవన పారమార్థిక ఖేలనములో నిచ్చెనలు. లౌకికముగ చెడ్డవి అనుట అప్రస్తుతము. పాములెవరు ? పరమధామమును చేరనీయకుండ ముముక్షువును ఎవరు మింగి క్రిందికి త్రోయుదురో వారే పాములు. నిగమశర్మ తలి దండ్రులు పాములు. నిగమశర్మ అక్క ఘోర సర్పి, నిగమశర్మ భార్య పాము. అత్యంతాప్తము, రమణీయ

ముగ కన్పించు ఈ సంసారము ముముక్షువునకు త్యాజ్యము. మొసలితో పోరుకు తలపడి శరణాగతి కోరుటకు పూర్వరంగమున గజేంద్రుని సంసారమును అంత రసవంతముగ వర్ణించిన భాగవత (పోతన) తత్త్వమిదే. నిజమైన తల్లి, తండ్రి, సోదరుడు, ప్రియుడు, గురుడు విఠ్ఠలుడే అను నామదేవుల అభంగ మొకటి కలదు. నిగమశర్మ తన ఇంటివారి వస్తువులను ఎత్తుకొని పోయిన తర్వాత, శోకించువారిని వావి వరుసలలోనే రామకృష్ణుడు తడవినాడు. వారు నిగమశర్మ తండ్రి, తల్లి, బావ, అక్క. వీరు హాళక్కి చుట్టములు. నిగమశర్మ భార్యను రామకృష్ణుడెందుకు మినహాయించెనో ఊహ్యము. ఈ ఘట్టములో రామకృష్ణుడు "ఎంత దుర్బుద్ధి యెంత దుర్భ్రాంతి యహహా" అనును ఈ లోకము అత్తిల్లు. పరంధామము పుట్టినిల్లు. నరేంద్రుడు (భవిష్యత్తులో వివేకానందుడు), రామకృష్ణ పరమహంస ఎదుట పాడిన కీర్తన "మన్ చలో నిజ నికేతనే" ఇదే అర్థము కలది. పదునాల్గవ శతాబ్దపు ఇస్లాము వేదాంతి ఖ్వాజా మొయినుద్దీను భిస్తీ గతించినప్పుడతని కళేబరము ఖననమునకై తీసికొని పోవుచుండగా, అతని శిష్యుడగు అమీర్ ఖుస్రూ (ఇతడు నేటి హిందూస్తానీ శాస్త్రీయ సంగీతమునకు మూలపురుషు డందురు), ఆ దృశ్యమును ఆడబడుచు పుట్టినింటికి పోవునదిగ రూపించి దీప చండీ తాళమున, ఒక అమరగానమును పాడెనని ఐతిహ్యము కలదు. అట్టి పుట్టినింటికి పోవుటకు తొందర పడుచున్న నిగమశర్మను, వలదు ఇచటనే యుండుమని అనుటకువచ్చిన

నిగమశర్మ అక్క ఎవరు?

నిగమశర్మఅక్క స్వార్థపరురాలు. సంసారమును చవులూర వర్ణించి తమ్ముని అందు కూర్కొనునట్లుచేయ ప్రయత్నించినది. ఆమె పాత్రను అంత మానవీయత కలదిగ చిత్రించిన రామకృష్ణుని అభిప్రాయము సంసారపు టాకర్షణీయతను చూపెట్టుటకై యుండును. మహాభినిష్క్రమణముచేయు సిద్ధార్థుని సంసారము వైపు త్రిప్పుటకు ప్రయత్నించిన మారుని వంటిది నిగమశర్మఅక్క. (Temptress) ఈమెను 'మారి'అనవచ్చును. ఐహిక సుఖాలవైపు క్రీస్తును మళ్లింపజూచిన "డెవిల్"వంటిది నిగమశర్మఅక్క. ఫౌస్టు ఆత్మనే గుత్తగొన్న మెఫెస్టఫెలెస్ వంటిది నిగమశర్మఅక్క. ఈమె తమ్మునిపై జూపు ప్రేమ ఆత్మానురాగమే, తన ఆభిజాత్యముపై కల అహంకారమే కాని వేఱుకాదు. సాలగ్రామ గనిలో రాళ్లు పుట్టునా యని తన పుట్టినింటిని పొగడుకొనుచున్నది. తమ్ముని వంశము పరమేష్ఠినుండి వచ్చినదట. సర్వబంధముల మూలచ్ఛేదము చేసికొని పోవుచున్న తమ్ముని వంశవృక్షపు వ్రేళ్ల లోతులను కొలుచుచున్నది. నా తమ్ముడు బ్రహ్మాదుల మెచ్చడు నేనతని యజ్ఞమునం గడు బాజ్యురాలనై వేది యలంకరింతునని వేవురిముంగర ఆడుకొను ప్రగల్భురాలు. పైగా తమ్ముని కళ్లల బోధచేయును. కామ వికారము కల్గెనేని "రూపగుణ శీల గుణోన్నతి గల్గు విప్రకన్యా మణులన్ సహస్రమయినన్ వరియించి రమింపరాదె" అని తమ్మునికి చెప్పుచున్నది. మనమేమయిన ఇందు కభ్యంతరము చెప్పెదమేమో అని "ఏమీ! మునులే గృహస్థులు! రమించుటయొగ్గె కులాంగనా తతిన్" అని బుకాయించును. శ్రీహరి దగ్గఱికే "అమరపథము" (ఇది రామకృష్ణుని సమాసమే)న బోవు తమ్మునితో "మామకబుద్ధి పద్ధతిన్ నడువుము, నీకు కావలసెనా హరికౌస్తుభమైనం దెచ్చెదన్" అని బీరములాడును. ఏ స్వార్థముచేత తమ్ము నుద్ధరింతమని వచ్చెనో, ఆ స్వార్థమే ముక్కరపోయినప్పుడీమెను సారలి సారలి ఏడ్పు నట్లు చేసినది. ముక్కరపోయిన, అయిదువతనమునకు దెబ్బ అనుకొని ఆమె అంతగా ఏడ్చియుండునని విమర్శకు లొకరు చెప్పిరి. ఒకే ప్రేగు పంచుకొని పుట్టిన తమ్ము గుజ్జి పాపకూపము (ఆమెదృష్టిలోనే)లో పడిపోయినాడే యని కాక, ఇంక ముందెన్నడో పోగల ఐదువతనమునకై ఏడ్చుట స్వార్థముకాదా? దీనికి ఎవరికైనా నవ్వు వచ్చిన పాపము రామకృష్ణుడేమిచేయగలడు? ఆమె నిజమైన స్వభావమును విశ్లేషించి ప్రదర్శించినాడు. రామకృష్ణుడీ పాత్రకు పేరు పెట్టలేదు. కథా ప్రారంభమున ఉత్పలమాలలో ఒక పాదమునను, దర్భముద్రిక కొడుకెత్తుకొని పోయినపుడు శోకించుటకొక సీస పద్యకాలమున వచ్చిన నిగమశర్మ అబ్బ పేరైన చెప్పినాడు కాని, ఇంత యసంబద్ధ సంసార నాటకమాడిన నిగమశర్మఅక్క పేరు చెప్పలేదు రామకృష్ణుడు. ఆదిమానవుడైన ఆదాము పతనమునకు దారి తీసిన పాముకు "స్వర్గచ్యుతి"లో రామకృష్ణుని తర్వాతి మిల్టను కూడ పేరు పెట్టలేదు.

ఈ వ్యాసములో ఇంతకుముందు ఉద్ధరించిన "పద్మకర్ణికకు గొలువున్న పద్మవోలె"లోని "పద్మ" అను పదముబట్టి, విష్ణువు లక్ష్మీదేవినే 'నీవుపోయి ఆ నిగమశర్మను త్వరగా పంపించు" అని పురమాయించినాడా అని అనుమానము కలుగక మానదు. ఆ లక్ష్మీ దేవియే నిగమశర్మ త్వరగా వైకుంఠమునకు పోవు ఎత్తు ఎత్తినదా అక్క రూపమున వచ్చి?

ఇవన్నియును కవి యాలోచించి వ్రాసియుండునా? లేక విమర్శకుల స్వకపోల కల్పనలా అను అనుమానము రావచ్చును. గొప్ప కవుల రచనలలో ఎన్నియైన మెళకువ లుండవచ్చును. ఎన్నియైన ఓదములు (Traps) ఉంచి యుండవచ్చును. "మాక్బెత్" నాటకములోని ఒక అప్రధాన దృశ్యము (తలుపు తట్టుదృశ్యము)పై, డీక్విన్సీ అను విమర్శకుడు (ఇతని వచనము కవిత్వమువలె నుండును) On knocking the Door పై గొప్ప సాహిత్య విమర్శ వ్రాసినాడు. మిల్టను వాడిన Dumb eyes ('మూగకనులు')లో ఎంతయో అర్థమున్నదని రస్కిన్ వ్యాఖ్యానించినాడు. ఇట్టివి పాఠకుల సహృదయత, దృక్పథము, శేముషినిబట్టి అర్థమిచ్చుచుండును. నిగమశర్మ అక్క ఉదంతమట్టిది. ఈ పాత్ర పవిత్రమైనను, అపవిత్రమైనను, అద్భుతమైనది పేరుకూడ చెప్పకుండ ఇంత మఱపురాని పాత్రను చిత్రించిన రామకృష్ణుని కళ గొప్పది. పేర్లు పెట్టకుండ పాత్రలను వర్ణించు ఈ "టెక్నిక్"ను విశ్వనాథవారు "మా బాబు"లో సర్వేసర్వత్ర అనుసరించినారు.

శ్రీ వాడపల్లి లక్ష్మీనారాయణాచార్యులు

ఇంటికి వెళ్ళిపోదాం

నీరెండలో డాబామెట్లమీద కూర్చుని శ్రీనాధూ శేఖరూ లెక్కలు చేసుకొంటున్నారు. వాళ్ళకి కొంచెం దిగూ మెట్టుమీద వాణి కూర్చుని, కొండపల్లి బొమ్మల్నీ సంసారం లక్కపిడతల్నీ పేర్చుకొని ఆడుకొంటోంది.

పేపరు చదువుకొంటున్నవాడినల్లా ''యేం! యెదవా—మళ్లీ పలకొత్తు! తన్నేత్తానంతే'' అన్న వాణి మాటలు విని మెట్లమీదికి దృష్టి మళ్లించేను. అప్పటికే వాణి శ్రీనాథ్ దగ్గిరకి వెళ్ళడం, వాడిమీద వో చిన్న చఱుపు చరుస్తూ ''మరి నా బొమ్మ లెందుకు పలగొత్తావ్? '' అని అనడం — అయిపోయి; తిరిగొచ్చి పడిపోయిన బొమ్మల్ని సర్దుకొంటోంది. నిల్చోబెట్టిన చెవులపిల్లీ, గొల్లభామా అటూ ఇటూ తల లాడిస్తుంటే శేఖర్ వాటివైపే అలా చూస్తున్నాడు. శ్రీనాథ్ మళ్ళా సందుచూసి మెల్లిగా వో నోట్సు పుస్తకాన్ని బొమ్మల పైకి విసిరి, నంగనాచిలా రాసుకొంటున్నాడు. ''యేంరా దొంగ యెద్దవా. వుండు నీ పని అమ్మతో సెపతాను'' అని వాణి అంటూనే లేచి పుస్తకాన్ని శ్రీనాథ్ పైకి గిరాటెట్టి; ''అస్సలు నేనాలుకోనే ఆలుకోను! ఛి!'' అంటూ మిగతా బొమ్మల్ని కూడా కాలితో తోసేసింది! వాణిఅన్న మొదటి వాక్యంతో బొమ్మల మీదనున్న శేఖర్ దృష్టి చెదిరి వాణిపై నిలిచింది! శూన్య దృక్కులతో తదేకంగా దాన్నే చూస్తున్నాడు. నీరెండలో వాడి కళ్ళు చూడ్డాని కదోలా వున్నాయి!

ఇంతట్లోనే వాణి కళ్ళని మిలమిలా ఆడిస్తూ ''సెప్పన్లే'' అని హుందాగా అని; ''మరేం—నాకా నెమలికన్ను యిచ్చెయ్యరా!'' అంటూ తాను గిరాటెట్టిన నోట్సులోంచి జారిన నెమలి కన్నును అందుకోబోయింది. కాని; శ్రీనాథ్ ముందే అందుకొని మేడమీదికి దౌడు తీసేడు. ''వ్వాలే అన్నయ్యా నా కిచ్చేయలా అది! ... మరి నువ్వు లేపు తెచ్చినప్పాతే నాకిచ్చేత్తానన్నావు కదేంతిరా!'' అంటూ వాణి వాడి వెనక పరుగెడుతోంది. దాన్ని పరిగెత్తించి పరిగెత్తించి; వొక్కసారి తను రక్కునఆగిపోయి, నెమలికన్నువున్న చేతినిపైకెత్తి ''అందుకో ఇచ్చేస్తాను'' అన్నాడు శ్రీనాథ్. మెల్లిగా వాడి వెనక నుంచి డేకుతూ వెళ్ళిన శేఖర్ చటుక్కునలేచి వొకచేత్తో శ్రీనాథ్‌ని కదలకుండా చుట్టేసి; రెండో చేత్తో నెమలి కన్నువున్న చేతిని బలవంతంగా దిగూకి వాణి కందేలా దించి ''ఎందుకురా నా చిట్టి చెల్లిని ఏడిపిస్తావ్? — వాణీ అంటే మా చిన్నారి బంగారితల్లి — ఏమ్మా కదూ!'' అంటూ వాణి నెత్తుకున్నాడు.

ఇంతలో ఇంట్లోంచి ''రిక్షా వొచ్చే వేళైంది. కుఱ్ఱాళ్ళని అన్నాలికి రమ్మనండి'' అన్న నా భార్య మాటని వాళ్ళ కందించి; మళ్ళా నేను పేపర్లో పడ్డాను.

మేడ దిగి ఇంట్లోకి వొస్తూనే శ్రీనాథ్ ''నాన్నా! ఇవాళ కూడా శేఖర్ స్కూలికి రాట్ట!'' అన్నాడు. ''శేఖరేవిటి అన్నయ్య అనలేవూ? ఎన్నిసార్లు చెప్పేనలా పేరు పెట్టి పిలవద్దని!—నువ్వెళ్ళి భోంచేస్తూండు వాడూ వొస్తాడు'' అన్నాను. వాణిని మెట్లు దించి, బొమ్మల్ని దాని ముందర పేరుస్తున్న శేఖర్ని పిలిచి ''జ్వరం తగ్గిపోయింది కదా వెళ్ళడానికేంరా!'' అన్నాను చేతిని పట్టుకొని పరీక్షిస్తూ.

''ఉట్టినే—రేపట్నించీ వెళతాను''అన్నాడు క్రిందికిచూస్తూ.

''ఉట్టినే ఎందుకు చెప్పు స్కూలు మానేయడం? వొంట్లో బాగులేకపోతే యెలాగూ తప్పదు. ఇప్పటికే వారంపైగా వెళ్ళలేదు. ఏ సబ్జక్టులోనన్నా వెనకబడితే దాన్ని కవర్ చేసుకోడం యెంత కష్టమని!—వెళ్ళిరా నామాట విని. నేను మీ క్లాస్ టీచర్‌కి లెటర్ రాసిస్తానుగా ఇన్నాళ్ళూ వొంట్లో బాగోలేదని. ఏం! అది కాదు—చూడిలా!—ఎందుకు వెళ్ళవో నాకు చెప్పడానికేం?'' అన్నాను తటపటాయిస్తున్న శేఖర్‌తో.

''ఇవాళ నాన్న దగ్గిర్నుంచి వుత్తరం వొస్తుందని'' — నా నుంచి చూపు మళ్లించుకొంటూ అన్నాడు. కళ్ళలో కొంచెంగా నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

వంటింట్లోంచి ''నెల క్రితం నుంచీ గని వుత్తరం ఇవాళొస్తుందిట్రా నీ పిచ్చిగాని!'' అంది నా భార్య.

''బాగుంది! ఇన్నాళ్ళూ రాలేదు గాబట్టి ఇవాళకూడా రాదని ఏం చెప్పగలం కాని! .. నాక్కూడా వడ్డించు. వీడి మాష్టారికి రెండు ముక్కలు రాసి వొచ్చేస్తున్నా'' అని; శేఖర్‌తో ''వుత్తరం కోసం స్కూలుమాని కూర్చోడమెందుకురా. ఉత్తరం వొస్తే అలాగే వుంచుతాను. సాయంత్రం నువ్వే చదివి వినిపిద్దుగాని—ఏం—వేగిరం భోంచేయి మరి రిక్షా వొచ్చేస్తుంది'' అని వాడిని లోపలికి పంపించి; ప్లేంక్ తీసుకొని లెటర్ వ్రాస్తున్నాను.

వాణి బొమ్మలన్నింటినీ మెల్లిగా ఇంట్లోపెట్టి ''నాన్నా మరేం ఊ నెమలీక ఈ బొమ్మ తలకి కత్తు నాన్నా— ఇంచక్కా యెంతో బావుంతాది'' అంటూ వో చిన్నదారం ముక్కా, నెమలి కన్నూ, గొల్లభామ బొమ్మా ప్లేంక్‌మీద పెట్టింది.

''అదెలా కట్టనమ్మా?! దీని తల నున్నగా బోడిగుండులాగా వుంది. దారం కడితే మొహం మీదికి వొస్తుంది. అసలు బిగవదు. జారిపోతుంది. అలాగే ఆడుకొందూ — రాత్రి ఈకల ఆల్బంలో గుచ్చుకొందాంలే.''

''నే పెడతాను వే'' అంటూ అన్నం తింటున్న శేఖర్ పిలిచేడు.

కాగితాన్ని రాసి పుస్తకాల బాక్సుమీద పెట్టి భోజనానికి వెలుతుంటే వాణి మహదానందంతో ఎదురుగావొచ్చి ''నీకేం తెలీదు నాన్నా, పెద్దన్నయ్య చూడు ఎంచక్కా ఎంత బాగా అంతించేడో!'' అంది బొమ్మని చూపిస్తూ. గొల్లబామ నెత్తికి వెనకగా కొంచెం ప్రక్కన నెమలికన్ను పెట్టి దాని పైనుంచి బొమ్మకి ట్రాన్స్పరెంట్‌గా వున్న వో చిన్న స్టికర్ ముక్కని బిగుతుగా అంటించేడు బొమ్మ తల పంకిస్తుంటే నెమలి కన్నుకూడా తలతోకలిసి వూగుతూ గొప్ప అందంగా వుంది. వీడికి ఎంత వేగిరం ఐడియా తట్టింది — అనుకొంటూ ''ఈ స్టికర్ ముక్క ఇప్పటి కిప్పుడెలా వచ్చిందిరా'' అన్నాను పీటపై కూర్చొంటూ.

''ఆమధ్య మీరు పళ్ళపొడి సీసా కొన్నారు కదా. దాని అట్ట పెట్టికి సీల్‌చేసివుంటే ఉట్టినేతీసి గుమ్మానికి అంటించివుంచేను'' అన్నాడు లేచి చేతులు కడుక్కుంటూ.

వీధి గుమ్మంలోంచి ''అబ్బాయిగారూ'' అన్న రిక్షావాడి కేక విని బెల్టు బుజాన వేసుకొని, బూట్లు వో చేత్తోనూ, పుస్తకాల బాక్సు మరో చేత్తోనూ పట్టుకుని గుమ్మం దగ్గరికి కుర్రాళ్ళు పరిగెత్తేరు. నా భార్యా, వాణీ టిఫిన్‌కారియర్లని పట్టుకు వీధిగుమ్మంలోకి వెళ్ళేరు.

''ఏలేం అన్నయ్య ఎప్పుడూ నన్నేలిపిస్తాడే అమ్మా. మరి నేను వాలికి తాతా సెప్పను.''

''చెప్పాపోతే మానీ—సాయంత్రం సర్కస్‌కి నిన్ను తీసుకువెళ్ళనంతే'' అన్నాడు బెల్టు బిగించుకొని బూట్లు కట్టుకుంటూ.

''అమ్మా సలకసుకి నేనూ లావద్దే'' అంది జాలి కళ్ళతో బుంగమూతితో.

''వుత్తిదేనమ్మా నువ్వు రాకపోతే ఏనుగులూ, కుందేళ్ళూ వాడిని గేటుదగ్గిరే అడ్డేసి లోపలికి వెళ్ళనీయవంతే'' అంది రిక్షాలో కెక్కిన కుర్రాళ్ళకి బాక్సుల్ని అందిస్తూ.

''పెద్దన్నయ్యా తాతా...అన్నయ్యా తాతా.''

అన్నం తింటున్నవాణ్ణల్లా రక్కున వెనక్కితిరిగి శేఖర్‌వైపు చూసేను! చేతినూపే వాడి కళ్ళలో మెఱుస్తున్న సంతృప్తి నా కళ్ళబడి వొక్కసారిగ చలించిపోయేను. సాయంత్రపు నీరెండపోయి, వెన్నెల రాడానికి ముందర — నీలాకాశంలో నూత్న కాంతితో మెఱిసే నక్షత్రాల్లాగా వున్నాయి వాడి కళ్ళు!

''డాక్టరుగారేవన్నారండి?'' అంది మజ్జిగపోస్తూ నాభార్య.

''ఏమంటారు అసలు వాడికి డిసీజంటూ వుంటే కదా!. వాడికి తల్లిదండ్రులమీదా తోబుట్టువులమీదా వుంది మనసంతా!... ఈ సంగతులేవీ మా అన్నయ్యలుంగారి కర్థం కావు అయితే పరిస్థితులు కూడా అలాగే వొచ్చేయనుకో.'' అన్నాను లేస్తూ.

''పరిస్థితులేవిటండీ ... కుర్రాళ్ళు దగ్గిరున్న కొద్దిపాటి రోజుల్లో కూడా వాళ్ళిద్దరికీ తమ తమ ఆనందాలు తప్ప వీళ్ళ గొడవ అస్సలు పట్టదు గదా! ఇంట్లో పిల్లల్ని వుంచి తలుపులికి తాళాలేసుకొని ఎంచక్కా ఎవరి మట్టుకువారు సినిమాలకనీ షికార్లకనీ వుడాయిస్తారు రాత్రి యెనిమిదవకుండానే పిల్లల్ని ఎలాగోలాగు పడుకోబెట్టేసి ఇంట్లోనే తాగి తందనాలాడతారు'' అంగి కిళ్ళీ చుట్టి అందిస్తూ.

''అవన్నీ అలా వుండనీ, కనీసం వారానికో పక్షానికో వో కార్డుముక్కన్నా వాడిపేర రాసి పడేయడానికి వాడికి వీలుచిక్కడం లేదా అని?! నేను ఎప్పటినుంచో శేఖర్ని తెగస్టడీచేసి చూస్తున్నాను. మన పిల్లలపై మనం మనకే తెలీకుండాచూపే వాత్సల్యాభిమానాలు వాడికి కావాలి. శ్రీనాథ్‌కీ వాణికీ మధ్యనున్న చనువూ, సోదర ప్రేమా వాడికి కావాలి ... ఎంత హోల్‌హార్టెడ్‌గా మనం వాడిని చూస్తున్నా...ఏదో ఎక్కడో ఆ లేతమనసు వెలితిని ఫీలై షాక్ తింటున్నాడు మెంటల్‌గా! సరిగ్గా ఆర్నెల్ల నుంచి వాడీ మానసిక క్షోభకే అడపా తడపా గుర్రై; గతవారమంతా ఆబాధే తారస్థాయికి పోగా మంచం పట్టేడు!...వ్చ్ వాడినెలా సముదాయించాలో నాకర్థం కాడం లేదు'' అన్నాను చెప్పుల్లో కాలుపెట్టి తలదువ్వుకొంటూ.

సైకిలు దింపుతుండగా పోస్టుమేను వచ్చి ఓ కవరందించేడు. కలకత్తా నుంచే వొచ్చింది నా పేరనే! చింపబోతూ శేఖర్ కిచ్చిన మాట గుర్తుకొచ్చి ''వాడొచ్చిన వెంటనే ఇయ్యి. నే స్కూలికి వెళ్తున్నా'' అని నా భార్యకి కవరందించి పెడల్ వేసేను—వాణిచేతి టాటా నందుకొని

సాయంత్రం నే వొచ్చేసరికి కుర్రాళ్ళిద్దరూ మరికొందరితో కలిసి మండువాలో దాగుడు మూచ్చులాడుకొంటున్నారు. వాణి ఈమధ్యే సరదాగా కుట్టించిన కొత్తజరీఅంచు పరికిణీ జాకెట్టూ కట్టుకొని; పొట్టి పిలకకి నాలుగు చేమంతిపూలు కుట్టించుకొని జడగంటలు వేసుకొంది. వాటి బరువుకే జడ సాగినట్లుంది. ఆటలో తల్లిగా వాణినే పెట్టుకొన్నారుగాని; దొంగలో బాటు తనూ ఆవారా ఈవారా నక్కుతూ, అటూ ఇటూ పరిగెడుతూండడంవల్ల తల్లిని దొంగలు ముట్టుకోడంకాక తల్లే దొంగల్ని ముట్టుకోడంతో కుర్రాళ్ళు మరింత గోలచేస్తున్నారు.

''కాఫీ తెస్తావా — అన్నయ్య ఏవిటి రాసేడు'' ఇంట్లోకి వెల్తూ వంటింట్లోవున్న నా భార్యతో అన్నాను.

''ఏమో పాపం వాడు సరదా పడ్డాడేగాని; అది ఇంగ్లీషులో వుండడంవల్ల దిగాలు పడిపోయి దాచేసి ఆడుకొంటున్నాడు మీరు

కాళ్ళు కడుక్కోండి ముందు'' అంది. ''ఏవిటి విశేషం? ఏదో సువాసన వేస్తోంది'' అని నేననే లోపలే కుర్రాళ్ళింట్లోకి రావడం, నన్ను చుట్టుముట్టడం అయింది. శ్రీనాథ్ ''నాన్నా ఇవాళ నేను అన్నయ్యా, అన్నయ్య తమ్ముడూ, చెల్లి అక్కా అయిపోయేం!—ఏవిటో చెప్పుకో చూద్దాం'' అన్నాడు.

ఇంతట్లోకే జాపోస్తూవొచ్చిన వాణి ''నాన్నా నాన్నా మలేం మలి అమ్మ—కాదు నాన్నా పెద్దన్నయ్య ఇప్పులే పుత్తేసేడు నాన్నా! మలి అమ్మ నేనూ ఆ వెల్లి కొత్తు మించి సామానులూ, బత్తలూ తెచ్చేం మాట. మలి నాకు కాళ్ళు పీకెలతాయి కదా అందుకని లిక్సా ఎక్కి వెల్లేం నాన్నా—పెద్దన్నయ్య బల్లో అమ్మగాలు నన్ను ఎత్తుకుని వుంచేత్తామన్నాలు నాకు బిల్లలుఇచ్చేరు. నేనన్నీ మల్చిపోయే నాన్నా మలి ఇలాగా చెవులో సెప్పాలి అమ్మ నాకిట్టం అని ఎన్నో అప్పచ్చులు చేత్తున్నాది మూత'' అని చెవినుంచి వొళ్ళోకి జారింది.

''ఊం... ఇదొక్కత్తీ వాగుడు కాయలాగ. ఎంతో సీక్రెట్‌గా వుంచుదామని అంతా అనుకొంటే''అన్నాడు శ్రీనాథ్ ఉరుముతూ.

''అరి దొంగల్లారా అదా సంగతి మరి పొద్దున్న చెప్పేవు కాదేమే'' అన్నాను శేఖర్ వైపు చూస్తూ. వాడు తలంటుకొని పసుపుపెట్టిన కొత్త బట్టలతో పిన్ని అందించే ప్లేట్లు మూకం దిస్తున్నాడు.

''నాకేవిటో **జ్ఞా**పకవే లేదు. మధ్యాహ్నం పడుకొన్నానంతే ఇదిగో మీ అమ్మగారు ఎందుకన్నారో 'అమ్మా నా పుట్టిన రోజుకేం చేస్తావే' అని. అంతే రక్కున జ్ఞాపకం వొచ్చింది 'ఇవాళ శేఖర్ పుట్టిన రోజు కదా' అని! అబ్బబ్బ ఆ నూనెకో దణ్ణం. ఊరికే పొంగిపోతూ తెగ ఏడ్పించిందనుకోండి'' అంది చెంగుతో తుడుచుకొంటూ.

''బాగుంది నాకన్నా మీ పిన్నే నయంరా! — హేపీ బర్త్‌డే టూ యూ'' అన్నాను ప్లేటు నందుకొని శేఖర్ భుజం చరుస్తూ.

''నువ్వు **కూడా** తినేయి పిన్నీ, తరవాత వంటిల్లు సర్దుకొని స్నానం చేద్దువుగాని'' అంటూ తానే స్వీట్స్‌సర్దిన ప్లేట్‌ని నాభార్య కందిస్తూ శేఖరన్నాడు.

''మర్చిపోయేను — మలి మీలెందుకు **ఈ** కొత్తబత్తలూ జలగుంతలూ చింగారించేచేరు సార్!'' అన్నాను వాణి నోట్లో **స్వీట్** నొక్కు**తూ**.

' నువ్వంతా యెప్పులూ మల్చిపోడవే నాన్నా — మలి నేను కూలా రేపో ఎప్పులో పుత్తేసేను కదేంటి నాన్నా. మలేం — నువ్వు మల్లా మలిచిపోయేవు నేను సెప్పెయ్యనా! మలేం పెద్దనాన్నగాలి వుత్తలం సూచేవా.''

''ఔనే నిజంగా నేనూ మర్చిపోయేను'' అంటూ శేఖర్‌వెళ్ళి ఉత్తరం తెచ్చేడు.

''ఏరా రాస్కెల్. వాడికితెలీపోతే తెలీపోయిందిగాని నువ్వన్నా చదవలేవట్రా. రాస్కెల్స్ మళ్ళా **కాన్వెంట్‌**లో వెలిగిస్తున్నారు.'' అన్నాను ప్లేట్లో స్వీట్‌ని విరిచి వో ముక్క శ్రీనా**థ్ నోట్లో** కుక్కుతూ; కనరందుకొని మిగతా ముక్క శేఖర్ నోట్లో కుక్కు**తూ**.

''అదేవిటి వాడు పెద్ద క్లాసా నేను పెద్ద క్లాసా? అయినా మాకు స్కూల్లో నేర్పేదీ మా కలవాట్లైనదీ ఇటాలిక్ స్క్రిప్ట్ సార్! నువ్వం**టావు**కదా 'సిరాబుడ్డీలోంచి వొచ్చిన చీమ తెల్లకాగితం మీద పాకినట్టు' అని అలాంటి ఆ కలిపిరాతని **హౌ** కెన్ వుయ్ రీడ్ సార్! అసలా లెటర్‌లో వొక్క లెటర్ కూడా **మాకు తెలీలేదు**'' **అన్నాడు** శ్రీనా**థ్**.

నవ్వుకొంటూ కవరులోంచి వుత్తరం తీసేను. **ఓ** పావువంతు మేర రాసివున్న లెటర్‌హెడ్‌కి పైన పిన్‌చేసి నాలుగు వందలకి వో క్రాస్డ్ చెక్కు వుంది. ''వీడికి పిచ్చెక్కుతున్న**ట్టు**ంది. మొన్న రెణ్ణెళ్ళక్రితమేనా ఆరొందలు పంపిస్తే! ఏవిటి ఈ పదేళ్ళ కుర్రాడి రీసెర్చి స్టడీస్‌కి సాలుకి ఏ **మూడు**వేలో ఖర్చుచేయమంటాడు గాబోలు'' **అంటూ** లెటర్ చదివి;

''నేనూ, నీ వదినా ఇక్కడ క్షేమం. నీకూ శేఖర్‌కీ పిల్లలకీ మందరికి ఆశీస్సులు. **ఈ డబ్బు** శేఖర్ చదువు ఖర్చులకోసం పంపిస్తున్నాను. క్రితం నెల ఏం పంపనందుకు మరోలా ఏం అనుకోకు. రాబోయే సంక్రాంతికి నీ దగ్గరకీ, తాడికొండలో నా **బావ**మరది దగ్గరకీ, మా మావగారింటికి అంటే నెల్లూరూ వచ్చి మిమ్మల్నీ శేఖర్, రాజీ, విజ్జీలనీ చూచి రావాలనుకొన్నాను కాని; అనుకోకుండా నా ఫ్రెండ్స్ జనవరి తొలి రెండు వారాల్లోనూ డార్జిలింగ్, గాంగ్టాక్ వగైరాలకి టూర్ వేసేరు. కాబట్టి రాలేకపోతున్నాం. చి॥ సౌ॥ మంగదలిని మీ వదిన అడిగినట్లు వ్రాయమంది. వెంటనే ఉత్తరం కోరుతున్నాను. నీ అన్న'' అని తర్జుమాచేసి చెప్పేను.

''అదేవిటి పుట్టిన్రోజు అని ఇవాళే అందేలా ఆ చెక్కూ, వుత్తరం రాసేరనుకొన్నాం'' అంది నా భార్య.

శేఖర్ చూడకుండా నా భార్యని ఎర్రగా **చూ**సి కన్నుగీటుతూ ''బాగుందే—నీకే మధ్యాహ్నందా**కా** జ్ఞాపకంరాలేదు! రాద్దామనుకొనే మర్చిపోయేడు కా**బో**లు. అయినా సరిగ్గా సమయానికి వొచ్చిందిగా కానుక. ఇన్కంటాక్స్ ఆఫీసరుగారి ద్వితీయ పుత్రరత్నానికి తండ్రి ఇచ్చే ఫాయా**లో**నే వుందిలే కానుక'' అని కవర్ని శేఖర్ జేబు**లో** పెడ్తూ ''అయితే ఇవాళ ఏవిట్రా ప్రోగ్రాం డిసైడ్ చేసేరు'' **అన్నాను** మాటమారుస్తూ.

''సర్కస్'' అన్నారు శ్రీనాథూ వా**ణీ** గొంతులు కలిపి.

''మీరేవిటి చెప్పడం! వాడు చెప్పాలి'' అంది నా భార్య.

''ఇవాళ సర్కస్ వద్దు.''

''ఏంరా **హా**యిగ సర్కస్‌కి పోదాంరా'' అని మళ్ళా శ్రీనాథూ వా**ణీ** అంటూండగానే నేనూ గొంతు కలిపేను.

. శేఖర్ కొంచెంసేపు ఏం అనకుండా వుండి; తలదించుకొని ఎటో చూస్తూ అన్నాడు—''ఇవాళంతా పిన్ని పనిచేస్తూనే వుంది. అసలు పడుకోలేదు—తలనొప్పి వచ్చి రానంటుందని.''

దాని సంగతేమో కాని నేనుమాత్రం వాడి మాటకి వొక్కసారి చలించిపోయేను. నిలుచున్నపళంగా శేఖర్ని పొదివి పట్టుకొని అక్కున చేర్చుకోవాలనిపించింది. కాని; వాడి తల నివురుతూ ''ఆరినీ-అదా?! ఫరవాలేదు సర్కస్‌కే పోదాం. ఏమే నువ్వేమంటావ్?''

''నాకేం—పావుగంటలో తెమిలిపోతాను.''

''ఇవాళ వొద్దులెద్దురూ'' అన్నాడు శేఖర్.

''మరేం చేద్దాం'' అన్నాను.

''ఇవాళ పౌర్ణమికదా హాయిగా మేడమీద కూర్చుందాం అందరం . మీరుమాత్రం కథలు చెప్పాలి'' ఇలా అని ఏదో చిన్నితనం ఫీలైనట్లు అటు చూస్తూ వాణి నెత్తేసుకొని మండవాలోకి పారిపోయేడు.

నా మట్టుకు నాకు గుండెల్లోంచీ ఏదో అనిర్వచనీయభావం ఉబికి వొస్తోంది. శేఖర్ని అలా చూస్తూ; తమాయించుకొని లేచేను.

రాత్రి 'చిక్కుడు గింజా చాక్లెట్లలోకం' కథ అయి 'సిందుబాద్' కథ మొదలెట్టేసరికే వాణి తల్లి తొడనోదాన్ని ఆక్రమించుకొని నిదురబోతోంది. 'సిందుబాద్' కథ అయి 'కాంచనద్వీపం' మొదలుపెట్టిన కొంచెం సేపటికే శ్రీనాథ్ తల్లి రెండో తొడపై తల ఆన్చి పడుకొన్నాడు. జిన్, డాక్టర్లబృందం అస్థిపంజరం గుర్తును వెతికేలోగానే నా భార్య అలాగే వొళ్ళో పడుకొన్న పిల్లలతో తాను వెనకనున్న పిట్టగోడకి జారబడి పడుకొంది. కథ సాగుతోంది.

సిగరెట్ వెలిగించేను. ఆకాశమాత వుంచిన మేఘాల పొత్తిళ్ళలో చంద్రుడు మాటిమాటికీ దాక్కుంటూ దోబూచులాడుతున్నాడు! తల్లి ప్రేమలా లోకాన్నంతనీ వెన్నెల ఆవరించివుంది!

కథ చెప్తూ చెప్తూ అనుమానం వొచ్చి శేఖర్ని చూసేను. వాడి దృష్టి కథమీదనుంచి చెదిరి నా భార్యపైనా; ఆమె వొడిలో వెన్నెట్లో ఆదమఱచి నిదురించే శ్రీనాథ్, వాణీలమీదా పడింది. మళ్ళా సాయంత్రంలాగే నా గుండెల్లోంచీ ఏదో భావం ఉబికి వొస్తోంది. తమాయించుకొని తక్కున కథని ఆపేసేను. శేఖర్ వొక్కసారి నావైపు చూసి అంతట్లోనే శూన్యంలోకి చూస్తున్నాడు. వాడి కళ్ళలో వెన్నెల చోటుచేసుకొంది?! ఏం నాన్నా పడుకొంటావా? కథ మానేసేదా!'' అన్నాను ఊకొట్టేడు. ''ఇలా దా రేపు కలకత్తా వెళ్ళొద్దామా!'' అన్నాను. ''మీ యిష్టం.''

ఫిష్ ప్లేట్ల దగ్గర కాకరఖాళ్ళు కూడా లేచి ముందు వొస్తున్నాయా అని అనిపించేటంత వేగంగా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ పరుగెడుతోంది.

చిలక సరస్సు దాటేసరికి శేఖర్ పడుకొన్నాడు. సిగరెట్‌మీద సిగరెట్ వెలిగిస్తూ వాడి ముఖంలోకే చూస్తూ కూర్చున్నాను. బుఱ్ఱంతా ఆలోచనల గాలులతో గింగురెత్తుతోంది! శరీరమంతా ఏదో భావోద్వేగం తారస్థాయిలో ప్రవహిస్తున్నట్లుంది! రైలు భువనేశ్వర్ దాటి మరింత వేగాన్ని పుంజుకొంది...రెండేళ్ళబట్టీ నా దగ్గరే వుంటున్న వీడు నాలో రేకెత్తించని భావతీవ్రతని సరిగ్గా ఈ ఆర్నెల్లబట్టీ ఎలా నాలో రేపుతున్నాడు?— ఈ ఆర్నెల్లబట్టీ వీడి ప్రతి మాటా చేతా అతి నిశితంగా పరిశీలిస్తున్నాను గాబట్టా ?! మొన్న వారంరోజుల జ్వరంనుంచి తేరుకున్నాక నిజంగా ఏదో ప్రశాంతతా, కాంతీ, సంతృప్తీ వీడిమొగంలో కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయి. అంతకుముందు ఎప్పుడూ పరధ్యానంగా, ముభావంగావుండే వీడి కళ్ళల్లో ఈ నాలుగు రోజుల్నించీ వింత వింత వెన్నెలకాంతులు కన్పిస్తున్నాయి?! ఇంత లేతవయసులో ఇంతగా లైఫ్‌తో రాజీపడ్డం సాధ్యమయే పనేనా అని?! రైలు పోతోంది.

★ ★ ★

కలకత్తా ఉదయం ఏడుకి చేరేం. ఎస్ప్లనేడ్‌కి ప్రక్కగా రబీంద్రమార్గ్‌లో వున్న వో పన్నెండంతస్థుల భవంతిలో పదకొండో అంతస్థు—మా అన్నయ్య నివాసం. కలకత్తా రావడం నాకు మూడో సారీ, శేఖర్‌కి రెండోసారీ కాడంతో సులువుగా ఓ ముప్పావుగంటలోనే ఇల్లు చేరేం. తలవని తలంపుగా మేం కంటబడేసరికి అన్నయ్యా వదినా కాస్తంత ఆశ్చర్యపడ్డారు!

కాలకృత్యాలూ, బ్రేక్‌ఫాస్టూ అయేక శేఖర్ రేడియోగ్రాం వున్న రూమ్‌లో రికార్డుల ఆల్బం ముందేసుకుని ఏవేవో రికార్డులు తీసి ఆన్‌చేస్తూ ఆపుతూ ఎంచుకొంటున్నాడు.

నేను బెడ్ రూంలో వూరకే దొర్లుతున్నాను-ఏవో పత్రికలు తిరగేస్తూ. ఉన్నట్టుండి దండెంమీద నా దృష్టిపడింది. అస్తవ్యస్తంగా దండెంమీంచి వ్రేలాడుతున్న తెల్లచీరకి దిగూన దండెంమీంచి ఏదో వ్రేలాడుంటే లేచి చీర జరిపి చూసేను-కుట్టిన పూలజడ?! వాడిన పూలతో అదో వెగటు వాసన వేస్తోంది. ఇందాకా డైనింగ్ హాల్లో టేబుల్ దిగూన బేసిన్‌లో కుప్పగావున్న గాజు గ్లాసులకీ, ముగ్గులకీ, ప్లేట్లకీ దీనికీ ఏమిటో సంబంధం! అనుకొంటూ ఫ్రిజ్ తెరిచేను. మధ్య అరలో మూడు బీర్ బాటిల్సూ, రెండు విస్కీ, ఒక జిన్నూ వున్నాయి. దిగూ అరలో పళ్ళూ, ఏవేవో డ్రింక్ సీసాలూ వున్నాయి. పై అరలో మంచి ఆర్టిస్టిక్‌గా వున్న ఓ గాజు జాడీమీద నా దృష్టిపడింది. ఎర్రని నీళ్ళలో వూరేసిన ఉసిరికాయల్లా తేలుతూ ఏవో పళ్ళున్నాయి! అతి పదిలంగా జాడీ తీసి పట్టుకొని మూతతీసి వాసనచూసేను. అదో ప్లెజెంట్ స్మెల్! ఏదో వైన్ వాసనే! కాని; ఈ పళ్ళేమిటి ?!

టర్కీ టవల్తో తుడుచుకొంటూ రూంలోకి అన్నయ్య వొచ్చేడు. ''ఏవిట్రా—ఇవి!'' అన్నాను స్పూన్‌తో వో రెండు నోట్లో వేసుకొంటూ. ''అవా—ఏం ఎలా వుంది టేస్ట్! అలా కాదనుకో తినడం. వాటి సంగతి రాత్రి చెప్తాలే—అంతదాకా నువ్వా పళ్ళని తినేకుండా మిగిలిస్తే నేననుకో. నిన్న మీ వదిన మేరేజ్ డే అంటూ తెగ హంగామా చేసిందిలే. చిన్న పార్టీ ఇచ్చేం మా ఫ్రెండ్స్‌కి ఇంట్లోనే రాత్రి మీరు ఏ అర్ధరాత్రో రాకపోడం మీ —మా అదృష్టమే! ఏవిటో లైఫ్‌ని ఎంత యెన్జాయ్ చేస్తున్నా తనివితీరదు నాలాంటి వాళ్ళకి! ఇవాళ తప్పనిసరిగా ఆఫీసు కెళ్లాలి. నిన్న ఫ్రెంచి లీవు కూడాను. కారు పంపిస్తాను — ఎక్కడికన్నా వెళ్ళండి మీ ముగ్గురూ'' అన్నాడు డ్రస్ పూర్తై దువ్వుకొంటూ.

''శేఖర్ ఎక్కడికీ రానన్నాడు. రాత్రి నిద్రలేక నాకూ టీడియస్‌గా వుంది. నువ్వు వొచ్చేవరకూ పక్కేస్తాను'' అన్నాను అవలిస్తూ. పళ్ళు ఏదో వింత రుచితో స్లైట్ ఆల్కహాలిక్ ఘాటుతో నిండారా ఏదో రసాన్ని చిప్పిలుతూ నోట్లోంచి లోపలికి జారుకున్నాయి.

''సరే నీ యిష్టం ఎంత ప్రయత్నించినా రాత్రి ఏడు దాటుతుంది నే వచ్చేసరికి అయినా ముందుగా రాడానికి చూస్తాను. మరి నేను భోజనం చేసి పోతాను'' అని వెళ్ళేడు.

మధ్యాహ్నం నాకు తెలివి వొచ్చేసరికి వొంటిగంటయింది. ప్రక్క రూంలోంచి ''సాగా సాహూరే'' అని ఏదో చక్కని బెంగాలీ పాట విన్పిస్తోంది. గొప్పగా మనసును ఊపేస్తోంది, ఒక్క ముక్కా అర్థం కాకపోయినా! ఏదో జానపద గీతంలాగే వుంది. పాట అయేక మళ్ళా అదేపాట వేసేడు! ఎవరో ప్రేయసి ఎందుకో ప్రియుణ్ణి నిందిస్తోంది గాబోలు. 'సాహూ' అంటే సాధువు కదా! మరి సన్యాసికి ప్రేయసి తిట్లేవిటి?! ఏమైనా భాష అర్థం కాకపోయినా ఆ పాటలో భావం మా తం అదే తప్పకుండా

''మున్నీ! ఎక్కడనుంచి లాగేవురా ఆ వెధవ పాటని — అన్నీ అప్టుడేట్ రికార్డులుండగా! అంకుల్ లేచేరేమో చూడు మీల్స్ చేద్దాం'' అవతలి రూంలోంచి వదినగారు శేఖర్ని కేకేసేరు.

నేను లేచి శేఖర్ రూంలోకి వెళ్ళి ''ఎవ్వరా పాడుతుంట?'' అన్నాను.

''రూనా లైలా! బాగుంది కదండీ పాట! బెంగాలీ ఫోక్ సాంగుట. ఈ పాటైపోనీండి—ఇదే రికార్డు వెనకాతల హేమంత్ కుమార్, చక్రబార్తీలు పాడిన మరో రెండు పాటలు గూడా చాలా బాగున్నాయి.''

''చక్రబర్తి కాబోలురా. ఇంగ్లీషులో అలాగే రాయాలికదా. బెంగాలీలో 'వ'కి 'బ' పలుకుతారులే. నువ్వింకా భోం చేయలేదూ—లే మరి.''

''మీరు పడుకొన్నాక అమ్మ ఫ్రెండ్స్ వొస్తే వాళ్ళతో మాట్లాడుతూ కూర్చొంది. ఏం తోచక నేనలా ఓసారి బజారులోకి వెళ్ళొచ్చేను'' అంటూ లేచి తన బేగ్ తెరిచి వో నెమిలి బొమ్మా, రెండు పుస్తకాలూ నా చేతికిస్తూ ''చెల్లికీ తమ్ముడికీ'' అన్నాడు.

''ఆరినీ...బాగా సెలక్ట్ చేసేవే'' అని పుస్తకాల్నిచూసేను. వొకటి 'ది సాగా ఆఫ్ అవర్ ఇండిపెండెన్స్', రెండోది 'ది వరల్ ఆఫ్ బర్డ్స్'. నెహ్రూ బాలల సంస్థవారి ప్రచురణలు రెండూను

''ఇవాళెక్కడికీ వెళ్ళొద్దన్నావని నాన్న కారు పంపిస్తానంటే వొద్దని పడుకొన్నా—దా భోం చేద్దాం'' అన్నాను పుస్తకాలూ, బొమ్మా అందించి డైనింగ్ హాల్లోకి వెళుతూ.

''చిన్నాయనగారూ! మున్నీ అచ్చు మీలగే తెగ రిజర్వ్‌డ్‌గా వుండడం నేర్చేసుకొన్నాడండీ. రాజీ ఇలా కాదు—వొచ్చిం దగ్గర్నుంచి టాటా చెప్పేదాకా మమ్మీ మమ్మీ అంటూ వొకటే సోదె—ఆ తాడికొండ స్కూలుగురించీ, వాడి పిక్నిక్‌ల గురించీ మా తమ్ముడూ మరదళ్ళ గురించీను. ఇక చిన్నారి అంతా అదో తరహా. దానిక్కొంచెం అన్‌హెల్దీగా వుందని మొన్నే మా డాడీ లెటర్ రాసేరు. పోనీ వోసారి చూసొద్దామంటే—ఎక్కడా తీరదనుకోండి చిన్నాయనగారూ! పోనీ మీరన్నా వొస్తారేమో అంటే అదీలేదు. ఆ బొంబాయి కాన్పూర్‌లలో వున్నప్పుడు అసలేలేదు. ఏదో కొంచెం దగ్గరి కొచ్చేం కదా మీ ఆవిడనీ పిల్లల్నీ తీసుకురండి'' అన్నారు వదినగారు వడ్డన పూర్తిచేసి తానూ భోజనానికి కూర్చుంటూ.

''కలకత్తా విజయనగరానికి దగ్గరా!...వొస్తాం. నే వచ్చిన మూడుసార్లూ అప్పటికప్పుడు అనుకొని బయలుదేరడమే అయింది ఈ స్వీట్లన్నీ ఎప్పుడు చేసేరు ''

''లేదండీ — మామూలు వంట ఆ బెంగాలీ వంటావిడే చేస్తుంది. అవి కొన్నవే ఇవాళ సాయంత్రం ముగ్గురం సరదాగా ఏ రామకృష్ణ మఠ్‌కో వెళ్దామనుకొన్నాను. కాని; అనుకోకుండా ఇక్కడుంటే ఆంధ్రమహిళా సంఘం ఇవాళే మీటింగ్ పెట్టింది — నేను సెక్రటరీని తప్పదు వెళ్ళాలి. కారు వొస్తుంది మీరిద్దరూ ఎక్కడికన్నా వెళ్లరాదూ.''

''చూద్దాం సాయంత్రంకదా!'' లేచి బేసిన్‌లో చేతిని కడుక్కుంటూ అన్నాను.

★ ★ ★

రాత్రి మేమిద్దరం విక్టోరియా మెమోరియల్నీ, అబ్జర్వేటరీ షోనీ చూసుకొని వొచ్చేసరికి రాత్రి ఎనిమిదైంది. అప్పుడే అన్నయ్య వొచ్చేడు. శేఖర్ మా కంటే ముందే భోంచేసి రేడియోగ్రాం రూంలో పడుకొన్నాడు.

భోజనాలయేక మేం ముగ్గురం డ్రాయింగ్ రూంలో కూర్చున్నాం.

అన్నయ్య సిగరెట్ వెలిగించి ''మరదల్నీ పిల్లల్నీ తీసుకు రావలిసిందిరా, సరదాగా సిటీ చూద్దురుకదా'' అన్నాడు.

''అనుకోకుండా బయలుదేరేను...శేఖర్‌కి ఈమధ్య ఓ వారం వొంట్లో బాగోలేదు. అనారోగ్యం ఏమీకాదు. మీకోసం బెంగపెట్టుకున్నాడు. ఎప్పుడూ మీ గురించే ఆలోచిస్తుంటాడు. పోనీ వోసారి చూపించి తీసుకొద్దామని ఇలా తీసుకొచ్చేను...దానికేం గాని . మీరు ససేమిరా పిల్లల్ని పట్టించుకోమంటే ఎలారా'' అన్నాను.

''అదేవిట్రా మరీ అలా పట్టించుకోడం లేదంటావ్ !! ఇంకా ఏం చేయాలి చెప్పు! ఆ మధ్య వొచ్చినప్పుడూ సూచావా బాగా ఇదే అన్నావు. వుత్తరాల్లో సరేసరి. సరే నీకిలా కాదు చెప్పడం—ఉండు!'' అంటూ బెడ్‌రూంలోకి వెళ్ళి ఐరన్ సేఫ్‌లోంచి వో మూడు పాస్ బుక్కుల్ని తెచ్చి నా ముందర టేబుల్‌పై పెడుతూ ''వాటిని చూడు. విడివిడిగా ముగ్గురిపేరా నెల నెలా ఎంత డిపోజిట్ చేస్తున్నానో! ఇది కాక తాడికొండకి నెల నెలా ఎంత కడుతున్నానో నీకు తెలీంది కాదు. ఆ వూర్లోనేవున్న నా బావమరిదిక్కూడా సెలవుల్లో వాడిని చూసేందుకు వేరే పంపిస్తున్నాను. ఇక మా మావయ్యగారికికూడా అంటే ఇంకా బొడ్డూడని పిల్లక్కూడా నేను డబ్బు పంపిస్తున్నాను. మరి నీకు ఏదో రీతిగా సర్దుబాటు చేస్తూనే వున్నానుకదా ! ఏం ఇంతకన్నా ఏ తండ్రి తన సంతానానికి ఖర్చుచేస్తాడో చెప్పూ. ఇంతకీ నీ వదినక్కూడా యీ క్షణందాకా చెప్పని వో సీక్రెట్ నువ్వు విన్నావంటే అదిరిపోతావ్ — నువ్వంత ఇదిగా రెట్టించి రెట్టించి ఆ మాట అంటున్నావని చెప్తున్నా విను—సరిగ్గా పన్నెండేళ్ళనుంచీ నా జీతంలో నయాపైసా నాకు గాని ఇంటికి గాని ఖర్చుచేసి యెఱగనంటే నమ్ముతావా? అందులో ప్రతి పైసా పిల్లలకోసం పంపీ, డిపాజిట్‌చేసీ — నేనేం అఘోరించినా ఈ నా ఇంటికేం చేసినా నేను కతికే నాతాల్తోనే అఘోరిస్తున్నాను?!'' అన్నాడు అయిపోతున్న సిగరెట్‌తో మరోదాన్ని వెలిగిస్తూ.

''అలా విపరీతార్థాలుతీస్తే నేనేంచెప్పగలను కాని, కుర్రాడు మీకోసం పడే ఆరాటం కళ్ళారా చూస్తున్నాను గాబట్టి అలా అనకుండా ఉండలేకపోతున్నాను.''

''మీ మాటలకి అడ్డొస్తున్నానుగాని — చిన్నాయనగారూ మీరేవిటో అలా ఏవేవో చెప్తున్నారుగాని రాజీ హాయిగా వుండటం లేదుటండీ?! చిన్న గుంటముండ విజ్జీ హేపీగా మా డాడీ దగ్గిర వుండటం లేదుటండీ?! వాళ్ళు బెంగపడ్డట్టు వొక్క లెటరు నేనే నాడూ కళ్ళచూడలేదు ... అయినా మాకు మాత్రం వుండదూ పిల్లలు దగ్గిరుండాలని! కాని, ఎలా?! ఈ మీ అన్నయ్య మాయదారి వుద్యోగంవల్ల పిల్లి పిల్లల్ని పెట్టి ఇల్లిల్లూ తిప్పిందన్నట్టు అవుతోంది. పైగా ఈ మహాపట్నాల్లో దినదినానికీ వాళ్ళరాకకోసం పోకకోసం పడే నరకంకన్నా దూరంగావున్నా మీ దగ్గరా మీ దగ్గరా వుంటేనే క్షేమంగా వుంటారన్న ధీమాకొద్దీ కన్నతీపి చంపుకొని పెట్టుకోవాల్సి వచ్చింది'' అని వదినగారు అంటుండగానే అన్నయ్య—

''నువ్వూరుకో సరూ...అసలు నీ హెల్త్ కోపరేట్‌చేయదు. నువ్వెళ్ళి పడుకో ముందర...ఈ మాటల్లో మరిచేపోయేను చూడు ఆ ఫ్రిజ్‌లో నిన్న ఆ కాన్టినెంటల్ హోటల్ సేట్జీ నీకు ప్రెజంట్ చేసేడు కదా ఆ జాడీ ఇలా తీసుకురా'' అన్నాడు.

''ఆవిడను పొమ్మంటావెందుకు ? ఉండనీ .. ఆవిడన్నదీ రైటేగాని; రాజీ వుంటున్నది — సైకాలజీలో ప్రత్యేకంగా తర్ఫీదు పొందిన మాష్టర్ల కుటుంబాల మధ్యలోనూ; సమవయస్కులైన పిల్లల మధ్యాను. పైగా నా దృష్టిలో వాళ్ళు కూడా నాలాగే మీకు వుత్తరాలు రాసివుండాలి. రాసి రాసి మానేసేనా వుండాలి! లేదా - తల్లిదండ్రుల్ని మరిపించే వాత్సల్యాన్ని చూపేవారో; అథవా అసలు కుర్రాళ్ళ మెంటాలిటీని కేర్‌చేయని వాళ్ళో అయివుండాలి. ఇంతకీ రాజీ, శేఖర్‌లు అన్నదమ్ములేగాని వొకే మనస్తత్వంగలవాళ్ళు కావాలని లేదుగా !

నేను కేవలం శేఖర్ గురించే చెప్తున్నాను. వాడి ప్రతి కదలికా ప్రతిమాటా సాకల్యంగా అవగాహన చేసుకొనే చెప్తున్నా.

వాడికి నువ్వనే డబ్బు కాదు కావల్సింది. నాన్న చూపే అభిమానం, ఆదరణా; నాన్న చేసే బుజ్జగింపూ; నాన్నపిలుపూ కావాలి వాడికి! కనీసం నీ వాత్సల్యపూరిత సంబోధనతోవున్న వుత్తరం ముక్కైనాసరే, వాడు అత్యంత సంతృప్తితో స్వీకరిస్తాడు. వాడికి కావలసింది, వదినగారు అన్న లేక అనుకొంటున్న పోషణా రక్షణా మాత్రమే కాదు. తల్లిని 'అమ్మా' అని పిలుచుకోడం; తల్లిని వాటేసుకొని ఆమెవొడిలో ఆదమరచి నిదురబోవడం; తల్లిఅందించే అనుక్షణానురాగం—ఇవీ వాడికి కావాలి !

తోబుట్టువులు అనురాగంతో తిట్టే తిట్లకీ మమకారంతో కొట్టే కొట్లకీ ఆ పసిహృదయం వేసారిపోతోందంటే మీ కర్థం అవుతుందా అని?!'' ఆవేశంతో ఇంకా ఏం మాట్లాడేస్తానో అని తమాయించుకొంటూ ఎదురుగ వున్న అన్నయ్య సిగరెట్ పెట్టెతీసి సిగరెట్ వెలిగించేను.

''అసలు వాళ్ళిద్దరికీ కష్టంగా వున్నప్పుడు మీరు మరీను ! ఆతాడికొండవాళ్ళంటే ఇన్కమ్ గురించి ఏదో కొత్తరూల్‌పెట్టేరు గాని ఇంక స్టేట్ అంతా గొడ్డుపోయిందిటండీ? అక్కడెక్క..''

''వదినగారూ మీరా మాటంటే నేనొప్పుకోను. ముందా మాట విత్డ్రాకండి...కష్టం ఏవిటి కష్టం ?! నేనలా కలలో కూడా అనుకోలేదు. నాకొడుకొకటీ శేఖరొకటి కాదు నాకు. అయినా నేనెందుకు కష్టమనాలి? వో చిల్లిగవ్వైనా వాడికి నే పెడ్తున్నానా యేం ? ఇవాళదాకా వాడికోసం మీరు పంపిన మొత్తంలో వాడి చదువు ఖర్చు పోనూ ఇంకా మూడువేల పైచిలుకు బ్యాంకులో మూలుగుతూ వుండగా నాకు ఇంకా కష్టమేవిటి ?! ... మీ అంతరాంతరాల్లో అంటుకుపోయిన అభిప్రాయం నా కర్థంకాక కాదు ! 'వాళ్ళిద్దరికీ' అంటున్నారు. ఇక్కడ ఏదో నా భార్యని మీరు వేలు పెట్టి చూపేరని నేనేదో వెనకేసుకొస్తున్నాననో, లేచిపడుతున్నా

నవో మీరనుకోవద్దని ప్రార్థన! నా భార్య గురించి నేను కాదు చెప్పాల్సింది. వెళ్ళి ఆ పడుకొని కలలుగంటున్న శేఖర్‌ని లేపి అడగండి!...మీరు వినలేరు! ఊహించలేరు!...మీరు నన్నంతగా గాయపరిచేరు గాబట్టి, నేనొక్కటంటే వొక్క మాట—మిమ్మల్ని గాయపరచడానికే అనుకోండి; మీకు అర్థం చేయించే తపనవల్లే అనుకోండి అంటున్నాను మన్నించండి ? !

నిన్నటి రోజుకు మీ జీవితంలోవున్న ప్రత్యేకత మీకు మరపు రాలేదుగాని; మొన్నటి రోజుకువున్న విలువ ఏది ఈ క్షణానికూడా మీకు గుర్తు వొచ్చిందా అని ? ! ..."

"ఏయ్ సరూ. ఏవిఁటి చెప్పు ఆ మాటలు? వూరికే ఆలోచనా పాలోచనా లేకుండా అనేయడం, ఏడవడమూను!.. ఊఁ నువ్వు వెళ్ళి పడుకో! ప్లీజ్ వెళ్ళు సరూ" అంటూ అన్నయ్య ఆవిడ చేతిలోని జాడీని కప్పునీ అందుకొని టేబుల్‌మీద పెట్టి; ఆవిడ బుజాలపై చేతులునేసి "ఏవిఁటి సరూ చెప్పుంటే, ముందుకళ్ళుతుడచుకొని వాడికి సారీ చెప్పి వెళ్ళు. ప్లీజ్ నాకోసం" అన్నాడు.

నాకు చిటపటలాడిపోతోంది ఎలా నిగ్రహించుకున్నానో నాకే తెలీదు! "అదేవిఁటి ఆవిడ నాకు సారీ చెప్పడమేవిఁటి తల్లిలాంటివారు! అయినా నన్నంత చనువుగా మాట అనేవా రెవరుంటారు?...నేనొప్పుకోను"అన్నాను ఏష్‌ట్రేలో సిగరెట్‌నినొక్కుతూ.

"ఊఁ. కూర్చోమరి. ఆ కప్పులో వాడికి వో ఐదుపళ్ళు సర్దియ్యి. ఏవిఁటో నా వున్నాంకొద్దీ ఈ వదినా మరుదుల గలాటాలో ఆ జాడీ జారి పగల్లేదు"

"అది పగిలితే మీ గుండె పగిలిపోదూ ఈపాటికి! ఆ వెంటనే నా గుండె కూడా అనుకోండి"

ముళ్ళమీద కూర్చున్నట్టుంది నాకు, యూఫోం సోఫామీదే కూర్చున్నా ఆ మాటల్ని వింటుంటే !

అన్నయ్య పెద్దగా నవ్వుతూ, ఆవిడ వెన్నుపై చేత్తో కొడుతూ "ఏం జోక్ జోకేవ్ — అవునుగాని మనిద్దరి గుండెలు పగలడం చూసిన వీడి గుండెలు ఉంటాయిటే" అన్నాడు ఇంకా నవ్వుతూ.

"నా జోక్‌కేంగాని — ముందు మీరు నవ్వకండి నా జోక్‌కి డోక్‌గలరు" అంటూ పళ్ళు తేలుతున్న కప్పుని నా ముందుంచి; బెడ్‌రూంవైపు వెళ్ళేరు.

"అబ్బబ్బా-జోక్‌మీద జోక్‌వేసి చంపకే."

"మరి నీకో! — అసలివేవిఁటో చెప్పనేలేదు" అన్నాను. కప్పు క్రిందనున్న పొడుగాటి హేండిల్‌ని పట్టుకొని నోట్లోకి వో పండు పోనిస్తూ.

"నాకా — ఇప్పుడు మీ వదిన జోక్‌మీద జోక్ ఎందుకు వేసిందో తెలుసా, నోటి వాసనబట్టి! ఇందాకా ఇంటికొస్తుండగానే వో నాలుగౌన్సులు బిగించేను. ఇప్పుడీ పళ్ళు పడితే యింక నేను కంట్రోల్లో వుండను. అవి కూడా తీసుకో. ఈ మాత్రం తింటే ఏంచేయవు. కాస్తంత మైల్డ్‌గా వుంటుందంతే మరి నాలుగైదు పడితేగాని ఏం రంజుండదు. వాటికి 'ద్రాక్షాసవంలో నానేసిన ఆలివ్ పళ్ళు' అని అనువాదం చేసుకోవచ్చు గాని అంతా ఫారిన్ ఇంపోర్ట్! జపాన్‌మేడ్! అక్కడి ఆడంగులు తెగ మోజుపడి గుటుక్కు గుటుక్కుమని వీటిని మింగుతారట!

ఒరే నువ్వేం అనుకో, అంటే ఐమీన్ నువ్వేం అనుకున్నా నన్ను మాత్రం పల్లెత్తుమాట అనకూ అని నా అభిప్రాయం కేవలం విను ...

లైఫ్‌ని ఎవరికోసమో రూయిన్ చేసుకోడం ఉత్తినాన్సెన్స్! ఇటీజ్ మై పోలసీ. కనీసం ఫేమిలీకోసం కూడా నా లైఫ్‌నీ, నా ఆనందాన్నీ నేను శాక్రిఫైస్ చేయను. ఇటీజ్ మై డిటర్మినేషన్! అసలెవడన్నా ఎందుకు చేసుకోవాలంటాను? ఈ విలువైన జీవితాన్నీ,' ఈ అంతులేని అభిరుచుల్నీ వీలైనంతగా బ్రతికున్నంతకాలం అనుభవించక ఎవరికోసమో ఎందుకు మానుకోవాలి? నాకు తెలుసు. నీ దృష్టిలో లైఫ్ విలువ వేరని. కాని నాదృష్టి నాదే అలా అని నన్నానుకొన్న వారెవ్వరికీ నేను అన్యాయం చేసి నేను పాయసాలు త్రాగడం లేదు. పైగా మరో ముఖ్య విషయం. నావల్లా, నా బలహీనతల వల్లా నన్నానుకొన్నవారు పాడైపోడం నేను టాలరేట్ చేయలేను. ఇందాకా నీవన్న పాయింట్ దగ్గిరికే వొస్తున్నా నా పిల్లలు నా దగ్గరే వుంటే అంటే ఈ పొల్యూటెడ్ ఎన్విరాన్మెంట్ లోనే వుంటే ఇక వాళ్ళ గతి చెప్పక్కరలేదు. అందుకే దూరంగా ఎంతో దూరంగా వుంచేను

నిజంగా నేను మనస్సాక్షిగా చెప్తున్నా. నాదీ నీదీ వొకే రక్తం. వొక్కొక్క అర్ధరాత్రి నా పిల్లల మమతలకోసం, నా పిల్లల చేతితాకిడి కోసం నేనెంత విల విలలాడిపోతానో నాకే తెలీదు కాని, ఇలా అనుకొనే క్షణకాలాల్ని నేను కోరుంటే బలవంతంగా దూరం చేసుకొన్నాను, ఈ నా తీయని అందాల జీవితంపై నాకున్న మక్కువకొద్దీ !

ఇక్కడ మరో సంగతి తడవాల్సి వుంది మరేం లేదు. నీ మనస్తత్వానికి తగిన భార్య నీకు జతపడినట్లే నా మెంటాలిటీతో సరిగా ఏకీభవించే భార్య నాకు దక్కింది.

ప్లీజ్. ఈ నా మాటల్లో వొక్క అక్షరాన్ని కూడా నువ్వు కామెంట్ చేయకు. ఇదంతా స్పృహతోనే మాట్లాడుతున్నా. నా మోతాదు ఐదున్నరౌన్సులు.

అదేవిఁటింకా రెండు పళ్ళు మిగిల్చేవు నిజంగానే ఎనిమిది దాటేదాకా ఏం చేయవు. నువ్వసలు నోరు మెదపకుండా వాటిని నోట్లో పడేసుకు చప్పరిస్తూ హాయిగా వెళ్ళిపడుకో" అని లేచి; మరో రెండు మాటలు చెప్పాల్సివుంది.

''నాకు పిల్లలపై మనసులాగా ఈ సీరెండ వెచ్చందనాలపై నువ్వెప్పుడు మనసుపడినా ఎలాంటి అరమరికా లేక రా, నాకు సంతృప్తి కల్గించు. అలాగే ఇందాకా ఏదో ఎకౌంట్ చెప్పేవు ... ఇంటికి వెళ్ళిన వెంటనే ఆ డిపాజిట్‌ను విత్‌డ్రా చేయి. ఇక నా కెప్పుడూ ఆ రకంగా బాధని కలిగించకు.. ఎస్...ఇంక నే చెప్పేదేం లేదు. వెళ్ళి పడుకో'' అంటూ బెడ్‌రూంలోకి వెళ్ళేడు.

కప్పులోవున్న వైన్‌తోబాటు రెండింటిని నోట్లో ఒక్కసారి పోసేసుకొని, బెడ్డింగు తీసుకొని పైకి అంతస్థు పైకి పోయేను. కలకత్తా వస్తే అక్కడే పడుకోడం నా అలవాటు.

వెన్నెల, కలకత్తా అందాలికి మెఱుగులు దిద్దుతోంది. దూరంగా ఆవైపు లీలగా కన్పించే హౌరా బ్రిడ్జినీ మెలికలు తిరిగిన నదినీ; ఈవైపు సుస్పష్టంగా కనిపిస్తున్న విక్టోరియా మెమోరియల్‌నీ; దిగూగా రోడ్లపై అర్ధరాత్రి అవుతున్నా ఆగని జన ప్రవాహాన్నీ వాహనాల్నీ చూస్తూ నిల్చున్నా, సిగరెట్ పొగల్ని వెన్నెల్లో కలుపుతూ.

''నాన్నా ! మనం ఎప్పుడు ఇంటికి వెళ్ళిపోదామండీ.''

త్రుళ్ళిపడి వెనక్కి తిరిగేను. శేఖర్ ? ! ''ఏం నాన్నా. దా. ఇంకా పడుకో లేదా?'' అన్నాను దగ్గిరకి తీసుకొంటూ.

''ఇప్పుడే తెలివి వొచ్చింది. మీరు స్వెట్టర్ మర్చిపోయేరని తెచ్చేను.''

''అరినీ. అయితే ఇంతసేపూ నాన్నా, నేనూ మాట్లాడుకొన్నవి విన్నావా ?''

''లేదండీ. ఎందుకో ఇప్పుడే తెలివి వచ్చింది... రేపు ఇంటికి వెళ్ళిపోదాం.''

''అదేవిటి నేనింకా నాలుగు రోజులు సెలవుపెట్టివొచ్చేను. ఇండియన్ మ్యూజియం, బాలవిహార్, బొటానికల్ గార్డెన్స్ ఇంకా ఎన్నో చూడద్దూ ? !''

''ఈసారి తమ్ముడూ వాళ్ళతో వొచ్చినప్పుడు చూద్దాం. ఇంటికి వెళ్లిపోదాం.'' అటు చూస్తూ అన్నాడు.

''సరే. నీ యిష్టం. వెళ్ళిపోదాం రేపే. వెళ్ళిపడుకో.''

''నేనూ ఇక్కడే మీ దగ్గిర పడుకొంటాను.''

''అరి రాస్కెల్! అదా సంగతి. దా. మరేం ఇవాళనుంచీ నువ్వు నన్ను 'మీరు' అనిగాని 'అండీ' అనిగాని పిలవకూడదు. తెలిసిందా!'' అన్నాను పక్కమీద పడుకొన్న వాడిమీద చెయ్యేసి పడుకొంటూ.

వాడి శరీరం నుంచి శ్రీనాథుడి శరీర స్పర్శ నా శరీరంలోకి వెన్నెలకన్నా నున్నగా సుతిమెత్తగా ప్రసరిస్తోంది !

వి క ట క వి

డా. తంగిరాల

గురజాడ అకవి
 రాయప్రోలు సుకవి
తుమ్మల కాంగ్రెసు కవి
విశ్వనాథ ఆరెస్సెసు కవి
కృష్ణశాస్త్రి బ్రహ్మసమాజ కవి
శ్రీశ్రీ సమసమాజ కవి
పఠాభి ఫ్రాయిడ్ కవి
ఆరుద్ర బఫూన్ కవి
తిలక్ కుందుర్తులు సోషలిస్టులు
దిగంబరులు అనార్కిస్టులు
విరసంవారు నక్సలైట్లు
అరసంవారు అపర్యూనిస్టులు
దాశరథి సర్కారుకవి
సినారె సినిమాకవి
శేషేంద్ర జనతాకవి
(ద్వంద్వ సభ్యత్వం చర్చనీయాంశం)
కొందరు కవులు ఆత్మకవులు
మరికొందరు అయోమయం కవులు
'ఛ ఛ నేను ఏదీ కాదు' అన్నకవి
నిజంగా వికటకవి !

ఈ జీవిత దర్పణంలో

శ్రీ మాదిరాజు రంగారావు

నా ముందు వెలిగే దీపం ప్రార్థిస్తూంది
నా కోసమని ఆకాశంవైపు చూచి.

రివ్వున కెవ్వున వీచే వాయు రూపాల్లో
ముక్కలు ముక్కలుగా సంగీత చిత్రాలు.

నిశ్శబ్దంనుండి శబ్దం ఒక్కమారు వచ్చేను.
శబ్దం తీరాన నిశ్శబ్దం శయించి ఉండేను

మనసుతో మొదలైన ప్రాణి జీవితం
మనసులో పొరలో యుగాల సంచయం.

కళ్ళలో చూపులో ఊహలో నిశ్శబ్దం
గుండెలో శ్వాసలో వర్తనంలో శబ్దం.

బ్రతుకులో గాథలో నిశ్శబ్ద ప్రపంచం
కణ కణంలో ప్రవాహంగా మృదు శబ్దం.

నిశ్శబ్దం నాలో శక్తికి నిలయం
శబ్దం నాలో యానానికి చరణం.

ఈ నేల, సమయం ఎవరి సొత్తు!
ఈ ఊహ, బ్రతుకూ మనది! ఔనా!

చీకటి మొలుస్తుంది మరపు దారుల్లో
సూర్యుడు నిలుస్తాడు తెలివి వంపుల్లో

క్షణాల గాజు ముక్కలపై కాంతి ప్రసారం
స్మరింపజేయు ఊహలతో జీవిత చిత్రం!

వేటకై పట్టుక పోయిన తుపాకి పైన
పక్షి వ్రాలేను క్రమించి గగనం, క్షణాన.

ఆదర్శంఉందే! నిజంగా అద్దం వంటిదే
ఎంతో భద్రంగా ప్రవర్తిస్తేనే! జీవితం!

అన్యాయం అంతం చేసే అహంకార వర్తులే
చీకట్లో మార్గం చూసేను తేజోఽగ్ని మూర్తులై

రావాలి సంక్షోభంనుండి ఆర్తినుండి
ఆర్ద్రాంచలం, సౌభాగ్యం వహించినేడు!

మనం ఈ జన్మ గురించి ఎంత విసిగినా
అవశ్యం! తప్పదు! దీని నిష్కృతికి ఇదే!

పీడనుండి పీడకు బాధ నుండి బాధకు
జీవితం! మనస్సు శిలాగణాలు చెక్కుతూ.

గొంతెత్తి ప్రబోధించేరు యుగాలుగా ఎందరో
అన్నీ తలపైనుండే తరలేను ఏమూలకో!

మనిషి జన్మించడంతోనే మృత్యువు బెదిరింపు
క్షణ క్షణం! జీవితం నిల్పే శక్తులు మనచుట్టు!

కాలం ఎప్పడైనా మనందరికీ సమానం
బింబించేప్పుడువేరు! జీవిత దర్పణంలో!

అందరిలో ఉంటుంది విత్తిన బీజం
కొందరిలో వచ్చేను పూలు, ఫలాలూ,

నేలదున్ని దిక్కులు చూస్తూ నిల్చే
రైతు కళ్ళలో కదలే మేఘాలు!

ఎంత దూరమయినా కదలేను
ఊతగా గొని మనస్సును కాలం!

ఉదయం విసరిన నవ్వు వలయై —
నిలిపేను మనసు పై కెగురకుండా

ప్రవహిస్తుంది ఒక్కొక్క ఉషస్సు
ఎదలో తృష్ణ తీర్చే సెలయేరై

నిలిపేస్తుంది ఒక్కొక్క ఉషస్సు
శిలయై నిల్చి! లేచేవరకల్లా!

నిశ ఎంత భయదమైతేనేం?
ఇది లేంది ఉదయమేరాదు!

ప్రభాతం ఎంత ఇష్టమైతేనేం !
అవశ్యం ఉంది దీనికీ అంతం !

జీవితంపై ప్రీతి ప్రాణికి సహజం
అందుకే ఈ చావడం ప్రతి పదమూ !

వెలుగులో దాహం తీర్చుకొనే
సృజన రూపం నాలో ఒకటై

నేనెపుడూ ఆనంద రూపాన్నే
కాదు విషాదం చిందు ఆకాశం !

నీవు చెవిపై విసరు మాటకు బదులుగా
నేను ఎదలో పలుకు మాటలు తలచుకో !

స్వప్నాంచలాల నుండి ఇటురా ! శిలల్లోకి
తీరాలు పొంగి నేల తరిగే నదుల్లోకి !

నీ ముఖాన్ని చూచుకో కాస్త అద్దంలో
రోజు రోజుకీ జ్వలించే మహాకాలం !

ముఖం కన్పిస్తుందని ఎదురుగాఉన్న అద్దంలో
విభిన్నంచేసే మనిషి, మతిలో అగ్నిరూపంతో.

కాలం గడచిపోతూంది వయసు తెలీకుండా
చూచేసమయమే లేదు మనసుకు అద్దంలో.

మనిషి ముఖం చూడు దగ్గరినుండి పరీక్షగా
అమరికలో ఎన్ని లోయలు ! చీకటి చిమ్ముతూ

ఆశల అంచలాలలో కదలేను జీవితం
స్వప్న పదాల పంక్తిపై ప్రసరించు ఊహతో.

ఆరిపోయేను ఆయువు వత్తివలె వెలిగే
స్వప్నమై, నేలపై దిశలందు ఎదపరచీ.

హత్తుతూ ప్రపంచాన్ని ఎదనిండ, గాలి !
జ్ఞాపకాల మబ్బుల్ని పయనింపజేస్తూ !

ఈ జీవిత చిత్రం ముగిసేది కాదెపుడు
ఉంటుంది క్షణంలో మిగిలే ఏదో ఒకటి !

నీతి కథ

దిలావర్

వురేయ్ బ్రదర్ !
ఎముకలు మెడలో వేసుకుంటే చాలు
మాంసం తినకున్నా పర్వాలేదు.
పై మెరుగుల యీ లోకంలో
నీతీ నిజాయితీలకు విలువేలేదు.
భ్రమల మరీచికల్ని చూచి
వాస్తవాల వీచిక లనుకుంటున్నాయి
(అవి) నీతి చంద్రికలోని అసితాననాలు !
'అర్థం-పరమార్థం' లేని
వ్యర్థహితా హిత బోధచేసి
అనర్థం తెచ్చుకోకు శశంలా—అదే పదివేలు !
కొసా మొదలూ తెలియని కోతులు
మిణుగురుల్ని పోగుచేసి వూదుత్తూ
వాటినే విప్లవ జ్వాలలని వర్ణిస్తుంటే
నీ మనసులో ఎగిసే దావాగ్నిని
నీ గుండెలో మండే బడబాగ్నిని
అనామకంగానే అణచుకో !
లేకుంటే నీతి కథను మరోసారి తలచుకో !

స్వర్గీయ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

గిడుగు రామమూర్తి పంతులుగారు

[తెలుగు నేలమీద వ్యావహారిక భాషోద్యమం ప్రారంభమై డబ్బై యేళ్ళయింది. 1980 ఏప్రిల్ 26, 27 తేదీలలో ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వ్యావహారిక భాషోద్యమానికి సప్తతి పూర్తి ఉత్సవం వైభవంగా జరిగింది. వ్యావహారిక భాష పేరెత్తితే మొట్టమొదట ఆ ఉద్యమ జనకుడైన ''గిడుగు పిడుగు'' పేరు స్ఫురించందెవరికైనా.

సుప్రసిద్ధ కథకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఆదిలో గ్రాంథిక భాషలో రచనలుచేసినా గిడుగు, గురజాడల వ్యావహారిక భాషావాదంలోని మంచిని గ్రహించి, జీవితాంతం జీవద్భాషయైన వ్యావహారికంలోనే తమ సర్వరచనలనూ సాగించి, గిడుగు గురజాడలకు నిజమైన వారసులనిపించుకున్నారు. అనిపించుకోవడమేకాదు 'శ్రీపాదవారిదే అసలు సిసలైన వ్యావహారికం' అనీ ''ఆధునికాంధ్రమున వాడుక భాషను నిర్మించిన కొలది మందిలో మొదటి కరు .... సర్వథా తమరివంటి యథాంధ్రవ్యావహారిక భాషా నిర్మాతృగణ ప్రథమ గణనీయులు'' అనే గ్రాంథికవాదులైన విశ్వనాథ ప్రశంసలు కూడా పొందారు శ్రీపాద.

గిడుగువారియెడ తమ భక్తిగౌరవాలను వెల్లడిస్తూ శ్రీపాదవారు సుమారు ఏభైయేళ్ళ క్రితం వ్యాసం వ్రాసి 'మీగడతరకలు' శీర్షికతో 'భారతి'లో ప్రకటించారు. దానితో తృప్తిపడక, తమ 'ప్రబుద్ధాంధ్ర' [1935 డిసెంబరు సంచిక]లో గిడుగువారితో జరిపిన ఇంటర్వ్యూని ''రామమూర్తి పంతులుగారితో 36 గంటలు'' అనే ముఖాముఖీ ప్రకటించారు.

గిడుగు రామమూర్తి పంతులుగారు 1940లో స్వర్గస్థులైనప్పుడు శ్రీపాదవారు వ్రాసిన వ్యాసం ఒకటి వారి వ్రాతప్రతుల్లో నాకు ఇటీవల లభించింది. వ్యావహారిక భాషోద్యమానికి సప్తతి పూర్త్యుత్సవం జరుగుతున్న ఈ శుభసమయంలో ఆ ఉద్యమ నాయకుడైన గిడుగు వారిని సంస్మరించుకోవడంకోసం శ్రీపాదవారి ఈ అముద్రిత వ్యాసాన్ని 'భారతి' ద్వారా అందజేయడానికి ఎంతో ఆనందిస్తున్నాను.

— డాక్టర్ చామర్తి కనకయ్య]

పత్రికలు పెద్దక్షరాలతో ప్రకటించాయి.

ఢిల్లీ రేడియో కేంద్రం ముక్తకంఠంతో చెప్పింది.

ఎరిగున్నవారందరూ ఖిన్నులై ''అయ్యో'' అంటూ రుద్ధ కంఠులయిపోయారు.

ఎన్నో సభలు విషాద గీతాలు పాడాయి

ఆ కుటుంబం కూడా వెలవెలపోతూనే వుంది.

ఇలాగ యెటుచూసినా అంతా అయిపోయిందనే ధృవపడి పోతోంది; కాని రామమూర్తి పంతులుగారు చనిపోయారన్నమాట మట్టుకు కేవలమూ ప్రవాద అన్నట్టుంది.

రూఢివార్త కాదనే అనిపిస్తోంది.

ఎంచేతనంటే ?

జరాభర జర్జరితమైన ఆ ఆజానుబాహుమూర్తి అదిగో కనిపిస్తూనే వుంది.

ప్రసన్న గంభీరమైన ఆ ముఖం అదిగో హృదయ దౌర్బల్యాంధకార పటలం ఛిన్నాభిన్నం చేసేస్తూనే వుంది.

విద్యుత్వంతాలయిన ఆ నేత్రాలు అవిగో వాత్సల్యామృతం కురిసేస్తూనే, వున్నాయి.

పులిపంజావంటి ఆ అభయహస్తం అదిగో వృద్ధజంబుక సిద్ధాంతాలను ప్రతిఘటించగల నవశక్తి సంఘటిస్తూనే వుంది.

మేఘ గంభీర నిర్ఘోషమైన ఆ జంభోరాకంఠం అదిగో ''రాయవోయ్! కలం నిలపకోయ్! నువ్వు వాడిన భాషను ఆశ్రయించి నిఘంటువులూ వ్యాకరణ సూత్రాలూ తయారుచేసుకుని తరించవలసిన పండితులు నిన్నేం చెయ్యగలరోయ్, నాయనా, రాసెయ్యవోయ్'' అని ప్రోత్సాహపరుస్తూనే వుంది.

అయితే, యికవున్న చిక్కల్లా యేమిటంటే?

ఒక్కమాటు కళ్ళు కద్దుకుందామంటే ఆ పాదపద్మాలంటడం యిక శక్యంకాదు.

ఒక్కమాటు నిలువునా కరిగిపోదామంటే ఆ బాహుబంధంలో యిమడడం యిక సాధ్యంకాదు.

ఇలాగ, రామమూర్తి పంతులుగారు, మనకి, పోయిన్నీ వున్నవారూ, వుండిన్నీ లేనివారూ అయిపోయారు.

వారికీ మనకీ మధ్య శాశ్వతంగా వొక తెర అల్లుకుపోయింది.

నిజానికది మంచుతెరకంటే మృదుల మృదులమే; కాని దుర్భేద్యం.

దోమ తెరకంటే విరళ విరళమే; కాని దుష్ప్రవేశ్యం.

కాగా, పాడుగాటి ఆ చేతికఱ్ఱ ఆసరాతో, మన కళ్ళయెదట వారలా నుంచున్నట్టే వుంటారు.

ఇసక పాతర తవ్వుతువ్వట్టు వొకదానిమీద వొకటి చొప్పున శబ్దస్వరూపాలు చెబుతున్నట్టే వుంటారు.

''ఊఁ? విన్నారా?'' అని హెచ్చరిస్తున్నట్టే వుంటారు.

చెవులుండిన్నీ లేకపోవడంవల్ల, మనంచెప్పేది, ఆ నిశిత దృష్టితో ఆకళించేసుకుంటున్నట్టే వుంటారు.

అంతే.

ఇది మృతజీవుల లక్షణం.

2

రామమూర్తి పంతులుగారి పట్టభద్రత సర్వజనవిదితమే; కాని దానివల్ల వారు చెయ్యవలసిన పనికి అట్టే ప్రయోజనం కలగ లేదు.

కాలేజీలో వారనేకమందికి చరిత్ర బోధించారు; అదీ వారి పనికి తగినంత సాయపడలేదు.

ఇలాగ చాలాకాలం శిక్షాపూర్వకంగా వారు ఆర్జించుకున్న విద్వత్తు చాలా భాగం నిరర్థకమై, మళ్ళీ అక్షరారంభం చెయ్యవలసి వచ్చింది.

ఇంతేకాదు.

తాము చెయ్యవలసిన పనేమిటో—దేనివల్ల తమ జీవితానికి సాఫల్యం కలుగుతుందో అదయినా వారికి ఉత్తర వయస్సు ప్రారంభం అవుతుందన్నప్పటిదాకా అవగతమే కాలేదు.

మొత్తానికి, వారి ప్రారంభ జీవితమేకాక, జీవిత మధ్యకాలం కూడా వ్యర్థంగానే గడిచిపోయింది.

అలాకాక, ఆదిలోనే వారు భాషా సంస్కారానికి పూనుకొని వుంటే యింకా యెంత పని చెయ్యగలిగి వుందురో?

మనమింకా యెంతముందుకి వెళ్ళివుందుమో?

మనకంటే ముందుగా కళ్ళు తెరిచిన్నీ ప్రవాహ పతితులై కృతకాంధ్రంలో కూరుకుపోయి వుండినవారెందరు వ్యావహారికవాదం చేపట్టి వుందురో?

ఆంధ్రభాషలో నవీన వాఙ్మయం యెంత తయారయి వుండునో?

అయితే, యిప్పుడయినా మించిపోయిందేమీలేదు.

గొప్ప పనులు జరగడానికి దీర్ఘకాలమే ఆవశ్యకంకాదు.

అర్హత కలవాడు కర్తృత్వం వహిస్తే క్షణాల్లో అంతా పూర్తిచెయ్యగలడు.

మన రామమూర్తి పంతులుగారి విషయం సరిగా యిలాగే తటస్థపడింది.

వీరేశలింగంపంతులుగారి జీవితం భాషా సంస్కర్తృకత్వంతోటే ప్రారంభం అయింది; కాని అయిన కొద్దిరోజులకే వొక్క పూపున, అది, సంఘ సంస్కర్తృకత్వంలోకి మళ్ళిపోయి, అందు లోనే వుండిపోయి, చివరికందులోనే సాఫల్యం పొందింది.

అంచేత జీవద్భాషలో వారిపేరుగా వొక గొప్ప సంప్రదాయం యేర్పడ్డానికవకాశం లేకపోయింది.

అయితే, భాష, వొక్క కావ్యప్రపంచానికే కాక భౌతిక ప్రపంచానిక్కూడా అత్యావశ్యకమే—అని నిరూపించవలసిన పరిస్థితులేర్పడి, వారు, సొంతానికిమాత్రం గిడసబారిపోయిన పూర్వవ్యాకరణ సూత్రాలను కొంతవరకూ వుల్లంఘించి పూరుకున్నారు.

తరవాత వొకరిద్దరు మంచి రచయితలే బయలుదేరారు; గాని, యేదో తోచింది రాయగలగడమేకాని, భాషలో పాండిత్యం—నిజమైన ప్రవేశం కూడా లేక, కొత్త సంప్రదాయం యేర్పరచడం వారికి సాధ్యం కాకపోయింది.

ఈ స్థితిలో మన రామమూర్తి పంతులుగారు, జబ్బ చరిచి రంగంలో వురికారు.

ఇందుకోసం, మధ్య వయస్సు గడిచిపో వచ్చిందన్న సమయంలో, వారికి తమ జీవిత సందేశం స్ఫురించింది.

వెంటనే వారు తెనుగు భాష పుట్టుపూర్వోత్తరాలను గురించి పరిశోధనలు ప్రారంభించారు.

ఇందులో విశేషం యేమిటంటే?

ఇది చేస్తూనే వారు మనకి తమ సందేశం వినిపించారు.

అప్పటికి మన జాతిలో కేవల భాషాదాస్యం ముదిరిపోయి వుంది.

తరవాత్తరవాత చేమకూర వెంకటపతివంటి కవులు ఏ వొక రిద్దరో పొడచూపినా, విజయనగర సామ్రాజ్యం అంతరించిపోయాక మన జాతిలో కవితా కళే అంతరించిపోయింది.

భౌతిక దాస్యానికి తోడు భావనాశక్తి కూడా లోపించిపోవడం వల్ల, నల్లరాళ్ళలాగ పణుగులవంటి శబ్దాలను గుట్టలు పేర్చడమూ,

ఆ పేర్చడంలోనూ మొగ్గలు వెయ్యడమూ — ఇదే కవిత్వం అనుకున్నారు మనవాళ్ళు.

చిన్నయసూరి రాకతో యిది మరీ ఘనీభవించిపోయింది.

అయితే, గాఢాంధకారం పటాపంచలు చెయ్యడానికి సూర్యకిరణాల కెంతసేపు పడుతుందీ ?

నిజమే; కాని —

ఈ సందర్భంలో మనం ప్రత్యేక శ్రద్ధతో గమనించవలసిం దొకటుంది.

అదేమిటంటే ?

నన్నయభట్టు శబ్దానుశాసకుడే కాదు, కవిన్నీ.

కాని, అతని తరవాత యింత కాలానికి బయలుదేరిన మన రామమూర్తి పంతులుగారు శబ్దానుశాసకులే. కవులుకారు.

అంచేత, రాతి పనిలో నిమగ్నులయిపోయిన మన వాళ్ళకి ''కవిత్వం అంటే యిదీ'' అని చూపించడానికి వీరేశలింగంపంతులుగారు రావలసి వచ్చింది.

వారివల్ల కూడా అది పూర్తిగా నెరవేరక ''ఆ కవితలోనూ నవ్యత యిదీ'' అని చూపించడానికి గురజాడ అప్పారావుగారు రావలసి వచ్చింది.

దీంతో నిజమైన కవిత్వమూ, నవ్య కవిత్వమూ ప్రారంభం అయినాయి.

మెల్లిగా కాదు, హుటాహుటి నడకలతోటే ప్రారంభం అయినాయి.

అయితే, మరి యీ నవకవులు అవలంబించవలసిన నిజమైన భాషా సంప్రదాయం యేమిటీ ?

ఇదొక వ్యాస ఘట్టం అయికూచుంది.

వీరేశలింగం పంతులు రు కొత్తదారి తొక్కగలిగారే కాని పూర్తిగా స్వతంత్రించలేకపోయారు.

అప్పారావుగారు స్వతంత్రించారు; గాని అతి అయిపోయారు

ఇలాగ, ఈ యిద్దరివల్లా కూడా తగిన దారి దొరక్క నవ కవులు దిగ్భ్రాంతి పడిపోయారు.

కాగా, యిది పరిష్కరించడానికి — మళ్ళీ శబ్దానుశాసనం చెయ్యడానికి మరొకరు రావలసి వచ్చింది.

ఆ మరొకరే మన రామమూర్తి పంతులుగారు.

3

సరే, యేది ప్రధానమో అది నెరవేరింది.

ఇన్నాళ్ళకి మళ్ళీ తెనుగు భాష నిజమైన సంప్రదాయం గుర్తుకి వచ్చింది.

దేని ఆశ్రయం వుంటే కవితాకళకు రాణింపు సంభవిస్తుందో ఆ జీవద్భాష మన నవ కవుల అనుభూతికి వచ్చింది.

అయితే, యింత పని చెయ్యడం—ఇంత మార్పు కలిగించడం సామాన్యులకు తరమా?

దీనివల్ల రామమూర్తి పంతులుగారి పాండిత్యం వొక మహాసముద్రం అని మనకి చెప్పనక్కర లేకుండానే తెలుస్తోంది.

అయితే, మనం వారి ఆజ్ఞను శిరసావహించామేగాని — వారి అనుయాయులం కాగలిగామేగాని, అపారమైన, వారి, ఆ పాండిత్యం మనం జాగ్రత్త చేసుకోగలిగామా ?

సరియైన నిఘంటువు లేక అనుక్షణమూ మనం అవస్థ పడుతూనే వున్నాము.

అది తయారు చెయ్యడాని కొక్క రామమూర్తి పంతులు గారికే శక్తి వుందనీ మనం తెలుసుకునే వున్నాము.

కాని, మనమా ప్రయత్నం చేసిందేదీ ?

పోనీ అంటే, రామమూర్తిపంతులుగారయినా ఈవిషయమై శ్రద్ధ చెయ్యలేకపోయారు.

శబ్ద రత్నాకరాన్ని శస్త్రం చెయ్యడంద్వారా, వారు ప్రణాళిక అంతా సిద్ధం చేసుకునే వున్నారు; కాని పని మాత్రం ప్రారంభించ లేకపోయారు.

వారు కష్టాలకు జంకేవారు కారే?

వారు కష్టాలే అనుభవించారే ?

కాక; నిఘంటు రచనకు కావలసిన సకల పరికరాలూ, శక్తి సామర్థ్యాలూ కూలంకషంగా కూడబెట్టుకనే వున్నవారికి, వాటిని కాగితం మీది కెక్కించడం వొక కష్టమే అవుతుందా?

ఏ వంచ :

రామమూర్తి పంతులుగారు పర్లాకిమిడి విడిచిపెట్టి రాజ మహేంద్రవరం ప్రవేశించాక నేను అనేక మార్లు వారి దర్శనం చేసుకున్నాను.

అనేక విషయాలు వారికి విన్నవించి, వారు సెలవిచ్చిన అనేక విషయాలు విన్నీ వున్నాను.

ఏమిటేమిటో గొడవలు వస్తూ, విస్తరిల్లుతూ, వెళ్ళిపోతూ వుండేవి.

ఆయా సందర్భాలలో వారు తరుచు నవ్యసాహిత్య పరిషత్తు మాట తెస్తూ వచ్చారు.

నాకూ నవ్య సాహిత్య పరిషత్తుకీ సంబంధం యేమీలేదని తెలిసి వుండిన్నీ, అందుకుగల హేతువు కూడా యెరిగి వుండిన్నీ, మాటిమాటికీ వారా పరిషత్తును గురించి మాట్లాడుతూ వచ్చారు.

దీనివల్ల అదంటే వారికి చాలా ప్రీతి వుండినట్టు తోచింది.

వారు దాన్ని నమ్ముకుని వుండినట్టున్నూ కనపడింది.

ప్రతిపక్షులయిన జయంతి రామయ్య పంతులుగారి చేతిలో ఆంధ్ర సాహిత్య పరిషత్తుంటే, తమ చేతిలో నవ్య సాహిత్య పరిష త్తుందని వారు దిలాసాతో వుండినట్టు కూడా స్ఫురించింది.

మొదట్లో బాగానే వుందనుకున్నాను.

కాని, నిదానించగా — జరిగిందిన్నీ చూడగా "అయ్యో" అనిపించింది

ఏమంటే ?

ఆంధ్ర సాహిత్య పరిషత్తు రామయ్య పంతులు గారిచేత సృష్టించబడింది. రామమూర్తి పంతులుగారు నవ్య సాహిత్య పరిషత్తుచేత చేరతియ్యబడ్డారు.

రామయ్య పంతులుగారు ఆంధ్ర సాహిత్య పరిషత్తును నడి పిస్తూ వున్నారు. రామమూర్తి పంతులుగారు నవ్య సాహిత్య పరి షత్తుచేత నడిపించబడ్డారు.

ముఖ్యంగా, రామమూర్తి పంతులుగారు, ఆంధ్ర సాహిత్య పరిషత్తు పక్షంగా అనేకుల సాయంతో నిఘంటువు రచించి ప్రక టించారు. అనేకులకు సాయం చెయ్యగలిగి వుండిన్నీ, చేసీవుండిన్నీ, రామమూర్తి పంతులుగారు నవ్య సాహిత్య పరిషత్తు పక్షంగా నిఘంటు కర్తలయినా కాలేకపోయారు.

ఇంతేనా ?

రామయ్య పంతులుగారి నిఘంటువు చూశాక అయినా తమ దగ్గిర సర్వ సిద్ధంగా వుండిన సాధన సామగ్రికి గ్రంధ రూపం యివ్వకపోవడమేకాక, రామమూర్తి పంతులుగారు, నవ్య సాహిత్య పరిషత్తుచేత ప్రేరేపించబడి—ప్రోత్సహించబడి—కవ్వించబడి, అనవ సరంగా, అనాలోచనగా, ఆ పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం ప్రయో గించారు.

ఇలా చేయించడంలో నవ్య సాహిత్య పరిషత్తుకి గల కారణా లేమిటో, అసలు వుద్దేశాలేమిటో, చివరికి ప్రాప్యం యేమిటో — ఈ చర్చతో నేను కలగజేసుకోను; కాని రామమూర్తి పంతులుగారు చెయ్యవలసిందేనా ఈ దుషాహసనం ?

వారి శక్తి తెలిసివుండి, వారివల్ల కొండంత ఆశించి వుండి, వారి శ్రేయస్సును కూడా కోరి వుండిన వారెవరేనా దీనికి హర్షించ గలరా ?

రామయ్య పంతులుగారి నిఘంటువు అసమగ్రం అయితే సమగ్రం అయిందెలా వుంటుందో, అది దోష భూయిష్ఠం అయితే నిర్దుష్టమయిం దెలా వుంటుందో, అది నిరుపయోగం అయితే యెలాంటిది వుపయోగకరం అవుతుందోచేసి చూపించవలసిన—కలిగిన రామమూర్తి పంతులుగారు దానిమీద విమర్శ మాత్రం ప్రకటించి వూరుకోవలసిన వారేనా ?

నవ్య సాహిత్య పరిషత్తువారి ప్రతిభ రామయ్య పంతులుగారి నిఘంటువు మీద విమర్శకాక, అలాగేనా ఖండ ఖండాలుగా అయినా రామమూర్తి పంతులుగారి నిఘంటువునే ప్రారంభించి వుంటే?

4

రామమూర్తి పంతులుగారి పాండిత్యం వొక మహాసముద్రం అని చెప్పివున్నాను

సముద్రాన్ని గురించి ఆలోచనలూ, ఆవేదనలూ ప్రారంభం అయితే యిక అంతం వుంటుందా?

కాని అంతా అయిపోయింది.

ఇప్పుడేమనుకున్నా యేమీ ప్రయోజనం లేదు.

అయితే, వారిని గురించిన మన సుమత యెలాంటిది, యెంతటిది ?

వారివల్ల సమగ్రమైన ఫలితం పొందలేకపోయినా, వారిని గురించి మనం చెయ్యవలసిందేమయినా వుందా లేదా ?

రామమూర్తి పంతులుగారి అనుయాయుల్లో తక్కిన వార యినా ఙా విషయం కొంచెం యోచించవలసివుంది.

శ్రీమతి భాగవతుల గాయత్రి

నాకూ ... నీకూ ... మధ్య

"అమ్మ...హుఁ...హుఁ...అమ్మ కావాలీ...ఊ...ఊ..."

"తెల్లవారిందీ నీకు...నోరుమూస్తావా లేదా! ...సూర్యుడు పొడవకుండా లేచి, అర్ధరాత్రి దాకా ఒకటే ఏడుపు ఎన్నాళ్ళేడుస్తావే...పగలంతా చాకిరీతో ఒళ్ళు హూనమయ్యి...కాస్త నడుం వాల్చి కునుకుపట్టే వేళకి...నీ అంకమ్మశివాలు మొదలు...దరిద్రపు దానా ... పడుకో..."

"అత్తమ్మా ... అమ్మ ... అమ్మేదీ ... అమ్మ కావాలి ... హుఁ...హుఁ..."

"......"

"ఊ...ఊఁ...అమ్మ . అమ్మ కావాలి "

"ఛఫ్, నోరు మూస్తావా లేదా? ..." నడ్డిమీద ఒక్కటి వేసిన శబ్దం నిశీధిని చీల్చుకొని ప్రక్కవాటాలో నిద్రపట్టక దొర్లుతున్న పార్వతీశంగారికి ఛెళ్ళుమని అగిలింది. ఇక పడుకోలేక లేచి నిటారుగా మంచం మధ్యని మఠంవేసుకు కూర్చుని పొడుంకాయ కోసం తలగడక్రింద వెతకసాగేరు. మళ్ళీ ఏడుపు తారస్థాయినందుకొంది. ఈసారి ఒకటికి మరి రెండు కలిపి నడ్డిమీద మద్దెల వాయిద్యం!

"ఏడవను ... అబ్బ! కొట్టకు అత్తమ్మా ... కొట్టకు ... అమ్మ వద్దు ... ఒద్దే ఒద్దు ..." నోరు బలవంతాన మూసుకొని ఏడుపుని అదిమిపెట్టి బెక్కుతున్న చప్పుడు ... ఆ తరవాత మెల్లి మెల్లిగా...తగ్గి అంతా నిశ్శబ్దం అలుముకొంది.

ఒకసారి బాగా తెలివి వచ్చేయడంతో తిరిగి నిద్రపట్టలేదు పార్వతీశంగారికి. లేచి మెల్లిగా తడుముకుంటూ 'స్విచ్చి' నొక్కి బల్లమీద బోర్లించి పెట్టిన తన చేతి గడియారాన్ని తీసి నడుస్తున్నదో లేదోనని చెవిదగ్గర పెట్టుకొని ఒక్కక్షణం టక్...టక్... శబ్దం విని అది యింకా విశ్వాసంగా పని చేస్తున్నందుకో ఏమో తృప్తిగా తలనోసారి తాటించి కళ్ళకి దగ్గిరగా పెట్టుకొని ముళ్ళు ఎక్కడున్నాయో చూసి

"అబ్బో...నాలుగవ్వస్తోందే...ఇహ లేవొచ్చు..." అనుకొని బద్ధకంగా ఒకసారి ఆవలించి, వాచీనితిరిగి యథాస్థానంలో బోర్లించి పెట్టి బల్లమీద మూలకి వ్యాస పీఠాన్ని అలంకరించి వున్న 'భగవద్గీత' నందుకొని ఈజీ ఛైర్లో మేను వాల్చేరు. కుర్చీ కింద క్రితం రాత్రి భద్రపరచిన కళ్ళజోడందుకొని కళ్ళకి తగిలించుకొని నిన్న చదివి గుర్తుపెట్టుకొన్న పేజీతీసి చదవడం మొదలుపెట్టేరు.

కానీ పుస్తకంలో కృష్ణార్జునుల రూపుకు బదులుగా మాధురి పసిడి మోహం ... ఏడుపు నడుపులో పెట్టుకొందుకామె చేస్తున్న ప్రయత్నమే గోచరించసాగేయి.

"పిచ్చిపిల్ల...ఎంత కలవరించి పోతోందో తల్లికోసం ... ఆ భగవంతుడికి దయాదాక్షిణ్యాలు లేవా? ... పసిదాన్ని కన్నవాళ్ళకి దూరంచేసి ఆమె కంటికి కడివెడుగా రోదిస్తూవుంటే ... చూసి ఆనందించేటంత 'శేడిస్టా' ఈ దేముడు?..." అనుకోకుండా చేతిలో పుస్తకం జారి ఒళ్ళోపడింది బరువుగా ... గబుక్కున దాన్ని ఎత్తి కళ్ళ కద్దుకొని తిరిగి చదవడానికి ప్రయత్నం మొదలెట్టేరు.

మస్తిష్కంలో సాగుతున్న ఆలోచనల ఒరవడికి మనసులో చదువుతున్న శ్లోకాలు మెదడు వరకూ చేరకుండానే కొట్టుకు పోతున్నాయి.

'ఇవాళ ఇక సాగదు ' అనుకొని పుస్తకంమూసి టేబుల్ మీదనున్న వ్యాస పీఠంలో పెట్టి కాలకృత్యాలు తీర్చుకొందుకి పెరట్లోకి నడిచారు.

నూతి చప్టామీద చిన్న క్రస్టూలుమీద కూర్చొని ముకుంద మాల జపిస్తూనే ఒకొక్క బాల్చీడు నీళ్ళూ తోడుకొని తలాస్నానంచేసి, చలికి ఒణుకుతున్న స్వరంతో 'గంగేచ, యమునే చైవ, గోదావరి, సరస్వతి నర్మదే సిన్ధు కావేరి, జలే స్మిన్ సన్నిధిం కురు!'

మరొక బాల్చీడు నీళ్ళు తలమీద దిమ్మరించుకుంటూ అనుకున్నారు ...

'ఈ సరిపెట్టుకోవడం అన్నది వేదాల నుంచీ వస్తున్నదే... లేకపోతే ఈ మూరుమూల త్రిశంకుస్వర్గం లాంటి పల్లెకీ పట్నానికీ మధ్యగావున్న ఈ ఊళ్ళో నూతిలో నీళ్ళు నా బుర్రమీద పడగానే మహానదీ జలాలుగా మారిపోవాలని నే కోరుకుంటే అది అత్యాశ కాదూ! .' తువ్వాలుతో నడ్డి తుడుచుకుంటూ విరక్తిగా నవ్వుకున్నారు పార్వతీశంగారు.

'ఇవాళ మెలుకువ రావడమే మాధురి ఏడుపుతో ప్రారంభించడం...రోజంతా ఇదే విధంగా సాగేలా వున్నాయి ఆలోచనలు .. ' గత నెల్లాళ్ళుగా పక్కింట్లో జరుగుతున్న రభస ఆయన మనసుని కలచి వేస్తోంది. గాంధీ మహాత్ముడన్న వాక్యం— "నా తల్లి చాలా ఏళ్ళ క్రిందటే పోయింది. కానీ అప్పటి నుండి 'గీత' అనెడి తల్లి నా ప్రక్కనవుండి నన్ను కాపాడుచున్నది. కష్టములు కలిగినప్పుడు నేనామె ఒడిలో తలదాచుకొందును." పదే పదే మననం చేసుకొని

గీతలోనే, తోడూనీడా వెతుక్కొని కాలంవెళ్ళబుచ్చుతున్న పార్వతీశం గారు ఈ రోజు 'గీత'లో సేదతీర లేకపోయారు.

''గాంధీ మహాత్ముడూ.. నేనూ . మరెందరో గీతలో తల్లిని చూసుకుంటాము కానీ ... చిన్నారి మాధురి? ... ఆమె ఎవరిలో చూసుకుంటుంది తల్లిని ?.. అత్తలో చూద్దామనుకొంది ... కానీ దొరకలేదు ఆమెకు కావలిసిన మాతృత్వం అత్తమ్మలో ..''వెనుతిరిగి తుడుచుకుంటూ యధాలాపంగా చూసిన పార్వతీశానికి పిట్టగోడకి అటుగా పెరటి అరుగుమీద మెట్లకి ఆనుకొని ఒక చిన్న ఆకారం కదిలినట్లయింది.

బట్టలు మార్చుకొని తడిబట్ట పిండి తాడుమీద ఆరేసి తల తుడుచుకుంటూ పెరటి గోడ దగ్గరగా వెళ్ళితే వెలుగులో అస్పష్టంగా కనిపిస్తున్న ఆకృతివైపు చేతిని చాపి మెల్లగా ... 'ఎవరదీ...?' అన్నారు

'నేనే...తాతయ్యా...' అంది మాధురి మెల్లగా.

'ఓసి పిచ్చిపిల్లా...నువ్వటే? ... ఇంత చలిలో ఆరుబయట కూర్చుని ఏం చేస్తున్నావూ ? ... ఫో.. లోపలికి పోయిపడుకో ...' అన్నారు మందలిస్తూ.

'ఊహుం ... నిద్ర రావటం లేదు ...' అంది తల అడ్డంగా ఊపుతూ.

''వస్తుంది తల్లీ...ఇంట్లోకి నడు ముందు...చలికి జలుబు చేస్తుందీ...'' ఆయన మాటలు లక్ష్యపెట్టని దానిలాలేచి పరికిణీ దులుపుకుంటూ పిట్టగోడ దగ్గరగావచ్చి తలఎత్తి —

''తాతయ్యా...ఇంత చలిలో చన్నీళ్ళు పోసేసుకున్నారు కదా మీకు జలుబు చెయ్యదూ మరి . ?'' అంది అమాయకంగా.

''ఓసి . భడవా . నా మాటలు నాకే అప్ప చెప్తున్నావా? చిలకలా? దా . మనిద్దరం కలిసి పూలుకోద్దాం పూజకి.. '' అని చేయి అందించి మాధురిని పిట్టగోడ మీదకి లాగి తనవైపు దింపుకున్నారు పదిలంగా. ఇద్దరూకలసి నందివర్ధనాలూ, పారిజాతాలూ, మందారాలూ కోశారు బుట్టనిండా . ఆ ప్రత్యూషలో వయో తారతమ్యాలు మరిచి ఒకరి కష్టసుఖాలొకరు ఏకరువు పెట్టుకున్నారు. ఒకరి కన్నీళ్ళొకరు తుడుచుకున్నారు . పకపకా నవ్వుకున్నారు.

''అమ్మడూ ...కాఫీ తాగుదాం నువ్వు నోరుకడుక్కొని లోపలి కొచ్చేయ్ '' అంటూ లోనికి వెళ్ళి వంటింటి తలుపు చప్పుడు కాకుండా తెరిచి లైటువేసి మెల్లిగా ఒకొక్క వస్తువే తీసి గది మధ్యగా పెట్టుకొని స్టౌ వెలిగించి కాఫీ పెట్టే ప్రయత్నంలో పడ్డారు.

మాధురి వచ్చి వింతగా ఆయన చర్యల్ని గమనిస్తూ గుమ్మం మీద కూర్చుంది. చిన్నపీట వాల్చి చేత్తో దానిమీద కూర్చోమని సైగ చేసేరు. మెల్లగా వచ్చి కూర్చుంది మాట్లాడకుండా.

కాఫీ రెండు గ్లాసుల్లోపోసి 'ఇవి పట్టుకు ముందు గదిలోకి పద ..' అన్నారు.

మాధురిలేచి గ్లాసులు తీసుకొని ముందుగదిలోకి నడిచింది.

స్టౌ ఆర్పి వంటింటిని యధాస్థానంలోసర్ది తలుపు దగ్గరగా వేసి ముందు గదిలోకి వచ్చేసరికి పార్వతీశంగారి కళ్ళజోడు తగిలించుకొని ''గీతా మకరందం''లో పేజీలు గబగబా తిప్పుతోంది మాధురి.

'ఇదుగో...ఆ పుస్తకం అక్కడపెట్టి కాఫీతాగు ముందు...' అన్నారు.

ఆయనవైపు తిరిగి చిలిపిగా నవ్వి ... 'ఇందులో బొమ్మలే లేవు...' అంది కళ్ళజోడు తీస్తూ.

'అది బొమ్మల పుస్తకం కాదులే.. పెద్దవాళ్ళది...'

''పెద్దవాళ్ళకి బొమ్మలక్కర లేదా ? .. మీకు బొమ్మలు నచ్చవా ?''

'బొమ్మలందరికీ నచ్చుతాయిగానీ అంతోటి చదవాలంటే మరి బొమ్మలుచూస్తూ కూచుంటే ఎలా ? ... ' అన్నారు ఏమని చెప్పాలో తెలియక తన సమాధానం తనకీ నచ్చలేదు.

''పోనీ బొమ్మల పుస్తకమేదేనా వుందా? ... '' అంది కాఫీ ఊదుకుంటూ.

''లేదు తల్లీ ... ఇవాళ కొంటాలే నీకు మంచి బొమ్మల పుస్తకం...''

''ఇంత పెద్దది కావాలి '' అంది గీత చూపెడుతూ.

'అమ్మో, . అంత పెద్దదే ... చూద్దాంలే ...' అన్నారు నవ్వుతూ.

చటుక్కున గుర్తొచ్చింది పార్వతీశంగారికి ''అవునూ ... బొమ్మల రామాయణం, భారతం, భాగవతం, పంచతంత్రం.. ఇలా ఎన్నో బొమ్మలతో పిల్లలకోసం ముద్రించేరుగానీ గీతని ఎందుకు పిల్లలకి బోధపడేలా 'బొమ్మల గీత'ని వెయ్యలేదు చెప్మా? . అర్థం కాదని కాబోలు.. గాంధీచెప్పిన 'అమ్మ'లాంటి గీతని పిల్లలకెందుకు దూరంగా వుంచాలి? పిల్లలకే కదా అమ్మ అవసరం ఎక్కువ? . '' ఆయన ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ప్రక్కవాటా లోంచి కాంతమ్మ కంఠం ఖంగుమంది. కాఫీ ఒక్క గుక్కలో ముగించి గ్లాసు రక్కుమని టేబుల్‌పై నుంచి నిటారుగా నిలబడింది మాధురి.

'ఏవండోయ్ . మిమ్మల్నే ... కొంప మునిగింది ... మీ మేనకోడలు ఎటో పోయిందండోయ్ ... పెరటి తలుపులు బార్లాతీసి పెట్టి ఉన్నాయ్ ఓయి దేముడో . నేనెక్కడ వెతుకుదునురో... ఎక్కడికిపోయేవే ముదనష్టపుదానా' కాంతమ్మ కంఠం కఠోరంగా పరిసరాల్ని చీల్చుకొని పార్వతీశంగారి వాటాలో ప్రవేశించింది.

'మాధురీ ... వెళ్ళు ...' అన్నారు నెమ్మదిగా ఆమె తల నిమురుతూ.

బెదురు కళ్ళతో ఆయన వైపుచూసి తలనటూ ఇటూ ఊపింది.

'కొడుతుంది...' దుఃఖం ఆమె గొంతులో గడ్డ కట్టింది.

''కొట్టొద్దని నే చెప్తా ... పద'' మాధురి చేయందుకొని పెరటి గోడ దగ్గరకి చేరుకొన్నారు.

'కాంతమ్మా...ఇటురా . '

పక్షుల కిలకిలారావాలతో అప్పుడే తూర్పు తెల్లబడుతోంది. గంభీరమైన ఆయన స్వరం మృదంగ ధ్వనిలా కాంతమ్మ చెవుల పడింది.

చటుక్కున వంటింటి కిటికీలోంచి పెరట్లోకి తొంగిచూసి రయ్యిమని దూసుకువచ్చింది.

పిట్టగోడ మీంచి మాధురిని దింపి ఆమె చేయి విడిచిపెట్టకుండానే ...

'ఇదుగో ... నీ మేనకోడలు .. ఇద్దరికీ నిద్రపట్టలేదు ... కబుర్లు చెప్పుకుంటున్నాం . నేనే రమ్మని పిలచేను .'' చాలా సౌమ్యంగా నచ్చచెప్పేరు.

''బాగుంది సంబడం ... తెల్లవారకుండా పెత్తనాలూ నువ్వూ ... నడు లోపలికి ...'' ఆయనకి ఒక్కమాట జవాబియ్యకుండా మాధురిని బరబరా లాక్కెళ్ళిపోయింది.

భారంగా నిట్టూర్చి వెనుతిరిగి గదిలోకెళ్ళి పడకుర్చీలో మేను వాల్చేరు.

ప్రక్క వాటాలో కాంతమ్మ భర్తని సాధించడం మొదలు పెట్టింది. అప్రయత్నంగా పార్వతీశంగారి చెవుల్లో దూరుతున్నాయా మాటల తూటాలు.

''మన పిల్లలతోనే మనం వేగలేక ఛస్తూవుంటే అదనంగా దాన్ని తెచ్చి తలకెక్కించేరు. ఇవాళ తిండి పెట్టగానే సరిపోయిందా?...రేపు పెళ్ళి చెయ్యొద్దూ?... మనకున్న పిల్లలు చాలరనా దాన్నికూడా వెంటేసుకొచ్చేరు?...అయినా బస్సు బోల్తాపడి పెద్ద ప్రాణాలు రెండూ గుటుక్కుమన్నా దీని పిండం గట్టిది. బతికి మన ప్రాణాలు తీస్తోంది. ఏ అనాథాశ్రమంలోనో ఇచ్చేయక...చెల్లి... చెల్లి కూతురంటూ నెత్తికెక్కించుకున్నారు. పోనీ వెనకేమైనా దాచేడా దాని బాబు అంటే . తిండికే తికానాలేనివాణ్ణి తగులుకుపోయింది. ఛీ...ఛీ అయినా ఇంటి ఆడపిల్ల కులం కానివాడితో ప్రేమ...ప్రేమని తెగించి యిల్లు దాటిననాడే తీరిపోయింది రుణం. మనకెందుకు దీని గొడవ?...''

వడగళ్ళ వానలా కురుస్తున్న కాంతం వాగ్ధోరణిని ఎలా ఆపాలో తెలియని కామేశం నాన్చుతూ మెల్లిగా...

''ఊరుకో కాంతం...నేను అన్నీ చూస్తాగా...నువ్వెందుకు గొడవ పడతావు? కొన్ని రోజులు ఓపిక పట్టు. అసలే దిక్కుతోచక అది, అల్లల్లాడిపోతూవుంటే.. మనంకూడా కాదంటే ఎక్కడికి పోతుంది చెప్పు. కొంచెం పెద్దది కాగానే అదే అర్థం చేసుకుని మసలుకుంటూంది. నీకు బరువుగా వుండదు. నా మాట నమ్ము.''

''బరువు కాక మరేమిటండీ. నా పిల్లలతో సమంగా తిండీ బట్టా పెట్టాలా? అనవసరపు ఖర్చు అక్కరలేని బాధ్యత. లోకానికి దడిసి ఊరుకొంటున్నాను కానీ...''

పార్వతీశంగారు విరక్తిగా నవ్వుకున్నారు.

''అనవసరపు ఖర్చు. అక్కరలేని బాధ్యత!'' నిజమే...తనూ అక్కరలేని బరువే మరి. ఎవరికి ఉపయోగమని తింటున్నాడు? ఎందుకోసం బ్రతుకుతున్నాడు? రిటైరయ్యి సంవత్సరంన్నర అయింది. 'అది' పోయి నాలుగేళ్ళయింది. అదృష్టవంతురాలు! ఎవరికి అదనపు బరువు కాకుండానే తప్పుకొంది. తను? ప్రక్క గదిలో నిద్రలోవున్న కోడలు ఏడుకొట్టేకలేచి తన పనులు చూసుకొని తనకి ఇంత అన్నం పెడుతుంది. దానికోసం తాను బ్రతికి ఉన్నాడు.

ఎన్నోసార్లు...ఎన్నెన్నోసార్లు...'ఈ చాకిరీ చెయ్యలేక ఛస్తున్నాను బాబూ . ఒక్కపూట వంట మానేసి బయట తినడానికే లేదు. ఎంత ఉండి ఏం లాభం' అంటూ విసుక్కోడం చెవులారా విన్నాడు. అవునుమరి...పోనీ వాళ్ళతోపాటు పైన హోటల్లో తాను తినలేడాయె. తనకోసమైనా వండక తప్పదుకదా? 'అది' వుంటే తనకీ ఇక్కట్లు లేకపోను. అక్కడికీ అన్ని పనులూ స్వయంగా చేసుకోవడం అలవర్చుకొన్నాడు అరవయ్యో ఏట! ఎవరి పనులు వారివి. ఎవరి విషయాలు వారివి! పెద్దతనాన్ని పురస్కరించుకొని ఎందులోనైనా సలహా చెప్పబోతే... ''మీకెందుకూ...హాయిగా విశ్రాంతిగా వుండక లేనిపోని గొడవల్లో తల పాడుచేసుకోకండి'' అంటారు.

''ముసిలి కాలంలో ఇంత తిండి పెట్టేవాళ్ళుంటే ఇంకేం కావాలి?'' అంటారే గానీ తన కడుపుకింత తిండికంటే ఊరటనిచ్చే ఒక్కమాట ఖర్చుచెయ్య రెవ్వరూ.

''నీకేమోయ్...రాజా జీవితం. సకాలంలో కూతురి పెళ్ళిచేసేశేవు. కొడుక్కు దర్జా అయిన ఉద్యోగం వేయించేవు. హాయిగా కృష్ణా.. రామా...అనుకో ఇంక'' అంటారు తోటివాళ్ళూ...బాధ్యతల్లో మునిగి తేలుతున్నవాళ్ళూ... ఈర్ష్యగా.

తన కిప్పుడు తెలుస్తోంది తోడులేని జీవితం ఎంత దుర్భరమో! తనకిప్పుడు కబుర్లు చెప్పుకొందుకొక తోడు కావాలి. పెనవేసే బంధం కావాలి!... ఎలా?...ఎలా?

''మందులు వేళకి తింటున్నారా?''

''భోజనం చేశారా?''

''బజార్లో ఏమైనా కావాలా?''

''ఇంతే ... వీటితో తన అవసరాలు చూస్తున్నామను కొంటాడు సూర్యం. ఊరికే తినడం కూర్చోడం ఎన్నాళ్ళిలా? క్రమ బద్ధమైన జీవితానికి, అలవాటుపడిన జీవితానికి రిటైరయ్యాక కొన్నాళ్ళు విశ్రాంతి **ఎంతో** హాయనిపించింది. కానీ అదే శాశ్వత మంటే రోత పుడుతోంది.'' ఆలోచనలతో మెదడు వేడెక్కి జ్వరం వచ్చినట్లయింది. అలసటగా పూజ కూడా మాని అలాగే నిద్ర కొరిగారు పార్వతీశంగ**రు.**

★ ★ ★

''అన్నీ మూత పెట్టేను. ఆకలేసినప్పుడు వడ్డించుకు తినే **యండి.** నేనలా సుశీల ఇంటికెళ్ళి వస్తాను.'' మౌనంగా తల ఊపేరు పార్వతీశంగారు. ''ఆకలేస్తున్నట్టే వుంది. పోనీ పెట్టేసి వెళ్ళకూడదూ . సరేలే. లేచి తినేస్తే పని పూర్తయినట్టే ఈ పూటకి'' అనుకొని వంటింట్లోకి నడిచి పదార్థాలన్నీ వడ్డించు కొని కూచున్నారు. అన్నీ ఏమున్నాయ్? గుమ్మడికాయ కూర. తిన కూడదు. పప్పులో పోపు వేసింది. సయించదు. ఇక మిగిలినది చారే.

''తినమంటే అలా **కూర్చుంటావేమే.** మింగూ...ఈ తిండి కోసమే గద ఈ కొంపలో దిగేవు ''

నోటిదాకా వచ్చిన 'ఇడి' టప్పుమని కంచంలో పడింది. అన్నం . అన్నం...బాధ్యత పెట్టే అన్నం! ముసిలి కాలపు అన్నం! దీనికోసమేనా జీవితమంతా ధారపోసి సంసారంలో నలిగి ఒడ్డున పడేదీ...దీనికోసమేనా? భార్య పిల్లలూ మనుమలూ అంటూ సర్వ సంగ పరిత్యాగి తన గోచీగుడ్డ కాపాడుకుందుకోసం సంసార ఝంజాటంలో పడ్డ రీతిగా ఈ ''ముసిలికాలపు ముద్ద''కోసం బ్రతు కంతా బంధాలను పెంచుకుంటూ పోవాలా?

కాదు...దీనికోసంకాదు...మరి దేనికోసం?

బ్రతుకు భారమైపోకుండా బాధ్యతలను తనకు తానే సృష్టించుకుంటాడు మానవుడు. మళ్ళీ 'బాధ్యతలతో బ్రతుకు బరువైపోతుందే' అని విచారిస్తాడు...ఎంత విచిత్రం!

బరువు బాధ్యతలులేని జీవితం నిస్సారమైనది. ప్రాణం వున్నంతవరకూ అవి తప్పవు.

లాభంలేదు . మానసికంగా ఒంటరితనం తానిక భరించలేడు. ఈ ఏడాదిలోనే పదేళ్ళ వయసు పెరిగినట్లనిపిస్తోంది. —

ఏదో మార్గం చూడాలి.

''క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప'' అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే తిరిగి మొదటికి చేరేలా వుంది జీవితం అనుకుంటూ ప్రక్కవాటాలోకి నడచేరు పార్వతీశంగారు.

పార్వతీశంగారిని చూడగానే ఆదివారమని గుర్తువచ్చి అల వాటుగా చదరంగం బల్ల సర్దసాగాడు కామేశం.

అన్యమనస్కంగా కాస్సేపు పిక్కలు కదిపి

''కామేశం ఒక్కమాటోయ్...నువ్వేమీ అనుకోనంటే... మీ మాధురిని నాకు ఇచ్చేయకూడదూ . పెంచుకుంటాను.''

''భలేవారేనండీ...మాధురినేం ఖర్మ ...నన్నే పెంచుకోండి. నాతోపాటే నా పిల్లలూ...భార్య...మాధురీ...అందరమూను ..'' అన్నాడు నవ్వుతూ.

''నేను హాస్యంగా చెప్పటంలేదోయ్. నిజంగానే అడుగు తున్నాను. నువ్వెలాగూ పిల్లలుగలవాడివి. నాకూ ఒక తోడు కావాలని పిస్తోందీ వయసులో. ఏ మంటావ్...'' కళ్ళు అరమూసి యోగ ముద్రలో ఉన్నట్టు చాలా నింపాదిగా అడిగేరు.

''ఎంత మాటన్నారు బాబాయ్‌గారూ ఈ వయసులో మీ కెందుకొచ్చిన శ్రమ? బంధకం అని గానీ లేకపోతే మీ చేతుల్లో, పెరిగే అదృష్టంకంటే దానికేం కావాలి! మీ పిల్లలని పెంచి పెద్ద చేయడానికి ఎన్నెన్ని కష్టాలు పడ్డారో . ఎంతెంత త్యాగం చేసేరో నే నెరగనిదా? ఇప్పుడు హాయిగా నిశ్చింతగావుండే వయసులో మీ కెందుకొచ్చిన బాధ చెప్పండి'' నవ్వుతూనే తన మనసులోమాట చెప్పేడు కామేశం.

''నాకేమీ భారం కాదయ్యా. బంధక మంతకంటే కాదు. నిజానికి నా కిప్పుడేదో ఒక బంధకమే కావాలి. లేకపోతే జీవించడం ఎందుకనిపిస్తోంది. నా పిల్లలని పెంచినప్పుడు నేను యవ్వనంలో వున్నాను. నా భార్య నాకు అన్నివిధాలా సహకరిస్తూవుంటే వాళ్ళని నేను బాధ్యతతోనే పెంచేను. అయినా నా పిల్లలని నేను పెంచు కోవడంలో త్యాగమేముంది? ప్రయాణీకులని గమ్యానికి చేర్చే రైలు ఇంజనులా బ్రతికేను. ఎవరి గమ్యాలకు వారు చేరిపోయారు. ఇంజను మూలపడింది. కానీ 'వర్కింగ్ కండిషన్'లోనే వుంది. మూలకూచో అంటే అది యంత్రం కాబట్టి వుంటుందేమోగానీ, నాకు సాధ్యం కావటం లేదోయ్ నాకిప్పుడు నా వెనక తిరిగే రైలు పెట్టెలు కావాలి'' అన్నారు హాస్యధోరణిలో భుజాలు కదిలేలా నవ్వుతూ.

''కానీ . మీ కోడలూ ... అబ్బాయీ'' నాన్చుతూ అసలు విషయం బైట పెట్టేడు కామేశం.

''నీకా భయమేమీ అక్కరలేదు. నాకు తోడు ఇంకొకరి భారం వాళ్ళమీద వెయ్యను మా తాత తొంభయ్యేళ్ళు బ్రతికేరు. మా తండ్రి ఎనభయ్యేళ్ళు. నాకిప్పుడు అరవై. ఇంకా ఎంతలేదన్నా పదిహే నిరవైయ్యేళ్ళు నిరాఘాటంగా బ్రతికేస్తాను. నేనూ మాధురి మా స్వగ్రామం వెళ్ళిపోతాము అక్కడ నాకో పాడుపడ్డ యిల్లూ కొంత భూమీ వున్నాయి. నా ముసిలిదేహం, కానీ పరక ఆస్తి లేకపోతే నా పిల్లలు బ్రతకలేకపోరు నా అవసరం వున్నదగ్గిరే నేనుంటాను శరీరం లొంగినంతవరకూ. చీకి పారేసిన టెంకలోంచే క్రొత్త మొలక పుట్టినట్టు నా చేతుల్లో మాధురి పెరుగుతుంది.

అంతగా మధ్యలో నేను తనువు చాలిస్తే నువ్వుండనే వున్నావు. నీ అదనపు బరువుని నాకు వరంగా యిచ్చి'' అన్నారు దోసిలిపట్టి దీనంగా.

కామేశం కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

''బాబాయిగారూ మీదెంత మంచి మనసు, నా అవస్థని గమనించి మీరీ నిర్ణయాని కొచ్చేరనిపిస్తోంది నాకు. ఏమైనా మాధురి అదృష్టం ఏమని చెప్పను? భగవంతుడే దాని బాధ చూళ్ళేక మిమ్మల్ని పంపేడు. తల్లి లేక అది విలవిల లాడిపోతోంది. నా భార్య అర్థం చేసుకోదు'' అన్నాడు ఆయన చేతులు పుచ్చుకొని కన్నీరు కారుస్తూ.

''నాకు తెలుసాబాధ కామేశం. నాకూ ఇప్పుడు అమ్మ కావాలి! మాధురి నాకు తల్లి. నేను ఆమెకు తాతను!'' అన్నారు వాతావరణం తేలికపరుస్తూ.

ఇంతలో మాధురి పరుగు పరుగున వచ్చి తాతగారి చెయ్యి విప్పి అత్త చూడకుండా తెచ్చిన బెల్లంముక్క సగంవిరిచి గుప్పిట్లో పెట్టి చెయ్యిమూసింది. మాధురిని ముద్దాడి ఎత్తుకొని 'నాతో మనూరు వస్తావా? నీకు బోలెడు తినడానికీ ఆడుకుందికీ యిస్తాను' అన్నారు.

'ఓ...వస్తాను. మరి మావయ్య...' ఆ పిల్లకి ఏమీ తెలియక పోయినా రక్తసంబంధం పీకింది.

''మీ మావయ్య అప్పుడప్పుడు నిన్ను చూడ్డానికి వస్తాడులే. నీకు జడవేస్తానూ, బొట్టు పెడతాను, చదువు చెప్తానూ, మరి నువ్వూ నేనూ ఒక జట్టు...ఏం...''

''ఓ వస్తాను. నేను పెద్దయ్యాక అన్నం వండేసి ఇలా నోట్లో పెట్టేస్తాను మీకు'' అంది ముద్దు ముద్దుగా చేతులు ఊపి. ఆ మాటలకి పార్వతీశంగారు, కామేశం పకపకా నవ్వేరు.

ఒకరి ఆసరాతో ఒకరు చేతులు కలిపి నడుస్తూ సాగిపోతున్న వాళ్ళని చూసి ఏమిటీ వింత అనుబంధం వీరిద్దరిమధ్యా పెనవేసుకు పోయింది? ఆ భగవంతుని లీల అమోఘం అనుకున్నా తృప్తిగా.

★ ★ ★

బట్టలు పెట్టెలో సర్దుతున్న మామగారినీ, మాధురినీ మార్చి మార్చి చూస్తూ వింతగా అడిగింది కోడలు.

''ఎక్కడికీ ప్రయాణం?''

''మనూరికి'' ముక్తసరిగా జవాబిచ్చేరు.

''అదేం?''

''అక్కడే వుండాలనుకుంటున్నా కొన్నాళ్ళదాకా!''

''బాగుంది...ఇప్పుడీ వయసులో ఈ కుర్రదానికోసం వేరే వుంటారా? నలుగురూ నవ్విపోతారు.''

''అబ్బాయిని పిలుస్తావా ఒక్కమారు.''

నిద్రపోతున్న అబ్బాయి లేచి గాభరాగా వచ్చేడు.

''ఇదేమిటి నాన్నగారూ. అంతగా అయితే ఆ పిల్లనీ మీతో ఇక్కడే వుండనియ్యండి. ఇంత తిండికేం భాగ్యం? దానికోసం మీరు ఎక్కడో వుండాలా? దిక్కులేనట్టు!''

''దిక్కులేని వారికి దిక్కుగా వుండడంలోనే తృప్తివుందిరా అబ్బాయ్. ఇంతకీ నేనేం దేశం వదిలి పోవడంలేదుగా. మనూరికే. మాధురి బాధ్యత తీరేదాకా అక్కడే వుంటాను. ఆ తరవాత ఇక్కడకి వద్దన్నా వస్తాను. నన్నాపకు.''

కొడుకూ కోడలూ ఎంత వారిస్తున్నా వినకుండా నిద్ర పోతున్న మాధురిని భుజంపై వేసుకొని పెట్టె చేత్తో పట్టుకొని వీధిలోకి నడిచేరు పార్వతీశంగారు.

''నేనేం తక్కువ చేసేనని... ఆయనలా వెళ్ళిపోవడం. రేపు నలుగురూ నన్నే అంటారు మధ్యలో నాకొచ్చి పడింది చావు'' విసుక్కుంటూ వినవిసా వెళ్ళిపోయింది గదిలోకి.

''ఎందుకని వెళ్ళిపోతున్నాడాయన? కడుపున పుట్టిన పిల్లల కంటే ఎక్కువా? ఏమిటి ఆ దిక్కులేని దానికీ ఆయనకీ మధ్య సంబంధం? రానురానూ మతి పోతోంది నాన్నగారికి'' బాధగా కణతలు నొక్కుకున్నాడు కొడుకు సూర్యం.

ఎవరి హావభావాలతోనూ ప్రమేయం లేనట్టు ''అమ్మపెట్టిన తాయిలం ఎవరికంటా పడకుండా భద్రపరుచుకుంటున్న 'బాలుడిలా' గబగబా సాగిపోయేగ, పండితులు 'మిధ్య' అని చెప్పే సంసార సమరంలోకి మళ్ళీ పార్వతీశంగారు 'పార్థు'డిలా.''



చీకటి

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

"చీకట్లో ఉన్నార్రా
దీపం వెలిగించండి !"

ఎవరో అంటున్నారు
ఎవరో, ఎవరెవరెవరో అంటూనే వున్నారు
ఎప్పుడూ —
ఎవరో చమురుదీపం వెలిగించారు
మరెవరో మెరుపుదీపం వెలిగించారు
ఎవరికివారు వెలిగిస్తూనే వున్నారు
చీకటిని తరిమెయ్యాలని —
చీకటిని తోలెయ్యాలని —
చీకటి పడుతూనేవుంది
వెలుగు విడుతూనేవుంది —

* * *

చీకటి చిత్రమయింది
పుడమితో, ఎప్పుడూ, దోబూచులాడుతూనేవుంది —
చీకటి నల్లనయింది
నల్లగా, మృత్యుజిహ్వగా భయపెడుతుంది —
చీకటి చల్లనయింది
తల్లిలా, చల్లగా జోకొడుతుంది —
ప్రియురాలి పక్క ఏకాంతంలో మాత్రం
కస్తూరి పరిమళం కొడుతుంది —
చీకటి మర్మమయింది
తన నీల నీలాల వెనక విశ్వరహస్యం ఏదో
దాచిపెడుతుంది —

* * *

చీకటే — చిమ్మ చీకటే

ఆకాశమంతా, ఆకాశమంత తమస్సు !
భూమిచుట్టూ, సముద్రమంత తమస్సు !
అవని అంతా, అవని అంత తమస్సు !
అడివిలాగ అల్లుకుని,
ఎడారిలాగ పరుచుకుని,
శైల శిలలాగ బిగుసుకుని,
మబ్బులాగ కమ్ముకుని —
పక్షిలో, పశువులో, పడతిలో, నీలో, నాలో
వీడిలో, వాడిలో, ప్రతివాడిలో —
భయంగా పట్టుకొని,
అజ్ఞానంగా అంటిపెట్టుకొని,
స్వార్థ పరమార్థంగా బిగుసుకొని,

చీకటే — కటిక చీకటే —

గడులు కడుతూ,
గుడులు చుడుతూ,
మనుషుల్ని కలుపుతూ,
మనసుల్ని విడగొడుతూ,
మనువుల్ని విడదీస్తూ, తగవులు తెస్తూ,
నగవులుతెస్తూ, యుద్ధాలు చేయిస్తూ,
ఇంద్రజాలం సృష్టిస్తుంది —
చిత్ర విచిత్రాలు గీస్తుంది —
తమ్ముడూ,
చిట్ట చివరికి, నీ కళ్లకి మోహన మృత్యుకజ్జలరేఖ
తీర్చేస్తుంది —
చీకటమ్మా చీకటే — చిమ్మచీకటే —

* * *

నా బతుకు మొదలా,
నా బతుకు తుదలా,
చీకటే — కాటిక చీకటే !
చీకటికీ చీకటికీ మధ్య గిలగిలలాడుతున్న
క్షణ ప్రభను నేను !
నన్ను నేను నిలవరించుకోడం కోసం
పెనుగులాడుతున్న వెలుగును నేను !
అరణ్యాల తీవ్ర తపస్సులో
నాలో నేను పోరాడాను

ప్రకృతితో పోరుతున్నాను
ప్రయోగశాలలో పోరాడుతున్నాను
నా భయంతో నేను పోరుతున్నాను
నా అజ్ఞానంతో నేను పోరుతున్నాను
నా స్వార్థంతో నేను పోరాడుతున్నాను —
నన్ను నేను ప్రశ్నించుకొంటూ
నా బతుకు తెరువులు నేను శోధించుకొంటూ
నా చుట్టూ రహస్యాలు ఛేదించుకొంటూ
తమస్సుతో తలపడుతున్న క్షణ ప్రభను నేను
నన్ను నేను నిలువరించుకో విలవిలలాడుతూన్న
వెలుగును నేను —

*　　　*　　　*

చీకటిపడుతోంది
ఆకాశం నక్షత్రాలు వెలిగించుకొంటోంది.
చీకటి పడకుండా, అప్పుడే,
తూర్పుకొండ శిఖరంమీద ఎవరో
చంద్రదీపం పెట్టారు —
అటే చూస్తూన్న నాకు
వాసంత సమీరం పరిమళ భాషలో ఏదో సందేశం
మోసుకొచ్చింది —
అటే చూస్తూన్న నాకు
చైత్రమాసపు ఆకుపచ్చటి వాకిటినుంచి
ఒక మధుకంఠం వినిపించింది
శుభశకునంలా —
ఏ చీకటికైనా అంతముందనీ
ఈ తమిస్రమూ అంతరిస్తుందనీ
సవితృ తేజం అవతరిస్తుందనీ
ఈ ఇలలో, నాలో
అమృతకళ అవతరిస్తుందనీ
నన్నమృతమూర్తిని చేస్తుందనీ
అనిపించింది —
నేను క్షణ ప్రభను కాను,
తరుణారుణ కిరణాన్ని —
దివ్యపథంవేపు సాగే విశ్వ వికాసగీతం
తొలి చరణాన్ని -
అనీ, అనిపించింది, అప్పుడే!

నెత్తురు మఱక

శ్రీ నడకుదురు రాధాకృష్ణ

గేయానికి గాయం కాకుండా
　చూడాలని
కలం కుత్తుకకు ఉరిబిగించి
కూర్చున్నా!
ఇంకా నెత్తురు మఱకలు
ఏర్పడతాయా?
వీల్లేదు వీల్లేదంటూ గావు
కేక పెట్టింది మస్తిష్కం.
క్షణకాలం కన్నుమూశా
ఇంకేముంది
కాకూడదనుకున్నది అయిపోయింది.
రుధిర ప్రవాహంలో తేలి
ఆడుతోంది
గేయం కాయం.
అంతా రక్తమే అన్నీ గాయాలే
కలం లేదు
కంఠం మాత్రం తెగిపోయింది.
అంతే!
గుడ్లు మిటకరించి
కుత్తుకలోకి తోసేశా
గుండెల్ని.

డా. యు. ఎ. నరసింహమూర్తి

కవిత్వము - ధార

'కవితా వనితా చైవ సరసాస్వయ మాగతా।
అథవా పునరా కృష్టాచేత్ సరసా విరసా భవేత్॥'

ఇది పరంపరాగతమైన మాట. కళాసంబంధమైన రూపమేదైనా అది ప్రయత్నపూర్వకంగా ఎన్నుకొన్నదైతే ఫలవంతం కాదు. అది కళాకారుని సహజ ప్రకృతి నుండి ఉద్బుద్ధం కావాలి. అందుచేత ధార కవిత్వ నిర్మాణంలో ఒక ఆవశ్యకమైన విధి అవుతుంది. కవులకు స్వచ్ఛమైన దార్శనిక శక్తి, ధారాశుద్ధిగల అభివ్యక్తి వుండాలి. ఛందోమర్మాలు, ప్రాస విన్యాసాలు మాత్రం తెలిసినవారు తమలో ఉబికే భావాలకు ద్వారాలను తెరువలేరు. అలాంటివాళ్ళు రాసే కవిత్వం వాళ్ళనీ వీళ్ళనీ ఆకర్షించే అందమైన వ్యాయామం అవుతుంది కాని, నికార్సైన కవిత్వం కాదు. కవిత్వానికి మూలమైన శక్తి దైవదత్తమని ఆస్తికుల భావన.[1] కవిత్వం మానవాతీత శక్తి వల్ల సిద్ధించే వరం కాదని భౌతికవాదుల విశ్వాసం.[2] ఏది ఏమైనా కవిత్వం పైపై మెరుగులతో అందాలు దిద్దుకొనే బడాయి కాదు. అది పరిపూర్ణంగా సహజ మానవీయాభి వ్యక్తి.

'ధారా' అనే పదానికి ''నిరతిశయ సులభ నిరర్గళ విహారము'' అనే అర్థం చూపబడింది.[3] అవిచ్ఛిన్నత అనేది ధారకుగల సామాన్య లక్షణం. అసిధార—అగ్నిధార—భావధార—కవితాధార ఇలా చూస్తే ఈ ధార అనే పదమే ఒక గొప్ప ఆకర్షకశక్తిగా కనిపిస్తుంది. మన తెలుగులో కవిత్వాన్ని గూర్చి చెప్పే సందర్భాలలో ధారను ప్రశంసించే వాడుక వుంది. ధూర్జటి కవిత్వానికి 'అతులిత మాధురీ మహిమ' వారవనితల 'అధర సుధారస ధారలు గ్రోలుట' వలన సిద్ధించినట్లుగా ఒక చాటువు చెప్తుంది. రామరాజభూషణుడు 'కవితాధారా సుధారాశి సంజని త్రైకైక దిన సద్యశ్శత గ్రంధ కల్పనుడు.'[4] శ్రీనాథుని 'పద ప్రసిద్ధ ధారాధుని' కావ్యాలంకార సంగ్రహకారునిచేత ప్రశంసింపబడింది.[5] కవిత్వము 'సమధారాస్పదమై'[6] వుండాలని ఒక కవి అభిప్రాయపడ్డాడు. పై ప్రస్తావనల వలన ధారకు సంబంధించిన రెండంశాలు తెలుస్తున్నాయి. 1. ధార కవిత్వానికి మాధుర్యాన్ని కలిగిస్తుంది. 2. కవిత్వంలో సమధారకే అంటే రసయోగ్యమైన ధారకే రాణింపు వుంటుంది.

ధారకు కవిత్వంలోగల స్థాన మెంతటిది ? అనే ప్రశ్న సహజంగా కలుగుతుంది. భారతీయుల దృష్టిలో కవిత్వానికి సంబంధించిన అనేక విషయాలలో ధార ఒకటి. అలాకాక కవిత్వంలో ధార మాత్రమే ప్రధానంగాగల శాఖ ఒకటుంది. దానిని అంటిపెట్టుకొని జీవించే కవులున్నారు. రాజశేఖరుడు దశవిధ కవులలో 'అవిచ్ఛేది' అనే కవిని పేర్కొన్నాడు. కోరిక పుట్టినప్పుడల్లా లేక అవసరమైనప్పుడల్లా అవిచ్ఛిన్నంగా కవిత్వం చెప్పగలవాడు అవిచ్ఛేది కవి.[7] రాయలు గండపెండేరం వేస్తానంటే పెద్దన సుదీర్ఘమైన ఉత్పలమాలికను ధారాపాతంగా చెప్పడం ఇలాంటిదే. ఐనా ప్రాచీనకాలంలో ఈ అవిచ్ఛేది కవులంటే విశేష గౌరవాదరాలు గాని, ఆ విధమైన కవిత్వాన్ని మన్నించడంగాని లేదు. తెలుగులో తిక్కన ధారాపాతంగా కవిత్వం చెప్తానని — అలా చెప్పలేకపోతే నాలుక కోసుకుంటానని ప్రతిజ్ఞ చేసినట్లు జనశ్రుతి వినిపిస్తుంది. ఐతే అందుకు తగ్గ ప్రమాణం లేదు. ధార అంటే కొండమీద నుండి జలపాతం దూకినట్లు, కుండపోతగా వర్షం కురిసినట్లు కవిత్వం పుట్టుకునిరావడం కాదు. అది శుష్కమైన ఉద్రేకం కాదు. రసావేశాన్ని పొందిన కవిచిత్త సమాధి నుండి వెలువడే భావచాలనం సెలయేటిమీద పూలపడవలా నిరాఘాటంగా సాగిపోవడం. దీనినే 'ధారాశుద్ధి', 'ధారాధుని', 'సమధార'—ఇత్యాదిగా తెలుగు కవులు ప్రశంసించేరు. ఈ విధమైన ధారలో ఔచిత్యం వుంది. మన ప్రాచీనుల్లో ''సంస్కృత ప్రాకృత శౌరసేన్యాదుల—ఘటికలో నొక శతకంబుఁ జెప్ప'' వారున్నారు[8] ''కవితాధారా సుధారాశి సంజని త్రైకైక దిన సద్యశ్శత గ్రంధ కల్పను' లున్నారు.[9] తెలుగునాట ఆశుధార అనగానే తిరుపతి వేంకట కవుల సంప్రదాయం స్ఫురిస్తుంది. ''ఆశుధారా కవిత్వాడంబరంబన్న నల్లేరుపై బండి నడక మాకు'' అని వారు చెప్పకున్నారు[1] వీరి తర్వాత ఆశు సంప్రదాయం చాలా కాలం ముచ్చట చెల్లించుకుంది. దీనిని బహిరంగంగా ఖండించినవారు ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు. ఆశుధారలో కవియొక్క పాండిత్యం, సద్యస్ఫూర్తి వెల్లడి అయినా ఔచిత్యం కొరవడుతుందని రాయప్రోలు వారి అభిప్రాయం.

''రసమో భావమొ జీవదర్థ సుకుమార వ్యంజనా మంజు శ
బ్ద సమాసా రచనంబొ సాధుహృదయ స్పంద ప్రతిష్ఠా కధా
విసరంబో సకలార్థ శూన్యమగు నీవేగాతి వేగోక్తి దు
ర్వ్యసనం బేటికి త్రిప్పుమింక జననీ రమ్యాక్షర క్షోణికిన్''॥

అంటే కేవలం ధారమీద దృష్టి నిలిపే కవి రస – భావ – వ్యంగ్యాదుల విషయంలో ఔచిత్యాన్ని పోషించడానికి వీలుకుదురదని, ఆ విధమైన ప్రయత్నం మానుకోవాలని రాయప్రోలు వారి అభిప్రాయంగా తెలుస్తుంది ఈ విషయంలో సరియైన తీర్పును కోరేవారు ధారకు, ఆవేశానికి గల సంబంధాన్ని తెలుసుకోవలసిన అవసరముంది.

మన భారతీయాలంకారికులు కవిత్వం విషయంలో ఆవేశం—ఉద్రేకం—ఉత్సాహం అనే పదాలను వాడలేదని, ఈ ఆవేశాదులన్నీ

ప్రతిభలోనే అంతర్గతంకాగలవని శ్రీసన్నిధానంవారి అభిప్రాయం.[12] కాని రాజశేఖరుడు ఆవేశికుడనే కవిని పేర్కొన్నాడు. మంత్రాదులను ఉపదేశం పొందడం వలన కావ్యసిద్ధిని సంపాదించి ఆ దేవతావేశం కలిగినప్పుడు కవిత్వం చెప్పేవాడు ఆవేశికుడు [13] మన పూర్వ కవులను గూర్చి ఇలాంటి గాథలు కొన్ని మనం వినడం జరిగింది. ముఖ్యంగా కాళిదాసు నాలుకపై కాళికాదేవి బీజాక్షరాలను రాసిన తర్వాత అతడు ''మాణిక్యవీణా ముపలాల యంతీం'' అనే రచనను ధారాపాతంగా వెలువరించినట్లు చెప్పబడింది. ఇప్పటికీ కొందరు కవులు ఏదో ఉపాసనాబలం వలన సిద్ధించిన ఆవేశంతో రాస్తారనే నమ్మకాలున్నాయి. ఈ విశ్వాసాల సంగతి విడచిపెట్టినా కవిత్వానికి ఆవేశం ప్రధానమని వాల్మీకి దగ్గర నుండి శ్రీశ్రీ దాకా సూచ్యంగానో,[14] వాచ్యంగానో[15] తెలియజేయడం జరిగింది. ఈ ఆవేశమన్నది పూర్తిగాహృదయానికి సంబంధించినది. అంటే హృదయం స్పందించినప్పుడు కవి కవిత్వాన్ని వెలువరించగలడని తెలుస్తుంది. కాని ఊరకనే హృదయం స్పందించినంత మాత్రంలో కవిత్వం ఎక్కడ నుండి వస్తుంది ? దానికి కవిత్వ నిర్మాణానికి సంబంధించిన కొంత శిక్షణ కూడా అవసరం. అనిర్వచనీయమైన మానసిక ప్రేరణ, పరిపూర్ణమైన సాంకేతిక పరిజ్ఞానం — ఈ రెండూ కారణాలుగా కవిత్వం వెలువడుతుందని అంగీకరిస్తే[16] వానిలో ధారకు ఏది మూలమవుతుంది ? ఆవేశం అవిచ్ఛిన్నంగా కొనసాగితే కవిత్వం ధారాపాతంగా దొర్లుకుని వస్తుందా ? ఆవేశానికి తగినంత స్థానం లేనిచోట కూడా కేవల ప్రయత్నం ద్వారా, పరిపూర్ణమైన శాస్త్ర పరిజ్ఞానం ద్వారా ధార సిద్ధిస్తుందా? అనేది ఒక గడ్డు ప్రశ్న.

మనం సామాన్య పరిస్థితులలో పనిచేసే విధానానికి ఒకానొక ఉద్రిక్త స్థితికి లోబడి పనిచేసే విధానానికిగల తేడాను అనుభవపూర్వకంగా గ్రహించగలము. ఉద్రిక్తస్థితిలో మనం కొనసాగించే ఆలోచన, ఆచరించే పని నిశ్చల బుద్ధితో, నిరంతరాయంగా ప్రవర్తిస్తాయి. అందులోవున్న వేగాన్ని ధార అనవచ్చును. సాధారణంగా ఉద్రేకం అప్రయత్న సిద్ధంగా వుంటుంది. వ్యక్తి ప్రయత్న రహితంగా అనేకములైన ఆలోచనలకు లోనౌతూ వుంటాడు. ఆ ఆలోచనల నన్నింటినీ యథాతథంగా అమలుచేయడానికి వీలుకాదు. వ్యక్తియొక్క వివేకం ఆ ఆలోచనలను పరీక్షిస్తుంది. అందులో లాభకరమైన వాటిఆచరణకు, నష్టాన్ని కలిగించే వాటిని నిరాకరించడానికి వివేకం ప్రోత్సాహాన్నిస్తుంది. అప్పుడు వ్యక్తియొక్క ఊహ తన ఆలోచనను తిరిగి స్వీకరించడం జరుగుతుంది. దీనివలన కవులకు— అప్రయత్నంగా స్ఫురించిన ఊహలన్నీ కవితా రూపాన్ని పొందవనీ, ఆలోచన ద్వారా క్రమబద్ధం చేయబడిన ఊహలే కవిత్వంలో చోటు చేసుకుంటాయని చెప్పవచ్చును. ఒక్కొక్క సందర్భంలో కవుల ఊహలు కవిత్వం కాకుండానే ఇంకిపోవచ్చును.[17] ధారా పూర్వకమైన కదలిక మనకు క్రొత్తగా, స్వచ్ఛమైనదిగా, విలువైనదిగా కనిపించవచ్చును. కాని తాము చేయదలచిన పని యేమిటో ముందే తెలిసికొని దాని నాచరించిన వ్యక్తులు కూడా ఆత్మోత్కర్షను అనుభవిస్తారు. తల్లి తన పసిబిడ్డకు ఏం కావాలో తెలుసుకొని అప్రయత్నంగా ఆ అవసరాన్ని తీర్చి బిడ్డకు తృప్తిని కలిగిస్తుంది. ఆ క్షణానికి అది అప్రయత్న సిద్ధమైన చర్య అనిపించినా దానికి అవసరమైన అనుభవ జ్ఞానాన్ని ఆమె ముందుగానే సంపాదించింది ఈ విధంగా జీవితంలో అడుగడుగునా అప్రయత్నంగా జరుగవలసిన చర్యల నెన్నింటినో మనం గుర్తించి భద్రపరుచుకుంటాం. అలాగే కవితాధార కూడా ''చిరదీక్షా శిక్షా తపస్సమీక్షణ.''[18] అది సిద్ధించిన నాడు కవి ''కన్నవి విన్నవి విన్నవించగా—మాటలకై వెదుకాడగబోతే ... ... వడిగా, వడివడిగా వెలువడడం'' జరుగుతుంది. ఆ వడినే ధార అని పిలుస్తాం.

వివేకం సహజంగా దుష్ప్రేరణలను గుర్తించి వాటిని అణచిపెడుతుంది. సత్ప్రేరణలను నిరాఘాటంగా విడచిపెడుతుంది. లేదా తాను సత్ప్రేరణలనే కలిగివున్నట్లు ప్రవర్తిస్తుంది. అందుచేతనే మనం అప్రయత్నంగా చేసే పనులన్నీ ధారాపూర్వకమైన చర్యలు కావనే గ్రహించాలి.

''మానిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీ సమాః।
యత్క్రౌంచ మిధునా దేకమవధీః కామమోహితమ్॥''

అనే భావధార రామాయణ కావ్యంగ రూపొందితే, 'గుండె గొంతుకలోన కొట్లాడుతాది' అనే సద్యస్ఫురితమైన చరణం ఎంకి పాటల సంపుటంగా నిలిచింది. ఈ నడుమ కవి మనస్సులో ఎంతగా కవితా క్షీరార్ణవం ఘూర్ణిల్లిందో అందరూ గుర్తించగలరు. అదంతా అప్రయత్న పూరిత చర్యకాదు. అనంత గవేషణం. రచనకు సంబంధించిన ఆలోచన కవిలో నిరంతరధారగా కొనసాగుతుంది. దానిని కవిత్వానికి సంబంధించిన బాహిరమైన విలువలతో అనుసంధించి క్రమబద్ధంచేస్తూ కవి దానికొక సమగ్రమైన ఆకృతిని కల్పిస్తాడు. అప్పుడు అది లౌకికావరణాన్ని ఛేదించుకుని పోయి కొత్త సొగసులను కుమ్మరిస్తుంది. ఆలోచన కుంటుపడినప్పుడు కవియొక్క పనితనం పుంజుకున్నా, ఆలోచన నిరాఘాటంగా సాగుతున్నప్పుడు కవి బాహిరమైన విలువలపై తనకుండే వ్యామోహంతో తన పనితనానికే ప్రాధాన్యం కల్పించాలని ప్రయత్నించినా ఆ ఎగిరే పక్షికి రెక్కలు తెగిపోతాయి. అది నేలమీదనుండి కదలదు. అంటే ధార సిద్ధించదు.

కవియొక్క భావనకు కవితా సృష్టికి మధ్య ఇతరులకు తెలియని వ్యవధానం—ఎంపిక కొంత వుంటుంది. మనసులో సజాతీయ విజాతీయ భావాలెన్నో పుట్టుతూ వుంటాయి. ఈ ఊహలన్నింటినీ యథాతథంగా వెళ్లడిచేయడం వలన కలిగే ప్రమాదం ఎలాంటిదో చెప్పవలసిన పనిలేదు. పరిహరించడానికి వీలుకాని రీతిగా పుట్టుకొనివచ్చే పరస్పర విరుద్ధములైన భావాలను మార్పులేకుండా నిలిపివుంచే అమాయకత్వం ఒకరకమైన జాడ్యం కాగలదు. ఆ జాడ్యాన్ని వదలించుకొని కవి తనదైన బాధ్యతను గుర్తించాలంటే ఆత్మవిమర్శ అవసరం. ఆ ఆత్మవిమర్శ లోపిస్తే, ఆత్మసంయమనం లోపిస్తుంది. ఆత్మసంయమనాన్ని కోరని లేదా లోపించిన కవి తన భావధారను నిర్నిరోధంగా విడచిపెట్టడం జరుగుతుంది. ఆ ప్రయత్నంలో ఎదురయ్యే శిక్షలను సైతం ఆ కవి స్వేచ్ఛగా వరిస్తాడు.

ఐతే అందరూ ఈ స్వేచ్ఛను వరించరు. ఆ కారణంగానే కవుల స్వేచ్ఛా భావనలు, స్వచ్ఛమైన అభివ్యక్తులు, సహృదయ ప్రమాణాలు మొదలైనవన్నీ కూడా నిరోధింపబడతాయి. వాటిస్థానంలో వివేకం, ఆత్మావలోకనం, సామాజికన్యాయం మొదలైనవి ప్రవేశించి మాన్యరూపాలు అవతరిస్తాయి. ఐనా సహజమైన ఉద్రేకాలవల్ల నిర్వహింపబడే ప్రధాన వ్యాపారాలపట్ల ఆసక్తిని కనబరచడం మానవ లక్షణం. ఆ ఆసక్తి ఎక్కడో ఒక చోటనైనా వ్యక్తియొక్క మనన శీలాన్ని వెనక్కునెట్టి బుద్ధియొక్క ధారాపూర్వక ప్రవృత్తిని పరిపూర్ణ స్పృహతో స్వీకరించేలా ఒత్తిడిచేస్తుంది. అందువల్లనే అతడు కనీసం ఒకానొక దశలోనైనా పారంపర్యంగా తనకు సంక్రమించిన శాస్త్రీయ పద్ధతులలోని పరిధులను అధిగమించి ప్రవర్తిస్తాడు.[19] ఈ క్రింది పద్యం ఈవిధంగానే పుట్టిందని ఊహించవచ్చును.

> ''తరుణి ననన్యకాంత నతిదారుణ పుష్పశిలీముఖ వ్యథా
> భర వివశాంగి నంగభవు బారికి నగ్గముసేసి క్రూరుడై
> యరిగె మహీసురాధము డహంకృతితోనని రోషభీషణ
> స్ఫురణ వహించెనో యన నభోమణిదాల్చె కషాయదీధితిన్.''[20]

ఈ పద్యంలో ధార కనిపిస్తుంది. ఇది ఎంత రమణీయంగా వున్నా ప్రకరణాన్నిబట్టి అనుచితంగావుంది. అగ్నిదేవుణ్ణి ప్రత్యక్షం చేసికొని తన గొప్పతనాన్ని ప్రకటించుకొన్న ప్రవరుణ్ణి ''మహీసురాధముడు'' అని తలచిన పెద్దన ప్రతిభా దరిద్రుడా? ఎంతమాత్రం కాదు. చరమ సంధ్యలోని సహజ రామణీయకంతో పులకితమైన ప్రకృతిని చూసి పరవశించిన పెద్దన మనసులో రేగిన భావధార ఇందుకు కారణం. ఈ చింతన మనన దశకు చేరుకోకుండానే శాబ్దిక ధారగా అవతరించింది భావం కూడా సంతానంలాంటిదే. పిల్లలు తప్పు చేసినప్పుడు వారి విషయంలో విజ్ఞుడు కూడా ఉదారంగా ప్రవర్తించినట్లే, ధారావ్యామోహితులైన కవులు సౌందర్య ప్రలోభంతో కొన్ని భావాలపట్ల ఉదారంగా ప్రవర్తిస్తారు. వారు ఆ స్వేచ్ఛవల్ల సిద్ధించే శిక్షను స్వీకరించడానికి వెనుకాడరు.

జీవిత వేగంలో ప్రతిఘట్టానికి ఫలితాలను, కష్టాలను తయారుచేసుకుంటూ ముందుకు సాగడానికి తగినంత వ్యవధానం చిక్కదు. సుఖదుఃఖాలు హఠాజ్జనితాలు కావచ్చును ఆ విధమైన సందర్భా లెదురైనప్పుడు వ్యక్తి అప్రయత్నంగా ప్రతిస్పందించవలసి వుంటుంది. ధార విచారణను నిరోధించే పరిస్థితి ఇక్కడ ఏర్పడవచ్చును. ప్రకృతిని అనుకరించడమే కళాధర్మం అనుకున్నా, ప్రకృతిలోని అర్థాలను—ఆకృతులను విశ్లేషించి చూపడం కళాధర్మం అనుకున్నా కవిత్వంలో కూడా ఈ పరిస్థితి తప్పక ఎదురౌతుంది. అంతేకాక కవితా కళకు సంబంధించిన ఇతర విషయాలలో కూడా ధారను స్వీకరించడం విచారణను నిరోధించడమే అవుతుందన్న విషయం ఆలోచించదగినది. నారదుడు ''లతాంతాయుధు సంగరాన్ని''[21] వర్ణించడం ఇందులో మొదటి తరహాకు చెందినది. విచారణలేని ఈ పద్యరచనకు విమర్శకులు తిమ్మనను దోషిగా నిలబెట్టడం జరిగింది. కాని—ఈ పద్యానికి ప్రేరణ రామాయణంలోను[22] దిఙ్నాగుని కుందమాలలోను[23] వుందనీ, అవి చదివిన సంస్కారంతో ఉద్భమించిన భావధారకు తిమ్మన లోనయ్యాడని గ్రహిస్తే కొన్ని కొన్ని సందర్భాలలో పూర్వసంస్కార సంజనితమైన ధారకుగల ప్రాబల్యం ఎటువంటిదో అర్థం కాగలదు. ఇక శ్రీరాముడు ''లుంగమా లవంగమా కుడుంగమా''[24] అంటూ అను ప్రాసల్లో ఏడవడం ఇందులో రెండవ తరహాకు చెందినది. సమకాలికమైన ఆలంకారిక వ్యామోహం కవి ఆలోచనకు ప్రేరణగా నిలిచి అనుచితమైన స్థలంలోనైతం అప్రయత్నంగా కాలుపెట్టడం ఇక్కడ కనిపిస్తుంది. ఐతే ధార విచారణను నిరోధించిన ప్రతి సందర్భంలోనూ ఇలా అనౌచిత్యాలే ఏర్పడతాయని చెప్పడానికి వీలులేదు. కాని అనౌచిత్యం ఏర్పడినప్పుడు ఆ నిరోధాన్ని స్పష్టంగా గుర్తింపవచ్చును.

ప్రతిభగల కవి ''అరిస్తే పద్యం''[25] కావచ్చును. ఇక్కడ ధారయొక్క సహజ ప్రవృత్తి దర్శనమిస్తుంది. కాని కవిత్వంలో ధారయొక్క ప్రాధాన్యాన్ని అంగీకరిస్తూనే ఆలంకారికులెన్నో నియమ నిబంధనల నేర్పరచారు. నిశ్చితములు, నిరంతరములు అయిన ఒత్తిడులతో కూడినవ్యక్తి ఎప్పుడూ ధారాపూర్వకంగా ప్రవర్తించలేడు. పరస్పర విరుద్ధాలైన ఈ అభిప్రాయాలకు సమన్వయ మెలా కుదురుతుంది? అంటే ఒక సమాధానం లభిస్తుంది. ఆలంకారికుల నియమ నిబంధనలన్నీ అనుచిత భావనకు చెందిన ధారను నిరోధించేవిగా కన్పిస్తాయి. ధారావాహికమైన భావనకు- కళాత్మకమైన నియమాలకు మధ్య సమాధాన రహితమైన వైరుధ్యమేమీ లేదని గ్రహించాలి.[26] కవిత్వంలో అనుభూతికే ప్రాధాన్యం గాని తీర్పునకు ప్రాధాన్యంలేదు.

భారతీయుల కవిత్వంలో 'ధారాశుద్ధి' అనే లక్షణం ఎప్పుడూ ఒక ఉద్యమాన్ని అంటిపెట్టుకున్న లక్షణంగా రూపొందలేదు. బలీయమైన అనుభూతులు అప్రయత్నసిద్ధంగా ఉబికి రావడమే కవిత్వమన్న వర్డ్స్వర్తు నిర్వచనంతోను,[27] కాలరిడ్జి వివరణలతోను కాల్పనికోద్యమనాటి ఆంగ్లకవిత్వంలో భావధార ఒక ప్రధాన లక్షణంగా రూపొందింది. దానిని గూర్చి ఎన్నో తర్జన భర్జనలు జరిగేయి. ఒక కావ్యంలో అంతా కవిత్వమే వుండవలసిన పనిలేదు. కాని నిరంతరాయంగా పునరావృత్తమయ్యే ఆ కవిత్వం ఏపాటిదైనా అది అప్రయత్నంగా సిద్ధించినదై వుండాలి. అది కవి మేధనుండి ప్రయత్నరహితంగా ఆవిర్భవించాలని కాలరిడ్జి అభిప్రాయం.[28] కవిత్వం అప్రయత్నంగా సిద్ధించడమే కాకుండా కవితోద్రేకాలు కవుల అధీనంలో కాలరిడ్జి, వర్డ్స్వర్తు అభిప్రాయపడ్డారు,[29] ఈ అదుపునే భారతీయాలంకారికులు సమాధి[30] అని పేర్కొన్నారు సారస్వత తత్త్వం సిద్ధించాలంటే విదిత వేద్యమైన మనసుయొక్క ఏకాగ్రత ఒక్కటే పరమోపాయమని వారి తలంపు ఈ సమాధి ధారకు కళాధర్మాలకు చక్కని పొందిక కుదిరేలా చూస్తుంది.

ఫాస్ఫర్ మల్లవ్ అనే విమర్శకుడు ఒక కవి ధారాజనితమైన రచనను తిరిగి మెరుగుపరచడానికి చేసే ప్రయత్నంవల్ల మేలుకంటె కీడే ఎక్కువగా కలుగుతుందని చెప్పేడు.[31] కాని వర్డ్స్వర్తు తన

మొదటి అభివ్యక్తులకంటె వాటిని సంస్కరిస్తూ రెండవసారి ఉపయోగించిన పదాలు, ఊహలు మంచివిగా వుంటాయని చెప్పేడు అతని దృష్టిలో తొలి ఉద్రేకాలు మాత్రమే విలువైనవి.[32] ఒక పాదాన్ని నిర్మించడానికి అవసరమైతే కొన్ని గంటలపాటు శ్రమించవలసి వుంటుందని ఈట్సు అభిప్రాయము.[33] అప్రయత్నంగా సిద్ధించిన భావాన్ని ధారాశుద్ధిగల రచనగా మార్చడంకోసం కవులు పడే శ్రమ పై అభిప్రాయాలవల్ల తెలుస్తుంది. కవిత్వంలో ఈ విధమైన ఆవాపోద్ధరణములకు గల స్థానాన్ని, ఆ అవస్థను పూర్వులు కూడా వివరించేరు.[34] పరివృత్తి సహిష్ణువులుగాని పదములు సిద్ధించేవరకు కవుల మనసులు ఈ పదమా ఆ పదమా అనే డోలాయమానావస్థకులోనై వుంటాయి. పదములకు స్థైర్యం సిద్ధించినపుడు సరస్వతీసిద్ధి పొందినట్లేనని పూర్వాచార్యుల అభిప్రాయము. భాష భావంనుండి ధారాపూర్వకంగా ఉత్పన్నం కావాలని కొందరి భావన.[35] వారు ఒకానొక ఆవేశపూరితమైన స్థితిలో ఆలంకారిక పదజాలం ధారావాహికంగా సిద్ధిస్తుందని విశ్వసిస్తారు. ఇది వివాదాస్పదమైన విషయమైనా కొందరు కవులుమాత్రం ధారావాహికంగా వచ్చిన అలంకారాలనే ఉపయోగిస్తారు. కవితా భావనకు ఉద్రేకాన్ని కలిగించడంతోపాటు కళాధర్మాలను పోషించడంకూడా అవసరం. అది కవిత్వానికి పరిపూర్ణతనిస్తుంది. ఈ రెండింటి సమ్మేళనంలో కావ్యంలో అంతరంగ బహిరంగ ఐక్యం సిద్ధిస్తుంది ఈ ఐక్యభావన కవిని పదాలను, భావాలను ఎన్నుకొనేలా చేస్తుంది. దీనినిబట్టి కొందరు "అల్లన విచ్చు చెంగలువలందు రజంబు"వలె[36] ఆమోదయోగ్యమైన శైలిని కోరుకుంటే, మరికొందరు "చిరుసానపట్టించి చికిలి సేయించిన"[37] ఆకర్షణీయమైన శైలిని వరిస్తారు. ఈ రెండింటిలో ఏది ఉత్తమమైన శైలి? అనే సమస్య వుంది. కళను ప్రతిభయొక్క జాగృద్గ్రహణంగా, జాగృన్నిర్వహణంగా గ్రహించడంలో భేదం లేనప్పుడు అప్రయత్న సిద్ధమైన ధారావాహిక శైలికి, కళాత్మక శైలికి నడుమ యథార్థమైన వైరుధ్య మేర్పడదని stone అనే విమర్శకుని అభిప్రాయం.[38] ప్రతిభా వ్యుత్పత్తులు ధారకు ప్రాథమికావసరాలు. శుష్కమైన ఆవేశం ధారగా రూపొందదు. కవితాధార సిద్ధించాలంటే ఒక సుశిక్షితమైన మేధ, సదభిరుచి, చతురత కావాలి. "కళ్లుంటూవుంటే చూసీ వాక్కుంటే వ్రాసీ"[39] అన్న వాక్కు వెనక ఇదంతా వుంది. అంతే కాని అది ఆషామాషీ వాక్కు కాదు.

రసానికి, వూనికకు అనుగుణంగా ఛందం దానంతట అదే ఏర్పడుతుందని కొందరి అభిప్రాయం. "అర్థానురూపచ్ఛందస్త్వవ్" అనే మాట భావానికి తగ్గ ఛందాన్ని ఎన్నుకోమని చెప్తుంది. "నాదబ్రహ్మపు పరిచుంబనలో నాడుల తీగలపై"[40]

కొన్ని కదలికలు జనించడం సహజమే. కాని అన్నివేళలా ఆ కదలికలే ఛందంగా రూపొందుతాయని నమ్మడమెలా? గడచిన కాలంలో ధారా శుద్ధిగల కవులనేకులు తమ రచనల్లో ఒకేరసాన్ని, ఒకే పూనికను భిన్న భిన్నచ్ఛందాల్లో వ్యక్తంచేయడం సంభవించింది. ఇందులో కొంతభాగం ఎన్నిక చేయబడ్డ ఛందస్సు లుంటాయి. కొంతభాగం మార్పుకోసం, మక్కువకొద్దీ, ఆ సమయానికి తోచినందువల్లా రచించిన వుంటాయి. ధారకు ఛందస్సు పరిపూర్ణమైన అవరోధ మని ప్రాచీన కవిత్వాన్ని చదివిన అనుభవంవల్ల కాని, ఛందస్సులేని కారణంగా ఆధునిక రచనల్లో పరిపూర్ణమైన ధారాశుద్ధి ఏర్పడిం దని గాని ఏ విమర్శకుడూ చెప్పలేదు. ఛందస్సు విషయంలో ధారతో పాటు, అభిరుచి, ఎన్నిక అనే లక్షణాలు ప్రధానంగా కన్పిస్తాయి. ధారకు అవరోధం కల్పించేవి, కృతకమైన ధారకోసం కూర్చుకొనేవి అయిన వర్ణాలు, పదాలు గణబద్ధ చ్ఛందస్సులలోనే కాకుండా ఆధునిక రచనల్లో కూడా వుంటాయి. ఆధునిక లాక్షణికులు వచన పద్యం విషయంలో అవసరమని భావించిన తూగు, ఊపు, విసురు[41] మొదలైనవి ధారకు సంబంధించిన అంశాలుగా గ్రహించవచ్చును.

''రెండు కన్నులు
కాలిన బండికమ్మిలు
పట్టలేని కూర్మిని
పచ్చని సంపెగల డాసి
విగత ప్రాణులు
వాలిన తుమ్మెద బారులు
కాలిన మారుని తరాపులు
కలికి చూపులు''[42]

ఈ చరణాల్లోని కవిత్వపు విలువను గూర్చి ప్రస్తుతం ఆలో చించవలసిన పనిలేదు 'అనియత గురు లఘ్వక్షర ప్రయోగంతో' కూడిన పాదబద్ధత[43] వచనగేయంయొక్క లక్షణాల్లో ఒకటిగా అంగీకరించి పై పాదాలను ఆ దృష్టితో పరిశీలిస్తే పైన చెప్పిన ఊపు, విసురు, తూగు వగైరా ఈ చరణాల్లో కుంటుపడినట్లు గమనించవచ్చును.

''రానున్న కాలంలో దాగున్న విషఘుడియల గుండియలు
విజ్ఞానాస్త్రాలతో తుత్తునియలు చేసి
వాటివల్ల ప్రమాదం వాటిల్లకుండా చేస్తాను''[44]

ఈ చరణాల్లో 'రానున్న'తో సమతూకం ఏర్పడడానికి 'దాగి వున్న' అనే రూపం 'దాగున్న'గా మారింది. 'విషఘుడియలు—తుత్తు నియలు' అనే రూపాలతో సమధార కుదరడానికి 'గుండెలు' అని వుండవలసిన మాట 'గుండియలు' అనే గ్రాంధిక రూపంగా అవత రించింది. 'వాటి వాటిల్లకుండా' అనే చోటగల 'వాటి' అనే మాట యతి ప్రాసలకు తీసిపోని రీతిగా పునరుక్తమై సమధారను సాధించింది.

''అగాధ బాధాపాథః పతంగాలూ
ధర్మవీరుల కృత్త రక్తనాళాలూ
త్యాగశక్తి ప్రేమరక్తి శాంతిముక్తి
నా కళా కరవాల ధగ ద్ధగ రవాలు''[45]

లలితము గాఢము ఐన ఆవేశంతో నిర్నిరోధంగా సాగిపోయే తిలక్ కవితాధారలో పై చరణాలు అతుకుల గతుకులుగ కన్పిస్తాయి. పై నాల్గు పాదాలలో ఏ రెండింటి నడకా ఒక్క తీరుగా వుండదు. అది వచన పద్యంయొక్క లక్షణం కాదనుకుంటే ఈ నాలుగు చర ణాలను ఆద్యంతం ఒక ఊపులో ఇమిడ్చే పదును కూడా ఇక్కడ లోపించిందని అనిపిస్తుంది. భావధార—శబ్దధార ఐక్యంకాని సంద ర్భాలు ఇలా దర్శనమిస్తాయి.

''విషం క్రక్కే భుజంగాలలో
కదం త్రొక్కే తురంగాలో
మదం పట్టిన మాతంగాలో
కవీ, నీ పాటల్''[46]

ఇక్కడ 'క్రక్కే—త్రొక్కే' అనే ప్రయోగాల్లో ఉత్కంఠతో మీద కెగజిమ్మిన ధార, ఆ నాలుగు మాత్రలనే కలిగివున్నా, 'పట్టిన' అనే చోటగల 'ఇ' అనే వర్ణంతో పప్పులో కాలువేసి వెంటనే బయ టకు లాగుకున్న తీరు స్పష్టంగా తెలుస్తూంది పై ఉదాహరణ లను పరిశీలించిన తరువాత సుశిక్షితమైన కవితాధారకు గణబద్ధ చ్ఛందస్సులే అవరోధాన్ని కలిగిస్తాయని అనుకోవలసిన పనిలేదు. ధారాశుద్ధి లోపించడానికి కవి అభిరుచి విశేషంగాని, ప్రత్యేక ప్రయో జన సాధన గాని, అనవధానత గాని, అశక్తత గాని కారణాలు కావ చ్చును. కొన్ని కొన్ని సందర్భాలలో బుద్ధిపూర్వకంగా ధారను నిర్లక్ష్యం చేసిన కవులను గూర్చి చెప్పకోవాలంటే అందుకు ప్రాచీ నుల్లో తిక్కనను, ఆధునికులలో నారాయణబాబును ఉదాహరించ వచ్చును. శబ్దధారపైగల వ్యామోహంతో భావధారను కుంటుపర చేందుకు కొందరు కవులు ఇచ్చగించరు.

ఒక రచన అప్రయత్న జనితమైన ధారతో ఉద్గమించిందో, లేక ఆలోచన—పునరాలోచన—సంస్కరణ అనే వ్యవధానంతో చెక్క బడిందో గుర్తించడమెలా ? అనే సమస్య ఒకటుంది. స్వచ్ఛమైన— బలప్రయోగం లేని భావన అప్రయత్నంగా, నిరాఘాటంగా వెలు వడిందని సాధారణంగా చెప్పవచ్చును.

''ఆకులో ఆకునై
పూవులో పూవునై
ఈ అడవి దాగిపోనా
ఎటులైన ఇచటనే ఆగిపోనా''[47]

ఈ భావన స్వచ్ఛమైనది. దీని అభివ్యక్తిలో బలప్రయోగానికి ఎక్కడా ఆస్కారం కనబడదు ఉద్రేకాన్ని అభివ్యక్తం చేయడం, ఉద్రేకాన్ని కల్పించడం అనే ప్రాథమిక లక్షణా లీ కవితకున్నాయి. అంతమాత్రంచేత ఇది ప్రయత్న రహితమైన అభివ్యక్తి అనడానికి ప్రమాణమేముంది? కవికి, సహృదయునికి మధ్యనుండే అవగాహన మాత్రమే దీనికి ప్రమాణం. కూర్పులోని సారళ్యం గాని, కాఠిన్యం

గాని ధారయొక్క అప్రయత్న సిద్ధిని గాని, ప్రయత్నసిద్ధిని గాని ప్రమాణ పూర్వకంగా నిర్ణయించలేవు. ఎంకి శృంగార నాయికల వేషాలన్నీ వేయడం ధారాజనితంకాదు. అది ఒక ప్రణాళిక. శ్రీనాథుడికి కాదంబరి, నైషధ, కుమార సంభవాదుల్లోని భావాలు, పదాలు, అలంకారాలు, చమత్కారాలు దొర్లుకొని రావడం పూనిక కాదు; ధార. ఎంకివేషాలూ, శ్రీనాథుడి అనువాదాలూ ఒకస్థాయిలో రూపాంతరాలే. "ఏదో విధమైన శక్తి మమ్మల్ని పూనుతుంది. అదేదో రాయిస్తుంది."[48] అన్న అధివాస్తవికుని మాటకు "నీవు నా యుల్లంబందున నిల్చి యుక్తుల్ సుశబ్దంబు శోభిల్లం బల్కుము"[49] అన్న సనాతనుడి మాటకు అర్థాన్ని-అనర్థాన్ని కూర్చే సిద్ధాంత సంబంధమైన భేదమే గాని మౌలికమైన ధారలో భేదంలేదు. అధివాస్తవిక ధార తెలుగులో ప్రయోగదశలోనే పురిట్లోనే సంధి కొట్టిన తీరుగా తయారయింది. ప్రాచీనుల చిత్రబంధ కవిత్వాలు ధారను అణగద్రొక్కి కుస్తీపట్లు పట్టడం ఎలా జరిగిందో అలాగే ఆధునికు అధివాస్తవిక ధోరణిస్థైర్యం ఆకర్షణీయమైన కవితాధారగా రూపొందలేకపోయింది. ఇదికాక 'చైతన్యధార' అనేది వేరొకటుంది. ఈ ధార నిజమైన ధార అని ప్రణాళికా రహితంగా బాహిరిల్లిన ఆలోచనల సద్యస్పందన అని తెలుగులో ఇంతవరకు నిరూపితం కాలేదు. ఈ కారణాల వలన ప్రయత్నరహితమైన, ధారాపూర్వకంగా అవతరించిన రచన ఇది అని గుర్తించే ప్రత్యేకమైన సూత్రాలంటూ ఏమీలేవని గ్రహించాలి

ధారకు అంతర్ముఖత్వానికి పొత్తు కుదరదు. కొందరు వ్యక్తులు తమ జీవితంయొక్క ప్రకృతిని, అవసరాలను జీవించడం ద్వారానే తెలుసుకుంటారు. సహజంగా ధారాపూర్వకంగా వ్యవహరించే వ్యక్తులు తమ అప్రయత్న పూర్వకమైన భావానుభూతుల కనుగుణంగా వ్యవహరిస్తారు. ఆ కారణంగా తమ చర్యలతో ఇతరులను ప్రతిస్పందింపజేసే సాంఘిక చైతన్యాలుగా మిగులుతారు. వారు ప్రారంభించిన ఉద్యమాలు నిర్దిష్ట లక్ష్యసాధన జరిగేవరకు నిరంతర ధారగా కొనసాగుతాయి. ఆధునికులలో భాషారంగంలో గిడుగు, సంస్కర్తగా కందుకూరి ఈ కోవకు చెందిన వ్యక్తులుగా ఉదాహరింప దగ్గవారు. వారిది ధారాపూర్వకమైన ప్రతిస్పందన. వారి గుండెల లోతుల్లో గాఢంగా పాతుకుపోయిన పూనిక, సంస్కారబలం వారి నిర్విరామ సాధనకు ప్రేరణ అయింది. రచయితల మాట కూడా ఇంతే. వారికి "మహాకవిత్వ దీక్షావిధి" అవసరం. అప్పుడు తిక్కన చెప్పిన "విద్వత్సంస్తవనీయ భవ్య కవితావేశం"[50] సిద్ధిస్తుంది. అక్కడనుండి ఒక విశ్వనాథ, ఒక శ్రీశ్రీ, ఒక చలం పుట్టుకొని వస్తారు గమ్యం నిర్దిష్టమైనప్పుడు కవిత్వంలోని అంతశ్శక్తులన్నీ అటే ప్రవహిస్తాయి.

అ ధో జ్ఞా పి క లు

1 "తస్యాశ్చ హేతుః క్వచిద్దేవతా మహాపురుష ప్రసాదాది జన్యమదృష్టమ్"—జగన్నాథ పండితరాయలు, రసగంగాధరము—ప్రథమాననము.

2 "Poetry is neither a superhuman nor a superficial gift"- A History of Literary Aesthetics in America, Ed Max. I. Baym, P. 25.

3 తంజనగరం తేవప్పెరుమాళ్లయ్య వ్యాఖ్య, వసుచరిత్ర, 1920, పు. 30.

4 వసుచరిత్ర — అవతారిక

5 కావ్యాలంకార సంగ్రహము—1—15.

6 విశ్వకర్మ పురాణము 1—7.

7 "యోయదైవేచ్ఛతి తదైవాలిచ్ఛిన్న వచనః సోఽవిచ్ఛేదీ" రాజశేఖరుడు, కావ్యమీమాంస—పంచమాధ్యాయము.

8 జక్కన, విక్రమార్క చరిత్ర 1—20.

9 రామరాజ భూషణుడు, వసుచరిత్ర—అవతారిక.

10 తిరుపతి వేంకటకవులు, నానారాజ సందర్శనము.

11 రాయప్రోలు సుబ్బారావు, వనమాల.

12 సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి, కావ్యాలంకార సంగ్రహము, పు. 125.

13 "యోమన్త్రాద్యుపదేశవశాల్లబ్ధసిద్ధి రావేశ సమకాలం కవతే స ఆదేశికః" కావ్యమీమాంస — పంచమాధ్యాయము.

14 "మానిషాద ప్రతిష్ఠాం త్వమగమ శ్శాశ్వతీసమాః యత్క్రౌంచ మిథునా దేక మవధీః కామమోహితః" అనే శ్లోకం ఆవేశ జనితం.

15 "ఉండాలోయ్ కవితావేశం—కానీవోయ్ రసనిర్దేశం" శ్రీశ్రీ, మహాప్రస్థానం "బుక్కులు"

16 "Poetry comes from a twofold source - a mysterious inner compulsion and a fully conscious technical discipline"- Elizabeth Drew, Poetry-A Modern Guide to its understanding and enjoyment, P. 156.

17 "మనసులోని ఆలాపన మాటలలో మారిపోవు ఎత్తిన కవితాదీపము—ఒత్తిలేక ఆరిపోవు"—అబ్బూరి.

18 శ్రీశ్రీ—'కవితా! ఓ కవితా!'

19 "It may be retorted that the assemption of spontaniety blocks inquiry..." Eliseo Vivas-creation and discovery, P. 156.

20 అల్లసాని పెద్దన, మనుచరిత్రము.

21 ముక్కుతిమ్మన, పారిజాతాపహరణము.

22 ఘనరతి శ్రమజాత ఘర్మాంబు లార్పంగ నతివకు వీవన వగుదుగాదె" — భాస్కర రామాయణము, కిష్కింధకాండము.

23 "ద్యూతేపణః ప్రణయ కేళిషు కణ్ఠపాశః క్రీడాపరిశ్రమహరం వ్యజనం రతాన్తే" కుందమాల — చతుర్థాంకము.

24 అయ్యలరాజు రామభద్రుడు, రామాభ్యుదయము.

25 శ్రీశ్రీ, మహాప్రస్థానం.

26 "There need be no irreconcilable contradiction between spontaneous feeling and the exercise of judgement" P. W. K. Stone, the art of poetry, P. 63.

27 "Poetry is the spontaneous overflow of powerful feelings."

28 P. W. K. Stone, The Art of Poetry, P. 118.

29 „ „ P. 181.

30 "మనస ఏకాగ్రతా సమాధిః సమాహితం చిత్తమర్థాన్ పశ్యతి" కావ్య మీమాంసా చతుర్థాధ్యాయము.

31 Phosphor Mallam, An Approach to Poetry, P. 61.

32 Wordsworth, Letter to Gilles

33 "A line will take us hours may be,
yet if does not seem a moment's thought,
Our stitching and unstitching has been nought" -Yeats.

34 "ఆవాపోద్ధరణే తావ ద్యావద్దోలాయతే మనః
పదానాం స్థాపితే స్థైర్యే హన్త సిద్ధా సరస్వతీ"
కావ్యమీమాంస—పంచమాధ్యాయము.

35 "నా విన్నవి కన్నవి విన్నవించగా
మాటలకై వెదుకాడగబోతే...

వడిగా వడివడిగా
వెలువడినై
పరుగిడినై
నా యెద నడుగిడినై" శ్రీశ్రీ, 'కవితా! ఓ కవితా!'

36 పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు, శృంగార శాకుంతలము.

37 శ్రీనాథుడు, కాశీఖండము.

38 P. W. K. Stone, The Art of Poetry, P. 53.

39 శ్రీశ్రీ—మహాప్రస్థానం.

40 " "

41 రామారావు—సంపత్కుమార, వచన పద్యం, పు. 5.

42 నారాయణబాబు, రుధిరజ్యోతి-'దేశమాత'

43 రామారావు—సంపత్కుమార, వచనపద్యం, పు. 18.

44 ఆరుద్ర, త్వమేవాఽహమ్—'ఆవాహన', పు. 6.

45 తిలక్, "అమృతం కురిసిన రాత్రి"-'నా కవిత్వం.'

46 శ్రీశ్రీ, మహాప్రస్థానం—'స్విన్ బర్న్ కవికి'

47 దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణశాస్త్రి కృతులు.

48 నారాయణబాబు, రుధిరజ్యోతి—'ప్రవర'

49 పోతన, శ్రీమదాంధ్ర మహాభాగవతము—అవతారిక.

50 తిక్కన, విరాటపర్వము—అవతారిక.

క వి మి త్రు లు

కుమారి జె. వి. సుబ్బలక్ష్మి

కలమును బట్టినంత యతిగారును ప్రాసలవారు వచ్చి సం
చలనముఁ గల్గఁ జేయుదురు; శాంతి వహింపరె యంత వారలున్
"కలఁగక, వెండి, తద్దు, యొగి, గాఢముగా, వెస, నొప్పు, నేర్పునన్"
బతికిన యట్టిచోఁ గవికిఁ బద్యములల్లుట యొక్క కష్టమే!

డా. జి. యస్. మోహన్

బెళ్ళూరి కవితలలో ప్రకృతి చిత్రణము*

'మధురకవి' బెళ్ళూరి శ్రీనివాసమూర్తిగారు తమ కృతులలో చాలవరకు ప్రకృతికి విశిష్ట స్థానమును చూపించినారు. వీరి కృతులను నిశితముగ పరిశీలించిన ప్రకృతి వీరికి 'ఉపాసనా దేవత' అని స్పష్టమగును నేను ఈ వ్యాసమున జాముకోడి, అమృతాభిషేకము, తపోవనము అను వీరి కావ్యముల నాధారము చేసికొని ప్రకృతి చిత్రణమును మీ ముందుంతును. బెళ్ళూరివారి ప్రకృతి పరిశీలనా దృష్టిని ఉదాహరణ పూర్వకముగా వివరించుటకుముందు ప్రకృతి అనగానేమియో, ప్రకృతి—పురుషుడు—సాహిత్యములకు గల సంబంధమేమియో కొంత విశదీకరింతును.

ప్రకృతికి మనిషికి సన్నిహిత సంబంధము గలదు. ప్రకృతి లేనిచో మనిషిలేడు. మనిషి లేకపోయినను ప్రకృతి కలకాలము ఉండ గలదు. కనుకనే మానవుడు ప్రకృతిని అనాదినుండియు ఆరాధించుచు వచ్చినాడు. కవి ప్రకృతిని తన కవితా వస్తువుగా స్వీకరించినాడు. కనుకనే ప్రకృతికి, సాహిత్యమునకు మానవునిద్వారా అవినాభావ సంబంధ మేర్పడినది.

ప్రకృతిని రెండు విధములుగా విభజించిన ఒకటి మానవ అంతఃప్రకృతి, రెండవది బాహ్యప్రకృతి. ఆకాశము మొదలు సముద్రముతో కూడుకొనినదంతయును బాహ్యప్రకృతియే. అనగా ఇంద్రియ గోచరమైన బాహ్యసృష్టియంతయు బాహిర ప్రకృతియే. ఇట్టి ప్రకృతి దర్శనముచే కవికి కలిగిన అనుభూతి స్పందన కవిత్వ రూపమును పొందును. అది కవిధర్మము. భావకవిత్వమున ప్రకృతి కవిత్వము ఒక శాఖ. భావకవుల ప్రకృతి పరిశీలన విలక్షణమైనది; సుందరమైనది కూడ.

బెళ్ళూరివారు సహజముగ భావుకులు. వారి కవితలలో అడుగడుగునను ప్రకృతి తొంగి చూచును. సహజ సుందరము, మృదు మధురము అయిన శైలిలో వారి కవితాధార నడచును.

కవి అయినవాడు తాను గాంచిన దృశ్యమును కన్నులపండువుగా వర్ణించును. అదియే సామాన్యునకు కవికి గల భేదము. 'జాముకోడి' అను కావ్యమున జాముకోడి ఎట్లు ప్రజలను మేల్కొలుపునో, ఏ విధముగ పల్లీయులను ఉత్తేజపరచునో చక్కగా వర్ణించినారు బెళ్ళూరివారు.

'ఏ యెడలన్ ప్రతిధ్వనుల నిచ్చెడు నీ తొలికూత కొక్కొరో
కోయని, నీదు శ్రావ్యతర కూజితముల్ చెవి సోకినంత ప
ల్లీయువ కర్షకుల్ నిదురలేచి పొలమ్ములకేగు దృశ్యముల్
పాయని ప్రేమగొల్పి గరుపాటుగ జేయు మదీయచిత్తమున్'

—సాధారణముగా పల్లెలలో తెల్లవారుజామున తొలికోడి కూత వినుటతోడనే మేల్కొన్న రైతుసోదరులు వ్యవసాయ సంబంధమయిన పరికరములను భుజములపై వేసికొని పొలము పనులకు వెళ్ళుచుందురు. ఆ దృశ్యమును తిలకించినపుడు ఎట్టివాడైనను అనుభూతిని తప్పక పొందును. అట్టి అనుభూతినే బెళ్ళూరివారు కూడ అనుభవించి ఇంత చక్కని పద్యమును అందించినారు.

ప్రకృతి కవిత్వమున ఋతువులకు సంబంధించిన కవితలు వినసొంపుగ నుండును. ఋతువులను గురించి వివరించుచు శ్రీ వేకూరి చెన్నకృష్ణయ్యగారు 'ఆదిమధ్యాంత రహితుడగు విరాట్పురుషుని కాలపురుషునిగ కూడ గణింపవచ్చును. కాలపురుషుని యంగములే ఋతువులు. దృశ్యమాన జగత్తునందలి చైతన్యమునకును, పరివర్తన శీలములగు ప్రకృతి విలాసములకును ఋతువులే కారణభూతములు. ప్రతి ఋతువున కొక విశిష్టత గలదు. ఆ విశిష్టత ప్రకృతిలో ప్రతిఫలించుచుండును. కాలచక్ర పరిభ్రమణమున ఋతు పరిణామము ప్రవర్తిల్లుచుండును. జంగమ స్థావరరూపమగు జగత్తంతయు ఋతుహేల ప్రభావితమగుచుండు'[1] నని పేర్కొనియున్నారు. బెళ్ళూరివారు కూడ ఋతువుల వైశిష్ట్యమును బాగుగా నెరిగిన వారగుటచే, వారు ఋతువులను గూర్చి రచించిన కవితలు వారి భావనాశక్తికి నిలువుటద్దమువలె గోచరమగును. 'శోకాక్రాంతమై తూలు నీ జీవంబన్న గళస్వనంబె పివవచ్చెన్ సర్వదిక్సీమలన్' అని కవి కాలమును గురించి, తన అభీష్టమును గురించి ఇట్లు విన్నవించినారు.

'లలిత మధుమాస శోభల వెలయుదేని
కోకిలమనయి నే పాడు కొందు నచట
నీవు భయద గ్రీష్మంబవై యెసగు దేని
మల్లెపూ దీవనై యట నల్లుకొందు

* బెంగుళూరులో 16-9-1979న 'అభిరుచి' తెలుగు సాంస్కృతిక వేదిక ఏర్పాటుచేసిన 'మధురకవి బెళ్ళూరి కవిత'ల చర్చాగోష్ఠి కార్యక్రమమున చదివిన వ్యాసము.

1 ప్రకృతి–ప్రబంధము, పుట ix

అమల జలధర మాలిక వగుదువేని
చాతకమనయి నీ వెంట సాగివత్తు
పండువెన్నెలగాగ నేర్పడుదువేని
అలచకోరపుఁ బక్షినై పలవరింతు
మంచు కణములుగా నీవు 'మారెదేని
తరణి కిరణం బనై నిన్నుఁ దగులు వడుదు
శిశిర శోభలయందు వాసింతువేని
జీర్ణపర్ణంబనై నిన్నె చేరవత్తు'ననినారు. (జాముకోడి)

ఋతువులలోకెల్లను వసంత ఋతువు శ్రేష్ఠమైనదందురు. లోకమునకు ఆనందమును చేకూర్చునది వసంతము. ఈ కాలమున కోకిలలు రాగాలాపనము గావించును. కనుకనే బెళ్ళూరివారు కాలము లలిత మధుమాస శోభలతో వెలుగునట్లయిన కోకిలనై పాడు కొందుననినారు. కాలము భయమును గొలిపెడి గ్రీష్మాటోపముతో చిందులు ద్రొక్కిన మల్లెపూ తీగనై అచటనే అల్లుకొందుననినారు. గ్రీష్మమున మల్లె పూ తీవలు మనస్సులకు ఉల్లాసమును కల్గించును. వర్షాకాలమున చాతక పక్షివలె కాలమువెంట పోవుదుననినారు. శరదృతువులో పండువెన్నెల కురియును. ఈ సమయమున చకోరపు పక్షినయి పలవరించెద ననినారు. హేమంతమున సూర్యకిరణమై కాలమును అనుసరించెదననినారు. శిశిరమున శిథిలపర్ణమై కాలమును చేరవచ్చెదననినారు. ఇట్లు ఋతు చక్రమును, ఋతు ధర్మమును చక్కగా తెలియచేసినారు మధుర కవులు.

ఇట్లే 'అమృతాభిషేకము' కావ్యములోని 'కర్షక ఋతువులు' అను కవిత బెళ్ళూరివారి ప్రకృతి చిత్రణా నైపుణ్యమునకు మచ్చుతునక. బెళ్ళూరివారు పద్యమును ఎంత చక్కగా అల్లగలరో, అంత కంటెను రమ్యముగా గేయమును మలచగలరనుటకు ఈ గేయము మంచి ఉదాహరణము. ఇది ఖండగతిలో నడచినది.

'భావంబు చిగురింప
జీవితము కుసుమింప
పావన క్షేత్రమ్ము
త్రోవలో నీ యెడద—

ఎన్ని మధుమాసాల వన్నె లొలికించెనో
ఎలుగెత్తి కోకిలము లెన్నెన్ని పాడెనో'

—ఇదియే అచ్చమయిన ఋతుగానము. వృక్షలతాదులు వసంత కాలమున చివురు తొడిగి పుష్పించును. ఇది ప్రకృతిలోని ఋతు ధర్మము. భావమును, జీవితమును చిగుళ్ళతోడను, కుసుమముల తోడను పోల్చి రమ్యమైన కవితను అందించినారు బెళ్ళూరివారు.

అట్లే 'తనువెల్ల చెమరింప
దినమెల్ల శ్రమియింప
అనుగు నాగలి బట్టి
అవని దున్నే నీకు—

ఎన్ని గ్రీష్మర్తువులు హృదయమున దోచెనో
ఎన్ని యెండలు గాచి నిన్ను రాపాడెనో'

—శ్రామికుని దుర్భర జీవితమును కన్నులకు కట్టినట్లు చూపించినారు. ఇట్లే తక్కిన ఖండికలలో కూడ కర్షకులకు, ఋతువులకు గల సంబంధమును మధురముగా చెప్పియున్నారు.

ఉషఃకన్యను 'ఉషోదేవి' అను కవితా ఖండికలో వర్ణించినారు (అమృతాభిషేకము).

'అమలమై లలితమై
సుమవల్లరీ నిచయ
రమణీయ కుంజముల
సుప్రభాత ప్రభలు
సోనలై విరబారె—

తరుశాఖికల మనో
హర కంఠముల నెత్తి
వేదసూక్తులు వోలె
స్వాదు సుందర గీతి
వినిపించె విహగములు

మలయ మారుతము, క
మ్మని సౌరభములతో
సద్యోజనిత కుసుమ
సంచయము విసరినది—

దివ్య సందేశార్థ
దీధితులు వెదజల్లె
కన్నుగవ చిఱునగవు
కదలగ నుషఃకన్య'

— వేద సూక్తులవలె విహంగములు మనోహర కంఠముల నెత్తి స్వాదు సుందర గీతిని వినిపించినవట సుప్రభాత కిరణములు సోనలై విరబారినపుడు. అట్లే మలయమారుతము కమ్మని సౌరభములతో విసరినదట. అప్పుడు కన్నుగవ చిరునగవు కదలగ ఉషఃకన్య దివ్య సందేశార్థ దీధితులను వెదజల్లినదట. బెళ్ళూరి వారి భావచిత్రణమే కాక 'అల్పాక్షరములలో అనల్పార్థ రచన' ఈ కవితలో స్పష్టముగా కన్పించుచున్నది.

'హిమ గిరీంద్రము' అను మరియొక కవితలో (అమృతాభిషేకము) మహర్షులు ఎచట తపము గావించిరో, గంగ ఎచట ప్రవహించినదో, వరూధిని కోరివచ్చినను ప్రవరాఖ్యుడు తన నియమ వ్రతముచే ఆమెను ఎచట తిరస్కరించినాడో, కాళిదాసు ఎచట మేఘ సందేశమును రచించి పేరుతెచ్చుకొనినాడో అట్టి ప్రదేశమైన హిమ గిరీంద్రమును ఆరు ఖండికలలో ధ్యానించినారు మధురకవులు.

'పరమర్షి యాత్మలే
ప్రతిఫలించెడి నెచట ?
పరమ పావన గంగ
ప్రవహించు నెచ్చోట ?
ప్రకృతి కైసేసికొని
పవళించు నెచ్చోట ?

ధ్యానింతు హిమ గిరీం
ద్రము నెడద సంధించి
ప్రేమింతు నమృత భాం
డము పెదవి కందించి

... ...
.. ..
... ...

'సంధ్య' అను ప్రకృతి గీతమున (తపోవనము) కటిక చీకటులను దుఃఖములతో పోల్చినారు.

'కాంక్షలన్నియు మాసి, సుఖమ్ములంత
రించి, తుదకు దుఃఖము లావరించినట్లు
సాంధ్య కాంతులల్లల్లన సమయు కొలది
క్రమ్ముచున్నవి కటిక చీకటులు జగతి'

'సంధ్యారావము' అను కవితలో సంధ్యాకాలమున ప్రకృతిలోని సర్వ జంతు జాలముల స్థితి తెలియచేయబడినది.

'తల్లుల బిలుచు వత్సముల యంబా రవం
బరసి ధేనువులిచ్చు ప్రతి రవమ్ము
బారులుదీరి యంబరవీధి తమ కులా
యముల కేగెడు విహంగారవమ్ము
పొలముల యందు దవ్వులనున్న కర్షక
జనము లొండొరు బిల్చు కొనురవమ్ము
... ...
... ...
శాశ్వత స్థితిని దెల్పి
వలయు పరమార్థముల నెల్ల వెలువరించె
తప్త హృదయాంతరమున సంధ్యారావమ్ము'

అని వర్ణించినారు. గ్రామములలో సాధారణముగా దూడలను గృహములలో వదలివైచి పశువులను గడ్డిమేతకై ఊరిపొలిమేరలకు తీసికొని పోవుదురు. సంధ్యాకాలమగుట తోడనే తల్లుల కొరకు లేగదూడలు 'అంబా'అని అరచుచుండను. ఆకాశమున పక్షులు సాయం సమయమున కిలకిలారవము లొనర్చుచుండును. పొలము నుండి ఇంటికి వెనుదిరిగి పోవుటకై కర్షకులు ఒండొరులు పిల్చుకొనుచుందురు. ఈచప్పుడులన్నియును సంధ్యా కాలమును ఆహ్వానించుచున్నట్లుగా బెళ్ళారి వారు చిత్రించినారు. ఈ కవితలో మనము నిజముగా గ్రామ సీమలను సందర్శించినంతటి అనుభూతిని పొందగలుగుచున్నాము. ఇందు వ్యర్థ పదాడంబర మెచ్చటను లేదు.

'జోహారులు' అను గేయమున పల్లీజీవన చిత్రణము లయ ప్రధానముగా నడచినది. చూడుడు.

'చిగురులు మేసీ
గుబురులఁ గూసే
కోయిల పాటల
తీయదనాలకు —
వర్షకా భ్రములు
వంగి కురిసితే
కొండలలోన, కోనలలోన
వరదలుగా, వాగులుగా
వాహినిగా ప్రవహించే
సెల పాటల —
వేగుజుక్క వెలుగులకు
కోడికూత సొబగులకు
కళావికాసం కల్పించే
కాపు యువకుని
కపిలె పదాలకు —
చేతులు జోడించి
జోహారులు గూర్చి
ప్రకృతిదేవి హృదయములోన
పగలూ రాతిరి కలిగించే
బ్రహ్మానందం చిలికించే
భవ్యమైన నా కవితా గీతం
పాడుకొందు నవ కవితా గేయం'

— అని ఆధునిక గేయమును అందించినారు. ఇట్లు పల్లీ జీవనము లోని విశేషములను ప్రకృతిలో అనుసంధానించుటవలన కవికి పల్లీయ ప్రకృతి పైనను, పల్లీజన ప్రకృత పైననుగల ఆసక్తి వ్యక్తమగు చున్నది. ప్రకృతిని తల్లిగా భావించిన తీరు 'ప్రకృతిమాతకు దీవెన పూల్గు' అను మరియొక గేయమున స్పష్టమగును.

ప్రకృతిని సంబోధించి స్వవిషయమును చెప్పుకొనుట బెళ్ళూరి వారి కావ్యములలో కన్పించును. బెళ్ళూరివారు తమ ఏకైక పుత్ర రత్నమును కోల్పోయిన సమయమున 'సాన్నిధ్యము' అను గీతమును రచించినారు ప్రభాత వేళలో కోకిల గానమును వినిన పితృ హృద యము నైరాశ్య భావముతో ఇట్లు విలపించినది.

(తపోవనము నుండి)

'పాడకుమీ ప్రభాతమున పాడకు కోకిల—నీదు పాటలో
వాడి కృపాణ వర్షములు, వ్రచ్చెడు నా హృదయంబు, పుత్రునిన్
బూడిదవైచి నే శిశిరముం గనుచుంటిని జీవితంబులో
పాడకుమీ ప్రభాతమున పాడకు కోకిల ప్రేమగీతమున్'

ఏకైక పుత్ర విరహ
వ్యాకుల భావంబుతో నిరాశ్రయ భాష్ప
వాకీర్ణమయ్యె జీవిత
మాకలి దహియించు హృదయ మత్యంతంబున్'

— పుత్ర వియోగ దుఃఖమును స్వయముగా అనుభవించుట వలననే ఈ గీతములు ఇంత రక్తికట్టినవి.


ఇట్లు చెప్పుకొనుచు పోయిన బెళ్ళూరి కావ్యములలోని ప్రకృతి చిత్రణ కవితలను ఎన్నింటినైనను వెలికి తీయవచ్చును. ఏమైనను బెళ్ళూరివారు 'ప్రకృతి చారుతకు కయిసేత లిచ్చు', సుకుమార హృదయులు, మధుర కవులనుటలో అతిశయోక్తి లేదు.

భూమ్మీంచి దూకుతొన్నా...

శ్రీ ఏయస్. నాగేశ్వరరావు

బాటసారి !
ఎక్కడినుంచొస్తున్నావు ?
ఎక్కడి కెడుతున్నావు ?
చంద్రుడస్తమించాడు
సూర్యుడుదయించలేదు
కాంతికోసం వెదుకుతూ
సంక్షోభంలో పడుతున్నావా ?
నేను ముందుకు పోతున్నా

భావనల్లో కారు మేఘాలునెట్టి
నేను ముందుకు పోతూనేవున్నా
వ్రేళ్ళతో పాతుకున్న శతాబ్దాల వృక్షాన్ని
కూల్చెయ్యడానికి
ముందుకు పోతూనేవున్నా
పుడమిలో సమసమాజంకోసం సంఘర్షిస్తూ
మున్ముందుకు పోతూనేవున్నా
భూమ్మీంచి దూకుతూన్నా ... !



శ్రీ కుంటిమద్దుల లక్ష్మీనారాయణ శర్మ

కృతక సాధురూపాలు దాఢ్యతా సూత్రం*

0. వ్యవహారంలో ఉన్న సహజ రూపాలు కాలక్రమేణా మార్పు పొందడం సాధారణం. అప్పుడప్పుడూ సరయిన రూపాలూ వాటి స్థానే కొత్త మార్పుల్ని ప్రవేశపెట్టుకొని పునర్నిర్మిత సాధు రూపాలవుతాయి. ఇవే కృతక సాధురూపాలు. ఉదాహరణకి 'దారం' అనే పదాన్ని ఒత్తిపలికి 'ధారం' గా మార్చడం. (ఇందులో అల్ప ప్రాణం సరయినదే. అది తప్పని భావించి మహాప్రాణం చేర్చడం జరిగింది. తద్వారా అది కృతక సాధురూపం అవుతోంది.) సమాజంలో అధమవర్గం వారు (ధనికేతర వర్గం అనుకున్నా ఇబ్బంది లేదు), రాజకీయ, సాంఘిక, ఆర్థిక కారణాల మూలంగా సమాజంలో ఉన్నత వర్గాన్ని అనుకరించడం వల్లనూ, వారితో కలిగే సన్నికర్ష వల్లనూ కృతక సాధురూపాలు ఏర్పడుతాయి. క్రమేపీ ఇవే సాధురూపాలుగా చలామణీ అయే అవకాశమూ లేకపోలేదు. ఉదాహరణకి – ఇప్పటి వ్యవహారంలో ఉన్న 'హారతి' ఒకప్పటి కృతక సాధురూపం. ఇప్పుడు ఎవరైనా 'ఆరతి' అని పలుకుతే అప్రమాణంగా ఉచ్చరిస్తున్నాడని దిద్ది మొదటి రూపాన్ని (హారతి) నిర్దేశిస్తాం. కాని 'ఆరతి' వ్యవహారరూపం. ప్రాచీన కాలంలో ఇతర హకారాది పదాల (ఉదా: హెచ్చు) సామ్యం కారణంగా ఇదీ సంస్కరింపబడి కృతక సాధురూపం పొందింది. అదే కాలం గడిచే కొద్దీ వ్యవహార రూపంగా స్థిరపడింది.[1]

1. కృతక సాధురూపాల్ని అధికాధికంగా ప్రచారంచేసేది వ్యవహారమే అయినా పదిలంగా దాచుకునేది సాహిత్యమే. ప్రాచీన కాలంలో ఏర్పడిన కృతక సాధురూపాల్ని సాహిత్యంలో చూడగలిగితే, వ్యవహారంలో వినగలిగేవి వర్తమాన కృతక సాధురూపాలే. రెంటినీ సంతరించుకొని మధ్యదశకి ప్రతినిధిగా 'ఆశు' సంప్రదాయాన్ని రంగరించుకున్న 'జానపద సాహిత్యం' నిలుస్తుంది. కృతక సాధు రూపాల సృష్టికి కారణాలు ఏమైనా 'ప్రమాణానుకరణాలు'గా వృద్ధి పొందుతాయి. ఉదాహరణకి ఇదివరలో సాంఘిక భాషా ప్రమాణం—వాడుక ఎక్కువగా సంస్కృతంపై ఆధారపడి ఉంటే క్రమేపీ మార్పులకు లోనవుతూ ఇప్పుడు ఆంగ్ల భాషను అనుకరించడంతో తృప్తి పొందుతోంది. అందుకే సాహిత్యంలో 'సంస్కృత భాషా సంబంధమైన' కృతక సాధురూపాలు కన్పిస్తే, వ్యవహారంలో 'ఆంగ్లసంబంధి' కృతక సాధురూపాలు కన్పిస్తాయి. ఇవికాక 'దేశ్య సంబంధి' కృతక సాధురూపాలూ ఉన్నాయి సాహిత్య సృష్టి అధిక భాగం సంస్కృతానుకరణమవడం, వ్యవహారంలో ఆంగ్లానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడమే ఈ ఫలితాలకు ముఖ్య కారణాలు. సరయిన రూపానికి, తప్పు రూపానికీ తేడా తెలుసుకోలేకపోవడమే 'దేశ్య సంబంధి' కృతక సాధురూపాలు ఏర్పడటానికి కారణం.

2. సంప్రదాయ సాహిత్యం, జానపదసాహిత్యం, వ్యవహారం మూడింటి సంబంధాన్ని సూచిస్తే ఇలా ఉంటుంది.

1. (లిఖిత) సాహిత్యం — (ఆశు) జానపదం — వ్యవహారం

పై మూడు విభాగాల్లో కన్పించే కృతక సాధురూపాల లక్షణాలను పట్టిక ద్వారా క్రోడీకరించవచ్చును.

---

* తెలుగు సాంస్కృతిక సమితి, మైసూరు వారు నిర్వహించిన తెలుగు భాషాశాస్త్రం, జానపద విజ్ఞానం సదస్సు (మార్చి 5-7-1980)కు పంపిన వ్యాసపు మరో రూపం.

2. ప ట్టి క

కృతక సాధురూపాలు	సాహిత్యం	జానపదం	వ్యవహారం
1) మహాప్రాణ స్వరాలు : ఉదా : ధట్టంబు (=దట్టంబు) కంఠకము (=గంటము)		+	+
2) హ కారాగమం : ఉదా : హావతి (=ఆవతి) హావము (=ఆవము)	+	+	+
3) వ కారాగమం : ఉదా : వెంకలు (ఎంకలు<ఎముకలు) విస్తనని (=ఇస్తనని)	+	+	+
ఎ) వ కారాగమం – య కు బదులుగా ఉదా : కోవెల (=కోయిల)	+		
4) రేఫాగమం : ఉదా : ద్రేహము (=దేహము) థ్రాణము (=స్నానము)	+	+	
5) చ కారాదేశం : ఉదా : చీతాఫలం (=సీతాఫలం) చేరు (=శేరు)		+	
6) ఇయూ దేశం : ఉదా : తేనియ (=తేనె) నూనియ (=నూనె)	+		
7) ఱ కారా దేశం : ఉదా : బుఱుజు (=బురుజు)	+		
8) మూర్ధన్యీకరణం :			
(ఎ) స ను ష గా మార్చడం : ఉదా : షరే (=సరే)			+
(బి) చ ను ష గా మార్చడం : ఉదా : షాలా (=చాలా)			+
(సి) న ను ణ గా మార్చడం : ఉదా : ఎణభై (=ఎనభై)			+
9) అసంయుక్తాలు సంయుక్తాలవడం : ఉదా : స్తాళి (=తాళి) స్తాంబాళం (=తాంబాళం)		+	+[3]
10) (ఎ) ఫ ను ఫ (=f)గా మార్చడం : ఉదా : కఫం (=కఫం)			+[3]
(బి) జ ను జ (=z)గా మార్చడం : ఉదా : గాజు (=గాజు)			+[3]

[పట్టికలో + గుర్తు లక్షణం ఉండటాన్ని, ఖాళీ లేకపోవటాన్ని తెలియజేస్తుంది. బ్రాకెట్లలో ఇచ్చినవి సరయిన రూపాలు]

2. 1 వీటికీ ప్రమాణ భాషా లక్షణాలకీ[4] చాలా పోలిక లున్నాయి. కృతక సాధురూపాల్లో ప్రమాణ భాషా లక్షణాలు వ్యతిరేకంగా ప్రతిబింబించడం గమనించదగిన విషయం. పట్టికలో సూచించిన లక్షణాలు వరుసగా ప్రమాణ లక్షణాలతో సమానంగా ఛా పొందుతాయి. (1=A, 2=B, 3=D, 4=F, 5=C, 6=F, 8=E, 9=F, 10=H.) ఇవేగాక, అటూ ఇటూ మిగిలిన కొన్ని లక్షణాల విశ్లేషణకు భాషాశాస్త్ర సిద్ధాంతంలోని కొన్ని విషయాల ప్రసక్తి అవసరం.

3. కృతక సాధురూపాల లక్షణాల్లో అధిక భాగం వర్ణాశ్రితాలు కనుక సిద్ధాంత విషయం వర్ణ విభాగానికి సంబంధించిందే అవుతుంది. వర్ణ విభాగం వికాసం పొందుతున్న తొలి రోజుల్లో చామ్స్కీ మొదలైన వారిచే ప్రవేశ పెట్టబడిన నైజ భావమూ **(Naturalness Concept)** (1968), పరివర్తన-వికసనసిద్ధాంతాన్ని అధిగమించి ప్రపంచంలో ఉన్న భాషల వర్ణస్వరూప నైజాన్ని పరిశీలించడంలో ఎన్నో రకాలుగా ముందంజవేసిన నైజ వికసన వర్ణ శాస్త్రజ్ఞుల (నాచురల్ జనరేటివ్ ఫోనాలజిస్ట్స్) దార్ఢ్యతా భావమూ (స్ట్రెంగ్త్) ప్రస్తుత చర్చకు అవసరం. మూలాధార రూపాలు (అండర్ లయింగ్ ఫార్మ్స్) అమూర్తంగా (ఆబ్స్ట్రాక్ట్) ఉండాలన్నది చామ్స్కీ మొ||వారి వాదమైతే మూర్తంగా (కాంక్రీట్) ఉండాలన్నది హూపర్ (1976), ఫాలీ (1977) మొదలైన నైజ వర్ణ శాస్త్రజ్ఞుల మతం.

వర్ణనాత్మక భాషాశాస్త్రంలో నిర్వచించిన వర్ణాలను భేదక లక్షణాలుగా కుదించి చూడటంతో పరివర్తన—వికసన వ్యాకరణం కొత్తదారిలో ప్రవేశించింది. ఉదాహరణకు తెలుగు వర్ణాలు ప, ఫ, బ, భల భేదక లక్షణాలు క్రింది రకంగా ఉంటాయి.

3	ప	ఫ	బ	భ
	+స్పర్శం	+స్పర్శం	+స్పర్శం	+స్పర్శం
	+శ్వాసం	+శ్వాసం	—శ్వాసం	—శ్వాసం
	—మహాప్రాణం	+మహాప్రాణం	—మహాప్రాణం	+మహాప్రాణం

వీటిని గమనించి చూస్తే పై వర్ణాలు చివరి రెండు లక్షణాల్లో భేదాన్ని సూచిస్తున్నాయని తెలుస్తుంది. భాషలో జరుగుతున్న మార్పుల్ని సూత్రాల్లో పేర్కొంటున్నప్పుడు మరింత ప్రభావవంతంగా వర్ణించవచ్చును. ఉదాహరణకు ఫ, భలు విద్యావంతుల ఉచ్చారణ నుంచి ఇతరుల వ్యవహారంలో ప బలుగా మారుతుంటాయన్నది సూత్రరూపంలో ఇలా ఉంటుంది.

4 [+స్పర్శం, +మహాప్రాణం] → [—మహాప్రాణం]

పై సూత్రంలో స్పర్శంలో +శ్వాసం, —శ్వాసం ఇమిడి ఉన్నాయి కనుక తిరిగి సూచించడం సమధికత (రిడండన్సీ). పైకి రెండు వర్ణాలుగా మార్పిడి చెందుతుందని మనం భావిస్తున్నా ఒకే భేదక లక్షణంలో మార్పు వస్తోందని సూచించడమే సూత్రానికి లక్ష్యం.

విశ్వభాషల్లో భిన్న వర్ణ విధానాల్ని పరిశీలించి వర్ణాలను భేదక లక్షణాలకు కుదించిన మీదట ఈ సూత్ర నిర్మాణాలు భాషా స్వభావాన్ని పూర్తిగా బయటపెట్టలేక పోతున్నాయని గ్రహించిన దశలో ప్రకృతితత్త్వాన్ని (నాచురల్ నెస్) పేర్కొనడానికి భేదక లక్షణాల స్థానే నైజభావాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని సాధారణ, అసాధారణ లక్షణాలతో (అన్ మార్క్‌డ్/మార్క్‌డ్) గుర్తిస్తారు. ఎక్కువ భాషల్లో అధికంగా కన్పించే లక్షణాలు సాధారణంగాను, మిగిలినవి అసాధారణంగాను భావిస్తారు. ఉదాహరణకు 'మహాప్రాణ లక్షణం' భారతీయ భాషలకే పరిమితం. కనుక ఇది అసాధారణ లక్షణం. పై సూత్రం ఇలా రూపం మార్చుకుంటుంది.

5 [+ అసాధారణం] → [— అసాధారణం]

ఇదివరలో ఇచ్చిన (4) సూత్రం మీదట (5) సూత్రం ఒకే విషయాన్ని చెప్పున్నా భాషాభేదక లక్షణాల మార్పుతోపాటుగా వ్యవస్థ సామాన్యతకు (సింప్లిసిటీ ఆఫ్ ది సిస్టమ్) దారి తీస్తోందన్న ప్రకృతి సత్యాన్ని ప్రకటిస్తోంది. దీనిద్వారా భాషలో ఉన్న అసాధారణ వ్యవస్థలు సామాన్యంగా సాధారణంగా మారిపోతుంటాయని గ్రహించవచ్చును. కాని ఈ రీతిగా అన్ని వ్యవస్థల్లోనూ సామాన్యత తటస్థిస్తే భాషలో ఒకప్పటికి అసాధారణ లక్షణాలు మిగిలి ఉండవు. ఎప్పటికప్పుడు భాషలో జరుగుతున్న మార్పులు మరికొన్ని వైవిధ్యాల్ని — అసాధారణత్వాల్ని సృష్టిస్తుంటాయి. ఈరకంగా మార్పు సూత్రాలన్నీ బంధక — ప్రతిబంధకాలుగా (ఫీడింగ్ — బ్లీడింగ్) పునరావృత్తమవుతుంటాయి.

పై విషయాలతోపాటు మార్పు ఏ దిశలో జరుగుతున్నదో ఎత్తి చూపడానికి నైజవర్ణ శాస్త్రజ్ఞులు దార్ఢ్యత (స్ట్రెంగ్త్)ను ఆధారం చేసుకున్నారు. దీని ఆధారంగా 'అసాధారణం'నుంచి 'సాధారణం'వైపుకు జరుగుతున్న మార్పుల్లో పాల్గొంటున్న వర్ణాల 'స్థాయి'ని బలవత్తమం, బలవత్తరం, బలహీనంగా గుర్తించవచ్చును. ఉదా: మహాప్రాణం, అల్పప్రాణం వరుసగా (1) అధిక బలం, (2) బలహీనమైనవి (వీక్). (5) సూత్రాన్ని ఈ అంశాల్తో సూచిస్తే క్రిందివిధంగా ఉంటుంది.

6) 1 → 2

సూత్రం చూడటానికి సంఖ్యల్లో కన్పించినా ముఖ్యంగా మూడంశాల్ని సూచిస్తుంది: 1) భేదక లక్షణాలమార్పు 2) అసాధారణత్వాన్నుంచి సాధారణంవైపుకు మారడం 3) బలం స్థాయిలో తేడావలన బలహీనంగా మారడం — ఈ రకంగా (6) సూత్రం భాషాస్వభావాన్ని అత్యధికంగా తెలియజేస్తుంది.

4. ఈ విభాగంలో ముందు (2) చర్చించిన కృతక సాధురూపాలకు (3)వ విభాగంలో చర్చించిన దార్ఢ్యతా సూత్రాన్ననుస

రించి భిన్న 'స్థాయి'ల గుర్తింపు పిలవుతుందో లేదో పరిశీలించబడుతుంది·

ఇదివరలో (2.1) చెప్పిన విషయాన్ని పునరుక్తంగానైనా సాంకేతికంగాను చెప్తే—భాష మార్పు, శిష్టవ్యవహారంనుంచి జానపదుల (శిష్టేతరుల) భాషలోకి అసాధారణంనుంచి సాధారణానికి లేదా అధికబలం నుంచి బలహీనానికని, కృతక సాధురూపాల్లో అయితే మార్పు వ్యతిరేకదశలో సాధారణంనుంచి అసాధారణానికి లేదా బలహీనంనుంచి అధికబలంవైపుకి జరుగుతున్నది తెలుతుంది.

కృతక సాధురూపాల లక్షణాల స్థాయి తద్వారా ఉత్పాదకశక్తి (ప్రొడక్టివిటీ) పరిశీలనకు అసాధారణ భావం (మార్క్‌డ్‌నెస్ కాన్‌సెప్ట్) ఉపయోగపడదని దార్ఢ్యతాభావం విషయ పరిశీలనకు అనువుగా ఉంటుందని గ్రహించడం జరిగింది. ఇందులో ప్రమాణ భాష నుంచి అప్రమాణ భాషలో జరిగే మార్పులు బంధక ప్రక్రమాలు (ఫీడింగ్ ప్రాసెస్)గాను, కృతక సాధురూపాలు ప్రతిబంధక ప్రక్రమాలుగాను (బ్లీడింగ్ ప్రాసెస్)[5] నిర్వచించుకోవచ్చును.

భిన్న స్థాయిల్ని కృతక సాధురూపలక్షణాల్లో నిర్ణయించే ముందు వర్ణాల—సముదాయాల దార్ఢ్యతను నిర్ణయించుకోవాలి.[6] లోగడ పట్టిక (2) లో ఇచ్చిన కృతక సాధురూపాల లక్షణాలన్నీ బలహీనం → బలవత్తమంవైపుకు జరిగే మార్పుల్ని సూచిస్తున్నా 'దార్ఢ్యత' కొలతలో కొన్ని అభిప్రాయ భేదాలను, మరికొన్ని అంశాలను చేర్చాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది.

5వ లక్షణం (సకార రూపాలు చకార కృతక సాధురూపాలుగా మారడం) ప్రమాణ, అప్రమాణ వ్యవహారంలో చకారంనుంచి సకారంగా మారడాన్ని తెలియజేస్తుంది.

కృతక సాధురూపాల్లో	అప్రమాణ వ్యవహారంలో
స → చ	చ → స
[బలహీనం] → [బలవత్తరం]	[బలవత్తరం]→[బలహీనం]

కాని ఉషాదేవి (1978) [ఫుట్‌నోట్ నెం. 6 (2) ఈ వ్యాసంలో] విభజనలో వ,సలలో స బలవత్తరంగాను, చ బలహీనంగాను వర్ణింపబడింది. ప్రస్తుత ఉదాహరణలు ఈ అభిప్రాయానికి వ్యతిరేకోదాహరణలుగా నిలుస్తాయి. మానంలో స్పర్శాల తర్వాత తాలవ్యాల్ని గుర్తించాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది సందర్భం.

ఇదేకాక మరికొన్ని విషయాల్ని 'దార్ఢ్యత' మానానికి అదనంగా చేరుస్తున్నాయి కృతక సాధురూపాల లక్షణాలు.

7వ లక్షణం (ర → ఱ) అప్రమాణ వ్యవహారంలో(ఇప్పటి ప్రమాణ వ్యవహారంలోనూ) ఱ→రగా ఉంటుంది. వీటిలో ఱ (కంపితం) బలవత్తరంగాను రేఫాన్ని (తాడితం) బలహీనంగాను గుర్తించాలి. 9వ లక్షణం (అసంయుక్తాలు, సంయుక్తాలుగా మారడం) అప్రమాణ వ్యవహారంలో హ^1 హ^2 → హ^1 హ^1 లేదా హ^2 హ^2 లేదా హ లేదా హఅహలు హల్సమీకరణమో, అసంయుక్తాలుగానో లేదా స్వరభక్తి రూపాలుగానో [ఉదాహరణలకు ఈ వ్యాసంలోని ఫుట్‌నోట్ 4 (F) చూడవచ్చును] మారుతాయి. వీటి 'దార్ఢ్యం' ఈవిధంగా ఉంటుంది ·

హ^1 హ^2	హ^1 హ^1 , హ^2 హ^2	హ/హ^1 అహ^2
1	2	3
బలవత్తమం	బలవత్తరం	బలహీనం

పదవలక్షణం ఆదాన వర్ణాలకు సంబంధించింది. భాషాస్వభావం సాధారణ విషయాలకు భిన్నంగా అసాధారణంగాను / బలవత్తమంగాను (మార్క్‌డ్ / స్ట్రాంగ్) కన్పిస్తోంది. ఫ, జలు (ఊష్మాలు) అప్రమాణ వ్యవహారంలో ప, జలు (స్పర్శాలు)గా మారుతాయి. సాధారణంగా స్పర్శాలు (బలవత్తమం) ఊష్మాలుగా (బలహీనాలు) [ఫుట్‌నోట్ 6 (2) చూడండి] మారుతాయి. ఈ సందర్భం ఇందుకు వ్యతిరేకంగా కన్పిస్తోంది ఇవి ఆదాన వర్ణాలవడం, సమీప ఊష్మాలు దేశ్యవర్ణమాల లేకపోవడం దీనికి కారణంగా చెప్పుకోవచ్చును.

ఇప్పటివరకు చర్చించిన విషయాలు ఒక్కో లక్షణంలో ఇమిడిఉన్న 'దార్ఢ్యత'ను సూచిస్తాయి. అంతర్లక్షణాలకు 'దార్ఢ్యత'ను క్రిందివిధంగా తెలియపరచవచ్చును.

2 3 1	4 9 5 6	8 7 10
బలహీనం	బలవత్తరం	బలవత్తమం

కృతక సాధురూపాల లక్షణాలకు రూప ఉత్పాదక శక్తిని (ఫార్మ్ ప్రొడక్టివ్ కెపాసిటీ) అనుసరించి చేయబడ్డాయి. 'బలహీన' లక్షణాలు అధిక ఉత్పాదక శక్తి కలవిగాను, 'బలవత్తమ' లక్షణాలు మరీ తక్కువ ఉత్పాదకశక్తి కలవిగాను ఉంటాయి. ఇవే సాధారణ (అప్రమాణ) వ్యవహారంలో 'వ్యతిరేకంగా' ప్రతిబింబిస్తాయి.

10, 7, 8,	6 5 9 4	1 3 2
బలహీనం (అల్పఉత్పాదకశక్తిగలవి)	బలవత్తరం	బలవత్తమం (అధికఉత్పాదక శక్తిగలవి)

5. కృతక సాధురూపాలపై సాగిన సుదీర్ఘ చర్చను సంగ్రహంగా ప్రస్తావిస్తే ముఖ్యంగా మూడుంటాయి. తెలుగు భాషలో సంభవించే కృతక సాధురూపాలను (సాహిత్యం, జానపద వాఙ్మయం, వ్యవహారంలో ఉన్నవి) ఒకే పట్టికలో సమకూర్చడమే కాక వాటిలో భాషాస్వభావం ఎలా ప్రతిబింబిస్తున్నదో తెలియజెప్పడం జరిగింది. దీనికోసం దార్ఢ్యత భావాన్ని వర్ణవిభాగాన్నుంచి ఎరవు తెచ్చుకోవడం

జరిగింది. తద్వారా రూపాలను సున్నితంగా (డెలికేట్) వివరించడం జరిగింది. అంతేకాక ప్రమాణ లక్షణాలకుగల సంబంధాన్ని పేర్కొనడమూ వ్యాసానికి అనుస్యూతంగా ఉన్న మరో ప్రయోజనం. వీటిని వివరించడంలో వ్యాసకర్త ఏమాత్రం కృతార్థుడైనా వ్యాస ప్రయోజనం సిద్ధించినట్లే.

References

Chomsky, N., Morris Halle. 1968 The sound pattern of English, Harper & Row publishers, Newyork,

Donappa, T. 1971 "Hyper forms in Literary and Colloquial Telugu" in Proceedings of 1st All India Conference of Linguists, Poona.

Foley, J. 1974 Foundations of Theoretical Phonology, CVP London.

Hooper, J. B. 1976 An Introduction to Natural Generative phonology, Academic press, Newyork.

Krishnakumari, N. 1977 తెలుగు జానపదగేయ గాథలు—నాగార్జున నగర్, హైద్రాబాదు.

Krishnamurthi, Bh. 1974 (ఎ) "తెలుగు మాండలికాలు – ప్రమాణభాష," కృష్ణమూర్తి (1974) లో.

1974 (బి) (సం) తెలుగు భాషా చరిత్ర—ఆం. ప్ర. సాహిత్య అకాడెమీ, హైద్రాబాదు.

Laxminarayana Sarma, K. 1980 "వర్ణవిభాగంలో వర్ణాల క్రమ సూత్రాలు" అముద్రిత వ్యాసం.

Ramarao, C. 1974 'ఆధునిక భాష : సంగ్రహవర్ణనం' కృష్ణమూర్తి (1974)లో

Sivananda sarma, P. 1977 "Hyper corrections in Telugu : A sociolinguistic study" in Seminar on Sociolinguistics, Telugu Academy, Hyderabad.

Ushadevi, A. 1978 "A Typological study of Dravidian Morphophonemics" Unpublished M.Phil monograph, Osmania University, Hyderabad.

అధోజ్ఞాపికలు

1 దోణప్ప (1971) సాహిత్యంలోనూ, వ్యవహారంలోనుగల కృతక సాధురూపాలను సమీక్షించారు. మరికొన్ని ఉదాహరణలు ఇందులో లభిస్తాయి.

2 కృతక సాధురూపాల లక్షణాలను, ఉదాహరణలకు ఆయా విభాగాలకు సాహిత్యానికి దోణప్ప (1971)ను, జానపదానికి కృష్ణకుమారి (1977)ని, వ్యవహారానికి శివానందశర్మ (1977)ని రచయిత సంప్రదించారు. జానపద గేయ సాహిత్యంమీద చేస్తున్న పరిశోధనరీత్యా కొన్ని లక్షణాల్ని ప్రతిపాదించాడు.

3 రామారావు (1974--352, 353) (పై పట్టికలో ఇచ్చిన 9, 10 లక్షణాలను) 'నొక్కి చెప్పాల్సివచ్చినప్పుడు' [తీవ్రత (Intensity) అని ఉద్దేశ్యం కాబోలు!], 'ఉర్దూ, ఇంగ్లీషు భాషావ్యవహారంగాను', 'ఊష్మోచ్చారణగాను' అభిప్రాయపడుతున్నారు. ఇవి కృతక సాధురూపాలని ఈ వ్యాస రచయిత విశ్వాసం.

4 (ఎ) వత్తులు నిల్పడం / నిల్పకపోవడం: ప్రమాణం (ప్ర) / అప్రమాణం (అ. ప్ర) ఉదా : భాగవతం / బాగవతం; (బి) హకారం : ప్ర. రోహిణి, అ. ప్ర. రోయిణి; (సి) అద్విరుక్త చకారం : ప్ర. చవుడు, అ. ప్ర. సవుడు; (డి) పదాది వకారం (ఇ, ఈ, ఎ, ఏ ల ముందు): ప్ర. విల్లు, వీధి, వెండి, వేడి, అ. ప్ర. ఇల్లు, ఈది, ఎండి, వడి; (ఇ) శ, ష, సల భేదం : ప్ర. శాస్త్రి, భాష, కాసు అ. ప్ర. సాస్త్రి, బాస, కాసు; (ఎఫ్) సంయుక్త హల్లులు : ప్ర. భక్తి అ. ప్ర. బత్తి, బకతి. (జి) మూర్ధన్య, దంత మూలీయ భేదం: ప్ర. పల్లం: పళ్లెం, దాన్ని: వాణ్ణి. అ. ప్ర. పల్లం: పల్లెం, దాన్ని: వాన్ని; (హెచ్) ప, ఫల భేదం : ప్ర. ఆఫీసు, కాఫీ అ. ప్ర ఆపీసు, కాపీ (ఐ) పదాది గకారం: ప్ర. గట్టు, గడ్డ. అ. ప్ర. గెట్టు, గెడ్డ [వివరాలకు కృష్ణమూర్తి 1974 : 398, 399]

5 ఇదే రచయిత రాస్తున్న (1980) మరో వ్యాసంలో వర్ణ విభాగంలోని సూత్ర వైవిధ్యాల్ని, పునరావృత్తత, వర్ణాల క్రమ వివరాల్ని గమనించవచ్చును.

6 ద్రావిడ భాషా ఉపకుటుంబంలో (SDr II) సంధి విధానాల్ని తెలియపరిచే నిమిత్తం ఉషాదేవి (1978) 'దార్ఢ్యత' ఉపయోగించి వర్ణాల్ని తెలుగుకు విడదీసి చూపింది. అవి :

1)

ఉ^{1}	ఇ^{2} అ^{3}	ఎ^{4} ఒ^{5}
బలహీనం	బలవత్తరం	బలవత్తమం

(పు.68)

2)

ల^{1}	న^{2} ర^{3} చ^{4} స^{5}	ప^{6}
బలహీనం(బ^{1})	బలవత్తరం(బ^{2})	బలవత్తమం (బ^{3})

(పు. 71)

ల=పార్శ్వికాలు, న = అనునాసికాలు, ర = తాడితం, చ = **తా**లవ్యాలు, స = ఊష్మాలు, ప = స్పర్శాలు*

3)

ట^{1}	ళ^{2}	అ^{3}
(బ^{1})	(బ^{2})	(బ^{3})

అ = మూర్ధన్యాచ్చు, ట = మూర్ధన్య స్పర్శాలు, ళ= మూర్ధన్య పార్శ్వికం. (పు. 74)

4)

+**మూ**ర్ధన్యం^{1}	^{2}—మూర్ధన్యం
(బ^{3})	(బ^{1})

* స్పర్శాల్లో నాదాలు (బ^{1}) శ్వాసాలు (బ^{3})గా విభజించవచ్చును. (పు. 72)

ఈ **ఫుట్**నోట్‌లో బ్రాకెట్‌లో ఇచ్చినవి అదనంగా వ్యాస రచయిత సౌలభ్యంకోసం చేర్చినవి. ఇదేకాక మహాప్రాణం (బ^{3}) అల్పప్రాణం (బ^{1})గా గుర్తించవచ్చును.

రెండూ వొక్కటే

శ్రీ కె. ఎస్. రమణ

నేనూ
చీకటి **పొ**డుగు కురుల్లో
చిక్కుకొని
నక్షత్రాల తళతళల కేసి
కళ్ళప్పగిస్తున్నవాడ్నే —
నా గెలుపు నా వోటమి
నా సంఘర్షణ నా సందేహం
నా వుద్రేకం నా వున్మాదం
చివరికి **మౌ**నలీన రాగాలై
నాలో నేనే
గొంతు పెగలని పాటలా
విచ్చుకోని మొగ్గలా
నిశ్శబ్దపు ముద్దలా ఐన
హృదయాన్ని —
కదిలించే కరిగించే
తుఫాను హోరుకోసం
తుషార సుధాధారకోసం
నిలువెల్లా నిరీక్షణగా
మూర్తీభవించిన **వా**డ్ని —
ప్రమోదమో విషాదమో
నిశాంతంలా దివాంతంలా
గొంతుకి అడ్డుపడే చరణంలా
వుంటానికి యిష్టపడను
వుషో నిశో
మృత్యువులా నన్ను
ఏమీ మిగలకుండా కావిలించుకోవాలని
ప్రణయాకాశపు అంచులకో
వియోగాగాధ**పు** లోతులకో
నన్ను విసిరివేయాలని వాంఛించేవాడ్ని —
నీడల జాడలు లేని
వాస్తవగాఢతలో
చీకటో
వెలుగో
రెండూ వొక్కటే ...!

కలగూరగంప

'భారతి' మే 1980 సంచికలో శ్రీ రామచంద్రగారు వజ్జా లగ్గంలో కొన్ని మాటలని పోలిన తెలుగు పదాలని గురించి చెప్పారు.

వాటిని పోలిన ఇంగిలీషు ఇతర భాషల మాటలనీ కొన్నిటిని నేను చెబుతాను !

1. వింతర — ఇం 'వండర్' తో సంబంధం కల ఇతర యూరోపు భాషలలో మాటలని పరిశీలిస్తే బాగా ఉంటుంది.

2. వట్టు — ఇం. 'వేస్‌ట్'.

3. ఓ — దీనిని గురించి వేరే చెప్పాలా ?!

4. కసరక్కా — ఇం. 'కాస్టిక్' వగయిరా.

5. తలిన్‌హి — ఇం. 'టెండర్'.

6· విసూరణం — ఇం విస్పర్, హూష్ మొదలయినవి.

7. దే — ఇం. 'ఇట్'కి అర్థం ఏ పెద్ద ఇం. నిఘంటువులో చూసిన ఎన్నో ఆలోచనలు వస్తాయి.

8. నడిజ్జను — శ్రీ రామచంద్రగారి అర్థమే తీసుకుంటే అనాల్జెసిక్, అనిహిలేట్. నల్లిఫయ్' ఎగయిరాలు గుర్తుకిరావచ్చు!

9. వాటు — 'కథయతి' అన్న సంస్కృతంమాటని జర్మనీ భాషలో 'జాగ్‌టో' అంటే ఇంగిలీషులో 'సేస్' అంటారు కదా ?

10. పిల్ల— ఇగి ప్రాకృతం మాట అని కీ.శే. వయ్యాపురి పిళ్లెగారు తమ తమిళసాహిత్య చరిత్రలో అన్నారు. ఫ్రాన్సు భాషలో Fils, Fille లో కూడా ఇలాగ లేవూ ?

11. చంపిఊణ— ఇం. 'క్రాంప్' గుర్తుకి తెచ్చుకోవచ్చు...

12 తుకతుక, 13. గరగర గురించి ప్రత్యేకంగా సేందుకు ఏమీలేదు !

14. తవణి — 'తరవాణి'ని తాగుతారా తింటూరా? కేవలం తమాషాకి చెప్పాలంటే — ఫ్రాన్సు భాషలో 'త్రాన్‌ష్' అంటే తినే పదార్థం ముక్క. స్పెయిన్ భాషలో tortilla అంటే అట్టు. ఫ్రా. భా. లో tarte అంటే ఒక రకం రొట్టె అనుకోవచ్చు. tartine (ఫ్రా. భా.) అంటే తియ్యది ఏదయినా రాసిన రొట్టె ముక్క.

ఇటలీ భాషలో Stracchino అంటే మేకపాలతో చేసిన విరుగుడు తినుబండారం.

15. విలయా — ఫ్రా. భా. లో Fille అంటే అమ్మాయి! ఇం. లో కూడా 'ఫిల్లీ' అనే పదం ఉంది కదా ?

16 ఉబ్బేఉ — దీనిని గురించి ప్రత్యేకంగా రాసేందుకు ఏమీలేదు.

17. కాణా — ఇం. లో Ren సంగతి ?

18. బోలిఓ — హా! ఢాంప్! లాంటి వాటిని గురించి ఏమి రాయగలరు ఎవరయినా ?

19 ఢలియా — ఇం లో 'రోల్' ఉంది.

20. కర — హిందీ (!) లో 'ఖరాబు' సంగతి ఏమిటి ? ఇం. లో 'స్కార్' వ్యుత్పత్తి ఏమిటి ?

21. పెరడు— తమాషాగా చెప్పాలంటే ఇం. బాక్‌యార్డ్ కూడా ఉంది !

22· జూర్ ఇ 23 ఢురు ఢులంతో లు సయితం ఢాంప్, ఢూంప్ లాంటివే అయితే చెప్పేందుకు ఏమీలేదు !

ఏ భాషని తీసుకున్నా దానిలోని కొన్ని మాటలని పోలినవాటిని ఇంకే భాషలో నయినా వెతికి పట్టుకోవచ్చు. [talr తురక లేదా టర్కీ మాటలని చదివాను ! Cheque పారశీక పదంట ! Compound Wall ఆగ్నేయ ఆసియా ప్రాంతం నుంచి వచ్చిన మాటలు...]

1973లో జర్నల్ ఆఫ్ ది రాయల్ ఏషియాటిక్ సొసయిటీలో రాస్తూ ప్రా. బర్రో 'అసుర'అనే పదం సంస్కృతం 'ఈశ్వర' యొక్క బంధువే అని రాశారు. అసురలని గురించి ఎందరో చెప్పిన సిద్ధాంతాలన్నిటినీ ఆయన తోసివేశారు ...

గంటి రామలింగం

శ్రీనాథకవి - గాథాసప్తశతి

అతి చిరంతన కాలములో ఆంధ్రులకు అభిమాన గ్రంథములు రెండు.[1] అవి ఆంధ్ర చక్రవర్తి హాల సంకలన కృతి 'గాథా సప్తశతి'; ఆస్థానకవి గుణాఢ్య నిర్మిత 'బృహత్కథా.' మొదటిది ప్రక్షిప్త మశూచికము సోకినను, విరూపముగ నైనను సంపూర్ణముగ ఉపలబ్ధము. రెండవది శతాబ్దముల క్రిందటనే అంతరించుట మిక్కిలి బాధాకరము. సంస్కృత భాషాంతరీకరణలలో బృహత్కథ అరగొరగ నేడు లభించుచున్నది.[2]

వాగ్దేవీదత్త వరప్రసాదుడు, సకల విద్యా సనాథుడు అగు శ్రీనాథ కవి సార్వభౌముడు 'నూనూగుమీసాల నూత్నయౌవనము'న నొడివిన "శాలివాహన సప్తశతీ"[3] ఆంధ్రుల దురదృష్టమున అంతరించినది.

కవి వత్సలుడు, ఆన్ధ్రరాజు శాలివాహన చక్రవర్తి — ఆస్థాన కవులలో ఒకడగు శ్రీ పాదలిప్తాచార్యుని సాయమున 'గాథా సప్తశతి'ని సంతరించెనని ప్రతీతి.[4] సుమనో రుచ్యమగు ఈ చతుర ప్రాకృత కావ్యము నేడు అఱు ముఖ్య పాఠములతో లభ్యమగుచున్నది. భోజమహారాజు నిర్మిత ''శృఙ్గార ప్రకాశనవ్‌''లో 'గాథా సప్తశతి' భద్రపరచబడినది.[5] ఘుణములు చేసిన అత్యాచారముల వలన పెక్కు ప్రాకృత గాథలు దురవబోధములై ఉన్నవి.

కవిరాజు ఆన్ధ్రీకరణ నేడు లుప్తమైనను, మనకు ఐదు పద్యములు మాత్రము అన్యత్రా భద్రపరుపబడినవి. లభించిన పద్యములలో ఒకటి అవతారికలోని వినాయక స్తుతి.

ఆన్ధ్ర దేశములో ప్రచలితమైన 'గాథా సప్తశతి' పాఠమును అనుసరించియే శ్రీనాథకవి తెనిగింపు జరిగినది.

అవతారికలోని పద్యమును ప్రాతఃస్మరణీయులగు శ్రీకవిగారు ప్రకటించిన 'ప్రబన్ధమణి భూషణం' కూడ ఉటంకించుట గమనార్హము. దీనిని శ్రీకవిగారే గుర్తించుట చేత,[6] శ్రీవారి వద్ద దీని తాళపత్రి (అసమగ్రముగ) గలదని విశ్వసింప వచ్చును. ఆ విఘ్నేశ్వర ప్రార్థన ఇది

ఇంచిన బాలకేళిఁ బర
　　మేశ్వరు జూట కిరీట కోటిఁ గీ
లించిన చన్ద్రరేఖఁ గబళింప
　　మదిం దిలకించి గౌరి లీ
లాంచిత ఫాలవీధి విక
　　టాకృతిగాఁ గదియించి ముద్దులం
మించు నటించు దన్తి ముఖు నిం
　　ప్రణుతించెద నిష్టసిద్ధికిన్.

ఇక లభించిన నాలుగు పద్యములు, ప్రాకృత గాథలు తోడి దిగువ ఇవ్వబడును.

జంఝు వాదుత్తణ్ణి కిద
గహ వివర పలోట్ట సలిల ధారా ఇం।
కుడ్డలి హిద ఓహి దివసం
రక్ఖది అజ్జా కరతలే హిం॥

పటు జంఝూ పవనోత్తృణాలయములో
భద్రంబుగం బట్టి కం
కటిపై ముచ్చ ముడింగి నిర్భర వియోగ
గ్లాని శోషించి యె
క్కటి నిద్రించుచున్న పాంథ వనితన్
గర్జావచః ప్రౌఢిమన్
తటి దుద్ద్యోతము చూపు నట్టనడురే
ధారా ధర శ్రేణికిన్.

విక్కిణది మాహమాసమ్మి
పామరో ప్పావరణం బయిల్లేన।
ణిద్ధూమ ముమ్ముర వియ
సామలీం ధణో ప్పేఛ్ఛంతో॥

మాఘ మాసంబు పులివలె మలయుచుండ
పచ్చడంబమ్ము కొన్నాడు పసరమునకు
ముదిత చన్నులు పొగలేని ముర్ముగములు
చలికి నొరగోయ కేలుందు సైరికుండు.[7]

కస్స వ ణ భోది రోసో
దట్ఠూణ ప్పియా సవ్వణ అహరం।
సబ్భమర ప ఉమ ఘా ఇరి
వారి దవామే సహసు ఏహ్ణిం॥

వారణసేయ దావగొన వా
　　నవ వారిజ మందు తేటి క్రొ
వ్వారుచు నుంట నీ వెఱుగవా
　　ప్రియ వా తెఱగం టఁ గంటి కె
వ్వారికిఁ గెంపురాదె తగవా
　　మగ వారల దూర నీ మగం
డారసి నీ నిజం బెఱుగు
　　నంతకు నంతకు నోర్వు నెచ్చెలీ.

లచ్ఛి దుహిదా, జామాదో
హరి, తస్స గహిణీ అ గంగా।
అమియ మియంకా సుదా అ
హంహో కుడుంబం మహదహిణో॥

ఆగయ జీవనం బమృత,
మల్లుడు విష్ణువు, సొమ్ములన్నియున్
సారవు రత్నము, ల్కొడుకు
చన్నుడు, కూతురు లక్ష్మి, ఆలు భా
గీరథి, తా సముద్రుడు అని
కీర్తన సేయుదు రెల్లవారు, నా
క్షీర పయోధి నన్యులకుఁ
జెల్లునె యిట్లు సమస్త భాగ్యముల్।[8]

శ్రీనాధుని తెనిగింపు పూర్తిగ లభింపకపోయినను, కనీసము ఆన్ధ్ర గాథా సప్తశతి యందలి పంచ రత్నములు మనకు మిగిలినందుకు సన్తోషించుదాము. ఏష్యములో ఆ చతుర కృతి బయట పడునని పేరాస పడుదుము గాక.

జ్ఞా పి క లు

1　గానట బీసపే చదివి గాథలు త్రవ్వ తెనుంగు వారికిన్ ... ... శ్రీ లక్ష్మీ నృసింహావతారము – ఎఱ్ఱయ కవి

(అవతారిక) గానట — గాథా సప్తశతి
బీనట — బృహత్కథా

2 'బృహత్కథా' పైశాచీ మహాప్రబంధమునకు మొదటి భాషాంతరీకరణ 'వసుదేవ హిండీ.' సంఘదాస ప్రణీతమయిన శౌరసేనీ ప్రాకృత నిబద్ధము. బుధస్వామి ప్రణీత "బృహత్కథా శ్లోక సంగ్రహము"; సోమదేవ భట్టసూరి వినిర్మిత "కథా సరిత్సాగరము"; క్షేమేన్ద్రకృత "బృహత్కథామఞ్జరీ" — ఇవి సంస్కృత రూపాన్తరములు.

వీటిలో బుధస్వామి రచన గుణాఢ్యుని గ్రన్థమునకు మిక్కిలి సమీచీనముగ ఉన్నదని విమర్శకుల తలంపు.

3 ౨౫-౪-౧౯౭౨-న ఓరుగల్లులో జరిగిన కాకతీయ మహాసభ సన్దర్భంగా ఏర్పాటైన పుస్తక ప్రదర్శన యందు అమూల్యమగు తాళపత్రులు ప్రదర్శింపబడినవి. అందు శ్రీనాథ ప్రణీత 'శాలివాహన సప్తశతి' గూడ కలదు. ఇప్పటికైనను తెలంగాణ ప్రాంతంలో ఎచ్చటనో అది దాగి ఉండునని నా ఆశ.

4 "హాలే నోత్తమ పూజయా కవి వృషః
శ్రీ పాలితో లాలితః . ..." —

అభినన్దకవి ప్రణీత 'రామ చరితమ్—౧౨.౧౦౦'మఱియు శ్రీ ఆదినాథ ఉపాధ్యే పరిష్కరించిన "లీలావదీ" ఉపోద్ఘాతము — పుట ౫౧. (శ్రీ పాలితుడు 'తరంగలోల' అను శృఙ్గార కావ్యమును రచించినాడు నేడది లుప్తము.)

5 డాక్టరు రాఘవన్ (౧౯౦౮ — ౧౯౭౯) గారి సిద్ధాన్త గ్రన్థము 'Bhoja's Sringara prakasa—పుట ౮౨౨. (మద్రాసు ౧౯౬౩).

6 చూడు కవిగారి వ్యాసము "సంస్కృత భాషలోని కొన్ని విస్మృత నాటకములు" (మానవల్లి కవి — రచనలు, హైదరాబాదు—౧౯౭౨.) .. "పెక్కు నాటకములు మాకు దృష్టి గోచరములైనను వానిం జదువ నవకాశము లేమిం జేసి" ...

7 ఈ రెండు ఆన్ధ్రీకరణ పద్యములు క్రీడాభిరామంలో చోటు చేసికొన్నవి. (౬౦, ౨౬౨ పద్యములు - మద్రాసు ౧౯౭౨, ఎమెస్కో ప్రతి.)

8 శ్రీ ఇప్పగుంట సాయిబాబాగారి వ్యాసము "గాహారతణ కోసం" — అక్టోబరు భారతి (౧౯౭౯) చూడవలెను.

ఉ ప జీ వ్య గ్ర న్థ ము లు

౧ "గాథాసప్తశతీ" — భావలేశ ప్రకాశికా వ్యాఖ్యతో
సం॥ శ్రీ దుర్గాప్రసాద +
శ్రీ పనశికర
బొంబాయి ౧౮౮౯.

౨ "సప్తశతీ సారమ్" — భావ దీపికా వ్యాఖ్యతో
సం॥ ఆచార్య ఆదినాథ ఉపాధ్యే
కొల్హాపురం ౧౯౭౦.

౩ హిన్దీ గాథా సప్తశతీ — 'ప్రకాశ' హిన్దీ వ్యాఖ్యతో
సం॥ జగన్నాథ పాఠక
వారణాసి ౧౯౬౯.

౪ "శాలివాహన గాథా సప్తశతీ సారము"
తెనిగింపు —
శ్రీ రా. అనన్తకృష్ణశర్మ
హైదరాబాదు ౧౯౬౪.

౫ "ఆన్ధ్ర గాథా సప్తశతి"
ఆన్ధ్రీకరణ :
శ్రీ నరసింహశాస్త్రి
తెనాలి ౧౯౫౬.

౬ "కన్నడ గాథా సప్తశతి"
శ్రీ ఎస్వీ. పరమేశ్వరభట్ట
మైసూరు ౧౯౬౬.

౭ "మరాఠీ గాథా సప్తశతి"
శ్రీ ఎస్. ఏ. జోగలేకర్
పూనా ౧౯౫౬.

శ్రీ ఇప్పగుంట సాయిబాబా

పురిపండాతో ముఖాముఖి....

[బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి, దేశభక్తుడు, వ్యవహార భాషావాది, విమర్శకుడు, విశిష్ట అనువాదకుడు అయిన కళాప్రపూర్ణ డాక్టర్ పురిపండా అప్పలస్వామిగార్కి ఏప్రిల్ 27న విశాఖలో 'వాడుక భాషా సదస్సు'లో ఘనసన్మానం జరిగింది. ఆ సందర్భంగా వ్యావహారిక భాషపై పురిపండాతో జరిపిన ఇంటర్వ్యూ ఇది]

ప్రశ్న: ఈ రోజుల్లో పత్రికల్లో, రేడియోల్లో, ఉపన్యాసాల్లో సినిమాల్లో ఎక్కడచూసినా వాడుకభాషే వినియోగ పడుతోంది కదా! ఇప్పుడు మళ్ళీ వాడుక భాషగురించి క్రొత్తగా సదస్సులూ, ఉద్యమాలు నిర్వహించడం అవసరమంటారా?

జవాబు: మంచి ప్రశ్న. అసలు ఈ వాడుక భాషా ఉద్యమం పాఠ్య గ్రంథాలతో ప్రారంభమైంది. అదింకా పూర్తికాలేదు. అన్ని

స్థాయిల్లోనూ పాఠ్యగ్రంథాల్లో వాడుక భాషని ప్రవేశపెడితే ఉద్యమం విజయవంతం అయినట్టే. విశ్వవిద్యాలయాలలో వాడుక భాషకి పీఠం లభించనంతవరకు తనకు ఆత్మశాంతి దక్కదని గిడుగువారు 'తుది విన్నపం'లో పేర్కొన్నారు. మీకూ తెలుసనుకుంటాను—ఇంకా వ్యావహారిక భాషాప్రగతికి అడ్డంకులు వేస్తున్న గ్రాంథిక మహానుభావులు లేకపోలేదు... ఆఁ, పేర్లెందుకులెండి !

ప్రశ్న: వ్యావహారిక భాషలో విభిన్న మాండలికాలు వున్నాయిగదా ! మరి అందరికీ అర్థం అవుతుందా? దానికోసం మళ్ళీ ఓ ప్రామాణిక భాషని తయారుచేసుకోవాల్సినఅవసరం ఏర్పడదా?

జవాబు: నిజమే. పూర్తిగా ఒకే మాండలికంలో రచన సాగితే పోరంకి, దాశరథి రంగాచార్యుల నవలలాగా అందరికీ అర్థం కాకపోవచ్చు. అయినా సందర్భాన్నిబట్టి అర్థం తెలుస్తుంది—తెలీపోతే తెలుసుకొనే ప్రయత్నం చెయ్యాలి. తెలుగులోని మాండలికాపదాల్ని పర్యాయ పదాలుగా గ్రహించాలి. సంస్కృతంలో కోతి, విష్ణువు, సింహం మొదలైనవి 'హరి' అనే పదానికి లేవా? ప్రకరణాన్ని బట్టిగదా అర్థం! ఇకపోతే ప్రామాణిక భాష గురించి—మన సదస్సులో డాక్టర్ శివరామమూర్తిగారు, ప్రొఫెసర్ దోణప్పగారు, డాక్టర్ నాయని కృష్ణకుమారిగారు ఈ విషయంపై చర్చించారుగదా. ఈ సరికే వ్యావహారిక భాషకి ప్రామాణికత సిద్ధించింది. ఈనాడు దిన, వార, మాసపత్రికలలోని భాష ప్రామాణిక వ్యవహార భాషే. ఎందుకంటే అన్ని ప్రాంతాలవాళ్ళూ ఈ పత్రికల్ని చదవగల్గుతున్నారు అర్థం చేసుకోగల్గుతున్నారు. పైగా ప్రవాసాంధ్రులు కూడా ఈ పత్రికల భాషలోనే రచనలు చేస్తున్నారు. భాషకి ప్రామాణికత అనేది అదే ఏర్పడుతుంది. అలాగే ఏర్పడింది.

ప్రశ్న: వాడుక భాషకి వ్యాకరణం అవసరమంటారా?

జవాబు: అవసరమే. అయితే శాసించేటటువంటి పూర్వవ్యాకరణాల వంటివి అనవసరం. భాషని వ్యాకరించేవి—ఎనలైజ్ చేసేవి—మాత్రమే అవసరం.

ప్రశ్న: వాడుక భాషలో సంస్కృత భాషాపదాలు వాడకూడదా?

జవాబు: సంస్కృతమే కాదు అన్ని భాషాపదాల్ని వాడొచ్చు. చాలా మంది వ్యావహారికవాదులంతా సంస్కృతానికి శత్రువులు అనుకుంటారు. అది తప్పు. అయితే తెలుగుని తక్కువగా చూసి ఇతర భాషలకి బానిసైపోవటం కూడదు. వాడుకలో ఉన్నవి, జనం నోట్లో నలిగినవీ సంస్కృతపదాల్ని వాడవచ్చు.

ప్రశ్న: ప్రాథమిక స్థాయినుంచే మీరు వాడుక భాషని ప్రవేశపెట్టాలంటున్నారు. మరి విద్యార్థులకి శబ్దంమీద అధికారం లేకుండా పోదా అలా చేస్తే?

జవాబు: ఇది అపోహ. ఇప్పుడు ఒకటో తరగతివాడి వాచకంలో 'ఝషము' మొదలైన శబ్దాలుంటున్నాయి. ఇవి చదివితే వాడికి Vocabulary వస్తుందని మీ అభిప్రాయం. 'ఝషము' ఎవరు వాడుతున్నారు? ఆ శబ్దం వచ్చినందువల్ల పండితుడవుతాడా? ఆ చిన్న వయసులో 'చేప'ని కూడా చూసివుండని వాడికి 'ఝషము' అని వాడి ప్రాణం తియ్యటం న్యాయమా? మనం తినటానికి ఝషము ప్రాణం ఎలాగో తీస్తున్నాం. (నేను exception సార్!)

ప్రశ్న: 'వీరవిహారము గావించినాడు' అని అంటే గ్రాంథికంగానూ, 'వీరవిహారం చేసాడు' అంటే వాడుక భాషగానూ కొందరనుకుంటారు ...

జవాబు: ఇక్కడ 'వీరవిహారం' అనే పదం వాడుకలోవుంది 'కావించాడు' అని అన్నా వాడుక భాషే అవుతుంది. కొందరలా కృత్రిమంగా వ్యావహారికాన్ని వ్రాయటంవల్లనే ఈ దురభిప్రాయాలు ఏర్పడుతున్నాయి.

ప్రశ్న: కవిత్వంలో గ్రాంథికరూపాల్ని ప్రయోగించకూడదా ?

జవాబు : ప్రయోగించకూడదు. సాధ్యమైనంతవరకు వాడుక భాషా రూపాన్ని మాత్రమే వాడాలి. అక్కడక్కడ భావగంభీరతకి మరీ కఠినమూ అప్రసిద్ధమూ కాని గ్రాంథిక రూపాల్ని ప్రయోగించవచ్చు.

ప్రశ్న : మరి ఈనాటి వ్యావహారిక భాషావాదుల రచనల్లో—ముఖ్యంగా కవితల్లో గ్రాంథిక భాషాప్రయోగం ప్రస్ఫుటంగా కనిపిస్తుందే!

జవాబు: కనిపిస్తే నిలబెట్టి అడగాల్సిందే. అలా రచనలు చేస్తే తప్పే. నేనెప్పుడో రాసిన కవితల్లో కూడా గ్రాంథిక పదాలు ఉండి ఉండవచ్చు అయినా అదీ తప్పే. దీర్ఘసమాసాలు మాత్రం అసలు వాడకూడదు.

ప్రశ్న : పాఠ్యగ్రంథాలు వ్యావహారిక భాషలో ఉండాలనికదా మీ అభిప్రాయం? అంటే పూర్వకవుల కావ్యాలలోని భాగాలు పాఠ్యగ్రంథాలలో వుండకూడదా ?

జవాబు: జనరల్ తెలుగు, స్పెషల్ (ఆప్షనల్) తెలుగు అని రెండుంటాయి గదా తెలుగులో. జనరల్ తెలుగులోని పాఠ్యగ్రంథాలలో పూర్వపు గ్రాంథిక రచనల్ని పెట్టక్కర్లేదు ఐచ్ఛికంగా—స్పెషల్ తీసుకొని చదివే విద్యార్థుల పాఠ్యగ్రంథాల్లో మాత్రం గ్రాంథిక రచనలు ఉండితీరాలి. వాళ్ళు పూర్వకావ్యాలని చదవడం అవసరం కూడా. వాటిల్లో ఇంటరెస్ట్ లేని వాళ్ళమీద రుద్దుతాము అంటే ఏం న్యాయం? మాకు గ్రాంథికంపట్ల ద్వేషంలేదు. మమ్మల్ని అర్థం చేసుకోవటంలేదు కాని.

ఇంటర్వ్యూ : శ్రీ ద్వా. నా. శాస్త్రి

లేఖలు

మహాకవే

1980 ఏప్రిల్‌లో 'కలగూరగంప'లో 'మహాకవి అనే అంశాన్ని 21స్ట్ సెంచరీ రైటర్స్ అధ్యక్షుడు రాయగా చదివాను. పిమ్మట కొన్ని విషయాలు 'భారతి' పత్రికాముఖంగానే వెల్లడించ దలిచాను.

21స్ట్ సెంచరీ రైటర్స్ అధ్యక్షుడు రాసినట్టుగా నిజంగానే కృష్ణశాస్త్రిగారు చనిపోయిన పిమ్మటనే ఆయన పూర్తిపేరు ముందు 'మహాకవి' కొత్తగా మనం చూస్తున్నాం. గురజాడవారికి కూడా తన జీవితకాలంలో 'మహాకవి' బిరుదువుండి వుండకపోవచ్చును. అంతవరకూ బాగానేవుంది. అంతటితో ఆగక 21స్ట్ సెంచరీ రైటర్స్ అధ్యక్షుడు ఇంకొంచెం ముందుకుపోయి, ప్రస్తుతం జీవిస్తున్న కొంతమంది కమ్యూనిస్టు రచయితల పేర్లముందు 'మహాకవి' కనిపిస్తోంది ఈ కమ్యూనిస్టు సోదరులకు 'మహాకవి' బిరుదు ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఇచ్చేరంటూ పరోక్షంగా శ్రీశ్రీ గారిమీద ఓ రాయి వేసేరు.

21స్ట్ సెంచరీ రైటర్స్ అధ్యక్షుడు వారి లేఖలో శ్రీశ్రీ గారి పేరు ఉదహరించక పోయినప్పటికీ, అది శ్రీశ్రీ గురించి రాసిందేనని ఆ లేఖ చెప్పకనే చెబుతోంది. శ్రీశ్రీ అనే ఎందుకంటున్నానంటే కమ్యూనిస్టు కవుల్లో ఒక్క శ్రీశ్రీగార్కి తప్ప మరొకరికి 'మహాకవి' బిరుదులేదు.

శ్రీశ్రీని, 'మహాకవి శ్రీశ్రీ' అని పిలుచుకోవడానికే ప్రజలు ఇష్టపడుతున్నారు. అటువంటప్పుడు 'మహాకవి' బిరుదు ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఇచ్చేరంటూ ఆరాలు తీయడమెందుకు? ప్రజల ఇష్టాన్ని కాదనడానికి మనమెవ్వళ్ళం?

ఎవరు ఔనన్నా, కాదన్నా శ్రీశ్రీ మహాకవే.

శ్రీ వెంపలి వెంకటశివప్రసాద్

జవాబు

మార్చి 1980 'భారతి'లో శ్రీలింగంపల్లి "భాగ్యనగరం" రామచంద్రగార్కి సమాధానము.

(1) "భారతి పత్రికలో ప్రచురితమౌతున్న వచన కవితల్ని చూస్తుంటే నవ్వాలో, ఏడ్వాలో" అన్నాను, అయితే (i) ఇందులో అన్ని కవితలు కావచ్చు, (ii) లేదా కొన్ని కవితలు కావచ్చు, ఎక్కువ శాతమవె యుండబట్టి ఆలా వ్రాయడంలో కొన్ని మంచి వానికి కూడ కీడు కల్గియుండవచ్చు, ఒకవేళ పై రెండర్థాలు స్ఫురించక అన్నింటికివర్తించినచో క్షంతవ్యుణ్ణి. (ఇదటుండనిమ్మ)

(2) నేను నా ఆచార్యత్వానికి కూడ నమస్కారము పెట్టేస్తాను మీరన్నట్లుగానే, అయితే ఇదె అభిప్రాయాన్ని ఒక డా॥రేటు పొందిన వ్యక్తికూడ వెలిబుచ్చాడంటె మరి ఆయనేమి చేయాలి? (డా॥రేటుకు రాజీనామా ఇవ్వాలా?) డా॥ మురళీధర్ జూలై, 'భారతి' 1979

(3) పై అభిప్రాయంతో నేకీభవించిన మరొకరు శ్రీ రావి రంగారావు, సెప్టెంబర్ 1979 'భారతి' మరి వీరిని దేనికి నమస్కారము పెట్టమందాము?

(4) శ్రీ శివారెడ్డిగారి నేత్రధనుస్సు కావ్య సమీక్షలో పూజ్యులు శ్రీ కళాప్రపూర్ణ మరుపూరు కోదండ రామిరెడ్డిగారు అన్నమాటలు "నామటుకు నాకు పుస్తకం పేరు, అట్టమీదబొమ్మ అర్థం కావడంలేదు" ఫిబ్రవరి 1980 'భారతి' వీరికి గూడ మీరు సూచించిన "యనుభావ" విశేషము లేదంటారా? లేకపోతె వీరిని గూడ కళాప్రపూర్ణకు రాజీనామా చేయమంటారా?

అయ్యా రామచంద్రంగారు ఇవి కొద్దిమంది అభిప్రాయాలు మాత్రమే కావు, మహామహులైన ఎందరి ద్వారానో ఆ మాటలను విన్న తర్వాతనే వ్రాశాను ఉదా॥ హైమవతీ, డా॥ బోయి భీమన్న గారు, డా॥ కె. వి. సుందరాచార్యులుగారు, మైనంపాటి వేంకట సుబ్రమణ్యం మొదలగువారు.

ప్రజల కొఱకు వ్రాస్తున్నామని చెప్పకొనేవాళ్ళు, ప్రజాకవుల మనుకొనేవాళ్ళు కవితా మర్మజ్ఞుల పంథాలలో పయనించిన, ప్రజల కొరుగునదేమి? నూటికి 99 మందికి అర్థముగాక (చివరకు వ్రాసినవారే చెప్పలేని సంఘటనలు జరిగినవి) ఎవరికో ఒక్కరికి మాత్రమే అర్థమయ్యేది అది ఉపయోగకరమైనా వ్యర్థమే గదా! 'అర్థముగాని చదువు వ్యర్థమన్నది' ఈ ధోరణిలో మీరు మరోలా భావించినారు, నా అభిప్రాయాన్ని సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాను.

ఆచార్య తలోజు

మే (1980) 'భారతి'లో ప్రచురింపబడిన బి. చంద్రగారి కవిత 'పునర్జన్మ'లోని చివరి వాక్యాల్లోన్ని భావానికి

("విత్తనాన్ని మట్టిలో పూడ్చిపెడితే
మరుజన్మ యిచ్చినట్లే కాని
అది అంత్యక్రియ మాత్రంకాదు")

శేషేంద్ర శర్మగారి (సముద్రం నా పేరు—పేజి 18)

"ఒకరా అన గింజను మట్టిలో పూడ్చపెడితే దానికి అంత్యక్రియలు చేసినట్టుకాదు దానిప్రాణం భూమిని చీల్చుకొని బయటకు వస్తుంది" అను వాక్యాల్లోని భావానికి ఆట్టే భేదంలేదు గదా!

"పెన్నా శిరాకృ"

ధర్మరాజు వయస్సు 72 సం॥లే; అభిమన్యుని వయసు నిర్ణయించుటకు సరియైన ఆధారములులేవు, సుమారు 36 సం॥ లు.

కురుక్షేత్ర యుద్ధమునాఁటికి ధర్మరాజునకు 72 సం॥లు అని మీ 'భారతి' ఫిబ్రవరి '80 ద్వారా పాఠకులకు మనవిచేసినాను. 'భారతి' ఏప్రిల్ '80లో శ్రీ దామెర మురళిగారు 1 సం॥ పెంచి 73 సం॥లని వ్రాసినారు. అది సరికాదు, ఏలన, ధర్మరాజు జీవితకాలము అష్టోత్తరశతహాయనములు (108 సం॥లు) కురుక్షేత్ర యుద్ధానంతరము రాజ్యపరిపాలనా కాలము 36 సం॥లు. కావున కురుక్షేత్రయుద్ధమునాఁటికాయన వయస్సు 108–36=72 సం॥లు. ఈ విషయ మీక్రింది పట్టికవలన ఇంకను విశదము కాగలదు.

	వయస్సు (సం॥లలో)					
	ధర్మరాజు	భీముడు	అర్జునుడు	నకుల సహదేవులు	ఘటోత్కచుడు	అభిమన్యుడు
ఇభ పట్టణమున కేగునాఁటికి	16	15	14	13	–	–
,, విద్యాభ్యాసము	13	13	13	13	–	–
లక్కయింటిలో (వారణావతమున)	$\frac{1}{2}$	$\frac{1}{2}$	$\frac{1}{2}$	$\frac{1}{2}$	–	–
ఏకచక్రపురములో	$\frac{1}{2}$	$\frac{1}{2}$	$\frac{1}{2}$	$\frac{1}{2}$	$\frac{1}{2}$	–
ద్రుపదుని యింటిలో	1	1	1	1	1	–
యౌవరాజ్యములో	5	5	5	5	5	–
అప్పటికి వయస్సు	36	35	34	33	$6\frac{1}{2}$	–
ఇంద్రపురిలో	23	23	23	23	23	23
అరణ్యావాసము + అజ్ఞాతవాసము	13	13	13	13	13	13
కురుక్షేత్ర యుద్ధమునాఁటి వయస్సు	72	71	70	69	$42\frac{1}{2}$	36

ఈ 1 సం॥ము వ్యత్యాసమునకు కారణము వారణావతమున లక్కయింటిలో గడపిన 6 మాసములు, ఏకచక్రపురములో గడచిన 6 నెలలు గణనకు తీసికొనకపోవుటయే.

క. ధనదానములను బ్రియభో,జన దానములను విశిష్టసద్ద్విజతతులం
దనుపుచునుండఁగ దత్పుర, మున షణ్మాసములు భరతముఖ్యుల
కరిగెన్.
(భార. ఆది. 6—159)

ఇంద్రప్రస్థ పురములో ఉన్న 23 సం॥ల కాలములో అర్జునుఁడు ద్వాదశ మాసిక వ్రతము జరుపుటకు తీర్థయాత్రకు బయల్వెడలెను. పై పట్టికలో జూపిన విధముగా అప్పటి కాయన వయస్సు 34 సం॥లు. ఈ తీర్థయాత్రలోనే సౌభద్రార్జున వివాహము జరిగినది. తరువాత అభిమన్యుఁడు పుట్టెను.

ఇంద్రపురిలో ఉన్న 23 సం॥ల కాలములో అర్జునుఁడు సమయోల్లంఘన ప్రాయశ్చిత్తమునకై ఎన్నవయేట తీర్థయాత్ర సల్పుటకు చనెనో భారతమున వ్రాయబడలేదు. అందుచేత అభిమన్యుని వయస్సు నిర్ణయించుట కాధారములులేవు. ఇంద్రపురిలో గడపిన 23 సం॥ల మొత్తమును, అరణ్య అజ్ఞాత వాసముల 13 సం॥లు కలిపినచో 36 సం॥లగును (మహాభారత యుద్ధము నాఁటికి.) అంతేకాని, మాద్రేయుల వయస్సుతో అభిమన్యుని వయసు నిర్ణయించు టనువుగాదు.

''పాండవులు వ్యాసోపదేశంబున శాలిహోత్రాశ్రమమున నుండిరని వ్రాసిరి. వారు లక్షాగృహదహనమునుండి తప్పించుకొన్న తరువాత శాలిహోత్రాశ్రమమున ఒక్కనాటి ప్రభాత సమయమునఁ గృతస్నాతులై సంధ్యావందనంబులు దీర్చి శాలిహోత్రు చేతంబూజితులయి తద్వనస్పతిచ్ఛాయా శీతలంబున విశ్రమించి విగతక్షుత్పిపాసులై సుఖంబున్నంత'' వ్యాసుడు వారికి ప్రత్యక్షమయ్యెను.

(భార. ఆది. 6 ఆ. 227–228.)

భీముఁడు, దుర్యోధనుఁడు ఒకేరోజున పుట్టిరి.

క. అనిలజు పుట్టిన దివసము, నన యట దుర్యోధనుండు పుట్టె నరనుత ధృతరా
ష్ట్రునకున్ గాంధారికి న, గ్గనందనుఁడు ఘనుఁడు పుట్టెఁ గలియంశమునన్
(భార. ఆది. 5 ఆ. 105.)

శ్రీ పానకేశ్వరరావుగారు డిసెంబర్ 'భారతి'లో వ్రాసినట్లు వారిరువురు ఒకే గురువునొద్ద సహాధ్యాయులగుటచే కాదు వారిరువురు ఒకే యీడు వారగుట. పై పద్యములో చెప్పినట్లు ఆది పర్వములోనే వారిర్వురు ఒకే దినమున జనన మందిరి.

శ్రీ కె. విశ్వేశ్వరరావు

శ్రీ రావి రంగారావుకు మినీ సలహా

1980 ఏప్రిల్ నెల 'భారతి'లో కలగూరగంప శీర్షికన 'మినీ కవిత' అనే అంశంపై శ్రీ రావి రంగారావుగారు అర్థపూర్ణమైన వ్యాసం వ్రాసినందుకు వారిని అభినందిస్తున్నాను. 62వ పేజీలో వారు 'ఆటో ప్రిన్సిపల్' అనే ఓ కొత్త పారిభాషిక పదాన్ని ప్రతిపాదించినారు. అది సమంజసం కాదని నా మనవి. దాని బదులు 'ఆటో ఇంటర్ ప్రెటేషన్' అని వుంటేనే యుక్తమని నా సలహా. దానికి ఈ క్రింది కారణాలు తెలుపుకొనుచున్నాను :

(1) ప్రిన్సిపల్ అనగా సూత్రము.

(2) మినీ కవిత కవి ప్రతిపాదించే సూత్రము.

(3) చదువరి లేక పాఠకుడు ఆ కవితను తన అనుభవానికనుగుణంగా వ్యాఖ్యానించు కొంటాడు. కవి ఏ దృష్టితో కవిత వ్రాసి వుంటాడో అది ముఖ్యంగా తెలుసుకోవాలి కాని ఇది జరుగక తద్విరుద్ధంగ జరుగుతుంటుంది.

(4) ఇట్లాజరుగు దానిని'స్వవ్యాఖ్యానము'(ఆటో ఇంటర్—ప్రెటేషన్) అని పిలువవలెను కాని 'స్వసూత్రము' (ఆటోప్రిన్సిపల్) అని పిలువరాదు.

(5) శ్రీ రావి రంగారావుగారు వ్రాసిన వ్యాసం చదివిన తరువాత నాకు 'ప్రస్థాన త్రయముల'మీద శ్రీ శంకర, రామానుజ, మధ్వాచార్యులవారి వ్యాఖ్యానాలు స్ఫురణకు వచ్చినవి. సూత్రము లొక్కటే కాని వ్యాఖ్యానాలు వేరు వేరు దీనికి కారణం ఆత్మాశ్రయ పద్ధతిలో విషయాలను పరిశీలించటమే.

(6) 'స్వవ్యాఖ్యానము'ను వేరు పదాలలో చెప్పవలెనంటే 'దృష్టినిబట్టి కదా సృష్టి.'

శ్రీ హెచ్. హరిశ్చంద్రా రెడ్డి

సంయమనం ప్రదర్శించండి

'భారతి' మే 1980లో శ్రీ బెడిద రాజేశ్వర్ ఆచార్యులు తల్లోజు వ్రాసిన లేఖకు మందలింపు ధోరణితో ప్రతిలేఖ వ్రాశారు. వారా లేఖలో సంస్కృత వైమనస్యం, ప్రాచీన కవితా వైముఖ్యం సూచనగా తెలియజేశారు. ఇప్పటి ఆధునిక కవితా ప్రక్రియల అవగాహనకి పరిజ్ఞానం సంపాదించుకోమని సూచిస్తూ అవహేళన ప్రదర్శించారు.

రాజకీయ, సామాజిక అవగాహన అందరికీ మన ఊహా పరిధిలో ఉంటుందనుకోకూడదు. వచన కవితా ప్రక్రియలో సిద్ధహస్తుల రచన అలా వుంచి, మిగిలిన రచనలన్నీ ఉదాత్తాలని కాని అధమాలని కాని నిర్ణయించలేం. రచయిత సామాన్య పాఠకుణ్ణి పఠనాసక్తుణ్ణిచేసే ధోర్ణిలో రచనలుండాలి. ఆసక్తి పెంచేట్టుండాలి. శేషేంద్ర, మోహన ప్రసాద్‌ల వంటి వారి రచనలు సాహిత్య పరిణతికల వారికి కూడా అందుబాటులో ఉండనంత ఔన్నత్యాన్ని పొందివుంటాయి. పరోపదేశ వేళలో అందరూ పండితులే. మన భావాన్ని, మన ఆలోచనని, మన సూచనని, మరొకరికి తెలియచేసేటప్పుడు మృదుత్వం, సంయమనత్వం అవసరం. పొలైట్‌నెస్ అన్నమాట. సంస్కారం అంటే అదే.

తిడితే ని పేరు రాదన్న ధోరణికి అలవాటు పడ్డట్టు "ఎంగిలిపడ్డ సంస్కృత పదాల్ని — సమాసాల్ని కవిత్వంలో ఇరికించే కవుల్ని 'విటుల్ని'' తిట్టేవారి వెంటపడతానంటారు రాజేశ్వర్. వీరి లేఖలో సంస్కృత పదాల్ని వాడి ఎందుకు ఎంగిలి పడ్డారు? ఒక్క పదంకూడా అది లేకుండా తేట తెనుఁగు నుడికారం ఎందుకు చూపలేకపోయారు? సంస్కృతం అంటే ఎందుకు అక్కసు? మన భావ ప్రకటనకి, భాషలో ఒదిగిపోవడానికి ఏభాషలోని పదాన్నయినా వాడుకుంటాం. మన అంటె మన పూర్వపుకవులే నిజాయితీ ఉన్నవాళ్లని పిస్తుంది. అచ్చ తెనుఁగు కావ్యాలు వ్రాశారు. సంస్కృతం వాసన కూడా రానివ్వలేదు. విజ్ఞులు ఏంచేసినా హద్దు మీరరు. వేలెత్తి చూపేలా ప్రవర్తించరు. శ్రీ నార్లవారు సంస్కృతం మీద కృషి చేసి గుణదోషాల్ని దానివల్ల మనకి కలుగుతున్న మేలు కీళ్లను, సహేతుకంగా సంస్కృతం — సంస్కృతి అనే సంపాదకీయాల్లో నిరూపించారు. బహుశః అటువంటివి వెలువడ్డట్లు వీరికి తెలియక పోవచ్చు.

సహృదయత, బాధలు, అనుభూతి కవిత్వానికి కావాలంటూన్న వీరు నవ్వడం, ఏడవడం మానేసి కవిత్వాన్ని అర్థం చేసుకోమని తల్లోజువారికి బోధించడం అవహేళన కాదా? అది, తూచి ఆక్షేపణలేని వ్రాత ఉండాలి. రమ్యము, జుగుప్సితము, ఉదారము, నీచము అయిన వస్తువునయినా కవితా వస్తువుగా తీసికోవచ్చన్నారు. రసాత్మక వాక్యమే కావ్యమన్నారు. తప్పని నిరూపించడానికయినా ఓపిగ్గా చదివి, పరిశ్రమచేసి ఎదుటివాళ్లు సమాధానం చెప్పలేని హేతువుల్ని చూపి వాదించేవారు. ఇప్పుడా తితిక్ష లేదు. అర్భకత్వమే ప్రతిచోట ప్రత్యక్షం.

అక్షరం శక్తివంతమైనది. గుండెల్ని పిండినా, స్పందింప చేసినా మాటల పొందికే కారణం. ఆ పొందిక వసిష్ఠ మనస్తత్వానికి, హుందాతనానికి, నిండుతనానికి దర్పణం. అది అలవరచుకోవడం ఆవేశపరులకి కష్టమే కదా !

శ్రీ ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు

స్వీయ ఘోష

అక్టోబరు 1979 'భారతి'లో 'విమర్శ వేదిక' గ్రంథంపై నేను సమీక్ష రాశాను 1980 ఫిబ్రవరి 'భారతి'లో ఆ సమీక్షపై శ్రీ గోదావరి శర్మగారు లేఖ రాశారు. లేఖకు నేను సమాధానం ఇవ్వలేదు. కారణం సమాధానం ఇవ్వవలసినంత ప్రాముఖ్యం ఆలేఖకు లేకపోవడమే. 1980 ఏప్రిల్ 'భారతి'లో శ్రీ వాసవ్య నా సమీక్షను, గోదావరి శర్మగారి లేఖను చదివి నీడలులేని శ్రీ శ్రీ అని వేరొక లేఖ రాయడం జరిగింది. ఆ లేఖలో ప్రారంభంలోను, ముగింపులోనూ నా ప్రస్తావన తేవడం జరిగింది. ముగింపులో శ్రీ వాసవ్య రాసినదంతా నేను గ్రహించాలని ఒక హెచ్చరిక లాంటిది చేయడం జరిగింది.

శ్రీ వాసవ్య రాసిన లేఖలోని అంశాలకు 'విమర్శ వేదికపై' నేను చేసిన సమీక్షకు ఎటువంటి సంబంధం లేదు. నా సమీక్ష శ్రీ వాసవ్య రాసిన లేఖ చదివిన ప్రతి సాహితీవేత్తకు ఈ విషయం స్పష్టం కాగలదు. ఆరుద్ర, కుందుర్తి, నారాయణరెడ్డి, దుర్గానంద్ ప్రభృతుల ప్రసక్తి నేను నా సమీక్షలో తేలేదు. ''యుగే యుగే, మధూలిక'' మొదలైన మహాకావ్యాలను తృణీకరించడం అవుతుంది అని శ్రీ వాసవ్య పేర్కొనడం నా సమీక్షలో భాగం కాదు; నాకు దానితో నిమిత్తం లేదు.

శ్రీ శ్రీ కి తరువాత శ్రీ శ్రీ మార్గానికి భిన్నమైన మార్గంలో వచ్చిన కవిత్వానికి 'చైతన్య వాదం' అని శ్రీ వాసవ్య నామకరణం చెయ్యడానికి నా సమీక్షకు సంబంధం ఏమిటి? అని నేను ప్రశ్న వేస్తున్నాను. నేనుగా పై చెప్పిన కవులను, వారి కావ్యాలను అనుశీలనంచేసి రాసినప్పుడు దానిపై శ్రీ వాసవ్య రాస్తే బాగుంటుంది గాని ఒక సమీక్షను అడ్డంపెట్టుకొని ఆయన స్వీయఘోష అంతా నా నెత్తిన రుద్దటం న్యాయమైన విషయం మాత్రం కాదని పొరలులేని సాహిత్యవేత్తలకు మనవి చేసుకుంటున్నాను. ఎవరిమీదనో ఉన్న కోపాన్ని నామీద కక్కటం మంచిపని కాదు. నేను రాసిందాంట్లోంచి దోషాలు చూపితే అవి నిజంగా దోషాలైతే ఆ దోషాలను 'భారతి' ముఖంగా అంగీకరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అయితే ఆనిర్ణయం ఎవరైనా పెద్దలు చెయ్యవలసిన అవసరం ఉంది.

శ్రీశ్రీ నీడ క్రింద నేను ఎవరినీ నెట్టలేదు. పోగా దుర్గానంద్ 'మధూలిక' మహాకావ్యం అవునా? కాదా? ఈ చర్చలో నేనెప్పుడూ పాల్గొనలేదు. కుందుర్తి, ఆరుద్ర, నారాయణరెడ్డి మొదలగు వారిపై నాకున్న అభిప్రాయాలు నేను అనేక వ్యాసాల్లో, సమీక్షల్లో రాశాను. అవి శ్రీ వాసవ్య వెలిబుచ్చిన అభిప్రాయం పద్ధతిలో ఉండవని ఆ వ్యాసాలను చదివిన ఏ ఒక్కరైనా గ్రహించగలరు.

ఇంతకీ శ్రీ వాసవ్య గాలిలో కత్తి తిప్పుతున్నాడని చెప్పడం నా ధ్యేయం. నాకు సంబంధించని విషయాలు నావి ఆయన చెప్పబోవడం ఆయన చిత్తశుద్ధికి, అసహనానికి తార్కాణం. ఆయన ధన్యుడవుతాడో లేదో నాకైతే తెలియదుగాని ఆయన రాసిందాంట్లోంచి నేను క్రొత్తగా తెలుసుకోవలసింది, గ్రహించవలసింది లేదని మాత్రం విన్నవించుకొంటున్నాను.

శ్రీ టి యల్. కాంతారావు

చాలామంది విమర్శకుల్ని చూస్తున్నాను. శ్రీశ్రీ వాక్యాల్ని పొరపాటున మరొకరి పేరున చెలామణి చేస్తున్నారు.

మే 'భారతి' కలగూరగంప 'కావ్యము—కోతలు'లో ''పూర్వం మహాకావ్యం పద్దెనిమిది పర్వాలైతే ఆధునికుల మహాకావ్యం పద్దెనిమిది పేజీలంటారు కుందుర్తి'' అంటున్నారు యు ఎ. నరసింహమూర్తి.

ఈ వాక్యాలే ఆరుద్రవని యిదివరకు మరొకాయన యింకో చోట రాసేరు. కాని—

ఆరుద్ర సినీవాలి 'సాహిత్యోపనిషత్'లో శ్రీశ్రీ రాసింది యిది —

'మహాకావ్యానికి క్రైటీరియా
సైజూ బరువూ కావయా
నిన్నటి మహాకావ్యం పద్దెనిమిది పర్వాలైతే
నేటి మహాకావ్యం పద్దెనిమిది పేజీలే!''

మోహనమిత్ర

చర్చలవసరములు

ఏప్రిలు సంచికయందు ఎల్లా శివరామయ్యగారు, మరియొక వైద్యద్వయము వ్రాసిన యుత్తరములు జూచితిని. శివరామయ్యగారు 'ఇద్దరూ తప్పే'ని చెప్పిరి గాని ఎట్లు వారి వారి వాదములు దోషభూయిష్ఠములో చెప్పలేదు. వైద్యద్వయము చందాకట్టుట మాని వేయుదుమని బెదిరించుట వారి దౌష్ట్యమును తెలియఁజేయుచున్నది. వాగ్వివాదములు జరుగుట చైతన్యమునకు ప్రతీక. వివాదము జరుగుచున్నది. జరుగనిండు. వీలైనచో మీరును వివాదమునందుఁ బాల్గొని వివాదమునకుఁ బుష్టిని జేకూర్చుడు. వివాదము నుండియే క్రొంగ్రొత్త విషయము దెలియునుగదా !

శ్రీ సుంకిరెడ్డి సిద్దారెడ్డి

గ్రంథ విమర్శలు

["టెక్స్ట్ బుక్ ఆఫ్ యోగా": రచన యోగేశ్వర్. యోగా సెంటర్, 15 ముత్తురామ్ మొదలివీధి, మైలాపూర్, మదరాసు–600004. వెల : రు. 50/–]

ఈ ఇంగిలీషు పుస్తకంలో 570 పేజీలకి పయిగా ఉన్నాయి.

ఒక వందా ఇరవయి పేజీలకి పయిగా బొమ్మలు ఉన్నాయి.

యోగాసనాల ప్రయోజనాల వివరణ ఉంది. ఆసనాలు వేద్దామని అనుకునేవారికి తగినంత సలహా ఉంది. వైద్యుడిచేత తనిఖీ, అధ్యాపకుడివద్ద శిక్షణ అవసరాలు వివరింపబడ్డాయి కొత్తగా మొదలు పెట్టేవారికి కావలసిన హెచ్చరికలు ఉన్నాయి.

సూర్యనమస్కారాల వివరణ ఉంది.

మామూలు ఆసనాలేకాక కొన్ని ప్రత్యేకమయిన వాటిని గురించి ఉంది.

యోగాసనాలలో ప్రాణాయామానికి ప్రత్యేకస్థానం ఉంది. ఈ పుస్తకంలో నలభయి పేజీలకి పయిగా ఊపిరితీసే ప్రక్రియల వర్ణన ఉంది.

ఆసనాల జాబితాలు, దినసరి అధ్యయనం క్రమాలు, పథ్యాలు, యోగాసనాలు వేసేవారు పాటించతగిన నియమాలు వివరించబడినాయి.

ఆడవారికి ఎటువంటి ఆసనాలు పనికివస్తాయో రచయిత చెప్పారు.

కొన్ని అనారోగ్యాలకి యోగాసనాల చికిత్సని కూడ రచయిత వివరించారు. మామూలు రోగాలని గురించి రాశారు.

గ్రంథులకి ఒక అధ్యాయం కేటాయించారు.

దేహ భాగాలకి కూడా ఒక అధ్యాయం ఉంది

సంస్కృత సాతాలని అనుసరించి రాశామని రచయిత పీఠికలో అన్నారు.

మొత్తంమీద ఇదొక బరువయిన పుస్తకం! విదేశీ ప్రచురణ కర్తలు పెద్ద పుస్తకాలు వెయ్యటంలో ఆశ్చర్యం లేదు.

రచయిత ధైర్యంచేసి ఇంత పుస్తకాన్ని వెలువరించటం ముదావహం.

అచ్చు స్పష్టంగా చదవటానికి సౌకర్యంగా ఉంది.

ఈ పుస్తకం భారతదేశంలోనే కాక బయట కూడా మంచి ఆదరణ పొందుతుందనటంలో సందేహంలేదు.

విద్యార్థి

తేనెటీగ

[బాలల శతకం. దుర్గానంద్. చిన్నసైజు, 48 పేజీలు; వెల ఒక రూ; ప్రతులకు : దుర్గానంద్, డ్రీమ్స్ కాలని, నరసింహారావుపేట, ఏలూరు.]

బాలబాలికలను తేనెటీగలుగా పోల్చి, వాటివలెనే పువ్వు పువ్వుపై వాలి మధుపానమన్నట్లు – నీతులు వినమని, కవి ఒక పోతుటీగై హితవచనాలు పద్యరూపంలో చెప్పడం బాగున్నది. ఇది మంచి ఊహ. ఒక చిన్న బిడ్డ, తన తండ్రిని రచనోద్యోగానికి పూనించిన విధం చెప్పడం గూడ ఒక కొత్త చవే! "వాడిపొయ్యే పువ్వును శాశ్వతం చెయ్యాలంటే వాటి అత్తరుతీసి సీసాలలో ఉంచినట్లు, ఛాక్లెట్లును కాగితంలో ప్యాక్‌చేసినట్లు ఒక భావాన్ని పద్యంలో బిగిస్తే భద్రంగా ఉంటుంది" అని, నోటికి పద్యాలు రాజెయ్యాలని ఈ కవి ఉత్సాహపడటం నేటి ద్యారుస్థితి తొలగిపొయ్యే మంచి దినాలు వస్తున్నవేమో అనిపిస్తున్నవి.

పద్యాలతో తేనెటీగను సంబోధించి, బాలబాలికలకు నీతులు' నీతులు తెలిచోట నిండలు–"రసముట్టిపడే మాట చెప్పి ఉరుకుడు నిపుడే" అని సుమతిశతకం "నోరూరగ చవులు బుట్ట నుడివెద" అన్నట్లుగా పలుకుతున్నాడు.

అయినా ఈ బహుగ్రంథకర్తకు ఈ పద్యాలలో కుదింపు బిగువు తగ్గి ఉన్నవి. భావ విశదీకరణం ఉండవలసినంత సూటిగా స్పష్టంగాలేదు. కొన్ని భావాలు నవ్యరీతిలో బాగున్నవి :– గడియారాన్నై నిన్ను లేపి చెవికాడ (తేనెటీగ); అంత పెద్ద దేవుడింత చట్రాతిలో ఒదిగె; ఒక్క చీమను గన పౌరశాస్త్రము నేర్పు–గరళమున్న పాముకస్సన్న అందమే.

మృత్యురహస్యం

[ఉయ్యాల పాటలో కఠోపనిషత్తు. మోక్షానందస్వామి. చిన్నసైజు; ధర : ఒకటిన్నర రూ; ప్రతులకు: జననీ అద్వైతాశ్రమం, తిమ్మాపురం, వయా మోర్తాడు, కరీంనగర్ జిల్లా–503225.]

సర్వవేదాంతసార సంగ్రహ రూపమైన హిందూమత గ్రంథాలను ఏ కొద్దిమందో తమ పిడికిట బట్టుకొని, వినరాదు అనరాదు అని ఆంక్షలు బెట్టినందువల్లనే కొన్నివేల ఏండ్లనాటి సనాతన ధర్మం వ్యాప్తిలేక బూజుపట్టి పోగా, కొత్తమతాలు వ్యాప్తికి వచ్చి ప్రజలను ఆకర్షిస్తున్నవి. ఈ స్వార్థపరత్వాధికారాన్ని ఛిన్నంచేస్తూ, మన మత స్వాములు కొందరు ఇప్పుడు వేదాంత మతాన్ని సర్వులకు తెలిసే భాషలో విప్పి చెప్పడంవల్ల విశ్వాసులలో ఆశాజ్యోతిని వెలి

గించి హిందూమత జ్యోతిని విశ్వవ్యాప్తంగా కాంతులు ప్రసరింపజేసే టట్లున్నది. బౌద్ధం తన మతాన్ని పాళీలో ప్రచించడం ప్రజల కొరకేగదా! మ్యాక్సు మూలరు పుణ్యాన ఇంగ్లీషు భాష ప్రపంచానికి హిందూమత ఘనత తెలియవచ్చినది. వివేకానందస్వామి జాగృతి శంఖారావం భారతీయులను మేల్కొలిపినది.

మోక్షానందస్వాములవారు కఠోపనిషత్తును జోలపాటగా—తేటతెనుగులో అరచేతి ఉసిరికవలె ప్రజలకు అందజేసి, హిందు వేదాంత దేవతను సామాన్యుల హృత్పీఠాలపై నెలకొల్పినారు. ఇది పాట కాబట్టి లోకవ్యాప్తికి సుకరంగదా! కఠోపనిషత్తు మూల సూత్రాలు చాలా, భగవద్గీతలో యథాతథంగా నిక్షేపింపబడిఉన్నవి. మానవ జ్ఞానానికి పరమ లక్ష్యమైన — మరణానంతర జీవితాన్ని ఈ కథ వివరించి, నేటి సైన్సు—హేతువాదానికి అనుగుణం ఈ రహస్యాన్ని నిర్వచిస్తున్నది.

నచకేతునికి బోధించిన యముడు ఏ యముడే కానీయండి—ఈ భాగపు కథ కొంత అసహజంగావున్నా విషయం ఆత్మజ్ఞాన ప్రబోధకమై, సాధనే స్వయంభూ పరమాత్మను తెలుసుకోను మార్గమన్న నిశ్చల సత్యాన్ని చెప్పే ఈ ఉపనిషత్తు చదివి తెలుసుకొని ఆచరించవలసినదిగా ఉన్నది.

క్లిష్ట పారిభాషిక పదాలతో అర్థంగాని వాదం చేయక ''అజ్ఞాన మూఢులు సుజ్ఞానులావలె నాటకమ్మాడినను తిరిగి జన్మింతురు'' అని కపట స్వాములను సమ్మెటలతో మోదుతున్నది. ఈ రచనలోని తెలుగు మాటలు అలతి అలతి వైస్నిగ్ధత ఓజస్సుతో వేదధర్మాన్ని నిబెట్టి మదికెక్కుతున్నవి; ఇందు తిక్కన శాంతి పర్వపు తెనుగు పోకడలున్నవి; చూడండి :—(ఆత్మ) అణువుకన్నా చిన్న మహసుకన్నా మిన్న అన్నది ఎంత ప్రాణవంతంగా ఉన్నదో! (తిక్కన- అలతులైన వారికంటె నలతి, పెద్దలకును చాల పెద్ద; శాం 2:20) బ్రతికి ఉన్నప్పుడే బ్రహ్మమెరిగినవాడు (జీవన్ముక్తుడు) తన ఏకరూపమును బహువిధంబుల జేయు—పొగలేనిజ్యోతిగా వెలుగుచూ మండును. కత్తి అంచుమీద నడచుట. రచనంతా ఇదే విధంగా వేదాంతామృతాన్ని చదువరిచేత త్రాగిస్తున్నది. సకల విశ్వమునందు నిలిచిన ప్రాణము అతనినుండే వెడలి అతనిలోన లయించు. ఆధునిక వైజ్ఞానిక సార్వభౌముడు అణుయుగ జనకుడు—ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్—There is a spirit manifesting through nature అని సైన్సును మతంతో కలిపి ఉపనిషత్తుల శాశ్వత సత్యాన్ని ప్రకటిస్తున్నాడు.

స్వయంసాధనతో యోగవిద్యా విలసితుడైన ఈ స్వామివారి వివరణం ప్రథమదశ సాధకులకు ఎంతో సహాయకారిగా ఉన్నది. అనుభవంలేకుండా అర్థం కాకుండా చెప్పే వాగాడంబర ప్రవచనాల వలె గాక, ఈ రచన స్పష్టంగా ఉన్నది. కుండలిని గూర్చి (ఉపోద్ఘాతంలో) చెప్పినది అనుభవపూర్వకమై సైన్టిఫిక్‌గా ఉన్నది. ప్రణవాన్ని గురించి చెప్పినది గూడ ఇట్టిదే.

తలిదండ్రుల గుణాలు బిడ్డలకు అలవడి, వారి పరిసరాలు ఆ బిడ్డలను తీర్చిదిద్దును—అన్న స్వాములవారి మాటకు అడ్డు తగిలినందులకు మన్నించాలి :—నేటి హెరిడిటరి సిద్ధాంతం దీనిని ఒప్పుకోదు. ఒక జ్ఞాని అన్నట్లు తలిదండ్రులు తనువు నిస్తారు గాని బుద్ధి నివ్వరు. హిరణ్యకసిపుని కొడుకేగదా ప్రహ్లాదుడు. ధర్మవ్యాధునికి, కేరళ నారాయణగురుదేవునికి (ఎళువ — హరిజన్) ముమ్ముడివరం బాలయోగికి (హరిజనుడు) ఏ వాతావరణ ప్రభావం కలిగినది? ఒకే కడుపున బుట్టిన వణ కుంభకర్ణ విభీషణుల తీరులు దారులు వేరు కాలేదా? అరవిందుని ఆశ్రమంలో పుట్టి పెరిగిన ఒక వ్యక్తి హత్యచేసిన ఉదంతం నాకు తెలుసు. హిందువుల కర్మ—ప్రారబ్ధ వాదాలే అప్రతిహతమైనవి.

స్వాములవారు మిగిలిన ఉపనిషత్తులన్నిటినీ ఇట్లే తెనిగిస్తే ఆంధ్రులకు ఆధ్యాత్మిక సంపదను పంచిపెట్టినవారవుతారు.

నవ సృష్టి

[డాక్టర్ అంతటి నరసింహం. క్రౌన్ 112 పేజీలు; వెల : 6 రూ; ప్రతులకు : సమతా సాహితి, 3-4-705/5, నారాయణగూడా, హైదరాబాదు—500029.]

ఆంధ్రప్రభుత్వంలో పెద్ద ఉద్యోగం (సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేకాధికారి)చేస్తూ, విసుగెత్తించే ఫైళ్ళ జిడ్డు చేతుల కంటకుండా ఉండను ఈ రచయిత, ఆత్మానంద ప్రదాయినియై పాఠకుల ఆనందింపజేసే కవితాతాల్యం కలిగిఉండటం ఒక సుకృతం. ఎన్నోపూలతేనె నానింది ఈయన మానసిక భ్రమరము. కళాశాల అధ్యాపకుడు,హిందీ, ఇంగ్లీషు పండితుడు. తెనుగులో పిహెచ్ డి. ఉద్యోగి; అంటే ఈయన బుద్ధి సమన్వయశీలి, ఇన్నిటిలో పొందే గాని పోరులేదు. అందువల్ల ఈ అంతటి వారిని ఎంతటి వారన గలను ?

గట్టి చదువు — భావేశాన్ని ఆవేగంతో వ్యక్తం చేయగలిగిన భాషాప్రౌఢి, రచనా పాటవం ఈ వ్రాతలో మెండుగా మెరుస్తున్నవి. ఇవి నవ్య రీతులలో సాగినవి; ఇదేగదా కవితా లక్షణం ! అగ్రవర్ణాల ఆధిపత్యపు గానుగలో నలిగిన మనసు గలిగినదైనా, వివిధ అత్యాచారాలను మూఢ సాంఘిక దురాచారాలను రాజకీయ కుటిల తంత్రాలను విమర్శించినా, ఈయన హృదయంలో అమర్షం లేదు; కాబట్టే నవసృష్టికోరే ఈహృదయావేదన ఒక అసహాయుని ఆక్రందనంగా గాక ఒక ధీరుని తిరుగుబాటుగా ఉన్నది; అంటే — భావాలకు ద్వేష మలిన మంటకుండా పోతున్నది.

చెప్పిన ప్రతి విషయంలో ఒక నవ్యత, ఊరకే నోరు పారవేసుకొనే తిట్లుగా గాక, ఆకర్షించే అవహేళనగా రూపొందినది. ఈ విమర్శనలో చూపిన మలుపు (ట్విస్టు) వింతగా ఉంటున్నది. కొన్ని శీర్షికలు ప్రభుత్వ విధానాల ప్రచారక సాధనాలైనా అందరి లోపాలను బయటబెట్టం నిజంగా ధైర్యమే అనాల.

కృతయుగం ధర్మ స్వర్ణయుగము కలియుగం పాపాలవల్ల కాదు అనే ఛాందస వాదాన్ని బద్దలుకొట్టి ధర్మాధర్మాలు ప్రతి యుగ స్వభావాలని చక్కగా చెప్పినాడు. నేటి ధర్మగ్లాని నిర్మూల నానికి అవతారంగాక ప్రళయమే తగిన దనటంలో ఒక బలమున్నది. ఇదే నవ సృష్టికి దారి తీసేదని ఈ కవి చాటింపు. సంఘ స్వార్థ తను కులతత్వాన్ని మెత్తగానే నూకులుబెట్టినాడు. హిందూమత పునర్వికసనానికి గుప్తులపాలన స్వర్ణయుగమని చరిత్రపాట; కాని పురాణాల సృష్టితో వేదమతం ఎట్లా పాడైనదో చెపుతూ, బోయ డైన వాల్మీకి శంబూక వధను, శూర్పణఖ అవమానాన్ని, తారశిల భంగాన్ని ఎట్లా వ్రాసినావని నిలవేసి అడుగుతున్నాడు — చదువు సంస్కారం గలిగిన ఒక బ్రాహ్మణేతరుడు. ఈ ఎత్తిపొడుపు నూతన పంథాలో ఉన్న రామాయణ విమర్శ. పాత నినాదాలైన పొదుపు, కుటుంబ నియంత్రణాలకు కొత్త దుస్తులు వేసినాడు. మహిళా సభలో మహిళామణుల అన్య వ్యాసంగాలను బాగా ఎగతాళి చేసినాడు. ఆత్మబలిదాతలు ఆశించినది నేటి కుళ్ళు రాజ్యమేనా అని పరితపిస్తున్నాడు. ఈ ప్రభుత్వోద్యోగి ఆత్మస్థైర్యం చూసినా డనక తప్పదు.

తెనుగులో మెత్తదనము సంస్కృతంలో రమణీయ ప్రౌఢి డొక్క శుద్ధిని వెల్లడిస్తున్నవి. మంచి పదబంధ సౌరభం పుస్తక మంతా అలముకొని ఉన్నది.

చైతన్యం

[వచన కవితా సంపుటి. పసుపులేటి జయంత్ కుమార్. క్రౌన్ 70 పేజీలు, ధర : 5 రు., ప్రతులకు : గ్రంథకర్త, మెహర్ కుటీర్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా–505301.]

ఈయన భవిష్యత్తుపై కొండంత ఆశపెట్టుకొని వ్రాస్తు న్నాడు. ''ఉషోదయ గీతానికి బదులు నిషామయ గీతాన్ని ఆలపించే అమానుషుణ్ణి'' అవతలకు నెట్టివేస్తూ ముందుకు పొగుతున్నాడు. భాషా వైఖరిలో ఒక సొంపుఉన్నా వ్యక్తీకరణానికి అది చాలక మర్మ ధోరణిలో బడినదీ రచన. ఇందు మాటల సందడి ఎక్కువ. కొన్ని కొత్త కవి సమయాలను సృష్టిస్తున్నా :—

నవ్వు విరిచిన ప్రతిచోటా ఆనంద విభావరి (విభావరి అంటే రాత్రిగదా ఈ చీకటిలో విశేషమేమిటో?) పుష్పించిన పూవుటధరం (చెక్కిలిని గులాబితోనో దానిమ్మ పూరేకుతోనో గదా పోలుస్తు న్నారు—అనార్కలి) వెలుతురు చినుకు; ఉదయిస్తున్న మొక్క — ఇట్లా.

స్నేహం శీర్షిక భావం భాషలలో బాగున్నది.

జ్యోతిర్మయి

[ఖండకావ్య కదంబము. శాంతిశ్రీ జంధ్యాల వెంకటేశ్వర శాస్త్రి. క్రౌన్ 32పొరటలు, ధర : 3 రు., ప్రతులకు : జంధ్యాల నాగేశ్వరరావు, శాంతిసదన్, సుబ్బారావుపేట, తాడేపల్లిగూడెం — 534 101.]

బాగా చదువుకొన్న సరసత ఈ రచనలో దట్టంగా పేరు కొని ఉన్నది. ఈయన మానసము ఆర్షసంప్రదాయపూర్ణ మగ్నము. పద్యాల నడక సహజ సుందరంగా పాండిత్య స్ఫూర్తిలో ఉన్నది. సీస పద్యాలు చారు గంభీరాలు. గ్రంథనామం జ్యోతిర్మయి కాబట్టి విషయ సూచికను కాంతిరేఖలు అనడం ఊహాసౌభాగ్యం. భక్తి పార వశ్యం ఈ పద్యాలకు ప్రాణం. ఏడుకొండల కల్యాణమూర్తిని స్తుతిస్తూ ఆశ నిరాశలను పెనవేసినాడు. ''శ్రీ శౌరిసేవ మంజేతి తొడవు'' అని పరవశిస్తున్నాడు. దీపావళిని ''మదభినందన చందన మందుకోవే'' అని స్వాగతం చెపుతున్నాడు.

ఇందు గాయక బ్రహ్మశీర్షిక కన్నాకు ''దేవలోక మందార మరంద బిందువులు తారక మంత్ర గతుల్ భవత్ కృతుల్'' అని, త్యాగరాజస్వామి సంగీత అనుపానంతో శ్రుతుల పరమార్థాన్ని ఎట్లా కృతులలో చెప్పినది తెలుపుతున్నాడు. త్యాగయ్య ''శివమంత్రానికి 'మ' జీవము, నారాయణ మంత్రానికి 'రా' జీవమని చెప్పగలిగిన — ఆత్మానుభూతితో సొక్కిన వాగ్గేయకారుడు గదా! కవికి తమిళ పరిచయం లేనందున త్యాగయ్య పట్టణాన్ని ''తిరువైయ్యురు'' అన్నారు. వీరు అన్న పంచనద పట్టణం (కావేరి ఐదుపాయలై తూర్పుగా పారుతున్నది. ఇవి నదాలు కావు—నదులే.) తిరు—శ్రీ, ఐ—ఐదు, ఆర్—నదులు గలది—తిరు ఐయ్యార్ అని దీని పేరు. ఒక వింతైన విశేషం. దక్షిణ భారత సంగీతమూర్తిత్రయం — శ్యామ శాస్త్రి దీక్షితులు త్యాగరాజు తిరు ఆరూరు (ఆరు పల్లెలు) లో పుట్టి తిరుఐయ్యార్ చేరుకొంటారు.

కవి త్యాగయ్యను ''రఘునాథ గాయక'' అంటాడు; కాదు. రఘునాథుని తర్వాత తంజావూరు నేలిన మహారాష్ట్రులలో శరఫోజీ మహారాజు కాలంనాడు—ఈ భక్తగాయక శిఖామణి. గాయకుల పేర్లు పట్టీ ఇవ్వడంలో ఒక బెడద ఉన్నది; తగినంత న్యాయం కలిగించ లేరు. తెనుగువారు సరే, అరవలలో—అరైకుడి చెంబై సెమ్మనగుడి మధురమణిఅయ్యర్, సంజీవరావు, మైసూరు వాసుదేవాచారి, తెనుగు ఆడపడుచు బెంగుళూరు నాగరత్నం మొదలైన వారిని పేర్కొనక పోవడం కాస్త లోపం.

నాగరత్నం పండితురాలు, తన సర్వస్వాన్ని త్యాగరాజ సమాధికి అర్పించి ఆయన సేవలో అక్కడనే కృతకృత్యురాలైన భక్తురాలు. హిందీ మీరాబాయి వంటిది.

లక్ష్మీ సరస్వతుల వివాదం — భాష భాగ్యాన్ని అన్యాపదేశంగా విమర్శించడం బాగున్నది గాని, అలబడిమూక (హీనజాతుల) పోరు వలె రచ్చకెక్కినట్లున్నది. ఇది మంచి అభిరుచిని చూపడం లేదు. ఇట్లే శ్రీరాముని పార్వతీ పరమేశ్వరులు చిత్రకూటంలో కలిసి పరీ క్షించి అర్చించివారనడం శైవులకు కోపం వచ్చేటట్లున్నది. ఇది హిందీ తులసీదాసు వ్రాతగా ఉన్నట్లున్నది.

కొన్ని నుడికారాలు:—నవనవలాడెడి మృదుమానవ హృదయం పూచినట్టి నందన వనము, నీ కృతులు రత్నకటక శుభాకృతులగు నరస సంగీత శారదా చరణములకు; సుందర మందహాస రసమూర్తి విలాసము మోము దమ్మిపై అందము విందుసేయ, ఏ రాణి పాదాల పారాణి గీలించి పూర్వాబ్ధి నవరత్న పూజసల్పు (ఆంధ్ర) బంగాళా ఖాతానికి రత్నాకరమని పేరు. రోజాల చుట్టుమూగిరి బాజాలను చేబట్టి భ్రమర కిశోరముల్—అన్నదానిలో అనుప్రాస బాగున్నదిగాని, మన మోదుగపువ్వువలె అందంగా ఉండి తేనెలేని పూవు రోజా.

శివతాండవము

[గంగావతరణము. కొలకలూరి స్వరూపరాణి. క్రౌన్ 48 పేజీలు, మూల్యం : 4 రు., ప్రతులకు : — విద్యాధర ప్రభాస, ఉప్పుగుండూరు, ప్రకాశం జిల్లా.]

మనోజ్ఞ విన్యాస కళా స్వరూపమైన నటరాజ భంగిమ దక్షిణభారతంలో భక్తిని పురికొల్పే విగ్రహరాజమై అలరారుతున్నది. కవితాస్ఫూర్తిమూర్తే ఈ ప్రతిమ. ఆతాండ లాస్యాల వర్ణనమే ఈ సంగీత గీతము. ఆ భంగిమలను సంగీత జ్ఞానంతో లయబద్ధ ద్విపదను [గా]యగలిగిన నేర్పరి — ఈ కవయిత్రి. శోభామయమైన ఆ శివతాండవాన్ని గంగను భూమికి దించిన సన్నివేశంతో [మే]ళవించి గంభీర భావ పూర్ణ భాషా ప్రౌఢితో ఈ కావ్యాన్ని వ్రాసినారు.

ప్రస్తుతం ఈమె రాయలసీమ వాసి కాబట్టి సరస్వతీ పుత్ర డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులవారి శివతాండవ ప్రభావం ఈమెపై దట్టంగాపడి ఉన్నది. ఆచారిగారి శివతాండవం చదివినా, ఆయన నోట విన్నా పారవశ్య వశులైనవారికి ఈ కృతిగూడ ఆనందాన్నే గూరుస్తున్నది.

మహాశివుడు చేసిన ఈ తాండవకథను తాండవ స్వరూపాన్ని విషయపూర్ణమైన పీఠికలో చక్కటి భాషలో వివరించి వ్రాయన గత్తె చదువరి అని అనిపించుకొంటున్నది. 13 పేజీల పాటకు 32 పొరటల టిప్పటిగూడ వ్రాసి ఉన్నారు కవిత్వం బాగున్నది. తాండవమూర్తి పార్వతీ పరమేశ్వరుల కలగలుపు రూపమని వ్రాసినారు గాని, శిల్పాలలోగాని చిత్రాలలోగాని అటువంటిది కనబడటం లేదు.

ఆంధ్రరాజుల చరిత్ర చెపుతూ, క్రమంమార్చి, పల్లవులు రాష్ట్రకూటులు ఇక్ష్వాకులు మొదలైన రాజవంశాలను వదలి పెట్టినారు. ఏలకో!

పురాణ గాథల రంగం ప్రతి ప్రాంతం వారు తమ నాటనే అనుకోవడం హిందూమత ధర్మాలలో ఒకటిగా ఉన్నట్లున్నది. రామ కథ తమది కాదనువారే లేరుగదా. చిదంబరానికి తమిళులు ఈ అర్థం—కథ చెపుతున్నారు. దక్షిణాపథంలో ఒక అరణ్యంలో శివుడు ఒక మునికాపున తాండవం చేస్తుండగా, ఒక కాలి అందియ వీడి వచ్చి పడినచోటే ఈ చిదంబర పట్టణమట. అచట పూజింపబడేది పెద్ద బండ (ఇదే చిదంబర రహస్యం) ప్రక్కన దివ్యకళలు ప్రసరించే నటరాజ విగ్రహము (శిలంబు—అందియ, విడివడు—వీడి వచ్చిపడిన, ఇడం—చోట ఈ చిదంబరం.)

నడిరేయి నగరం

[కవితా సంపుటి. శాంతి నారాయణ. క్రౌన్ 70 పేజీలు, ధర : 4 రు., ప్రతులకు : ఎన్. విమల, ఉదేగోలం పోస్టు, రాయదుర్గ తాలూక, అనంతపురం జిల్లా.]

ఇది ఆత్మానుభూతితో వ్రాసిన రచన కాబట్టి కవితా గుణం కలిగి ఉన్నది. సాధనలో శైలికి ఇంకా జిగి ఎక్కగలదనిపిస్తున్నది.

నేటి సంఘ సమస్యలకే ప్రాధాన్యమిచ్చినాడు కాబట్టి పునరుక్తి కలుపు ముక్కలు మెండైనవి. మరికొన్ని అతి సామాన్య విషయాలు. నడిరేయి నగర శీర్షిక—రేయి మాటు మణగిన పగటి నాగరిక వర్ణన, దాని మంచి సెబ్బరల విమర్శ అయినందువలన "అమృతమ్మును హాలాహలమును గర్భమున కరగించుకొన్న నీ అద్వైత తత్త్వము"ను మంచి భాషలో చెప్పినాడు. మానవుడు అనే ఖండికలో, ఆదిమ మానవుడు నేటి వరకు పొందిన అభివృద్ధి పరిణామాన్ని, అందలి బాగోగులను మంచిగా చెప్పి, మానవుడు దానవుడవుతున్నదానికి, అతడు చేపట్టిన కృత్రిమనాగరకతకు వగస్తున్నాడు.

తెనుగునాడు తెనుగువాడు తెనుగు బాసలపై చూపిన అభిమానంతో, అభిజనమైన అనంతపురాన్ని అభినుతిస్తున్నాడు : కవులలో నన్నయ, శ్రీనాథ, చేమకూరలను మాత్రం చెప్పి "కోయిల కన్నెవలె గొంతెత్తిన భాష"అంటూనే త్యాగరాజును ప్రస్తావించడు. పాడేది గండు కోకిల గాని కన్నె కోకిలగాదు. ఇందు తిక్కన, వేమన పోతనాదులను ప్రస్తావించకపోవడం, వారి కవితలు నచ్చక కాదనుకొంటా.

ఈ కవి నిశిత విమర్శక శక్తికి మంచిబాష చేదోడువాదోడు అయినది. రేగడి నేలలు దున్ని జగతికి జీవనరేఖలుగీసే రైతుబిడ్డ, నిన్నపుట్టి నేడు పోవుటకై మిన్నుముట్టు అహంకారులమై, (తెనుగువాడు) మానవజాతికెల్ల మణిపూసయగువాడు భరతాంబ నుదిటిపై పచ్చల బొట్టువాడు, చేమకూరవాని చేమంతి చిత్తమ్మునందు వెలుగొందు శృంగార విజయ విలాసమ్ము — ఇట్లా.

కళాప్రపూర్ణ మరుపూరు కొడండరామరెడ్డి

రెండు శాస్త్ర గ్రంథాలు

పంచాంగ దర్పణము

[గ్రంధకర్త : శ్రీ తనికెళ్ల వేంకట సూర్యనారాయణ సిద్ధాంతి; క్రౌను సైజు 104 పుటలు. వెల : రూ. 2-50. ప్రకాశకులు శ్రీ తనికెళ్ల వేంకట సూర్యనారాయణ సిద్ధాంతి,

మృత్యుంజయనగరం (కొత్తపట్నం), పార్వతీపురం తాలూకా, విజయనగరం జిల్లా.]

ఉత్తరాంధ్ర ప్రాంతంలోని జ్యోతిర్వేత్తలలో పిడపర్తి, తనికెళ్ల కుటుంబాలవారు ప్రసిద్ధులు. ఆ విద్య వారికి వంశపారంపర్యంగా వస్తూ ఉన్నది. వారు పంచాంగకర్తలు కూడా. వారిలో తనికెళ్ల కుటుంబానికి చెందిన వేంకట సూర్యనారాయణ సిద్ధాంతి గారు తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములనే అయిదు అంగాలను గురించీ, వాటికి సంబంధించిన విషయాంతరాలను గురించీ, సర్వజన సుబోధకంగా ఈ పంచాంగదర్పణంలో వివరించారు.

ఇందులోని అధ్యాయాలకు బింబములని పేరు పెట్టబడింది. ఆ అధ్యాయాలు అయిదు. మొదటి దానిలో ముఖ్యసంజ్ఞల వివరణం ఉన్నది. క్రమంగా సంవత్సరాలు, అయనాలు, ఋతువులు, మాసములు (వివిధ మానాలలోనూ, హిందూ-క్రైస్తవ-మహమ్మదీయ మతాల్లోనూ) పక్షాలు, తిథులు, వారాలు, నక్షత్ర, యోగ, కరణములు, గ్రహములు, పంచాంగాలతో పొడి అక్షరాలు సూచించే విషయాలు వివరించబడినవి. రెండవ బింబంలో తిథుల విషయం, వార, యోగవిషయం, హోరాచక్రం, నక్షత్ర వివరణ, అశుభకరణాలు, వార దుర్ముహూర్తములు, రాహు-గుళికకాలములు వివరింపబడినవి. మూడవ బింబంలో అధికమాస, క్షయమాస నిర్ణయం, తిథినిర్ణయం, అమావాస్య, ఏకాదశీ, మాసశివ రాత్రుల నిర్ణయం, మాధ్వ, వైష్ణవ పుణ్యదిన నిర్ణయం ఉన్నవి. నాల్గవ బింబంలో శుభముహూర్తనిర్ణయం, ఐదవ బింబంలో ఫలనిర్ణయం ఉన్నవి.

పంచాంగం చెప్పేవారిమీద ఆధారపడకుండా సందిగ్ధ విషయాలను తెలుసుకొనుటకు ఈ పంచాంగ దర్పణం బాగా ఉపయోగిస్తుంది. ఇందులో అన్ని విషయాలు సులభపద్ధతిలో చెప్పబడినవి.

ఈ పుస్తకం కావలసినవారు, విజయనగరం జిల్లా బొబ్బిలిలోని సంస్థానం హైస్కూలు తెలుగు పండితులు తనికెళ్ల. వేంకటరమణ శాస్త్రిగారికి వ్రాయాలి.

జాబాల సత్యకాముడు

[షోడశ కళాబ్రహ్మ విద్య. అనువక్త: శ్రీ చదలువాడ జయరామశాస్త్రి. క్రౌన్ 4+16+36 పుటలు. వెల: రూ. 1-50. ప్రతులకు-చదలువాడ జయరామశాస్త్రి అండ్ సన్స్, బుక్ సెల్లర్స్ అండ్ పబ్లిషర్స్, ట్రంకు రోడ్డు, నెల్లూరు.]

ఛాందోగ్యోపనిషత్తులోని నవమ ఖండంలో షోడశ కళా బ్రహ్మవిద్యను వివరించే జాబాల సత్యకాముని చరిత్ర ఉన్నది. ఆ బ్రహ్మవిద్యను గురించి తెలుసుకొనగోరేవారికి కథారూపంలోఉన్న యీ ఖండం మిక్కిలి ఉపయోగకారియై ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించి సుప్రసిద్ధ విద్వాంసులు, వ్యాకరణ, వేదాంతాది శాస్త్రాలలో సమర్థులై, సంస్కృతాంధ్ర సాహిత్యాలలో నిష్ణాతులై, చక్కని కవిత్వం చెప్పగలిగినవారు. వీరు ఛాందోగ్యంలోని సత్యకాముని చరిత్రను తెలిపే మూలానికి తగిన ఆంధ్రీకరణం చేసి మూలంతోకూడా చేర్చి యీ పుస్తకం తొలిభాగంలో ప్రకటించారు.

"**సత్యకాముఁడను విప్రకుమారుఁడు హారిద్రుమతుఁడను** గురువుంజేరి, గురువు గోవులను మేపుచు, వృషభ, అగ్ని, హంస, మద్గురువులవలన షోడశ కళాత్మకమై, చతుష్పాదమైన బ్రహ్మము నెఱుఁగుట ఇందు కథాంశము" అని ఉపోద్ఘాతములో చెప్పబడినది. అనువక్త అందులో ఉపనిషత్ ప్రతిపాదితమైన బ్రహ్మమునుగూర్చి కూడా సంగ్రహంగా చెప్పారు.

రెండవ భాగంలో ఈ సత్యకాముని చరిత్రయే సులభశైలిలో పద్యకావ్యంగా శ్రీ శాస్త్రిగారిచేత రచింపబడినదే. ఉన్నది.

ఉదాహరణ కొక పద్యం—

"చనియెన్ వాసరముల్ నెలల్ సమలు
    బల్ శాంతంబులై స్వాంతమున్
గొనియెన్ శాంతము సత్యకామునకు
    నూల్కొ దశ్శ్వ జిజ్ఞాసయున్
దనరెం గాలము యోగ్యమై దరిసె
    నంతన్ బ్రహ్మవిద్యం గొనన్
మునుమున్ యోగ్యత గూడె మే పరికి
    సమ్మోదంబు నాఁడొందఁగన్."

[రెండవభాగం పుట. 19]

షోడశ కళాబ్రహ్మ విద్యను గురించి తెలిసికొన దలచినవారు చదువవలసిన గ్రంథం యిది.

"అంగిరస"

శాస్త్రీయ దృక్పథం కొన్ని ప్రశ్నలూ - జవాబులూ

[రచన : రంగనాయకమ్మ. వెల : ఆరురూపాయలు, ప్రచురణ : స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్-హైదరాబాద్.]

శాస్త్రీయ దృక్పథం అనే పదానికి మార్క్సిస్ట్ దృక్పథం అని యీ రచయిత్రి అర్థం చెప్పి, ఇంతకుముందు రెండు పత్రికలలో తను నడపిన శీర్షికలలో యిచ్చిన సమాధానాలను యీ పుస్తకంగా ప్రచురించారు. కొత్త విశ్వవిద్యాలయాల యేర్పాటుగురించి కేంద్ర విద్యామంత్రి (ఏ సంవత్సరమో) ఇచ్చిన సమాధానం గురించి యీ రచయిత్రి ఇచ్చిన వివరణ సమంజసంగానూ, సహేతుకంగానూ వున్నది. అలాగే విద్యార్థులకు రాజకీయ నాయకులు చెప్పే హితవు గురించిన ప్రశ్నకు యీ రచయిత్రి సమాధానం కూడా బాగున్నది. కవిత్వానికీ రాజకీయ సిద్ధాంతాలకూ గల సంబంధం గురించి, రాజకీయాలలో కవిత్వంగురించీ, కవిత్వంలో రాజకీయాలను గురించీ యీ రచయిత్రి ఇంకా వివరంగా సమాధానం ఇచ్చివుంటే బాగుండేది. నిరుద్యోగ సమస్య పెరగడానికీ స్త్రీలు ఉద్యోగాలు చేయడానికీ

గల సంబంధం గురించి యీ రచయిత్రి యిచ్చిన సమాధానం చాలా బాగున్నది. మతాన్ని ఆహారపదార్థాలలో కల్తీతో పోల్చడమే తప్పు.

నిజమే. జీవిత పోరాటంలో క్రమంగా అజ్ఞానంలోంచి బయట పడుతున్నమాట నిజమే? ఎవరు బయట పడుతున్నారు? ఎంత శాతం జనానికి సామాజిక స్పృహ అలవడినదీ? మిగతా జనం కూడా స్పృహ గలవారుగా తయారయ్యే వరకూ నయినా తర్కాలకు అవకాశం వుంటుంది. అవి నిలబడతాయని అనుకొనక తప్పదు. కులమత భేదాలను గురించి యీ రచయిత్రి యిచ్చిన సమాధానం వివాదాస్పదమయినది. మానవ ప్రవృత్తిని అర్థం చేసు కొనడానికీ, భవిష్యత్తుకు మార్గం రూపొందించుకొనడానికీ 'మార్క్సిజం' ఒక్కటే ఉపాయంకాదు. ఎందుకనంటే "మార్క్సిజం మూసివేసిన సిద్ధాంతాల గుచ్ఛంకాదు." మానవ స్వభావం వలెనే మార్క్సిజమ్ కూడా మార్పునకు లొంగేదే, మార్పునకు అవకాశం ఇచ్చేదే. దురంతాలంటే యేమిటో వాటి నివారణకు దేవుడంటే భయం కలిపించడం ఎంత పెద్ద దురంతమో యీ రచయిత్రి బాగా వివరించారు. కానీ ఆమె వూహించిన పరిస్థితులు సమాజంలో ఎన్నడయినా యేర్పడే అవకాశం వున్నదా? లేకపోతే ఇది మరొక "ఉటోపియా" (Utopia) అవుతుందా! స్త్రీ బానిస బ్రతుకు గురించి యీ రచయిత్రి ఇచ్చిన వివరణలో అసలు బానిసత్వం అంటే యేమిటో కూడా చేర్చివుంటే బాగుండేది. మరి యీనాడు మాటల అర్థం అంతగా మారిపోతున్నది గదా? ఎవరు ఏ అర్థంలో యే మాటను ఉపయోగిస్తున్నారో సామాన్య పాఠకులకు అంతు పట్టడంలేదు. "ది ఇకనమిక్ కాన్‌సెప్ట్ ఆఫ్ ఏ మాన్ — ది కార్డినల్ కాన్‌సెప్ట్ ఆఫ్ యాన్ ఇకనామిక్ మాన్ మేక్స్ హిమ్ ఎస్లేవ్ ఆర్ ఎస్లేవ్ హోల్డర్" అన్న వివరణ యీ రచయిత్రికి తెలిసేవుంటుంది. శాస్త్రీయజ్ఞానం అంటే "అసలు కారణం తెలుసుకోవడం" ఒక్కటేననే వివరణ సమగ్రంగాలేదు. అయితే ఆడపిల్లల చదువు గురించిన ప్రశ్నకు యీ రచయిత్రి ఇచ్చిన సమాధానం ప్రశంసనీయంగా వున్నది. పెళ్ళి చూపులను గురించిన ప్రశ్నకు యీ రచయిత్రి సమాధానం చాలా ఘాటుగానూ సహేతుకంగానూ వున్నది. ఈ రచయిత్రి అభిప్రాయాలన్నింటితో యేకీభవించినా, ఏకీభవించలేకపోయినవారూ కూడా చదివి చర్చించవలసిన పెక్కు అంశాలు ఈ మంచి పుస్తకంలో వున్నాయి. ఈ పుస్తకం ఒక చర్చా సంగ్రహంలాగా వున్నది. చాలా అంశాలను వస్తునిష్ఠంగా చర్చించే యత్నం యీ పుస్తకంలో జరిగింది.

శ్రీ వి. ఎస్. అవధాని

శ్రీ తులసీ రామాయణము

[హిందీ మూలం: శ్రీ గోస్వామి తులసీదాసు, ఆంధ్ర గద్యానువాదం: శ్రీ మిట్టపల్లి ఆదినారాయణ, క్రౌన్ 470 పేజీలు. పుస్తకం వెల, ప్రచురణకర్త, ప్రెస్ పేరు, సంవత్సరం మొదలగు వివరాలు ఏవీ కూడా ఇందులో లేవు.]

శ్రీ గోస్వామి తులసీదాసు హిందీలో రచించిన రామచరిత మానసం మూల గ్రంథంలోనున్న దైవ ప్రార్థన, గురు బ్రాహ్మణ, సజ్జన ప్రార్థన, గ్రంథ రచనలో కవి ఉద్దేశము, రామనామమహిమ, ఒక పెద్ద రూపకాలంకారంలో మనోహరంగా వర్ణించబడిన మానస వర్ణన, మానస మహిమ వగైరాలు షుమారు డెబ్బయిపేజీలు వదలి పెట్టి, అటు తరువాతి యాజ్ఞవల్క్య భారద్వాజ సంవాదంతో ఈ పుస్తకం ప్రారంభమై తదుపరి గ్రంథం పూర్తిగా అనువదింప బడినది. ఈ అనువాద గ్రంథంలో వదలివేయబడిన (పైచెప్ప బడిన) అంశాలన్నీ ఎంతో ఆకర్షణీయంగా, మనోహరంగా కావ్య రామణీయకతను ఋజువు పరుస్తూవుండి పండిత పామరులకు గ్రంథ పఠన మందు ఆసక్తిదాయకంగా వుంటాయి. ఇంత ముఖ్యమైన భాగాన్ని వదలిపెట్టి అనువాదం ప్రారంభం చేయడంలో అనువాదకుని ఉద్దేశమేమిటో తెలియకున్నది. కారణాంతరముల వలన సంక్షిప్తత అవసరమని భావించినా కావ్య సమగ్రతకు భంగంవాటిల్ల కూడదు గదా!

1965లో శ్రీయుత నూతలపాటి పేరరాజుగారు తులసీ రామాయణాన్ని గద్యంలో ప్రచురించి వున్నారు. వారి అనువాదం కూడా ఇలాగే యాజ్ఞవల్క్య భారద్వాజ సంవాదంతో ప్రారంభమై వుంది. మరికొన్ని అంశాలలో కూడా ఆ రచనను ఈ అనువాదకులు అనుసరించారన్నట్లు ఉదాహరణలు లభ్యమవుతున్నాయి. అయితే శ్రీయుత పేరరాజుగారి అనువాద గ్రంథంలోని భాష సామాన్య పాఠకునికి అతి క్లిష్టంగా వుండగా ప్రస్తుత అనువాదము చాలా సరళంగా సాగింది. ఇది ఇందలి విశేషమని చెప్పక తప్పదు. కాని ఉభయులు గ్రాంథిక భాషలోనే అనువాదం సాగించారు. ప్రస్తుత అనువాదకులు వ్యావహారిక భాషలో గ్రంథం నడిపించి వుంటే ఎక్కువ ప్రజాదరణ పొందడానికి అవకాశం వుండేది.

ఇక, మూల గ్రంథానికీ ఈ అనువాద రచనకూ కనపడ్డ వ్యత్యాసాలను గురించి చెప్పవలసివస్తే, బాలకాండంలో పాయసఘట్టములో కౌసల్యా కైకలకుఇవ్వగా మిగిలిన పాయసాన్ని రెండు భాగాలు చేసి వాటిని కౌసల్య కైకల చేతుల్లో పెట్టి (తాకించి) దశరథుడు తానే సుమిత్రకు ఇచ్చినట్లు తులసీదాసు వ్రాశాడు. కాని వీరి అనువాదంలో "కౌసల్య కైకలచేత సుమిత్రకు ఇప్పించెను" అని వ్రాయడం జరిగింది. అంటే, దశరథుడు సుమిత్రకు స్వయంగా ఇవ్వలేదనే భావం చూపించడం పాఠకులను పెడదారి పట్టించడమే అవుతుంది. హిందీ మూలంలో "కౌసల్యా కైకేయీ హాథ్ ధరి. దీన్హ సుమిత్రహి మన ప్రసన్న కరి." అని వున్నది.

"రాముడు మారీచునిపై సాధారణ బాణం వేయగా" అని ఈ అనువాదకులు వ్రాశారు. కాని మూలంలో "బిను ఫర బాన్ రామ తెహి మారా." అని వుంది. అనగా ములికి, లేక కొనలేనటు వంటి బాణం అని అర్థం వస్తున్నది.

ఇక ధనుర్యజ్ఞ ఘట్టమునందు "బందీజన్, భాట్" అనే మాటలకు అనువాదకులు 'భట్టుమూర్తులు' అనే పదం ఉపయో

గించారు. ఇందుకు బదులుగా 'వంది మాగధులు లేక భట్రాజులు' పదాలు వాడి వుంటే స్వాభావికంగా వుండేది.

అరణ్య కాండంలో జయంతుడు చేసిన అపరాధానికి శిక్ష విధిస్తూ "శ్రీరామచంద్రుడు జయంతుని క్షమించి ఒక చెవి, ఒక కన్ను మాత్రము పనికిరాకుండా చేసి, వానిని ప్రాణములతో వదిలెను." అని అనువాదకులు వ్రాశారు. కాని మూలంలో చెవి ప్రస్తావన ఏమీలేదు. ఒంటి కంటివాణ్ణి చేసి వదలివేసినట్లు "ఏక్ నయన్ కరి తజా" అని మాత్రమే వున్నది.

శూర్పణఖ ఘట్టములో "శూర్పణఖ భయంకర రూపము ధరించి సీతాదేవిని మ్రింగబోయెను." అని ఈ అనువాదకులు వ్రాశారు. కాని, మూలంలో సీతాదేవిని మ్రింగబోవుట అనే ప్రస్తావన లేదు. ఇలాగే లక్ష్మణుడు మహోగ్రుడై "ఓ క్రూరురాలా, సిగ్గు లేకుండా పురుషుల వద్దకు వచ్చి కామమును తీర్చుమని అడుగుదువా ?" అన్న మాటలు కూడా మూలంలో లేవు.

ఇక, సీతాదేవిని రావణుడు బలవంతంగా తీసుకువెళ్లేటప్పుడు కిష్కింధా పర్వతం పైన వానరులను చూసి సీతాదేవి తన వస్త్ర ఖండాన్ని పడవేసినట్లు మాత్రమే తులసీదాసు వ్రాసి వున్నాడు. "కహి హరినామ దీన్హ పట డారీ" అని అరణ్యాకాండంలోనూ, "హమహి దేఖి దీన్హెవు పటడారీ" అని కిష్కింధా కాండంలోనూ తులసీ చెప్పివున్నాడు. కాని అనువాదకులు "సీత తన ఆభరణములు మూటగట్టి ఆ మూటను క్రిందపడవేసెను." అని అరణ్యాకాండంలో వ్రాశారు. ఇదే విధంగా కిష్కింధా కాండంలో కూడా వ్రాశారు. ఈ మార్పు అనువాదకులు ఎందుకు చేశారో తెలియదు.

ఇదే కిష్కింధా కాండలో వర్షఋతు వర్ణన, శరదృతు వర్ణన తులసీదాసుయొక్క పాండిత్య ప్రతిభతోబాటు అధ్యాత్మ భావ మిశ్రితమై ఎంతో మనోహరంగా వుంటుంది. అటువంటి వర్ణనను ఈ అనువాదకులు రెండు వాక్యాలతో దాటవేశారు.

సుగ్రీవుడు రామకార్యాన్ని మర్చిపోయినప్పుడు రాముడు సుగ్రీవునిపై కోపగించుకొని లక్ష్మణుణ్ణి సుగ్రీవుని వద్దకు పంపుతూ "నాయనా, సుగ్రీవుడు మనకు మిత్రుడు. తొందరపడి వానిని చంపవద్దు. అతడు లేనిచో మన కార్యము చెడిపోవును." అని చెప్పిన వాక్యాలు మూలంలో లేవు. మిత్రుడైన సుగ్రీవుణ్ణి భయపెట్టి తోడుకరమ్మని మాత్రమే మూలంలో వుంది.

లంకా కాండంలో రావణవధ అనంతరం సీతను చూసిన రాముడు "చాలా రోజులు ఈమె లంకలో వున్నది. అగ్నిపరీక్ష చేసిన జనులు తృప్తి చెందెదరు." అని శ్రీరాముడు పలికినట్లు అనువాదకులు వ్రాసిన వాక్యాలు కూడా మూలంలో లేవు.

మొత్తం పుస్తకంలో అచ్చు తప్పులు లేవు. ప్రింటు బాగా వున్నది. గట్టి బైండు చేయబడి వుంది. భూమికగాని, పండితుల అభిప్రాయాలుగాని లేవు. గ్రంథం చివర అనువాదకులు తమ వ్యక్తిగత పరిచయం చెప్పుకున్నారు. ఈ గ్రంథం ఆస్తికుల హృదయాలను ఆకర్షించగలదని నా విశ్వాసం. శ్రీ ఆంజనేయ సహిత సీతారామలక్ష్మణుల ముఖ చిత్రం ఎంతో ఆకర్షణీయంగా వుంది. అనువాదకులు చేసిన కృషి అభినందనీయమైనది.

శ్రీ గాద-శెట్టి శ్రీరాములు

జాషువ జీవిత కవితా ప్రస్థానం

[డా. బి. భాస్కర చౌదరి. వెల : రు. 6–00లు. ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతిరోడ్, సికిందరాబాదు; నవోదయ పబ్లిషర్సు, ఏలూరురోడ్డు, విజయవాడ; విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్, నేంద్రగుంట, చిత్తూరుజిల్లా; పద్మశ్రీ అండ్ కో, చిత్తూరు.]

'జాషువకృతుల సమాలోచనము' అన్న తన సిద్ధాంత వ్యాసంలోని కొన్ని ప్రకరణాలను ఆధారంగా చేసుకొని ఈ పుస్తకాన్ని రూపొందించినట్లుగా గ్రంథరచయిత చెప్పుకొన్నారు. ఈ విమర్శ గ్రంథంలో ఉన్న ఒకానొక ప్రత్యేకత—కవి జీవితానికి, అతని కవిత్వానికి ఉన్న సంబంధాన్ని విశ్లేషించి చూపడం. కేవలం కవిత్వ విమర్శగాని, కేవలం జీవిత విమర్శగాని కవికి న్యాయం చెయ్యలేవు. ఒక కవి జీవితం, అతని కవిత్వం ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఉంటాయి. ఈ రెంటికి గల సాన్నిహిత్యం విమర్శకుడు అర్థం చేసుకొంటే తప్ప సరైన విమర్శరాదు. ఆ ప్రయత్నం ఈ గ్రంథంలో జరిగింది. గ్రంథం రెండు ప్రధాన ప్రకరణాలుగా విభజింపబడింది. ఒకటి జాషువ జీవిత ప్రస్థానం, రెండు కవితా ప్రస్థానం.

భావకవితా కాలంలో వచ్చిన సంప్రదాయ కవిత్వంలో జాషువ కవిత్వం విశిష్టమైందని ఇవ్వాళ చెప్పడం హాస్యాస్పదమైన విషయమవుతుంది. జాషువ పద్యానికున్న ధారాశుద్ధి ఆ తరం కవులలో చాలా తక్కువ మందిలో ఉందని చెప్పడం సత్యదూరమైన విషయం కాదు. జాషువ రాసిన ప్రతి కావ్యంలోను, ప్రతి పద్యంలోను సమాజపరమైన, వైయక్తికమైన వేదన, చేదన ధ్వనింపబడుతూనే

ఉంటుంది. ఆయన తండ్రి వర్ణాంతర వివాహం చేసుకొన్నాడు. తల్లి కులమే జాషువ కులమైంది. అంటరానితనాన్ని జాషువ తీవ్రంగా అనుభవించాడు. అందుచేతనే ఆయన కవిత్వంలో అధిక భాగం కుల, మత భేదాలపై కేంద్రీకృతమైంది. ఆర్థికంగా చాలా దైన్యస్థితిని అనుభవించినవాడు కనుకనే ఆర్థిక అసమానతమీద కూడా ఆయన కవిత్వం దండెత్తింది. జాషువ ఆత్మస్థైర్యానికి, విశ్వాసానికి ఒక ఉదాహరణ.

గవ్వకు సాటిరాని పలుగాకుల మూకల మాయచేత న
న్నెవ్విధి దూరినన్ నను వరించిన శారద లేచిపోవునే?
యివ్వసుధా స్థలిం బొడమరే రసలుబ్ధులు? గంటమూనెదన్
రవ్వలు రాల్చెదన్ గర గరల్ పచరించెద నాంధ్రవాణికిన్.

అంటరానివాడు కవిత్వం రాయకూడదనే రోజులు అంతిమ కాలమది. ఆ రోజుల్లో 'నను వరించిన శారద లేచిపోవునే?' అనే మాటను ఎంతో గుండె దిటవున్న కవిమాత్రమే అనగలడు. అట్లనే జాషువ కవిత్వాన్ని మెచ్చుకొని ఆయన కులాన్ని ద్వేషించే మనస్తత్వం ఆయనకు తారసపడినప్పుడు ఆయన అనుభవించిన వేదనకు అక్షరాకృతి ఈ పద్యం.

నా కవితా వధూటి వదనంబు నెగ దిగ జూచి రూపు రే
ఖా కయనీయ వైఖరులుగాంచి భళీభళి యన్నవాడె మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున క్రుమ్మినట్లగున్ పార్థివచంద్ర వచింప సిగ్గగున్.

దారిద్ర్యానికి మూలమైన ధనస్వామ్య వ్యవస్థను చక్కని శిల్పమార్గంలో వ్యక్తీకరించాడు జాషువ. 'ఎవడారగించు నమృత భోజనంబున గలిసెనో ఈ లేమ గంజి బువ్వ' మొదలైన పద్యాల్లో కవితాశిల్పం పరాకాష్ఠ నందుకున్నది.

జాషువ ప్రచారంవల్ల, అభిమాన పురస్కృతమైన విమర్శల వల్ల జీవించిన కవికాదు. ఆయన అక్షరాల్లో బలం ఉంది; కవిత్వంలో జీవం ఉంది; విషయంలో నిజాయితీఉంది. ఈ కారణాలవల్ల గొప్ప కవిగా జీవించాడు, జీవిస్తున్నాడు, జీవిస్తాడు. ఈ గ్రంథంలో జాషువ జీవితంలోని అనేక ఘట్టాలు, ఆ ఘట్టాల ప్రభావంతో ఆయనలో పెల్లుబికిన కవితావేశం, దాని పరిణామం ఒక క్రమంలో చక్కగా వివరించబడ్డాయి. గ్రామం నుండి దేశానికి, దేశంనుండి ప్రపంచానికి ప్రాకిన ఆయన వ్యక్తిత్వం, కవిత్వం ఈ గ్రంథంలో స్పష్టమవుతుంది. భాస్కర చౌదరిగారు ఈ గ్రంథం పునాదిగా జాషువ సర్వకవితా సంకలనాలమీద సమగ్రమైన విమర్శ గ్రంథాన్ని వెలయిస్తారని ఆశించవచ్చు.

శ్రీ టి. ఎల్. కాంతారావు

గ్రంథస్వీకారాలు

* శ్రీ సత్యసాయి కరావలంబ స్తోత్రము (సుప్రభాత సహితము) కృతికర్త : శ్రీ నిష్కల సీతారామశాస్త్రి, పేజీలు 20, వెల : అమూల్యము, ప్రతులకు : సిద్ధాంతి ఎస్. వి. యస్. సుబ్రహ్మణ్యం, అగ్రహారం, బొబ్బిలి–532558.

* దేవయాని (భారత కథకు అభినవ వివరణాత్మకము) గ్రంథకర్త. శ్రీ రూపావతరం నారాయణశర్మ, పేజీలు : 82, వెల : రు. 4/– (విద్యార్థులకు రు 3) ప్రాప్తిస్థానం : (1) శ్రీ కె. శేషశయనం, నవజీవనముద్రణాలయము, పెనుగొండ, అనంతపురం జిల్లా. (2) గ్రంథకర్త, కేర్ ఆర్. ప్రభాకర్, 6వ క్రాస్, మైసూర్ రోడ్, చెన్నపట్నం, బెంగుళూరు జిల్లా, కర్నాటక.

* ప్రాతః స్మరణము దైవిక ప్రార్థనలు. రచన : శ్రీ ఆర్. వి ఆర్. మూర్తి, పేజీలు 38, వెల : రు. 1/– ప్రతులకు : రచయిత, భారత భారతి, శ్రీ గీత పవర్ ప్రెస్, విజయనగరం–531202.

* గ్రంథాలయజ్యోతి (త్రైమాసపత్రిక) సంపాదకుడు: యన్నం వేంకటనర్సిరెడ్డి. పేజీలు 52, ఏడాది చందా : రు. 12/– వివరాలకు : సంపాదకుడు, గ్రంథాలయజ్యోతి, త్రైమాస పత్రిక, నరసరావుపేట–522601.

* నూతన (నవతరం మాసపత్రిక) ఎడిటర్ : ఎమ్. రత్నమాల, పేజీలు 80, వెల : రు. 1–50 పై. వివరాలకు : ఎడిటర్, నూతన (మాసపత్రిక), 2–1–561, నల్లకుంట, హైదరాబాదు-500044.

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.